ఆర్షవిద్యాతరంగిణి

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# SRIMADBHAGAVADGITA - SECOND SHATKAM

# శ్రీమద్భగవద్గీత – రెండవ షట్కము

## స్వామి పరమార్థానంద

శ్రీభగవాన్ ఉవాచ
అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

## స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో

## వారి ఆశీస్సులతో

## తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ

First edition – Year 2021   1000 copies

For Copies
Arsha Vidya Tarangini Trust
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 98490 92368
Email: raghavkasturi@gmail.com
for softcopy: www.telugubhakti.com

Title – BHAGAVADGITA – SECOND SHATKAM

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna

DTP – Sri S Rajendra Kumar 98661 15622

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222
Price Rs. 500

# బ్రహ్మయజ్ఞం

ఆర్ష ఆనందకుటీర్ సభ్యులు మావద్ద ఆత్మవిద్యను అధ్యయనం చేస్తూ, సాయంకాలం హట్‌లో కుర్చొని మననం చేస్తూ, తాము నేర్చుకున్న జ్ఞానాన్ని నిదిధ్యాసనద్వారా జీవితంలో రంగరించుకుంటూ జ్ఞాననిష్ఠలో నిలుస్తున్నారు. వీరు ప్రతి ఏకాదశికి గీతా పారాయణం చేస్తారు. వీరంతా బ్రహ్మవిద్యమీద ఎంతో మక్కువ చూపుతూ అతిరహస్యవిద్యను చక్కగా అందుకుంటున్నారు.

భగవద్గీత రెండవ షట్కప్రచురుణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి ఇతోధికంగా సహకరించిన వారు –

శ్రీమతి కావలిపురపు సూర్యకుమారిగారు
శ్రీమతి ఉయ్యూరు సాయిలక్ష్మిగారు
శ్రీ పిరాట్ల సత్యనారాయణశాస్త్రిగారు
శ్రీమతి మల్లాది శిరీషగారు
శ్రీ కాశీభట్ట కృష్ణశాస్త్రిగారు
డా॥ బోయినేపల్లి యాదగిరి రావుగారు
శ్రీమతి కానాల సుమంగళిగారు
శ్రీ దాట్ల నారాయణరాజుగారు
శ్రీమతి దాట్ల జానకిగారు
శ్రీమతి ఆగెపాటి రమాదేవిగారు
శ్రీమతి రావులపర్తి రాజేశ్వరిగారు
శ్రీమతి గుంటక విష్ణుప్రియగారు
శ్రీమతి మూల ఈశ్వరిగారు
శ్రీమతి ప్రాతూరి సత్యవాణిగారు
శ్రీమతి తురగా పద్మావతిగారు
శ్రీమతి వెల్లంకొండ ఉమారాణిగారు
శ్రీమతి జవ్వాజి విజయలక్ష్మిగారు
శ్రీమతి తాతా కామేశ్వరిగారు
శ్రీమతి తాతా భవానిగారు
శ్రీమతి మానేపల్లి మీనాక్షిగారు
శ్రీమతి పొదిల యమునగారు
శ్రీమతి మెట్టు గంగాయమ్మగారు
శ్రీమతి గోనెళ్ళ భారతిగారు
శ్రీమతి నల్లూరి కోటేశ్వరమ్మగారు
శ్రీ రామాయణం వెంకట చలపతిగారు
శ్రీమతి రామాయణం కృష్ణకుమారిగారు

ఆర్ష ఆనందకుటీర్ సభ్యులు సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని, వారి పిల్లలకూ, మనవళ్ళకూ, మనవరాళ్ళకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను వైదికజీవనాన్ని మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుని వేడుకుంటున్నాము. –

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బ్రహ్మయజ్ఞం | 3 |
| 2. | ముందుమాట | 6 |
| 3. | పరమార్థానందస్వామివారి బోధలోని విశిష్ఠత | 10 |
| 4. | కృష్ణపరమాత్మ హృదయానికి దర్పణం పట్టిన స్వామీజీ | 12 |
| 5. | ఆర్షవిద్యాతరంగిణి ట్రస్ట్ ఆవిర్భావము | 15 |
| 6. | స్పందనలు | 16 |
| 7. | శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యమ్ | 22 |
| 8. | ధ్యానశ్లోకాలు | 24 |
| 9. | ఏడవ అధ్యాయము - జ్ఞానవిజ్ఞానయోగము | 27 |
| 10. | ఏడవ అధ్యాయము - సారాంశము | 104 |
| 11. | ఎనిమిదవ అధ్యాయము - అక్షరబ్రహ్మయోగము | 113 |
| 12. | ఎనిమిదవ అధ్యాయము - సారాంశము | 173 |
| 13. | తొమ్మిదవ అధ్యాయము - రాజవిద్యారాజగుహ్యయోగము | 183 |
| 14. | తొమ్మిదవ అధ్యాయము - సారాంశము | 278 |
| 15. | పదియవ అధ్యాయము - విభూతియోగము | 289 |
| 16. | పదియవ అధ్యాయము - సారాంశము | 394 |
| 17. | పదకొండవ అధ్యాయము - విశ్వరూపదర్శనయోగము | 405 |
| 18. | పదకొండవ అధ్యాయము - సారాంశము | 540 |
| 19. | పన్నెండవ అధ్యాయము - భక్తియోగము | 551 |
| 20. | పన్నెండవ అధ్యాయము - సారాంశము | 631 |

Swami Paramarthananda

Sriram Apartments,
80, St. Mary's Road,
Chennai - 600 018.
Phone : 2499 7459

Date : 30-12-20

Dear Rajyasri & Rao,

Received your letter of 26-12-20 along with the Gita-book. Excellent. Congratulations for this great service.

Happy to know the activities and classes conducted by both of you. My blessings are there.

You are welcome to meet me whenever it is possible.

Received the donation sent by the Satsang-group.

With Best Wishes
Paramarthananda

# ముందుమాట

**॥ ఓం శ్రీ సాయినాథాయ నమః ॥**

**ఓం సద్గురుభ్యో నమః । ఓం శ్రీకృష్ణపరమాత్మనే నమః । ఓం భగవద్గీతాయై నమః ।**

మొదట నేను ఏయే గురువులనుండి భగవద్గీతను నేర్చుకున్నానో వారందరి గురించి చెప్పి వారందరు నా జీవితాన్ని ఎలా తీర్చిదిద్దారో తెలియజేస్తాను.

1952లో మద్రాసులో శ్రీ స్వామి చిన్మయానందజీ జ్ఞానయజ్ఞానికి నాకు ఇంగ్లీషు తెలియకపోయినా, అర్థం కాకపోయినా ఆ సమయంలో యాగశాలలో ఒక గదిలో అఖండ హరేరామ సంకీర్తన చేయటం చూసి క్రమం తప్పక రోజూ వెళ్ళి కూర్చునేదాన్ని. అప్పుడు నాకు 7 సంవత్సరాలే అయినా, భాష రాకపోయినా స్వామీజీ వాగ్ధాటికి, వాక్ప్రవాహానికి ముగ్ధురాలనయిపోయాను. ఎన్నటికైనా గీతార్థాన్ని తెలుసుకోవాలనుకున్నాను.

దీనికసలు బీజం అప్పటికే మా నాయనమ్మగారు రోజూ సాయంత్రాలు గీతలోని 12, 15 అధ్యాయాలు పారాయణ చేయించడం. నా మనస్సులో ఇలా గడగడా చదవటం ఎందుకు? వాటి అర్థం తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగింది. ఆ యజ్ఞంలోనే పూజ్యశ్రీ దయానందస్వామివారు చిన్మయానందజీని చూసారట. కొద్ది రోజుల్లోనే వారి ఉపన్యాసాలను విని, వారికి Stenographer గా అన్నీ record చేసుకున్నారట. నా పూర్వపుణ్యంవలన నేను కూడా అందులో పాల్గొనడం జరిగింది.

పెద్దయ్యాక వివాహానంతరం గృహస్థాశ్రమ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆ అనుభవాలతో భావపరిణతి చెందడానికి అవకాశం కలిగింది. తర్వాత అనుకోని పరిస్థితుల వలన, జిజ్ఞాస పెరిగింది. ఆ సమయంలో పై గురువులిద్దరిచేత పవాయ్‌లో జరిగిన 3 సం॥రాల కోర్సులో చదివి, చిన్మయ విజ్ఞానమందిరం, హైదరాబాద్‌లో ఆచార్యులుగా ఉన్న శ్రీ స్వరూపానంద సరస్వతిగారి దగ్గర భగవద్గీత నేర్చుకున్నాను. శంకరభాష్యం, శంకరానందీయం ఉపయోగించి భగవద్గీత పూర్తిగా నేర్పించారు. స్వరూపానందజీ నన్ను అనేక విధాలుగా ఉత్సాహపరిచి, కోపించి, నాచే నాలుగుసార్లు అనేకులకు గీతని బోధించేలా చేశారు. దీనివలన ఒక్కొక్కసారీ భగవద్గీతను క్రొత్తకోణంలో చూడడం నేర్చుకున్నాను. తర్వాత నేను ఋషీకేష్‌కి వెళ్ళినప్పుడు పూజ్యశ్రీ దయానందజీ బోధను క్రమంతప్పకుండా 3 నెలలు విన్నప్పుడు నాకర్థమైంది చాలా తక్కువని అనిపించింది, ఇంకా స్వామీజీ వారివద్ద శ్రవణం చెయ్యాలని అడిగాను. స్వామీజీ ఒప్పుకుని ఆనైకట్టి గురుకులానికి రమ్మన్నప్పుడు చాలా సంతోషంతో గురుకులానికి వెళ్ళాను. స్వామీజీ introductionలో మనుష్యులకు guilt and hurt ముఖ్య సమస్య అని "guilt అంటే ఎందుకు చేయకూడనిది చేశాను, ఎందుకు చేయవలిసినది చేయలేదు అన్న బాధ ఇంకా hurt అంటే పరులు నాకెందుకు ఇలా బాధ కలిగించారు, వారు నాకు చేయవలిసినది చేయలేదు అన్న బాధ", **'కిమహంసాధు నాకరవమ్, కిమహం పాపమకరవమితి'** జ్ఞానికి భయం ఉండదని, ఎందుకంటే తను కర్త, భోక్తను కాదని సందేహరహితంగా తెలుసుకున్నందువలన అని వివరించినప్పుడు అర్థమయి ఆ తైత్తిరీయ ఉపనిషద్ తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాను.

2003లో ఋషికేశ్‌లో 3 సం॥ కోర్సుని పూజ్య దయానంద సరస్వతి స్వామీజీ, స్వామి బ్రహ్మవిద్యానందజీ ఆచార్యులుగా ప్రారంభించినప్పుడు నేను అందులో చేరి 3 సం॥లు సంస్కృతము, శంకరభాష్యంతో అనేక ఉపనిషత్తులను నేర్చుకున్నాను. భగవద్గీత కూడా వారివద్ద నేర్చుకున్నాను. కోర్సు పూర్తవగానే పూజ్య దయానంద స్వామీజీ హైదరాబాదు వెళ్ళి నేర్చుకున్న విద్యని జిజ్ఞాసువులకు పంచమని నాకు సందేహనివృత్తి కలిగేలా, స్పష్టతకోసం చేయమన్నారు. అదెంతో ఉపయోగకరమయింది.

ఋషికేశ్‌నుండి వచ్చినప్పటినుండి శ్రీ స్వామీ పరమార్థానందజీగారి పూర్తి గీత, వారం వారం online లో వచ్చే ఉపనిషత్తు (భాష్యంతో) వదలక విని రాసుకున్నాను. గీత పరిచయంలో స్వామీజీ సంసారమనే భవరోగానికి రాగము, శోకము, మోహము – ఈ మూడు లక్షణాలు అనీ, వాటి రోగనివారణకు భగవద్గీత ప్రశమనాన్ని చూపుతుందని చెప్పిన మాటలు నా హృదయంలో నాటుకున్నవి.

ఎంతో దర్పంతో, ఉత్సాహంతో శత్రువులైన కౌరవులను నాశనం చేయాలని వచ్చిన అర్జునుడు శ్రీకృష్ణుని (అప్పటికి భగవంతునిగా కాక, రథసారథి వలె) రెండు సైన్యాలకు మధ్య నిలపమని, తాను ఎవరెవరితో యుద్ధం చేయాలో చూడవలెనని ఆదేశించాడు. తాను వనవాసకాలంలో నేర్చుకున్న అస్త్ర, శస్త్ర ప్రయోగం జరుపుటకు చాలా ఉత్సాహముతో తాను సంపాదించిన పాశుపతాస్త్రము, తక్కిన దేవతలందరినుంచి పొందిన అస్త్రశస్త్రాలతో శత్రువులను వధించుటకు ఉబలాటం కనబరిచాడు. తీరా ఇరుసైన్యాల మధ్యనుంచి చూచినపుడు, రెండువైపులా తనకు అందరూ తనవారినిగా జూచి, తాను ఎవరి సుఖంకోసం ఇంత విధ్వంసం జరపడానికి యుద్ధభూమికి వచ్చాడో, వారందరూ ఎదుట కనబడ్డారు. ముఖ్యంగా తనని అతిగా ప్రేమించిన తాత భీష్మాచార్యులు, తన కన్నపుత్రునికన్నా అధికంగా విద్యనిచ్చిన ద్రోణాచార్యులను చూచి, వారినెలా తను వధించగలడని రాగముచేత శోకములో మునిగిపోయాడు.

ఎప్పుడయితే రాగము, శోకమువలన మన బుద్ధిని అజ్ఞానం, మోహం కమ్మేస్తుందో మన బుద్ధి యుక్తాయుక్త వివేకాన్ని కోల్పోతుంది. అందుకే అర్జునుడు తన స్వధర్మమయిన క్షత్రియ ధర్మాన్ని వదిలి, పరధర్మమైన భిక్షాటన, అంటే సన్న్యాస ఆశ్రమాన్ని స్వీకరిస్తానన్నాడు. అంటే ధర్మాధర్మాల విషయంలో కలిగిన సందిగ్ధమే మోహం. మొదటి అధ్యాయంలో ఈ విధంగా రాగ, శోక, మోహాలు సంసారదుఃఖాలకు కారణమని తెలియజేస్తూ, అర్జునుణ్ణి శ్రీకృష్ణుడు మాట్లాడనిచ్చాడు. తాను మధ్యలో మాట్లాడక అర్జునుని ఆలోచనా విధానంలోని తప్పు తానే తెలుసుకునేటట్లు చేశాడు. అప్పుడు అర్జునుడు దానిని గుర్తించి, తన మోహాన్ని గుర్తించి, శ్రీకృష్ణుని భగవంతునిగా గుర్తించి 'నేను నీకు శిష్యునిగా నమస్కరిస్తున్నాను. నీకు శరణమయిన నాకు శ్రేయస్సును (అంటే సర్వులూ కోరుకునే అత్యంత దుఃఖనివృత్తి, పరమానందశ్చ ప్రాప్తి అయిన) మోక్షాన్ని ప్రసాదించమని కోరుతున్నాను' అని ప్రార్థించాడు. కృష్ణుడు వెంటనే మోక్షం గురించి మాట్లాడక, దుఃఖంచేత ఆలోచించలేని అర్జునుణ్ణి అనదగని మాటలతో మేల్కొలిపి, శరణు పొందినవానికి ఆత్మజ్ఞానం బోధించ మొదలుపెట్టాడు. 2వ అధ్యాయం 11వ శ్లోకంలో తను శోక అనర్హమైన విషయాలకు శోకిస్తున్నాడని, పండితులు – అంటే ఆత్మజ్ఞానం కలిగినవారు అలా దుఃఖించరని తెలుపుతూ, ఆత్మ అనగా ఏమిటన్న ప్రశ్నకు బీజరూపంగా జవాబునిచ్చాడు. ఈ శ్లోకం నుండే

వ్యాసమహర్షి శ్రీకృష్ణుని శ్రీభగవాన్ ఉవాచ అని జగద్గురువుగా పేర్కొన్నారు. 2వ అధ్యాయంలో శ్లోకం 12 నుండి 25 వరకు ఆత్మ లక్షణాలను తెలియజేశారు. ఉన్నదంతా ఒకేఒక సత్యం అని అద్వైతాన్ని బోధించుట మొదలుపెట్టారు. ఆత్మ సత్యమని 12, 13 శ్లోకాల్లో, నిత్యమని, దాని వినాశనాన్ని ఎవరు చేయలేరని, శరీరము అన్తవన్తములే గానీ (మిథ్యారూపం) **శరీరి అయిన ఆత్మ నిత్యమని**, ఎవరైనా ఈ ఆత్మని హన్తా (కర్తా) లేక హననక్రియకు(కర్మ) అనుకుంటే ఇరువురికీ ఆత్మ గురించి తెలియదని బోధించారు. ఎందుకంటే – ఆత్మ చంపబడదు, చంపదు. ఆత్మ ఎప్పుడూ పుట్టలేదు లేక పుట్టి శరీరము నశించినపుడు మళ్ళీ పుట్టదు.

నీవు ఆత్మ అనుకుంటే అది సత్యం, నిత్యం, అకర్తా, అభోక్తా, అవికారి కనుక నీవు అనవసరంగా దుఃఖిస్తున్నావు. నీవు దేహానివి అంటే స్థూల, సూక్ష్మశరీరానివని అనుకుంటే, ఎల్లప్పుడూ పుట్టి మరణించేటటువంటి స్వరూపము కలిగినవాడివగుటచే మిథ్యా శరీరాన్ని గూర్చి దుఃఖింప పనిలేదు. ఈ విధంగా దుఃఖకారణం లేదని నిరూపించి, ఆత్మస్వరూపాన్ని తెలియజేశారు.

ఈ విషయం వినడానికి బాగున్నా, మనం కోరుకుంటున్నది అదే అయినా అంతఃకరణ శుద్ధి లేకపోతే అర్థం చేసుకోవడం కష్టమని, 2వ అధ్యాయం 27వ శ్లోకంనుంచి 3, 4 అధ్యాయాలలో కర్మయోగాన్ని వివరించారు. పూజ్యశ్రీ దయానందజీ, **సుఖదుఃఖే సమేకృత్వా –** కర్మఫలాన్ని సమత్వబుద్ధితో స్వీకరించినపుడు, కర్మలు చేస్తున్నప్పుడు మన రాగద్వేషాలననుసరించి కాక, ఈశ్వరుడే అన్ని నియతులని తెలుసుకుని ఆ ఆయా పరిస్థితులలో ఏది ధర్మమో చేయడమే ఈశ్వరార్పణం అని చెపుతూ కర్మలు చేసేటప్పుడు **యోగః కర్మసు కౌశలం** అని, కర్మఫలాలు వచ్చినప్పుడు ప్రసాదరూపంలో సమత్వంతో స్వీకరించడమే కర్మయోగమని తెలియచేశారు. ఆ సాధనతో మన రాగద్వేషాల ప్రకారం కాక, ధర్మనియతి ప్రకారం చేయడమే అంతఃకరణ శుద్ధి కలుగచేస్తుంది. అటువంటి మనసులో గురువుగారు చెప్పిన శాస్త్రం తానే ఆత్మ–బ్రహ్మగా తెలుసుకోవచ్చని తెలియజేశారు. ఈ జ్ఞానంవలన మిథ్యా అధ్యాస తొలగి, స్వరూపాన్ని బ్రహ్మగా తెలుసుకోవడమే మోక్షమని తెలియజేశారు.

4–6 అధ్యాయాలలో అంతరంగ, బహిరంగ సాధనలు తెలియజేసి శ్రీకృష్ణుడు అర్జునుని ద్వారా మనలను కూడా ముక్తులు చేశారు. ఇంతవరకు 'త్వం' పదవిచారము చేశారు. ఇక 'తత్' పదవిచారణ మొదలవుతుంది. భగవంతుని స్వరూపం తెలియడానికి శాస్త్రమే శరణ్యం. **'శాస్త్రయోనిత్వాత్'** అనే బ్రహ్మసూత్రం ద్వారా దానిమీద ఆధారపడే ఈశ్వర స్వరూపాన్ని మనకు 7 నుండి 12 అధ్యాయాల వరకు వివరించారు. ఈ జ్ఞానంద్వారా భక్తుడు ఎటువంటి మనస్సుతో ఉంటాడో, అజ్ఞానులకు మార్గదర్శకంగా ఉంటాడో, **అద్వేష్టా సర్వభూతానాం** (12.13) నుండి అధ్యాయం చివరివరకు పరమభక్తుని వర్ణిస్తూ, ఇవన్నీ జ్ఞానీభక్తునికి సహజ లక్షణాలు కనుక, ముముక్షు అయిన సాధకులకు ఈ లక్షణాలన్నీ సాధనలని శ్రీశంకరాచార్యులు వివరించారు. కనుక ఈ 8 శ్లోకాలలోని విలువలు మనందరం పాటించాలి.

ఇలా 'త్వం'పద, 'తత్'పద లక్ష్యాల వివరణ మొదటి రెండు షట్కాలలో చేసి, 'అసి'పదం గురించి అంటే 7–12 అధ్యాయాలలో తెలిపిన ఈశ్వరునికన్నా, 2–6 అధ్యాయాలలో తెలియజేసిన ఆత్మ అభిన్నమని తెలియజేస్తున్నారు. కాని ముందుగా అమానిత్వాది గుణాలు ఉన్నప్పుడే బ్రహ్మాత్మైక్య జ్ఞానం కలుగుతుందని,

అమానిత్వం మొదలైన 20 విలువలను తెలియజేశారు. ఈ విలువలే జ్ఞానసాధనలని, ఇవి లేకపోతే ఉన్నదంతా అవిద్యయే అని తెలియజేశారు.

క్షేత్రం, క్షేత్రజ్ఞులు ఎవరు? అన్ని క్షేత్రాలలోనున్న క్షేత్రజ్ఞుడను తానే అని తెలియజేసి, సర్వాత్మభావాన్ని తెలియజేశారు 13వ అధ్యాయంలో. 14వ అధ్యాయంలో గుణత్రయాలైన సత్త్వ, రజో, తమోగుణాలు అందరి అంతఃకరణాల్లో ఉంటాయని, ఏ గుణం ప్రాధాన్యంగా ఉన్నప్పుడు మనమెలా ప్రవర్తిస్తామో, ఎలా సత్త్వగుణాన్ని పెంపొందించుకోవాలో వివరించారు. మనస్సులో సత్త్వగుణము ఉన్నప్పుడే జ్ఞానం, సంతోషం కలుగుతుంది కనుక ముముక్షువులకు ఎటువంటి ఆహారవ్యవహారాలుండాలో తెలియజేశారు.

మళ్ళీ 15వ అధ్యాయంలో జ్ఞానాన్ని చెప్పారు. శ్రీకృష్ణుడు ఆత్మ చైతన్యరూపంలో తానే అందరి హృదయాలలో ఉన్నానని, తననుంచే అన్ని ఆలోచనలు, జ్ఞానం, అపోహనం అనగా మరపు కనుక అవి తనకు భిన్నంగా లేవని తెలియజేశారు. సర్వవేదాల ద్వారా తెలుసుకోవలసింది తానేననీ, తానే **వేదాంతకృత్, వేదవిత్** అని తెలియజేశారు.

16వ అధ్యాయంలో ఏవి దైవీగుణాలో, ఏవి ఆసురీగుణాలో వివరించి, ఆసురీగుణాలు ఉన్నప్పుడు మానవులు ఎలా ప్రవర్తిస్తారో వివరించారు. దానివలన విజృంభించే కామ, క్రోధ, లోభాలు మనకి నరకానికి ద్వారాలని, వాటిని త్యజించాలని చెప్పారు. చివరగా మనం ఏ కార్యాలు ఎలా చేయాలో, ఎలా చేయగూడదో తెలుసుకోవడానికి శాస్త్రం ప్రమాణమని, కాబట్టి శాస్త్రం చెప్పిన విధానాన్ని తెలుసుకుని మనందరం కర్మ చేయాలని ముగించారు.

17వ అధ్యాయంలో శ్రద్ధ యొక్క ప్రాముఖ్యత **"శ్రద్ధామయోஉయం పురుషః యో యత్ శ్రద్ధః స ఏవ సః"** వాక్యం ద్వారా తెలియజేసి సాత్త్వికశ్రద్ధని పెంపొందించుకోమని చెప్పారు.

18వ అధ్యాయంలో అర్జునుడు మళ్ళీ త్యాగం గొప్పదా, సన్న్యాసం గొప్పదా అని అడిగినప్పుడు ఇంతవరకు చెప్పిన విషయాలనే మరోమారు ఉటంకిస్తూ అర్జునుడు **'నష్టోమోహః స్మృతిర్లబ్ధా'** నీ మాటలనే ఆచరిస్తాను. అనేంతవరకు బోధించాడు. మనందరం కూడా ఈ భగవద్గీతని మళ్ళీమళ్ళీ అంటే **పౌనఃపుణ్యేన శ్రవణం** చేస్తూ మనమే మోక్షస్వరూపులమని తెలుసుకుని, మళ్ళీమళ్ళీ ఆనందిద్దాము. ఆనందమే మన స్వరూపంగా తెలుసుకుందాము. వ్యాసుని ప్రసాదంచేత సంజయుడు ధృతరాష్ట్రునివద్దే కూర్చున్నా, యుద్ధభూమిలో జరిగిన విషయాలు, వారి సంభాషణలను విని ఆనందించాడు. మనం కూడా ఆ సంవాదాన్ని మళ్ళీమళ్ళీ మననం చేసుకుంటూ ఆనందిద్దాము.

నాకు పూర్తి గీతను సింహావలోకనం చేసుకునే అవకాశమిచ్చిన శ్రీ రాఘవరావు గారికి, రాజ్యశ్రీ గారికి అనేకమార్లు గీత చదివించిన నా స్నేహితులందరికీ నా కృతజ్ఞతలు, **'గీతాసుగీతా కర్తవ్యాకిమన్యైః శాస్త్రవిస్తరైః'** అన్నట్లు మనందరం గీతను మళ్ళీమళ్ళీ చదువుతూ దానిలోని గూఢార్థాలను తెలుసుకునేలా శ్రీకృష్ణపరమాత్మ మనందరినీ ఆశీర్వదించాలని ప్రార్థిస్తూ ఈ ముందుమాటను పూర్తి చేస్తున్నాను.

**ఓం నమో భగవతే వాసుదేవాయ!**

**ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ।**

**స్వామిని శివాత్మానంద సరస్వతి, హైదరాబాద్**

# పరమార్థానందస్వామివారి బోధలోని విశిష్ఠత

పరమార్థానందస్వామివారి బోధలో నూతనత్వం ఉంది, స్పష్టత ఉంది, విజ్ఞత ఉంది, విశ్లేషణ ఉంది, విశిష్ఠత ఉంది. అదెలాగో స్వామీజీ మాటల్లో మీరే స్వయంగా చూడండి!

***

**తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే**

జ్ఞానం ఒక్కటే మోక్షాన్ని ఇస్తుంది; జ్ఞానం కాకుండా వేరే ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. ఎందుకు? అజ్ఞానం సమస్య అయితే, జ్ఞానం పొందటం ఒక్కటే ఆ సమస్యకు పరిష్కార మార్గం. ఒక గదిలో చీకటి ఉంటే, అక్కడ దీపం వెలిగించటం ఒక్కటే చీకటిని పారద్రోలే మార్గం. ఆ గదిని శుభ్రంగా ఊడిస్తే చీకటి పోతుందా? ఆ గదిలో శీర్షాసనం వేస్తే చీకటి పోతుందా? ఆ గదిలో విష్ణుసహస్రనామం పారాయణం చేస్తే చీకటి పోతుందా? ఒక విషయం జాగ్రత్తగా గమనించండి. వీటినేవీ మనం కించపరచటం లేదు. గదిని శుభ్రం చెయ్యటం మంచికర్మే కాని అది చీకటిని తొలగించలేదు; శీర్షాసనం యోగాసనాల్లో మంచి ఆసనమే కాని అది చీకటిని తొలగించలేదు; విష్ణుసహస్రనామ పారాయణం మంచి పారాయణమే కాని అది చీకటిని తొలగించలేదు.

**అవిరోధితయా కర్మ నావిద్యాం వినివర్తయేత్**
**విద్యాఽ విద్యాం నిహంత్యేవ తేజస్తిమిరసంఘవత్** – ఆత్మబోధ 3

శంకరాచార్యులవారు ఈ విషయాన్ని తన ఆత్మబోధలో సుస్పష్టం చేశారు. చీకటిని వెలుగువల్లనే పారద్రోలగలము. అలాగే అజ్ఞానాన్ని జ్ఞానంద్వారానే పారద్రోలగలము. సంసారం అజ్ఞానంవల్ల ఏర్పడింది, అందువల్ల జ్ఞానంద్వారానే మోక్షాన్ని పొందగలము. జ్ఞానంవల్ల **మాత్రమే** మోక్షాన్ని పొందగలము అంటే దాన్ని జ్ఞానంమీద ఉన్న వెర్రి అభిమానంగా భావించకూడదు. సత్యాన్ని నెలకొల్పాలంటే గట్టిగా నొక్కి వక్కాణించాలి. అనేక మార్గాలుంటే, ఒక్క మార్గాన్నే పట్టుకు ప్రాకులాడితే, దాన్ని వెర్రి అభిమానం అనవచ్చు కాని, ఇక్కడ ఉన్నది ఒక్కటే మార్గం. చీకటిని పారద్రోలటానికి దీపం వెలిగించటం ఒక్కటే మార్గం ఎలాగో, అలాగే అజ్ఞానమనే చీకటిని పారద్రోలటానికి జ్ఞానదీపం వెలిగించటం ఒక్కటే మార్గం. ఒకవేళ దాన్ని వెర్రి అభిమానం అన్నా ఫర్వాలేదు కాని అది వెర్రితనం మాత్రం కాదు. మీరు ఏ పేరుతో పిలిచినా అది సత్యం, సత్యం, పునః సత్యం.

**జ్ఞానాదేవ తు కైవల్యమ్**

జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది. ఈ మాటకు మీరు ఏ పేరు పెట్టుకున్నా ఫర్వాలేదు. కాని జ్ఞానమార్గం కష్టం కాబట్టి, వేరే మార్గం చూద్దాము అంటే, ఆధ్యాత్మమార్గాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం. అందువల్ల అజ్ఞానం జ్ఞానంవల్లనే పోతుంది.

ఇప్పుడు రెండవ అంశం. జ్ఞానం ఎలా కలుగుతుంది? ఏ జ్ఞానమైనా సరే, దానికి సంబంధించిన విద్య గురించిన జ్ఞానం పొందాలి. ఫిజిక్స్ జ్ఞానం పొందాలంటే, ఫిజిక్స్ నేర్చుకోవాలి తప్ప దానికి వేరే ఏ మార్గం

లేదు. లేదా $(a+b)^2$ ఎంతో తెలుసుకోవాలంటే దానిమీద ధ్యానం చేస్తే తెలుస్తుందా? మ్యాథ్స్ బోధించే గురువుకు పాదపూజ చేస్తే తెలుస్తుందా? ఏదైనా ఆలయానికి వెళ్ళి కొన్ని పూజలు చేస్తే తెలుస్తుందా?

జ్ఞానం పొందాలంటే దానికి సంబంధించిన విద్యను అభ్యసించాలి. లౌకిక విద్య విషయంలో కూడా ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు సమర్ధవంతమైన గురువు దగ్గర ఆ విద్యను అధ్యయనం చెయ్యాలి. అంతేకాని, నాకు ఫిజిక్స్ జ్ఞానం కావాలి, దానికోసం స్టార్‌డస్ట్‌ను చదువుతాను అంటే కుదరదు. అంటే అధ్యయనం చెయ్యాలంటే ఏదో ఒకటి అధ్యయనం చెయ్యకూడదు. దానికి సంబంధించిన శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి. ఈ సూత్రం లౌకికవిద్యకే కాదు, ఆధ్యాత్మిక విద్యకు కూడా చెందుతుంది. బ్రహ్మవిద్య పొందాలంటే బ్రహ్మ గురించి బోధించే శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి. ఇందాక చూసిన నిర్వచనమే ఇక్కడా వర్తిస్తుంది. నిజానికి ఇది శ్రవణం గురించి నిర్వచనం.

**అథాఽ తో బ్రహ్మజిజ్ఞాసా** – బ్రహ్మసూత్రాలు 1

బ్రహ్మసూత్రాలను ఈ సూత్రంతో మొదలుపెట్టారు వ్యాసాచార్యులవారు. దాని పూర్తి అర్థం ఇలా వస్తుంది.

సాధన చతుష్టయసంపత్తి పొందిన అనంతరం, కర్మ వల్ల మోక్షం రాదు కాబట్టి, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాబట్టి, బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. అలా ఒక క్రమపద్ధతిలో జ్ఞానాన్ని పొందటాన్ని జ్ఞానయోగం అంటారు.

జ్ఞానయోగం మాత్రమే జ్ఞానాన్ని ఇస్తుంది; జ్ఞానం మాత్రమే అజ్ఞానాన్ని పారద్రోలుతుంది; అజ్ఞానం తొలిగితేనే మోక్షం కలుగుతుంది. ఈ ప్రాథమిక జ్ఞానం జాగ్రత్తగా పెంపొందించుకోవాలి. సాంప్రదాయబోధ అంటే ఇది. ఏ ఉపనిషత్తు, ఏ ప్రకరణ గ్రంథంమీద శంకరులవారి భాష్యం నేర్చుకున్నా, శంకరాచార్యులవారు ఈ ప్రాథమిక అంశాలను సుస్పష్టం చేస్తారు. ఇది తెలియకపోతేనే, అనేక మార్గాల వెంట పరుగులు తీస్తారు.

ఒక్కసారి ఆగి ఆలోచించండి. జ్ఞానం పొందటానికి వేరే మార్గం ఏదైనా ఉండి ఉంటే అంటే స్పర్శదీక్ష వల్లనో, దృష్టిదీక్ష వల్లనో జ్ఞానం వచ్చేటట్టయితే, కృష్ణపరమాత్మ యుద్ధభూమిలో అంతసేపు జ్ఞానబోధ చెయ్యకుండా, ఆ తేలిక మార్గాన్ని ఉపయోగించి ఉండేవాడు కాదా? కురుక్షేత్ర రణగొణ ధ్వనుల్లో జ్ఞానం బోధించటానికి అనువుగా ఉంటుందా? అయినా ఎందుకు బోధించాడు? అంటే వేరే దగ్గర దారులు లేవు కాబట్టి. కృష్ణపరమాత్మ జ్ఞానబోధ తప్ప వేరే ఏ మార్గమూ ఉపయోగించలేదనే నగ్నసత్యమే జ్ఞానం పొందటానికి వేరే మార్గాలు ఏవీ లేవనే విషయాన్ని తేటతెల్లం చేస్తోంది.

అందువల్ల జ్ఞానయోగం చాలా కష్టం, నేను వేరే మార్గాలు పాటిస్తాను అనకూడదు. కృష్ణపరమాత్మే స్వయంగా జ్ఞానయోగం కష్టమన్నాడు; మీరేమో అది తప్ప వేరే మార్గం లేదు అంటున్నారు. నేను ఏం చెయ్యాలి అని మీరు అంటే దానికి జవాబు చాలా తేలిక.

**జ్ఞానయోగం కష్టమయితే, జ్ఞానయోగాన్ని తేలికపరచుకోండి**

**– మద్దూరి రాజ్యశ్రీ**

# కృష్ణపరమాత్మ హృదయానికి దర్పణం పట్టిన స్వామీజీ

**ఆదిగురువు బోధనా శైలి  ఉపోద్ఘాతం – శ్లోకాలు 1-3**

ఏడవ అధ్యాయంలోని మొదటి మూడు శ్లోకాలు ఉపోద్ఘాత శ్లోకాలు. వీటిలో ఈ అధ్యాయంలో, ఈ షట్కంలో చర్చించబోయే అంశాలను పరిచయం చేస్తాడు కృష్ణపరమాత్మ.

**సమగ్రం మాం జ్ఞాస్యసి** – నా బోధను జాగ్రత్తగా వింటే, నా గురించి సమగ్రంగా తెలుసుకుంటావు. నా గురించిన జ్ఞానం అంటే పరమాత్మ గురించిన జ్ఞానం. ఇక్కడ కృష్ణుడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఈ అధ్యాయమూ, తక్కిన అధ్యాయాలూ సరిగ్గా వింటే ఈశ్వరస్వరూపం గురించిన జ్ఞానం పొందుతావు. దానికి కృష్ణపరమాత్మ మూడు షరతులు విధించాడు. అవి – భగవంతుణ్ణి అంతిమ లక్ష్యంగా పెట్టుకోవాలి; పురుష ప్రయత్నం చెయ్యాలి; ఈశ్వర అనుగ్రహం కోరాలి – ఈ మూడు నియమాలను పాటిస్తే భగవంతుణ్ణి ఖచ్చితంగా తెలుసుకుని, భగవంతుణ్ణి పొందుతారు. బ్రహ్మజ్ఞాన ఫలం ఏమిటి? బ్రహ్మవిత్ ఆప్నోతి పరం.

* * *

**అహమ్ ఎవరు? తస్య తస్య శ్రద్ధామ్ అహమ్ అచలాం విదధామి** – ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి మనం. నేను వారి కోరిక తీరుస్తాను అంటున్నాడు. నిజానికి వారు పూజిస్తున్నది ఎవరిని? అన్యదేవతలను! పరిచ్ఛిన్న దేవతలను లేదా అపూర్ణ దేవతలను. ఆ పరిచ్ఛిన్న దేవతలు తీరుస్తారు అనాలి కదా, నేను తీరుస్తాను అని ఎందుకన్నాడు? భగవద్గీతలో కృష్ణపరమాత్మ అపరిచ్ఛిన్న దేవుడు, అనంతం, నిర్గుణం, సత్‌బ్రహ్మ. కృష్ణపరమాత్మ అపరిచ్ఛిన్నం కాబట్టి, ఈ సందర్భంలో తక్కిన దేవుళ్ళంతా పరిచ్ఛిన్న దేవుళ్ళు అవుతారు. ఎందుకంటే పరిచ్ఛిన్నమైనవన్నీ అనంతంలో ఒకభాగం. పరిచ్ఛిన్నమైనవి అనంతంలో కలవకపోతే అనంతాన్ని అనంతం అనలేము. తక్కిన దేవతలు అనంతం అయిన కృష్ణపరమాత్మలో ఒక భాగం కాబట్టి, ఏ భాగానికి మనం పూజ చేసినా అది మొత్తానికి వెళుతుంది.

* * *

**కృష్ణపరమాత్ముని చిలిపిబోధ** – కృష్ణపరమాత్మ చెప్పాలనుకున్నది నిష్కామభక్తులు చివరికి పరాప్రకృతిని, అపరాప్రకృతిని కూడా తెలుసుకుంటారు అని. పరాప్రకృతి అంటే భగవంతునియొక్క ఉన్నతస్థాయి అని, అపరాప్రకృతి అంటే వ్యావహారికస్థాయి అని చూశాము. కాని ఇక్కడ కృష్ణపరమాత్మ పరాప్రకృతి, అపరాప్రకృతి పదాలు వాడకుండా కొత్త పదాలను పరిచయం చేస్తున్నాడు. సహజంగా ఈ కొత్త పదాలేమిటో తెలుసుకోవాలనే కుతూహలం అర్జునునికి కలుగుతుంది. ఆ కుతూహలం రేకెత్తించటం ద్వారా ఎనిమిదవ అధ్యాయానికి ఇక్కడే బీజం వేసాడు కృష్ణపరమాత్మ. ఆ కొత్త పదాలు **బ్రహ్మ, కర్మ**. వాటిని ఇక్కడ వివరించడు. ఎనిమిదవ అధ్యాయంలోనే చూస్తాము.

* * *

**గీత ఉపనిషత్తుల సారం – ధర్మ్యమ్** – ఇది ధర్మయుక్తం అంటే వేదాంతబోధను ఆధారం చేసుకుని చెప్పబడింది. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే మన వేదాలు ప్రాథమిక గ్రంథాలు. ఏ బోధ చేసినా, అది వేదాన్ని ఆధారంగా

చేసుకుని చెయ్యాలి. భగవద్గీతను స్మృతి గ్రంథం అంటారు. అది ఉపనిషత్తుల సారం అని ప్రతి అధ్యాయం చివర్లో చెబుతారు. కాబట్టి భగవద్గీత మోక్షశాస్త్రం. అందువల్ల వేదాలను ఆధారంగా చేసుకోని బోధ నిలవదు. ఇప్పటి తరానికి వేదప్రామాణ్యత అంతగా తెలియకపోవచ్చు కాని, కృష్ణపరమాత్మ బోధ చేసిన కాలంలో దానికి చాలా విలువ ఉంది. అందువల్ల కృష్ణపరమాత్మ సాక్షాత్తూ అవతారమూర్తే అయినా, తను వేదప్రమాణాన్ని ఆధారం చేసుకుని చెపుతున్నానని స్పష్టం చేశాడు నాలుగవ అధ్యాయంలోనే.

* * *

**వైవిధ్యవాక్యాల గంభీరత – భూతాని న మత్స్థాని** – సర్వప్రాణులు నాలో నెలకొని లేవు. సరిగ్గా ముందు శ్లోకంలోనే అన్ని ప్రాణులు నాలో నెలకొని ఉన్నాయి అన్నాడు. వెంటనే సర్వప్రాణులు నాలో నెలకొని లేవు అన్నాడు. అలా భిన్నవాక్యాలు ఎందుకు చెప్పాడు కృష్ణపరమాత్మ? గీతను బోధించే వారందరికీ ఇది క్లిష్టమైన సందిగ్ధం. అందువల్ల ఇక్కడ రకరకాల వివరణలు వస్తాయి. ఇలాంటి సందర్భాలలో శంకరులవారు మనను ఆదుకుంటారు. శంకరులవారి భాష్యం లేకపోతే ఇలాంటి భిన్న వాక్యాలను అర్థం చేసుకోవటం కష్టం.
**మత్స్థాని సర్వభూతాని** – నాలో అన్ని భూతాలూ ఉన్నాయి అన్నప్పుడు వ్యవహారిక స్థాయినుంచి చెప్పాడు. అంటే అప్పుడు ప్రపంచం ఉంది.
**న చ మత్స్థాని భూతాని** – నాలో అన్ని ప్రాణులూ లేవు అన్నప్పుడు వ్యవహారిక స్థాయినుంచి పారమార్థిక స్థాయికి వెళ్ళాడు. అంటే బ్రహ్మపరంగా చెప్పాడు.

* * *

**ఏకశ్లోకీ** – ఒక్కశ్లోకంలో ఐదు దశలు. అవి –

| | | |
|---|---|---|
| **1. మద్భక్తః భవ** | **– నామీద భక్తి పెంపొందించుకో** | **– అది సాధనమీద భక్తి** |
| **2. మత్పరాయణః** | **– నన్నే నీ అంతిమ లక్ష్యంగా చేసుకో** | **– అది సాధ్యంమీద భక్తి** |
| **3. మన్మనా భవ** | **– నన్ను నీ లక్ష్యంగా ఎన్నుకున్నాక, ఏకాగ్రత వీడకు** | **– అది ముముక్షు భక్తి** |
| **4. మద్యాజీ భవ** | **– నువ్వు చేసే ప్రతి పనినీ నాకే అంకితం చెయ్యి** | **– అది నిష్కామ భక్తి** |
| **5. మాం నమస్కురు** | **– నన్నే శరణు వేడు, నా దీవెనలు కోరు** | **– అది ఈశ్వర అనుగ్రహం కోరే భక్తి** |

* * *

**విశ్వరూపదర్శన అంతరార్థం–** విశ్వరూపదర్శనం చెయ్యాలంటే జన్మ మృత్యువులు రెండింటినీ మంగళకరంగా చూడాలి తప్ప, ఒకదానిని మంగళంగానూ, ఇంకొకదానిని అమంగళంగానూ చూడకూడదు. దాన్నే దృష్టిదోషం అంటారు. అలా ఏ ద్వంద్వవిషయాలను చూసినా, మంగళకరంగా తీసుకోవాలి. ఎదుగుదల–క్షీణించటం; ఆరోగ్యం–అనారోగ్యం; కలవటం–విడిపోవటం; రాత్రి–పగలు – అన్నీ మంగళమే. అన్నీ విశ్వరూపంలో భాగంగా చూడాలి. పవిత్రంగా లేనిది ఏదీ లేదు; నాకు అంగీకారం కానిది ఏదీ లేదు అనుకోగలగాలి. అలా అనుకోగలగటం

పరిపక్వతను సూచిస్తుంది. ఈ పరిపక్వత లేకపోతే భగవంతుడు కరుణామయుడుగా ఒకసారి అనిపిస్తే, నిర్దాక్షిణ్యుడుగా ఇంకొకసారి అనిపిస్తాడు. భగవంతుడు నిర్దాక్షిణ్యుడుగా కనిపిస్తే అది భగవంతుని నిర్దాక్షిణ్యం కాదు, నా అపరిపక్వత.అర్జునునికి ఇంకా పూర్తిగా పరిపక్వత రాలేదు; అందువల్ల అతను భగవంతునిలోని రెండవ అంశాన్ని చూడలేకపోతున్నాడు.

* * *

**భక్తియోగవిశ్లేషణ –**నిజానికి భక్తి అనే పదాన్ని విడిగా వేదాల్లో కాని, ఉపనిషత్తుల్లో కాని చూడము.

**కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = భక్తియోగం**

ఈ మూడు దశలనే కృష్ణపరమాత్మ ఐదు దశలుగా విభజించాడు. కొన్నిచోట్ల మెట్లు చాలా ఎత్తుగా ఉంటే, వాటిని పడగొట్టి ఇంకా చిన్న మెట్లు చేస్తారు. ఆ విధంగా కృష్ణపరమాత్మ కూడా ఈ మూడు స్థాయిలను ఐదు స్థాయిలు చేశాడు.

| | | | |
|---|---|---|---|
| కర్మయోగం స్థాయి | 1 | – సకామకర్మ ప్రధాన కర్మయోగం | – 1 |
| కర్మయోగం స్థాయి | 2 | – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం | – 2 |
| ఉపాసనయోగం స్థాయి | 1 | – ఏకరూప ఈశ్వరధ్యానం | – 3 |
| ఉపాసనయోగం స్థాయి | 2 | – అనేకరూప ఈశ్వరధ్యానం | – 4 |
| జ్ఞానయోగం | | – అక్షర ఉపాసన | – 5 |

* * *

**కృష్ణపరమాత్ముని నర్మగర్భబోధ –**ప్రశ్న ఏమిటి? సగుణభక్తి గొప్పదా, నిర్గుణభక్తి గొప్పదా? ఎవరినైనా ఈ ప్రశ్న అడిగితే, సాధారణంగా సగుణభక్తి గొప్పది అంటారు. ఈ ప్రశ్నకు అందరూ ఇచ్చే జవాబు పక్కన పెడితే, అసలు జవాబు ఏమిటి? అసలు జవాబు – **ఈ ప్రశ్నే తప్పు. తప్పు ప్రశ్నకు సరియైన జవాబులేదు**. కాని కృష్ణపరమాత్మ అర్జునుని ప్రశ్నను విమర్శించకుండా, అతన్ని చిన్నచూపు చూడకుండా, దానికి జవాబు నర్మగర్భంగా, తెలివిగా చెపుతాడు. సగుణభక్తులు గొప్పవారు; నిర్గుణభక్తులు నన్ను పొందుతారు అన్నాడు.

* * *

**కృష్ణపరమాత్మ సందేశం –** మనకు ఆత్మీయులు మరణించగానే, భగవంతునికి చెవులు లేవా, కన్నులు లేవా, నా ప్రార్థనను ఆలకించలేడా అని తిడతాము.ఇప్పుడు కృష్ణపరమాత్మ జవాబు చెప్పగలడు. నేను భగవద్గీతలో అన్నిసార్లు చెప్పాను. మీకు చెవులు లేవా, కన్నులు లేవా, నా మొరను మీరు ఆలకించలేరా, ఇదేమి అక్రమం అని తిడుతున్నాడు. మీరు నా బోధను వినకండి, నేను మాత్రం మీ బాధను అర్థం చేసుకోవాలా అని ఎదురు ప్రశ్నిస్తున్నాడు. నా అపరాప్రకృతిలో నిలవకండి; శాంతి, భద్రత, ఆనందం కావాలంటే నా ఉన్నతస్థాయి గురించి తెలుసుకోండి. జగత్తులో ఉన్నదంతా నాశనమయ్యేదే. ఏదీ శాశ్వతం కాదు.

* * *

**– మద్దూరి రాజ్యశ్రీ**

# ఆర్షవిద్యాతరంగిణి ట్రస్ట్ ఆవిర్భావము

కొన్ని అనూహ్యమైన పరిస్థితులలో, భగవత్ ప్రేరణతో మా దంపతులము 2014లో రిటైరయ్యాక, వేదాంతబోధకు ఉపక్రమించాము. మా పాఠాలు స్వామిపరమార్థానందులవారి బోధనల ఆధారంగా ఉంటాయి. అప్పుడు మేము పాఠాలు ఉచితంగా చెప్పాలి అని గట్టి నిర్ణయం తీసుకున్నాము. మాకు వచ్చే పింఛను మాకు సరిపోతుంది. అప్పట్లో అద్వైత వేదాంత పరిచయము తెలుగులో రాజ్యశ్రీ అనువాదము చేస్తే, దానికి జిరాక్సు కాపీలు తీసి ఉచితంగా వితరణ చేసేవాళ్ళం.

మా ఆప్తమిత్రులు మూల్పూరి విష్ణుప్రసాదుగారి ప్రోద్బలమూ, అండదండలతో మొదట అద్వైత వేదాంత పరిచయము ముద్రణ చేశాము. ఈ పుస్తకము చాలా జనాదరణ పొందింది. ఆ తరువాత మా శ్రేయోభిలాషి, ఆప్తమిత్రులు దేవరకొండ అరుణగారి ప్రోత్సాహము, సహకారములతో కఠోపనిషత్ వెలుగులోకి వచ్చింది. గురుపూర్ణిమకు, గీతాజయంతికి గురుదక్షిణ అంటూ మా సత్సంగ్‌సభ్యులు మా ఇరువురికి బట్టలు పెట్టడం మొదలు పెట్టారు. గృహస్థులుగా మేము బట్టలను తిరస్కరించ లేక పోయాము. ఎప్పుడు మొదలైందో గురుదక్షిణ కూడా ఇవ్వడం మొదలు పెట్టారు. ఉచితంగా పాఠాలు చెప్పాలనుకున్నాము కదా అని ఈ ధనం పుస్తకప్రచురణలకు వాడుతున్నాము. ఇలా పుస్తకాలు వేస్తూంటే మేమంటే మేమని దాతలు ముందుకొస్తున్నారు. వాటివల్ల ప్రచురణలకు వెనక్కి తిరిగి చూడవలసిన పని లేకపోయింది.

ఈ సందర్భంలో స్వామీజీ గురించి, ఈ గ్రంథాల గురించి చెప్పాలి. పరమార్థానందస్వామీజీ చేసే బోధ క్లాసు రూమ్ టీచింగ్‌లా ఉంటుంది. ఎంతో క్లిష్టమైన అద్వైతబోధను చిన్నచిన్న అంశాలుగా విభజించి, ఒకటికి నాలుగుసార్లు చెప్పి, విషయం మన నరనరాల్లో జీర్ణించుకు పోయేలా చేస్తారు. ఎవరైనా ఆయన బోధ విని పరీక్షరాసి డిస్టింక్షన్ తెచ్చుకోవచ్చు.

అందువల్ల ఈ గ్రంథాలు కూడా భిన్నశైలిలో ఉన్నాయి. తక్కిన ఆధ్యాత్మిక గ్రంథాల మాదిరిగా గ్రాంథిక భాషలో కాకుండా, తేటతెనుగులో, సరళమైన శిష్టవ్యవహారభాషలో, శిష్యులను ఎదురుగా కూర్చోపెట్టుకుని బోధ చేస్తున్నట్టు ఉన్నాయి, కాని కేవలం ఒక పుస్తకం చదువుతున్నట్టుగా ఉండదు. ఎందుకంటే ఆత్మజ్ఞానం గురుముఖతః పొందాలి. ఇది సాధకులు గమనించగలరు. ఎవరైనా ఈ అద్వైతబోధను శిష్యపరంపరగా అందచేయాలంటే ఈ పుస్తకాలు ఎంతో సహాయకారిగా ఉంటాయి. ఈ గ్రంథాలు చదివితే స్వామివారి బోధ మరింత సుగమం అవుతుంది.

ఈ విధంగా బ్రహ్మయజ్ఞం చేస్తున్నాం. మేమూ సత్సంగ్ సభ్యులమూ కలిసి. అలా వసూలవుతున్న ధనానికి పారదర్శకతనివ్వాలనే ఉద్దేశంతో ఈమధ్యనే ఒక ట్రస్టు కూడా స్థాపించాము. ఆ ట్రస్టు పేరు **ఆర్షవిద్యాతరంగిణి ట్రస్ట్.** దీని ముఖ్య ఉద్దేశ్యం బ్రహ్మవిద్యను అందరికీ అర్థమయ్యే భాషలో, అతి సులభమైన రీతిలో పుస్తకాల ద్వారా ప్రత్యేకించి జనసామాన్యానికి అందించాలని. అదికాక బ్రహ్మవిద్యలో భాగంగా వేదపాఠశాలలకు, వేదవిద్యకు మనవంతు సాయం అందించాలని; స్వామీజీలకు, స్వామినీలకు ట్రస్ట్ తరుపున దక్షిణలు ఇవ్వాలని కూడా సంకల్పించాము.

**ఆర్షవిద్యాతరంగిణి ట్రస్టీలు–** శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీగారు, శ్రీ కస్తూరి వీరరాఘవరావుగారు, డా॥ కొండూరు రాఘవరాజుగారు, డా॥ బోయినేపల్లి యాదగిరిగారు, శ్రీ తిరుమలశెట్టి రామమోహనరావుగారు. **సంస్థపరంగా నిర్వహణ సౌలభ్యంకోసం కొన్ని పేర్లు ఉండాలి కనుక ఈ పేర్లు చెప్పబడ్డాయి. నిజానికి ఈ సంస్థ మనందరిది. అందరం కలిసికట్టుగా మన లక్ష్యాన్ని సాధిద్దాం. ముందు తరాలకు కూడా బ్రహ్మవిద్యను అందిద్దాం.**

మనం చేస్తున్న ఈ బ్రహ్మయజ్ఞానికి నేను సైతం అంటూ శ్రీజొన్నలగడ్డ వీరభద్రరావుగారు డాక్యుమెంట్ రాసిపెట్టారు, డా॥ కొండూరు రాఘవరాజుగారి మిత్రులు శ్రీచిగలి పద్మనాభమూర్తిగారు, రిటైర్డ్ అడిషనల్ ఐజీ ఆఫ్ రిజిస్ట్రేషన్స్ అన్డ్ అష్యురెన్సెస్ మన ట్రస్టు డాక్యుమెంట్‌కు మెరుగులు దిద్ది, రిజిస్ట్రేషన్‌కి సాయం చేశారు. రిజిస్ట్రేషన్‌కి డా॥ కొండూరు రాఘవరాజుగారు చేయూత నిచ్చారు. శ్రీకర్పూరపు శ్రీధర్‌గారు, శ్రీకొంగర కృష్ణయ్యగారు సాక్షిసంతకాలు చేశారు.

స్టేట్ బ్యాంక్‌లో ట్రస్టు అకౌంటు తెరిచాము. దీనికి శ్రీరొక్కం కుమార్ రావుగారు, శ్రీపారుపూడి సత్య వెంకట కుమార్‌గారు, శ్రీతంబి సుబ్రహ్మణ్యంగారు, బ్యాంక్ మేనేజర్ శ్రీనితిన్‌గారు సహాయసహకారాలు అందించారు. అడుగడుగునా డా॥ బోయినేపల్లి యాదిగిరి రావుగారు, శ్రీ తిరుమలశెట్టి రామమోహనరావుగార్ల, అండదండలు ఉంటూనే ఉన్నాయి. ట్రస్ట్ పాన్‌కార్డుకు, ఇనకమ్‌టాక్స్‌లో నమోదు చేసుకోడంలో శ్రీ హరి జగన్నాథశర్మగారు మనకెంతో సహాయం చేస్తున్నారు. టాక్స్ సంబంధిత విషయాల్లో శ్రీ హరి జగన్నాథశర్మగారు, శ్రీ జొన్నలగడ్డ వీరభద్రరావుగారు మనకెంతో అండగా, సహాయకారిగా ఉన్నారు.

ఈ పుస్తకంతో కలిపి ఇప్పటికి పదిహేను పుస్తకాలయ్యాయి. 2014కు ముందు మేము ఆత్మవిద్య బోధ చేస్తామని గాని. ఇలా పుస్తకాలు ప్రచురించబడతాయని గాని మా ఊహకు కూడా అందని విషయం. ఒక మంచి కలలా జరుగుతోంది. అంతా ఈశ్వరలీల. నిజంగా ఈశ్వరుని కృప మనందరిమీదా అపారంగా ఉంది. అందుకే మనం ఆత్మవిద్యను కొనసాగించగలుగుతున్నాము.

ఈ ట్రస్ట్ కార్యక్రమాల్లో భాగంగా జరిగే ఎమ్మెస్ టీమ్స్‌కి, కో–ఆర్డినేటర్ శ్రీరామ్మోహనరావుగారు. ఆయన చేస్తున్న సేవను మాటల్లో వివరించలేము. ఆయన వన్ టు వన్ బేసిస్‌మీద ఒక్కొక్క సభ్యునికి టీమ్స్ ఎలా ఆపరేట్ చేయాలో నేర్పారు. ప్రతిరోజూ క్లాసు కండక్టు చెయ్యటం, దానికి అవసరమైన ఆడియో విజువల్ ఎయిడ్స్ చూపటం, తరువాత ఆడియోలు గ్రూపులో పెట్టటం చేస్తారు.

ట్రస్టు అకౌంటు తెరవగానే దాతలు ముందుకొచ్చి విరాళాలను వెల్లువలా ట్రస్టు అకౌంటులోకి ట్రాన్సఫర్ చేస్తున్నారు. వీరందరికీ పేరు పేరునా మా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాము. వీరికి జ్ఞానప్రాప్తినివ్వమని, జ్ఞాననిష్ఠ నెలకొనేలా చేయమని ఈశ్వరుణ్ణి వేడుకుంటున్నాము. **ఇదంతా ఈశ్వర విభూతి.**

**సర్వం శ్రీ పరమేశ్వరార్పణమస్తు**

ప్రణామములతో,

– **మీ రాఘవ రావు, రాజ్యశ్రీ**

# మూకం కరోతి వాచాలం

**మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్।**
**యత్కృపా తమహం వందే పరమానంద మాధవమ్॥ గీత ధ్యాన శ్లోకం – 7**

**మూకం కరోతి వాచాలం –** ఈ మాట మా దంపతుల విషయంలో అక్షరాలా నిజం. ఈ రోజు ఇలా మేము నలుగురికి అద్వైత వేదాంతం బోధిస్తామని కానీ, ప్రస్థానత్రయాన్ని పుస్తకరూపంలోకి తెస్తామని కాని కలలో కూడా ఎన్నడూ అనుకోలేదు.

ఇద్దరం ఒకే విద్యారంగంలో ఉండటం, ఇద్దరి భావాలూ ఒకటే కావటంతో, ఏం చేసినా ఇద్దరం కలిసి చెయ్యటం ముందునుంచీ అలవాటు. ఒకరికి నచ్చినవి ఇంకొకరికి చెప్పుకుంటాము. మనస్సులోని భావాలను కలబోసుకుంటాము. 'భావం నాది, భాష నీది' అని చెప్పి నాచేత అనేక అంశాలమీద మావారు కథలు రాయించేవారు.

దాని తరువాత భక్తి రంగంలో చెట్టాపట్టాలు వేసుకుని అడుగుపెట్టాము. తను తెలుగు భక్తి పేజెస్ పెడితే, దానికి కావలిసిన వ్యాసాలు రాయటం, ఎడిటోరియల్‌వర్క్ చేయటం నేను చేసేదాన్ని. అందులో అలా ఆయన భావం, నాభాషలో రూపుదిద్దుకున్నది– **పర్సనాలిటీ డెవలప్‌మెంట్ త్రూ గీత.** ఆ వెబ్‌సైట్ ద్వారా మేము నేర్చుకున్న అంశం, ఏ దేవునికి ఏ ఫలితం ఆశించి ఏ పూజచేసినా ఆ ఫలితం విధిగా దక్కుతుంది, కాకపోతే శ్రద్ధగా, భక్తిగా చేయాలి. అప్పుడే దేవుళ్ళందరూ ఒకటే అనే సత్యం మాలో స్థిరపడింది.

తెలుగు భక్తి పేజెస్‌లోంచి ఆర్షవిద్యలోకి అంటే జ్ఞానమార్గంలోకి ఒకరి తరువాత ఒకరం అడుగు పెట్టాము. స్వామి పరమార్థానందగారు, ఆయనకు కూడా గురువైన దయానందస్వామి గారు మాగురువులు. వారిద్వారా ఇద్దరం ప్రస్థానత్రయాన్ని అధ్యయనం చేశాము. స్వాధ్యాయనంకోసం నేర్చుకోవటం మొదలు పెట్టిన ఆత్మజ్ఞానం, నిర్మలగారు అనే ఒక సత్సంగ్ సభ్యురాలు, వారి సత్సంగములో ఉపనిషత్తుల బోధ చేయమని కోరితే గురువుల ఆశీస్సులతో, దైవకృపతో మేము సైతం జ్ఞానబోధకు నడుం కట్టాము. ఇద్దరం ఆరు సంవత్సరాలుగా బోధ చేస్తున్నాము.

అందులో భాగంగా కొన్ని ఉపనిషత్తులు, ప్రకరణగ్రంథాలు ప్రచురించాము. ఇవన్నీ స్వామి పరమార్థానందగారి బోధనలను అనుసరించి ఉంటాయి. ఇప్పుడు భగవద్గీత అనే బృహత్ గ్రంథముతో మీ ముందుకు వస్తున్నాము.
**మా కార్యక్రమాలు –**

**1. అద్వైత వేదాంత బోధ –** ప్రస్థానత్రయమైన భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు మొన్న మొన్నటి వరకూ మూడు సత్సంగాలలో చెప్పేవారము. వాటి పేర్లు– దయా సత్సంగ్, ఆర్ష ఆనంద కుటీర్, వేదాంత సీనియర్ సిటిజన్స్ గ్రూప్. ఇప్పటి పరిస్థితులనుబట్టి ఆన్‌లైన్ క్లాసులు తీసుకుంటున్నాము.

**2. ఆర్షవిద్యా తరంగిణి – పుస్తక ప్రచురణలు –** ఇప్పటిదాకా– మూడు ప్రకరణగ్రంథాలు, తొమ్మిది ఉపనిషత్తులు, వేదాంత జీవన విధానము (స్వామీజీ సందర్భోచిత ఉపన్యాసాలు), భగవద్గీత మొదటి షట్కము ప్రచురించాము. ఇప్పుడు రెండవ షట్కముతో మీ ముందుకు వస్తున్నాము. బ్రహ్మవిద్య అర్థంచేసుకోవటం కష్టం కాబట్టి, అందరికీ తేలికగా అర్థమవాలనే సత్సంకల్పంతో తేట తెనుగులో రాయటం జరిగింది. ఇప్పటి వరకు ప్రచురించబడిన గ్రంథాలకు, ముఖ్యంగా భగవద్గీతకు మంచి గుర్తింపు వచ్చింది.

**3. వేదాంత శిబిరాలు –** సంవత్సరానికి ఒకసారి ఏదైనా పుణ్య క్షేత్రానికి వెళ్ళి పదిరోజులు ఉండి వేదాంత శిబిరం నిర్వహిస్తున్నాము. ఇద్దరం చెరొక ప్రకరణగ్రంథము బోధించేవారము.

| | | |
|---|---|---|
| అపరోక్షానుభూతి, దృక్‌దృశ్యవివేకము | – కాశీలో | – 2018 |
| భజగోవిందం, అద్వైతమకరందం | – శ్రీశైలంలో | – 2019 |
| జీవయాత్ర, మనీషాపంచకం, వాక్యవృత్తి, విష్ణుసహస్రనామం (వివరణ) | – నైమిశారణ్యంలో | – 2020 |

**4. తెలుగు భక్తి పేజెస్** www.telugubhakti.com – ఫ్రీ వెబ్‌సైట్

ఇందులో మాచే ప్రచురించబడిన పరమార్థానందస్వామి బోధనల పుస్తకాల సాఫ్ట్‌కాపీలు ఉన్నాయి. ఇంకా మా క్లాసురూము బోధనల ఆడియోలు ఉన్నాయి. అవికాక, అనేక దేవతల స్తోత్రాలు, వ్రతాలు, రామాయణం, భాగవతం, భగవద్గీత, ఉపనిషత్తులు, ప్రకరణగ్రంథాలు ఇలా ఎన్నో ఆధ్యాత్మిక అంశాలున్నాయి.

**5. అద్వైతామృత వర్షిణి – వాట్సాప్ గ్రూప్**

ఇందులో భగవద్గీత ఆడియోలు తెలుగులో పెడుతున్నాము. ఇప్పటిదాకా తొమ్మిది అధ్యాయాలు అయ్యాయి.

**6. ఆర్షవిద్యాతరంగిణి ట్రస్టు వాట్సాప్ గ్రూప్ – ఎమ్మెస్ టీమ్స్‌లో ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణ**

కోవిడ్ మూలంగా ప్రత్యక్షంగా క్లాసులు తీసుకోలేము కాబట్టి గత ఏప్రిల్‌లో ఎమ్మెస్ టీమ్స్‌లో ఆన్‌లైన్ క్లాస్‌లు మొదలు పెట్టాము ఆ క్లాసులు మంగళవారంనుంచి శుక్రవారం వరకు సాయంకాలం 6 నుండి 7.30 గం॥ లకు జరుగుతాయి. వాటిలో ప్రస్థానత్రయం ఒకేసారి బోధిస్తున్నాము. ఇది క్లాసురూమ్ టీచింగులా ఉంటుంది. ప్రతి క్లాసు అయ్యాక సత్సంగ్ సభ్యుల్లో ఒకరు ముందురోజు చెప్పింది రీకాప్ చేస్తారు. ఆ రీకాప్ ఒక గొప్ప అనుభూతి అందరికీ. ఎంత క్లిష్టమైన అంశం అయినా ఇట్టేపట్టేసుకుంటారు. దానిలో కొన్ని ప్రయోగాలు కూడా చేశారు. బ్రహ్మసూత్రాలు చెప్పినప్పుడు పూర్వపక్షిగా, సిద్ధాంతిగా ఇద్దరు నాటకీయంగా చెప్పేవారు. కొండొకచో సూత్రధారి కూడా ప్రవేశం చేసేవారు. ఈరోజు క్లాసు ఆడియో మర్నాడు ఆర్షవిద్యాతరంగిణి వాట్సాప్ గ్రూప్‌లో పెడతాము. ఈ గ్రూప్‌లో ఇప్పటి వరకూ 250 మంది ఉన్నారు. 90మంది ప్రత్యక్షంగా క్లాసులకు వస్తే మిగిలినవారు మరుసటిరోజు పెట్టిన ఆడియో వింటారు.

ఇవన్నీ పూర్తిగా స్వామీజీ చెప్పిన పద్ధతిలోనే ఉన్నాయి. పరమార్థానందస్వామీజీ పాఠంనుంచి ఏమాత్రం పక్కకు పోకుండా చెబుతారు. వారి అడుగుజాడల్లోనే మేమూ నడుస్తున్నాము. అంటే ఎక్కడా స్వామిజీ బోధను పలుచన చేయకుండా, స్వంతభావాలు చొప్పించకుండా, యథాతథంగా బోధిస్తున్నాము.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# ఎందరో మహానుభావులు

ఈ బ్రహ్మయజ్ఞానికి ఎందరో సహాయసహాకారాలందించారు. స్వామీజీల, స్వామినిల ప్రోత్సాహం, పాఠకుల నిరంతర ఆదరణ చెప్పనలవికాదు.
ఈ పుస్తకంలో దోషాలు లేకుండా దిద్దిపెట్టిన వారు –

**1. శ్రీ దేసు కృష్ణచైతన్యగారు**
**2. శ్రీ మూల్పూరి విష్ణుప్రసాదుగారు**
**3. శ్రీమతి దేవరకొండ అరుణయశోదగారు**
**4. శ్రీ గరికపాటి సత్యనారాయణమూర్తిగారు**
**5. శ్రీ తిరుమలశెట్టి రామమోహన్‌రావుగారు**
**6. శ్రీ పిరాట్ల వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణశాస్త్రిగారు**

సాంకేతికంగా మాకు అండదండలుగా ఉంటూ మాకెంతో సహాయ సహకారాలు అందచేస్తున్నవారు–
**శ్రీ హరి జగన్నాథశర్మగారు ఇంకా శ్రీ జొన్నలగడ్డ వీరభద్రరావుగారు**

బ్రహ్మయజ్ఞరూపేణ ఆర్థికంగా చేయూతనిచ్చిన వారు –
**ఆర్ష ఆనందకుటీర్ సభ్యులు**

ప్రింటింగ్‌కు సహాయపడుతున్న **శ్రీవీరమాచనేని వెంకట కృష్ణారావుగారు**, తప్పులు లేకుండా డీటీపి చేస్తున్న **సిరిపురపు రాజేంద్రకుమార్‌గారు**

వీరందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు, శతకోటివందనాలు.

**– రాఘవరావు, రాజ్యశ్రీ**

# నాలో రచనాశక్తిని వెలికితీసినది!

శ్రీకారం చుట్టాడు ఎమెస్కో క్రౌన్ సిరీస్‌కి
రుచి చూపించాడు ఫ్రీ పబ్లికేషన్ ఆఫర్లని
'హార్నీ' అనిపించుకున్నాడు తన ప్రతిభతో ఆర్నీలో
తోరణం కూర్చాడు యద్దనపూడి సులోచనారాణి నవలలకి
'తండ్రిని మించిన తనయుడు', 'తాతకు తగ్గ మనవడు' అని
పేరు పొందాడు ఆనాడు తెలుగు ప్రచురణ రంగంలో
ఇప్పుడు ఎగరవేస్తున్నాడు విజయ పతాకాలు కంప్యూటర్ ఫీల్డులో
తనకు తానే సాటిగా వెలుగుతున్నాడు
దేశవిదేశాల్లో శ్రీ యం. యస్. కుమార్

వంశపారంపర్యంగా వస్తున్న ప్రచురణరంగంలో తను కూడా అడుగుపెట్టి ఎమెస్కో పాకెట్ బుక్స్, ఇంటింటా స్వంతగ్రంథాలయం, యం. శేషాచలం అండ్ కో పేర్లతో దేశమంతటా మారుమ్రోగుతున్న సంస్థను ఇంకా కొన్ని మెట్లు పైకెక్కించాడు యం.యస్. కుమార్‌గా ప్రసిద్ధిపొందిన మద్దూరి శేషాచల కుమార్. కంప్యూటర్ రంగం బాగా విస్తరించక ముందే, తను అందులోనూ ఆరితేరి, అమెరికా వెళ్ళిన కొన్నాళ్ళకే అక్కడ స్వంతంగా ఒక సంస్థను పెట్టుకుని, దేశవిదేశాలంతటా తన కంప్యూటర్ వ్యాపారాన్ని విస్తరింపజేశాడు. అమెరికా వెళ్ళిన సంవత్సరంలోపే ఆరుగురు అమెరికన్లు ఒక సంవత్సరం పాటు చేసే పని తను ఒక్కడే ఒక్క నెలలో చేస్తాడు అనే ప్రశంసాపత్రాన్ని పొందాడు. ఇంత మేధావి నా అన్న అని నేను చెప్పుకోవటానికి ఎంతో ఆనందిస్తున్నాను.

కుమార్‌ను ఇంట్లో అందరమూ రఘు అంటాము. మా అన్న నాకన్నా ఒక సంవత్సరమే పెద్ద అయినా, మా అన్నయ్య ప్రభావం నామీద చాలా ఉంది. ప్రభావం ఉంది అనేకన్నా, నన్ను తీర్చిదిద్దాడంటే ఇంకా బాగుంటుంది. నాకు తను ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ అని చెప్పవచ్చు.

నేను ఇంటర్మీడియేట్‌లో ఉండగానే నాకు పంక్చువాలిటీ నేర్పించాడు. మా అన్న వంట కూడా బాగా చేస్తాడు. తనే నాకు వంటలోని మెళకువలను చూపించాడు. నేను ఎవరైనా నన్ను ఏదైనా అంటే, వెంటనే జవాబు చెప్పేదాన్ని. తను దాన్ని చాలామటుకు తగ్గించాడు. 'నువ్వు ఎవరినన్నా కోపంగా ఏదైనా అంటే వారికి నీ మనస్సుమీద అధికారం ఉన్నట్టు అర్థం. వారు అదిగో ఈ మాట అని తనను రెచ్చగొడతాను చూడు అని పక్కవారితో సవాలు విసిరి మరీ నిన్ను అంటారు,' అనేవాడు. 'ఒకసారి అంటే పడతాను, పదిసార్లు అంటే ఎందుకు పడాలి,' అంటే ఇదే జవాబు మళ్ళీ. కొండొకచో వారికి నాచేత క్షమాపణ కూడా చెప్పించేవాడు.

అంతేకాదు, వ్యక్తిత్వవికాసానికి తగ్గ సలహాలు కూడా ఇచ్చేవాడు. ఫౌంటెన్‌హెడ్ నవల చదవమని నాచేత చదివించాడు. అందులో హీరో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎలా దృఢంగా నిలబడ్డాడో చెప్పేవాడు.

ఇప్పుడు మేము పదేపదే చెప్పేది 'నాకే ఎందుకు వచ్చింది అని అనుకోకూడదు అని.' దాన్ని నేను జ్ఞానయోగానికి రాకముందే, ఎప్పుడోనే సెల్ఫ్‌పిటీ అనేవాడు మా అన్నయ్య. ఎవరికన్నా సెల్ఫ్‌పిటీ ఉన్నట్టు కనిపిస్తే దాన్ని తీవ్రంగా విమర్శించేవాడు. తనూ, నేనూ కొన్ని విషయాలు చర్చించుకునేవారము. అది వితండవాదంగా కాకుండా ఒకరి వాదనను ఇంకొకరు స్వీకరించేలా ఉండేది. నా సలహాలు కూడా తను వినేవాడు.

ఇంక నా రచనా వ్యాసంగాన్ని, ముఖ్యంగా అనువాదాలని తనే చాలా ప్రోత్సహించాడు. పుస్తకప్రపంచం అనే మాసపత్రిక ఉండేది ఎమెస్కోకి. ఒకసారి నన్ను సరదాగా 'ఒక కథ వండవే,' అన్నాడు. 'వండే ఉంది, నీకు నచ్చితే చూడు,' అని నా రఫ్ కాపీని ఇచ్చాను. అది చదివి నీ శైలి చాలా బాగుంది, కథలో ఓ హెన్రీ పెట్టే ట్విస్ట్ ఉంది అని చాలా మురిసిపోయి, 'ఇల్లే ఇలలో స్వర్గం,' అని తనే దానికి పేరు పెట్టి వేసేసాడు. దాని తర్వాత నేను మావారి సహాయంతో ఎన్నో శీర్షికలు నిర్వహించాను. చిన్న చిన్న కథలు రాశాను.

తను ప్రింటింగ్ కూడా చేసేవాడు. బహాయీఫెయిత్ వారికి వార్కా అనే చిన్నపిల్లల పత్రిక ఉంది. దానికి తనే నాచేత తెలుగుసేత రాయించాడు. 'బాబోయ్ నాకేం వచ్చు?' అంటే 'నాకా నమ్మకం ఉంది, నీకెందుకు నువ్వు రాయి,' అన్నాడు. అది కూడా ఫలానా గడువు లోపల రాయాలి. తన మాట కాదనలేక రాశాను, బహాయీఫెయిత్ వారికి కూడా చాలా నచ్చింది.

మా అన్నయ్య ప్రచురణ రంగంలో ఉన్నన్నాళ్లూ ఎడిటోరియల్ వర్క్ చాలానే చేశాను. కొత్త పుస్తకాలను ప్రచురణకు ఎంపిక చేయటం, దానిమీద రీడర్స్ రివ్యూ రాయటం, బ్యాక్‌కవర్ మ్యాటర్ రాయటం, పుస్తకప్రపంచంలో ఆ నవలను పరిచయం చెయ్యటం లాంటి పనులు ఉండేవి. అప్పుడే ఒక నవల రాయవే నేను ప్రచురిస్తాను అన్నాడు కాని అప్పుడు కుదరలేదు. ఇప్పుడు ఇలా ఉపనిషత్తులు, భగవద్గీత ప్రచురణలు అవుతున్నాయంటే దాని వెనక మా అన్నయ్య ఇచ్చిన ప్రోత్సాహమే కారణం. 'నీకు గొప్ప ఎస్సెట్ నీ శైలి,' అనేవాడు. పుస్తకం ప్రచురించేముందు రీడబులిటీ ఉందో లేదో చూసేవాడు, పబ్లిషర్‌గా. ఆ కోణంలో చెప్పాడు.

నా పెళ్ళి మా అన్నయ్య, వదినలే చేశారు. మా వదిన పేరు కమలకుమారి. 'ఇన్నాళ్ళూ మీరు నాకు ఆడపడుచు, ఇప్పుడు పెళ్ళి చేశాం కాబట్టి కూతురు,' అని అంది. అలాగే నాకే కష్టం వచ్చినా ఆదుకుంటుంది. పెళ్ళి చేస్తే బాధ్యత తీరిపోయింది అనుకోలేదు ఇద్దరూ. మా అన్నయ్య అయితే ఎప్పటికప్పుడు నా బాగోగులు తెలుసుకుంటూనే ఉంటాడు. అందరూ, 'మీ ఇద్దరికీ ఒకటే అభిరుచి ఉండటం అదృష్టం,' అంటారు ఇప్పుడు. కాని మా అన్నయ్య ఎప్పుడో, మా పెళ్ళి అయిన రెండోరోజే 'నీ భావాలకి తగ్గ భర్తే వచ్చాడే,' అని ఆనందంగా అన్నాడు. తన అంచనా వమ్మకాలేదు. ఈరోజు ఇద్దరం గురుదంపతులుగా అందరి మన్ననలందుకుంటున్నామూ అంటే మా అన్నయ్యా వదినల ఆశీస్సులే.

**– మద్దూరి రాజ్యశ్రీ**

# శ్రీమద్భగవద్గీతా మాహాత్మ్యమ్

భగవద్గీత పారాయణంవల్ల, అధ్యయనంవల్ల మనకొచ్చే ప్రయోజనమేమిటి? ప్రయోజనము లేకుండా మందుడు(తెలివితక్కువవాడు) కూడా ఏ పనీ తలపెట్టడు. అనేక ప్రయోజనాలున్నాయి. అందులో తొమ్మిది ముఖ్యమైన ప్రయోజనాలు ఇప్పుడు మనం తెలుసుకుందాం.

**1. మానసిక దృక్పథం –** కేవల పారాయణంవల్ల చిత్తశుద్ధి, చిత్తవైశాల్యము, చిత్త ఏకాగ్రత వస్తాయి. పారాయణంవల్ల మానసిక దృక్పథం విశాలమౌతుంది.

**2. దిశానిర్దేశం –** పారాయణంలో కొంచెం సౌలభ్యం వచ్చాక, భగవద్గీతను అధ్యయనం చేయాలి. భగవద్గీత అధ్యయనంవల్ల దిశానిర్దేశం జరుగుతుంది. అంతకుముందు లౌకికంగా ఉన్న మనస్సు ఆధ్యాత్మికం వైపుకు మళ్ళుతుంది. జీవితం కొత్తమలుపు తిరుగుతుంది. మనిషి – మనీషిగా మారతాడు. మనిషి – మహాత్ముడౌతాడు. స్వామీ చిన్మయానంద, 'ఏనిమల్‌మాన్ టు మాన్‌మాన్, మాన్‌మాన్ టు గాడ్‌మాన్‌గా మారుతారు,' అని అంటారు. పశుప్రవృత్తిపోయి మానవత్వంవచ్చి, మానవత్వంనుంచి దైవత్వం వస్తుంది. దైవత్వం అంటే ఆ దేవుడు జీవుడు ఒకటే అనే భావన. ఇదే కాకుండా మన నిజజీవితంలో పాటించదగిన 20విలువలు క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగంలో వస్తాయి. ఉదాహరణకు అందులో అమానిత్వం, అదంబిత్వం, అహింస, క్షాంతి, ఆర్జవం ఇట్లాంటివెన్నో ఉంటాయి. అమూల్యమైన మానవీయమైన విలువలు పొందుపరచబడ్డాయి. అదేవిధంగా **అనుద్వేగకరం వాక్యంలో** మనం ఏవిధంగా మాట్లాడాలో వస్తుంది. **యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య చేతసాలో** అతిగా నిద్రపోయేవాడు, ఎక్కువగా ఉపవాసాలు చేసేవాడు నా భక్తుడు కాదు అని భగవంతుడు చెప్తాడు. ఈ విధంగా ఎక్కడికక్కడ లౌకికంగా, ఆధ్యాత్మికంగా దిశానిర్దేశం చేస్తూ మన జీవితగమనాన్ని చక్కటి రాజమార్గంలో ప్రవేశపెడతాడు భగవద్గీతలో కృష్ణపరమాత్మ.

**3. కర్మస్వరూపం –** భగవద్గీత మనకు నిజంగా కనువిప్పును కలుగజేస్తుంది. అంతకుముందువున్న ధారణలు విచ్ఛిన్నమైపోతాయి. ఆత్యంతికమైన ఆనందంలో నిలుస్తాము. కర్మస్వరూపం తెలియజేస్తుంది. కర్మవల్ల మోక్షము రాదు. జ్ఞానయోగ్యతా ప్రాప్తిని మాత్రమే ఇస్తుంది అని చెబుతుంది. కర్మయోగము అనే ఒక చక్కటి ఆయుధాన్ని మనకిచ్చి మనం చేసే సమస్త దైనందిన కార్యక్రమాన్ని దైవపూజగా ఎలా మార్చవచ్చో తెలియజేస్తుంది.

**4. కర్మయోగఫలం –** కర్మయోగం రెండు ముఖ్యసంపదలను మనకిస్తుంది. సమత్వబుద్ధి, సమతుల్యతలను ఏర్పరుస్తుంది. అందరూ సమానమే అనే భావనను, భావసలో సమతుల్యతను కలుగజేస్తుంది.
**సమత్వం యోగ ఉచ్యతే.**

**5 ఉపాసన స్వరూపము లేదా ధ్యానస్వరూపము –** భగవద్గీతకు రాక ముందు ఉపాసన లేదా ధ్యానమే సాక్షాత్తూ మోక్షానికి దారితీస్తుంది అనుకుంటాము. అటువంటి ధారణలు గీతను అధ్యయనము చేయడంవల్ల వీగిపోతాయి. భగవద్గీత ధ్యానంయొక్క పరిమితిని చెబుతుంది. ధ్యానాన్ని రెండుగా విభజిస్తుంది. జ్ఞానం కలుగక ముందు చేసే ధ్యానము సగుణ ఈశ్వరధ్యానము దీనిని ఉపాసన అంటారు, జ్ఞానము పొందిన తరువాత మన నిర్గుణ నిజ ఈశ్వర స్వరూపము తెలిసాక ఆ సత్యనిష్ఠలో ఉండటానికి చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనము అంటారు.

**6. భక్తిస్వరూపము –** కేవలభక్తివల్ల మోక్షము రాదు. మోక్షము సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు. మనం నిత్యముక్తులమని తెలుసుకోవడమే తరువాయి, ఆనందము అలవోకగా అందుతుంది. భక్తులలో నాలుగు రకాలుంటారు అని పరమాత్మ విశ్లేషిస్తాడు. మొదటివారు ఆర్తభక్తులు. వారికి కష్టమొస్తేనే భగవంతుడు గుర్తుకొస్తాడు. రెండవ కోవకి చెందినవారు అర్థార్థిభక్తులు. వారికి భక్తి ఒక వ్యాపారము. భగవంతునికి వారి వ్యాపారములో లాభమొస్తే కొంత ముడుపులు చెల్లించుకుంటూవుంటారు. మూడవ తరహా భక్తులు జిజ్ఞాసుభక్తులు. వీరు కేవలభక్తిలో పరమార్థము లేదని గ్రహించి జ్ఞానమువైపుకు పయనిస్తారు. ఆఖరుగా జ్ఞానీభక్తుడు, ఈ భక్తుడు భగవంతునికి తనకు దూరాన్ని సహించలేడు. **స్వస్వరూపాను సంధానము భక్తిరిత్యభిధీయతే**. పారమార్థిక సత్యంలో **నేనే ఆ పరమాత్మను.** జ్ఞానికి భగవంతుడు వినా మరొకటి లేదు. **భక్తిపరాకాష్ఠే జ్ఞానము**. వీరందరిలో జ్ఞానీభక్తుడు నాకు అత్యంత ప్రీతికరమైనవాడని ఆ కృష్ణపరమాత్మే ప్రకటించుకున్నాడు.

**7. మోక్షస్వరూపము–**భగవద్గీత మోక్షస్వరూపాన్ని తెలియజేస్తుంది. మనం సాధారణంగా మోక్షం అంటే స్వర్గాదిలోకాలకు వెళ్ళడం అనుకుంటాము. అది సరియైన అవగాహన కాదు. బ్రహ్మలోకంతో సహా పద్నాలుగు లోకాలూ ప్రళయంలో అవ్యక్తంలోకి వెళ్ళిపోతాయి. లోకాలు, లోకపాలకులు, లోకస్థులు ఎవ్వరూ శాశ్వతము కాదు. పుణ్యం క్షీణించగానే లోకప్రాప్తి ముగిసిపోతుంది. **క్షీణేపుణ్యే మర్త్యలోకం విశంతి.** మళ్ళీ ఇంకో శరీరంతో వేరే లోకానికి వెళ్ళాల్సిందే. **ఇమం లోకం హీనతరం వా విశంతి** అంటుంది ముండకోపనిషత్తు నిష్ఠూరంగా. ఈ లోకంలో గాని ఇంకా హీనలోకాల్లో గాని పడిపోతారు. పాపం, పుణ్యం రెండూ సంకెళ్ళే. పాపం ఇనుపసంకెళ్ళైతే, పుణ్యం బంగారుసంకెళ్ళు అంటుంది. పాపపుణ్యాలకు అతీతంగా తీసుకువెళ్ళి జ్ఞానబోధ చేస్తుంది. జీవించి ఉండగానే ఆత్యంతిక ఆనందాన్ని అంటే జీవన్ముక్తిని, దేహపతనానంతరము విదేహముక్తిని ఇస్తుంది భగవద్గీత. సరిగా అధ్యయనం చేస్తే, ఇంక సంసార చక్రం ఉండదు. అందువల్లనే **భగవద్గీత మోక్షశాస్త్రం.**

**8. ఉపనిషత్ సారము –** అనేక ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ చదవనవసరం లేకుండా భగవద్గీత ఒక్కటి చదివితే చాలు. ముక్తి తథ్యం. ఎందుకు? ఇది ఉపనిషత్తుల సారము. ప్రతి అధ్యాయమునకు ఆఖరున ఉపనిషత్సు అని వస్తుంది. ఒక్క భగవద్గీతను సరిగా అవగాహన చేసుకుంటే వేదసారమంతా కరతలామలకమౌతుంది.

**9. గురు అపేక్ష –** శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువుద్వారా భగవద్గీతను నేర్చుకోవాలని, ఇంకా **తద్విద్ధి ప్రణిపాతేన ...** అంటూ చెప్పాడు కృష్ణపరమాత్మ. ప్రతి పదానికి అనేక అర్థాలుంటాయి. ఎక్కడ ఏ అర్థం చెప్పాలో గురువుకు తెలుస్తుంది, మన గురువుగారు పరమార్థానందస్వామీజీ కూడా వారి గురువులద్వారా సాంప్రదాయ బద్ధంగా శ్రుతిపరంగా శాస్త్రం అధ్యయనం చేశారు.

నాకు తెలిసి తెలుగులో ఇంత సులభమైన శైలిలో, లోతైన అర్థాలతో, ఆంతరస్వేచ్ఛను కలుగచేసే భగవద్గీత గ్రంథము మరొకటిలేదు. ఇది అందరూ తప్పక చదవవలిసిన గ్రంథము. ఇది ఆచరణీయ గ్రంథము. దీన్ని చదివి, శ్రీకృష్ణపరమాత్మ వివరించిన విధంగా జీవితాన్ని మలుచుకుని ఆత్మజ్ఞానాన్ని పొందుతారని ఆశిస్తూ–

– ప్రణామములతో,

**మీ రాఘవరావు**

# ధ్యానశ్లోకాలు

శ్లో. 1 ఓం పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ ।
అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ ॥

శ్లో. 2 నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయతపత్రనేత్ర ।
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః ॥

శ్లో. 3 ప్రపన్నపారిజాతాయ తోత్రవేత్రైకపాణయే ।
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః ॥

శ్లో. 4 సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥

శ్లో. 5 వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ ।
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

శ్లో. 6 భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా! ।
అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవై రణనదీ కైవర్తకః కేశవః ॥

శ్లో. 7 పారాశర్యవచః సరోజమమలం గీతార్థగంధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథా సంబోధనాబోధితమ్ ।
లోకే సజ్జనషట్పదైరహరహః పేపీయమానం ముదా
భూయాద్భారతపంకజం కలిమల ప్రధ్వంసి నః శ్రేయసే ॥

శ్లో. 8 మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ ।
యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్ ॥

శ్లో. 9 యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః
వేదైః సాంగపదక్రమోపనిషదైః గాయంతి యం సామగాః ।
ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః ॥

* * *

**నారాయణం పద్మభువం వసిష్ఠం, శక్తిం చ తత్పుత్ర పరాశరం చ।**
**వ్యాసం శుకం గౌడపదం మహాన్తం, గోవిన్దయోగీంద్రమథాస్య శిష్యమ్ ॥**
**శ్రీ శఙ్కరాచార్యమథాస్య పద్మపాదం చ, హస్తామలకం చ శిష్యమ్ ।**
**తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సన్తత మానతోస్మి ॥**

* * *

**సదాశివసమారమ్భామ్। శఙ్కరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యన్తామ్। వన్దే గురుపరమ్పరామ్॥**
**శ్రీ గురుభ్యోనమః హరిః ఓం**

* * *

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ ।
ధీనామవిత్ర్యవతు । గణేశాయనమః ।
సరస్వత్యైనమః । శ్రీ గురుభ్యోనమః ।
హరిః ఓమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ సప్తమోఽ ధ్యాయః - జ్ఞానవిజ్ఞానయోగః

## (ఏడవ అధ్యాయము - జ్ఞానవిజ్ఞానయోగము)

భగవద్గీతలో 18 అధ్యాయాలు ఉన్నాయి. దాన్ని మూడు షట్కాలు క్రింద విభజించవచ్చు. షట్కం అంటే ఆరు. ఆ విధంగా భగవద్గీతలో షట్కత్రయం ఉంది - ప్రథమషట్కం, మధ్యమషట్కం, చరమషట్కం. మూడు షట్కాలలోనూ మూడేసి ముఖ్యాంశాలు చర్చించబడ్డాయి. ప్రథమషట్కంలో అంటే మొదటి షట్కంలో చర్చించబడిన ముఖ్య అంశాలు - జీవస్వరూపం, కర్మయోగం, పురుషప్రయత్నం.

1. **జీవస్వరూపం** - ఈ జీవస్వరూపం 2, 3, 4, 5 అధ్యాయాల్లో చర్చించబడింది. జీవుడెవరు? జీవుడు శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు. జీవుడు వీటన్నిటినీ సాక్షీభూతంగా చూసే సాక్షిచైతన్యం. శరీరం, మనస్సు క్షేత్రాలు అయితే, చైతన్యం అందులో ఉండే క్షేత్రజ్ఞుడు. ఈ చైతన్యాన్ని **సచ్చిదానంద ఆత్మ** అంటారు. ఈ ఆత్మస్వరూపం చాలా చక్కగా రెండవ అధ్యాయంలో 12-25 శ్లోకాల వరకూ వర్ణించబడింది. మూడవ అధ్యాయంలో పంచకోశవివేకం ద్వారా చూపించబడింది.

**ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః ।**
**మనసస్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరతస్తు సః ॥** - 3.42

నాలుగవ అధ్యాయంలో అకర్తా, అభోక్తగా చూపబడింది. ఐదవ అధ్యాయంలో నవద్వారాలున్న పురంలో పురరాజుగా చెప్పబడింది.

**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్** - 5.13

అలా జీవస్వరూపం సచ్చిదానంద ఆత్మగా చూపబడింది.

2. **కర్మయోగం** - ఇది చాలా ముఖ్యమైన సాధన; నిజానికి ఆధ్యాత్మిక సాధనలో మొట్టమొదటి సాధన.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన** - 2.47

ఇది చాలా ముఖ్యమైన శ్లోకం. మూడవ అధ్యాయం మొత్తం కర్మయోగానికే కేటాయించబడింది. దాని పేరే కర్మయోగం. నాలుగు, ఐదు అధ్యాయాలలో కూడా కర్మయోగం చర్చించబడింది.

**బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥** - 5.10

ఆరవ అధ్యాయం మొదట్లో కూడా కర్మయోగం చర్చించబడింది.

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచాక్రియః ॥** – 6.1

కర్మయోగం అంటే ఏమిటి?

| | | | | |
|---|---|---|---|---|
| **కర్మయోగం** | **=** | **సరియైన కర్మ** | **+** | **సరియైన దృక్పథం** |
| **సరియైన కర్మ** | **=** | **సాత్త్వికకర్మ** | **+** | **పంచమహాయజ్ఞాలు** |
| **సరియైన దృక్పథం** | **=** | **ఈశ్వరార్పణబుద్ధి** | **+** | **ఈశ్వరప్రసాదబుద్ధి** |

3. **పురుష ప్రయత్నం** – పురుష ప్రయత్నంయొక్క ప్రాముఖ్యత చర్చించబడింది. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే మన హిందూధర్మంమీద చాలామందికి ఒక పెద్ద అపోహ ఉంది. మనం విధిని నమ్ముతామనీ, విధి చేతిలో కీలుబొమ్మలుగా మారామనీ అంటారు.

లలాట లిఖితరేఖా పరిమార్ష్టుం న శక్యతే

మన నుదుటి మీద రాసిన రాతను చెరపలేము అనీ, మన పూర్వజన్మకర్మను బట్టి ఆ నుదుటి రాత ఉంటుందనీ, అందువల్ల మనమేమీ చెయ్యలేమనీ అంటారు. పైగా భారతదేశం వెనకబడి ఉండటానికి కారణం ఈ లలాట లిఖితాన్ని నమ్మటమేనని కూడా నిందిస్తారు. కాని, ఇది నిరాధారమైన నింద.

మనం కర్మసిద్ధాంతాన్ని నమ్ముతాము నిజమే, కర్మసిద్ధాంతం అంటే మన కర్మను మార్చలేమని కాదు, విధిరాతను తప్పించలేమనీ కాదు. కర్మసిద్ధాంతం ఒకటే సూత్రాన్ని బోధిస్తుంది. ఏమిటది? ఇప్పటి మన జీవితం, గతంలో మనం చేసిన కర్మల ఫలితం అంటే దాని అర్థం ఏమిటి? భవిష్యత్తులో మన జీవితం, ఇప్పుడు మనం చేసే కర్మల ఫలితమనేగా? ఆ కర్మలు మన చేతిలో ఉన్నాయి. మన ఫ్రీవిల్‌ను ఉపయోగించి మనకు కావాల్సిన లక్ష్యాలను మనం ఎన్నుకోవచ్చు. శాస్త్రం మనకు నాలుగు పురుషార్థాలను నిర్దేశించింది – అవి ధర్మం, అర్థం, కామం, మోక్షం. వాటిని పురుషార్థాలు అని ఎందుకంది? పురుషుడు ప్రయత్నంచేసి పొందాల్సిన లక్ష్యాలు అవి. అంతేకాని ఎక్కడో దూరంగా కూర్చుని దేవుడు, ఇక్కడ మన తలరాతలు రాయటం లేదు. అది పెద్ద అపోహ.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్** – 6.5

మనం, మనను మనమే ఉద్ధరించుకోవాలి. అలాగని దేవుడు బాధ్యత లేకుండా చూస్తూ కూర్చోడు; నేను నీకు సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను, కాని దానికి ముందుగా నువ్వు నీ ప్రయత్నం చెయ్యి అని కృష్ణపరమాత్మ చెప్పాడు. కర్మణ్యేవాధికారస్తే అంటే కర్మ చేసే అధికారం నీకు ఉంది అని చెప్పాడు. ఫ్రీవిల్ యొక్క ప్రాముఖ్యత, వ్యక్తిగా మనం చెయ్యాల్సిన కృషి, మనం ఎన్నుకోవాల్సిన విధి గురించి నొక్కి చెప్పబడింది. కర్మ చేసే హక్కు మనకు ఉందంటే, దానివల్ల వచ్చే ఫలితంలో కూడా మనకు అధికారం ఉంది. ఇది కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనకు కర్మను ఎన్నుకునే హక్కు ఉంది కాని, దాని ఫలం ఇలాగే రావాలి అని నిర్దేశించే హక్కు

లేదు. అంటే ఫలం పూర్తిగా మన చేతిలోనూ లేదు, అలాగని మన చేతిలో లేకుండానూ లేదు. అంటే కర్మఫలం రావటానికి కారణమయ్యే అనేకానేక కారణాల్లో పురుషప్రయత్నం కూడా ఒకటి.

| | | |
|---|---|---|
| **నీ ఆలోచనలను గమనించు** | **-** | **అవి నీ మాటలు అవుతాయి** |
| **నీ మాటలను గమనించు** | **-** | **అవి నీ చేతలు అవుతాయి** |
| **నీ చేతలను గమనించు** | **-** | **అవి నీ అలవాట్లు అవుతాయి** |
| **నీ అలవాట్లను గమనించు** | **-** | **అవి నీ నడవడిక అవుతుంది** |
| **నీ నడవడికను గమనించు** | **-** | **అది నీ గమ్యం అవుతుంది** |

అంటే నీ గమ్యం నీ నడవడికవల్ల, నీ నడవడిక నీ అలవాటువల్ల, నీ అలవాటు నీ చేతలవల్ల, నీ చేతలు నీ మాటలవల్ల, నీ మాటలు నీ ఆలోచనలవల్ల ఏర్పడతాయి. అంటే నీ భవిష్యత్తు నీ చేతిలో ఉంది. ఇంకా మాట్లాడితే నువ్వు ఆలోచించే తీరులో ఉంది. అందువల్ల పురుష ప్రయత్నం చాలా ముఖ్యం.

జీవస్వరూపం, కర్మయోగం, పురుషప్రయత్నం అనే ఈ మూడు అంశాలూ మొదటి షట్కంలో చెప్పబడ్డాయి.

ఇప్పుడు మనం రెండవ షట్కంలోకి అడుగుపెట్టబోతున్నాము. అది 7-12 అధ్యాయాలతో కూడినది. ఇందులో కూడా మూడు అంశాలు ఉన్నాయి. అవి ఈశ్వరస్వరూపం, ఈశ్వరధ్యానం, ఈశ్వరకృప.

1. **ఈశ్వరస్వరూపం** - ప్రథమ షట్కంలో జీవస్వరూపం గురించి వస్తే, ఈ షట్కంలో ఈశ్వరస్వరూపం గురించి వస్తుంది. ఈశ్వరస్వరూపం అంటే భగవంతుని నిర్వచనం. ఇప్పుడు రాబోయే ఆరు అధ్యాయాల్లోనూ కృష్ణపరమాత్మ భగవంతునియొక్క నిర్వచనం అనేక విధాలుగా ఇస్తాడు - భగవంతుని స్వరూపం, భగవంతుని విధులు, భగవంతుని గొప్పదనం లాంటివి. మొదటి ఆరు అధ్యాయాల్లో మీరు గమనించి ఉంటే ఈశ్వరుని గురించి ఎక్కువగా రాలేదు. అంటే అసలు రాకపోలేదు కాని, జీవుని గురించి వచ్చినంతగా రాలేదు - ఇక్కడ మొదటి అధ్యాయంలో మొదటి శ్లోకం నుంచే ఈశ్వరస్వరూపం గురించి వస్తుంది.

జీవస్వరూపం గురించి చూసినప్పుడు రెండు భాగాలుగా చూశాము - దేహం-దేహీ; శరీరం-శరీరీ; అనాత్మ-ఆత్మ. అంటే అనాత్మ అయిన శరీరంలో ఆత్మ అనే, శరీరీ ఉందని చూశాము. జీవుడు = ఆత్మ + అనాత్మ అని చూశాము. ఇక్కడ కూడా ఈశ్వరస్వరూపం గురించి చూసేటప్పుడు రెండు భాగాలు చూస్తాము.

**ఈశ్వరుడు = సగుణబ్రహ్మ + నిర్గుణబ్రహ్మ.**

2. **ఈశ్వరధ్యానం** - ప్రథమషట్కంలో కర్మయోగ సాధన గురించి ప్రత్యేకించి చెపితే, మధ్యమషట్కంలో ఉపాసన సాధన గురించి నొక్కి వక్కాణిస్తాడు కృష్ణపరమాత్మ. ఉపాసన అంటే ఈశ్వరధ్యానం. కర్మయోగం శరీరప్రధానం అయితే ఉపసనాయోగం మనస్సు ప్రధానం. కర్మయోగంలో కాయిక కర్మలు చేస్తాము, పంచమహాయజ్ఞాలు చేస్తాము, సమాజానికి సేవ చేస్తాము. ఉపాసనాయోగానికి వచ్చేసరికి నెమ్మదిగా సమాజం నుంచి దూరంగా జరుగుతాము; అంతర్ముఖులమవుతాము, సగుణ ఈశ్వరధ్యానం చేస్తాము. అంటే నెమ్మదిగా స్థూలపరికరంనుంచి సూక్ష్మపరికరానికి ప్రయాణిస్తాము.

3. **ఈశ్వరకృప** – ప్రథమషట్కంలో పురుషప్రయత్నం గురించి నొక్కి వక్కాణిస్తే, మధ్యమషట్కంలో ఈశ్వరకృప గురించి చెబుతాడు కృష్ణపరమాత్మ. ఒకవిధంగా హెచ్చరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అంతా నీ చేతిలోనే ఉంది అనుకోకు అంటున్నాడు. మనం విధి చేతిలో కీలుబొమ్మలమనుకుని నిరాశ పడిపోయి, ఏమీ చెయ్యక పోవటమూ తప్పే. అంతా నా చేతిలోనే ఉంది, నేనేదైనా సాధించగలను అని అతిగా నమ్మటమూ తప్పే. అలా అతిగా భావించే వ్యక్తికి అదను చూసి, ఎదురుదెబ్బలు తినిపిస్తాడు దేవుడు. అలా ఒకదాని వెంట ఇంకొకటిగా ఎదురుదెబ్బలు తగిలేసరికి ఈ చివరినుంచి ఆ చివరకి వెళ్ళిపోతాడు. అంటే అంతా నా చేతిలోనే ఉంది అనుకునే దశనుంచి, నా చేతిలో ఏమీ లేదు, నేను నిమిత్తమాత్రుడిని అనుకునే దశకు వెళ్ళిపోతాడు. రెండూ మంచివి కాదు. మనకు ఆత్మస్థైర్యం ఉండాలి కాని అది మితిమీరకూడదు. ఈశ్వరుని కృపతో నేను సాధిస్తున్నాను అనుకోవటం సమతుల్యత.

అందువల్లనే భగవద్గీత నేర్చుకునే ముందు ధ్యానశ్లోకాలతో మొదలుపెడతాము. భగవద్గీతబోధకు మనం ప్రయత్నం చేసి వెళ్ళగలిగినా, చివరిదాకా వదలకుండా వెళ్ళి నేర్చుకోగలగాలంటే, దానికి ఈశ్వరకృప ఎంతో అవసరం. అందువల్ల అనుగ్రహం గురించి కూడా నొక్కి వక్కాణిస్తాడు కృష్ణపరమాత్మ. శరణాగతి, ప్రపత్తి, అనుగ్రహం ఇదీ వరుస.

ఈశ్వరస్వరూపం, ఈశ్వరధ్యానం, ఈశ్వరకృప – ఈ మూడు అంశాలు ఈ మధ్యమషట్కంలో వివరించబడతాయి. ఏడవ అధ్యాయం మొత్తం బోధను సంక్షిప్తంగా చెప్పే అద్భుతమైన అధ్యాయం. చూడటానికి చిన్న అధ్యాయంగా ఉన్నా, అది సమగ్రమైన బోధను చేసే శక్తివంతమైన అధ్యాయం. ఈ నేపథ్యంతో ఏడవ అధ్యాయంలోకి అడుగుపెడదాము.

**శ్రీ భగవాన్ ఉవాచ**

శ్లో. 1 **మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్ మదాశ్రయః ।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥**
మయి, ఆసక్తమనాః, పార్థ, యోగమ్, యుంజన్, మదాశ్రయః,
అసంశయమ్, సమగ్రమ్, మామ్, యథా, జ్ఞాస్యసి, తత్, శృణు ॥

| | | |
|---|---|---|
| పార్థ! | = | ఓ పార్థా! |
| మయి, ఆసక్తమనాః | = | అనన్యభక్తితో నాయందే ఆసక్తమైన మనస్సు కలవాడవై |
| మదాశ్రయః | = | మత్పరాయణుడవై |
| యోగమ్ | = | (నాయందే) |
| యుంజన్ | = | నిమగ్నుడవగుచు |
| సమగ్రమ్ | = | సంపూర్ణవిభూతి, సర్వప్రాణులకు ఆత్మస్వరూపుడనైన |
| మామ్ | = | నన్ను |
| యథా | = | (నీవు) ఏ విధముగా |
| అసంశయమ్ | = | నిస్సందేహముగా |
| జ్ఞాస్యసి | = | తెలిసికొనగలవో |
| తత్ | = | దానిని |
| శృణు | = | వినుము |

**హే పార్థ! మయి ఆసక్త-మనాః మత్ ఆశ్రయః (త్వం) యోగమ్**
**యుంజన్, మామ్ సమగ్రమ్ యథా అసంశయమ్ జ్ఞాస్యసి, తత్ శృణు ॥**

తా: ఓ పార్థా! అనన్యభక్తితో నాయందే ఆసక్తమైన మనస్సు కలవాడవై, మత్పరాయణుడవై, నాయందే నిమగ్నుడవగుచు సంపూర్ణవిభూతి, సర్వప్రాణులకు ఆత్మస్వరూపుడనైన నన్ను నీవు ఏవిధముగా నిస్సందేహముగా తెలిసికొనగలవో దానిని వినుము.

## 1. ఉపోద్ఘాతం - శ్లోకాలు 1-3

మొదటి మూడు శ్లోకాలు ఉపోద్ఘాత శ్లోకాలు. వీటిలో ఈ అధ్యాయంలో, ఈ షట్కంలో చర్చించబోయే అంశాలను పరిచయం చేస్తాడు కృష్ణపరమాత్మ.

**సమగ్రం మాం జ్ఞాస్యసి** - నా బోధను జాగ్రత్తగా వింటే, నా గురించి సమగ్రంగా తెలుసుకుంటావు. నా గురించిన జ్ఞానం అంటే పరమాత్మ గురించిన జ్ఞానం. ఇక్కడ కృష్ణుడు కృష్ణపరమాత్మ. అందువల్ల ఈ అధ్యాయమూ, తక్కిన అధ్యాయాలూ సరిగ్గా వింటే ఈశ్వరస్వరూపం గురించిన జ్ఞానం పొందుతావు.

ఈశ్వరస్వరూపం రెండు రూపాలు అని చూశాము. సగుణరూపం, నిర్గుణరూపం. అందువల్లనే సమగ్రం అన్నాడు కృష్ణపరమాత్మ. ఈ రెండు స్వరూపాలనూ అపరాప్రకృతి, పరాప్రకృతి అని ముందు ముందు వర్ణిస్తాడు.

అపరాప్రకృతి అంటే వ్యవహారికస్థాయి. అందులో దేవుణ్ణి ఏకరూపభక్తితో కొలుస్తారు. అంటే రాముని గానో, కృష్ణుని గానో కొలుస్తారు. నిజానికి చాలామందిని భగవంతుడెవరు అని అడిగితే, రాముడనో, కృష్ణుడనో, శివుడనో, ఒక ఆకారంతో వర్ణిస్తారు. ధ్యానశ్లోకాల్లో కూడా కృష్ణుని రూపంయొక్క వర్ణనను చూస్తాము. కాని ఎప్పుడైతే ఒక సగుణరూపంతో కొలుస్తామో, అప్పుడే ఆ రూపానికి ఒక పుట్టినరోజు, ఒక స్వర్గారోహణ రోజు ఉంటాయి. దేశకాలపరిచ్ఛిన్నం ఉంటుంది. ఇది సగుణరూపం.

ఇది కాక నిర్గుణరూపం కూడా ఉంది. అది పరాప్రకృతి.అది పారమార్థిక స్థాయికి చెందినది - అదృశ్యం, అగ్రాహ్యం, అవర్ణం, అనంతం. ఈ రెండూ నేర్చుకుంటేనే ఈశ్వరస్వరూపజ్ఞానం సమగ్రం అవుతుంది. కృష్ణపరమాత్మ ఎలా చెప్పబోతున్నాడు?

**అసంశయమ్** - సంశయం రాకుండా నేర్పిస్తాను అంటున్నాడు. అంటే నిశ్చయజ్ఞానం కలుగజేస్తాడు. జ్ఞాస్యసి - బోధిస్తాను. ఎలా బోధిస్తాను? అసంశయం - సంశయం రాకుండా బోధిస్తాను.

కాని దానికి కొన్ని షరతులు విధిస్తున్నాడు. ఏమిటవి? భగవంతుని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి, పురుషప్రయత్నం, ఈశ్వర అనుగ్రహం కోరటం.

**మయ్యాసక్తమనాః** - అర్జునా! నన్ను తెలుసుకోవాలనే కోరిక నీకుండాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏ విషయం గురించి అయినా సరే, దాన్ని తెలుసుకోవాలన్న ఆసక్తి లేకపోతే దాన్ని సరిగ్గా పట్టుకోలేము. మనకు ఏది లక్ష్యం

అయితే ఆ విషయం గురించి ఎక్కువగా తెలుసుకోవాలనే తపన ఉంటుంది. అందువల్ల భగవంతుణ్ణి లక్ష్యంగా పెట్టుకుంటే, భగవంతుని గురించి తెలుసుకోవాలనే తపన ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నా గురించి అంటే భగవంతుని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇక్కడొక సందేహం కలుగవచ్చు. ఇంతవరకూ మోక్షం పొందాలి, మోక్షమే నీ లక్ష్యంగా ఉండాలి అంటున్నాడు. ఇప్పుడేమో భగవంతుడు నీ లక్ష్యంగా ఉండాలి అంటున్నాడు. అంటే నా లక్ష్యం మోక్షమా, భగవంతుడా? ఏది ఉండాలి?

రెండూ ఒకటే. ఆధ్యాత్మపరంగా చూస్తే లక్ష్యం మోక్షం అవుతుంది. అదే లక్ష్యాన్ని మతపరంగా చూస్తే భగవంతుడు అంటుంది. ఎందుకు? మోక్షం అంటే ఏమిటి? శాంతి, భద్రత, ఆనందం. ప్రతివారికీ ఈ మూడూ కావాలి. భగవంతుడు ఎవరు? ఆయనే ఈ మూడింటిని ఇవ్వగలడు. ఆయన అనంతం. భగవంతునికి దేశ, కాల, వస్తు పరిమితులు లేవు. దేనికైనా పరిమితి ఉంటే అది శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేదు. ఒక కాలంలో వచ్చింది, ఇంకొక కాలంలో పోక తప్పదు. నక్షత్రాలు కూడా ఎప్పుడో ఒకప్పుడు నాశనమవక తప్పదు. కొన్ని లక్షల సంవత్సరాల తర్వాత అవచ్చు ఆ నాశనం, కాని నాశనం తప్పదు. అందువల్ల భద్రత ఎక్కడ దొరుకుతుంది అంటే భగవంతుని దగ్గరే!

అనంతం నిర్గుణం కాబట్టి, మనం చూడలేము కాబట్టి, నిర్గుణబ్రహ్మకు ఒక సగుణ ఆకారం ఇవ్వటం జరిగింది – రాముడు, కృష్ణుడు, దుర్గ అంటూ కొలుస్తున్నాము. కాని నిజానికి భగవంతుడు అనంతం. అనంతం అంటే శాశ్వతమైన భద్రత, శాశ్వతమైన శాంతి, శాశ్వతమైన స్వేచ్ఛ, శాశ్వతమైన ఆనందం. దీన్నే మోక్షం అంటారు. అందువల్ల మోక్షం అన్నా భగవంతుడు అన్నా ఒకటే! అందువల్ల మయి ఆసక్తమనాః – నామీద ఆసక్తి పెట్టుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. భగవంతుణ్ణి అంతిమ లక్ష్యంగా ఎన్నుకుని, ఆయనమీద అచంచలభక్తి చూపాలి.

మనకున్న తక్కిన లక్ష్యాల మాటేమిటి? పిల్లలకు స్కూల్లో సీటు సంపాదించటం, అమ్మాయికి పెళ్ళి చెయ్యటం, మనవళ్ళను చూడటం – వీటి మాటేమిటి? ఇవి అంతిమ లక్ష్యాలు కావు. ఇవి మధ్యలో వచ్చిపోయేవి. మనం ఒక రైలులో ప్రయాణిస్తుంటే, మధ్యలో వచ్చే స్టేషనులో దిగి కాఫీ తాగుతాము కాని అక్కడే ఉండిపోతామా? మళ్ళీ వెంటనే రైలు ఎక్కుతాము. మన అంతిమ లక్ష్యమైన స్టేషను చేరేవరకూ రైల్లో ప్రయాణిస్తూనే ఉంటాము. ఇదీ అంతే – ఒక లక్ష్యం తీరగానే, 'అమ్మయ్య అయింది,' అనుకునేలోపు ఇంకో లక్ష్యం ముంచుకు వస్తుంది. అమ్మాయి పెళ్ళి చెయ్యగానే, ఊపిరి తీసుకునే లోపు మనవడి సేవ మొదలవుతుంది – ప్రయాణం ముగియలేదు. ఇది అంతులేని కథ. పూర్ణత్వం ఎప్పుడు కలుగుతుందంటే అంతిమలక్ష్యం అయిన భగవంతుణ్ణి అర్థం చేసుకుంటేనే!

**యోగం యుంజన్** – యోగం అంటే దానికి అవసరమైన సాధన. యుంజన్ అంటే అవసరమైన సాధనలను చెయ్యాలి. కర్మయోగం, ఉపాసనయోగం, శ్రవణం – సాధనలు. యోగం అంటే ఈ సాధనలన్నీ వస్తాయి. మనం ఏ స్థాయిలో ఉన్నామో తెలుసుకుని, ఆ స్థాయి నుంచీ మన సాధనను మొదలుపెట్టాలి. అందరు పిల్లలూ

ఒకే క్లాసులో చేరరు – వారి స్థాయిని బట్టి ఆయా తరగతుల్లో చేరతారు. ఆధ్యాత్మిక సాధన కూడా అంతే. మనం ఏ స్థాయిలో ఉంటే, ఆ స్థాయినుంచి మొదలుపెట్టాలి. భగవంతుడే చూసుకుంటాడులే అనకూడదు. **పురుషప్రయత్నం** చెయ్యాలి. అంటే మనం చెయ్యాల్సిన పనిని మనం చెయ్యాలి.

ఉదాహరణకు మనకు ఆకలిగా ఉంటే, మనం ప్రార్థన చేస్తే భగవంతుడు ఆహారం తీసుకురావచ్చు, తెచ్చిన ఆహారాన్ని నోటిలో కూడా పెట్టవచ్చు కాని దాన్ని మింగటం మనమే చెయ్యాలి. కర్రతో దాన్ని మన నోటిలోకి తొయ్యడు భగవంతుడు. అందువల్ల యోగం యుంజన్ అంటే పురుష ప్రయత్నం చెయ్యాలి.

**మదాశ్రయః** – ఇది చాలా ముఖ్యమైన పదం. మదాశ్రయః అంటే ఈశ్వర అనుగ్రహం కోరాలి. గర్వంగా ఉండకూడదు; అతిగా మన గురించి అనుకోకూడదు. భగవంతునిమీద ఎన్నడూ సవాలు విసరకూడదు. మదాశ్రయః అంటే నా కృపను కోరు.

ఒక రైలు కొండ ఎక్కేటప్పుడు దానికి రెండు ఇంజన్లు ఉంటాయి. పైకి లాగటానికి, ముందువైపున ఒక ఇంజను ఉంటే, పైకి తొయ్యటానికి వెనక వైపున ఇంకో ఇంజను ఉంటుంది. ఎందుకు? కొండ ఎక్కటం కష్టమైన పని కాబట్టి. అలాగే ఆధ్యాత్మిక ఎదుగుదల కూడా కొండ ఎక్కటం లాంటిది. గీతాబోధ విని మారిపోయామని మనం అనుకుంటాము, కాని కుటుంబసభ్యులు ఒప్పుకోరు; ఏమీ మార్పులేదు అంటారు. వారు చెప్పిందే సత్యంగా తీసుకోవాలి, ఎందుకంటే మన బారిన పడ్డవాళ్ళు వారు.

ఆధ్యాత్మిక ఎదుగుదల మిల్లీమీటరు చొప్పున అవుతుంది అంతే. అందువల్ల దానికి రెండు ఇంజన్లు కావాలి; పురుషప్రయత్నం అనే ఇంజను ముందు; ఈశ్వర అనుగ్రహం అనే ఇంజను వెనుక. రెండూ ఉంటేనే గమ్యం చేరుతాము. మదాశ్రయ అంటే శరణాగతి, అంటే అనన్యభక్తి. వీటిని ఇప్పుడు సూత్రం రూపంలో చెప్పాడు. ఒక్కొక్కటీ ఒక్కొక్క టైముబాంబు లాంటిది – ముందు ముందు ఒక్కొక్కదాన్ని విపులంగా చర్చిస్తాడు కృష్ణపరమాత్మ.

కృష్ణపరమాత్మ విధించిన మూడు షరతులు – భగవంతుణ్ణి అంతిమ లక్ష్యంగా పెట్టుకోవాలి; పురుషప్రయత్నం చెయ్యాలి; ఈశ్వర అనుగ్రహం కోరాలి – ఈ మూడు నియమాలను పాటిస్తే భగవంతుణ్ణి ఖచ్చితంగా తెలుసుకుని, భగవంతుణ్ణి పొందుతారు. బ్రహ్మజ్ఞానఫలం ఏమిటి? **బ్రహ్మవిత్ ఆప్నోతి పరం**. బ్రహ్మజ్ఞానం పొందిన జ్ఞాని బ్రహ్మ అవుతాడు. దేవుడు నాకు భిన్నంగా లేదు అని తెలుసుకుంటాడు. అది రహస్యం. ఆ విషయం ముందుముందు తెలుసుకుంటాడు.

**యథా జ్ఞాస్యసి తచ్ఛృణు** – అందువల్ల జాగ్రత్తగా విను.

శ్లో. 2 **జ్ఞానం తేఽహం సవిజ్ఞానమ్ ఇదం వక్ష్యామ్యశేషతః ।**
**యద్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥**
జ్ఞానమ్, తే, అహమ్, సవిజ్ఞానమ్, ఇదమ్, వక్ష్యామి, అశేషతః,
యత్, జ్ఞాత్వా, న, ఇహ, భూయః, అన్యత్, జ్ఞాతవ్యమ్, అవశిష్యతే ॥

| | |
|---|---|
| యత్ | = దేనిని |
| జ్ఞాత్వా | = తెలుసుకుంటే |
| ఇహ | = ఈ లోకములో |
| భూయః | = మళ్ళీ |
| అన్యత్ | = మరియొకటి |
| జ్ఞాతవ్యమ్ | = తెలిసికొనదగినది |
| న, అవశిష్యతే | = మిగిలియుండదో అటువంటి |
| సవిజ్ఞానమ్ | = విజ్ఞాన సహితమైన |
| ఇదమ్ జ్ఞానమ్ | = ఈ తత్త్వజ్ఞానమును |
| అహమ్ | = నేను |
| తే | = నీకు |
| అశేషతః | = సంపూర్ణముగా |
| వక్ష్యామి | = తెలిపెదను |

**అహమ్ ఇదమ్ సవిజ్ఞానమ్ జ్ఞానమ్ తే అశేషతః వక్ష్యామి,**
**యత్ జ్ఞాత్వా ఇహ భూయః అన్యత్ జ్ఞాతవ్యమ్ న అవశిష్యతే ॥**

తా: దేనిని తెలుసుకుంటే ఈ లోకములో మళ్ళీ మరియొకటి తెలిసికొనదగినది మిగిలియుండదో అటువంటి విజ్ఞాన సహితమైన ఈ తత్త్వజ్ఞానమును నేను నీకు సంపూర్ణముగా తెలిపెదను.

ఇంకా ఉపోద్ఘాతం కొనసాగుతున్నది. మొదటి శ్లోకంలో సమగ్రజ్ఞానం పొందుతావు అన్నాడు – సమగ్రజ్ఞానం అంటే సగుణబ్రహ్మస్వరూపం + నిర్గుణబ్రహ్మ స్వరూపం అని చూశాము. ఈ శ్లోకంలో వాటికి సాంకేతిక పదాలను ఇస్తున్నాడు. సగుణ ఈశ్వరజ్ఞానాన్ని జ్ఞానమనీ, నిర్గుణ ఈశ్వరజ్ఞానాన్ని విజ్ఞానమనీ అంటున్నాడు. విజ్ఞానం అంటే మనం మామూలుగా వాడే విజ్ఞానశాస్త్రం (సైన్సు) కాదు; విజ్ఞానం అంటే నిర్గుణ ఈశ్వరజ్ఞానం.

**అహం జ్ఞానం వక్ష్యామి** – నేను నీకు సగుణ ఈశ్వరజ్ఞానం బోధిస్తాను;

**సవిజ్ఞానమ్** – నిర్గుణ ఈశ్వరజ్ఞానం కూడా బోధిస్తాను.

సగుణ ఈశ్వరజ్ఞానం స్థాయిలో భగవంతునికీ, భక్తునికీ మధ్య భేదం ఉంటుంది. కాని విశేషం ఏమిటంటే, నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందేసరికి భగవంతునికీ తనకూ మధ్య భేదం లేదని తెలుసుకుని ఆశ్చర్యపోతాడు.

భగవంతుణ్ణి సగుణరూపంలో కొలిస్తే, ఖచ్చితంగా ద్వైతం ఉంటుంది. ఎప్పుడైతే రూపం వస్తుందో, అప్పుడే భేదం కూడా వస్తుంది. రూపం ఉన్నదానికి దేశపరిమితి వస్తుంది. అందువల్ల నానాత్వం వస్తుంది. అందువల్లనే మనకు ఇందరు దేవుళ్ళు ఉన్నారు – రాముడు, కృష్ణుడు, వినాయకుడు, శక్తి, శివుడు, సరస్వతి, ఇలా ఎందరో! రూపం వస్తే నానాత్వం వస్తుంది. అందుకని దీన్ని తక్కువస్థాయి సత్యం అంటారు.

భగవంతుని ఉన్నతస్థాయికి వెళితే నామరూపాలు ఉండవు, గుణాలు కూడా ఉండవు. ఉన్నది ఒక్కటే నిర్గుణబ్రహ్మ; అద్వైతం. కాని అద్వైతం గురించి నేర్చుకోవటం మొదట్లో కష్టం. అందువల్ల ముందు సగుణ ఈశ్వరునితో మొదలుపెడతారు.

అధరం మధురం వదనం మధురం నయనం మధురం – నీ పెదవులు, నీ మొహం, నీ కళ్ళు అందంగా ఉన్నాయంటూ దేవుణ్ణి స్తుతిస్తారు. అందువల్ల శాస్త్రం మొదటిమెట్టుగా సగుణబ్రహ్మ జ్ఞానాన్ని, రెండవమెట్టుగా నిర్గుణబ్రహ్మ జ్ఞానాన్ని బోధిస్తుంది. అందువల్లనే కృష్ణపరమాత్మ కూడా అర్జునా, నీకు ద్వైతజ్ఞానం, అద్వైతవిజ్ఞానం రెండూ బోధిస్తాను అంటున్నాడు.

ఇది అల–సముద్రం గురించిన జ్ఞానం లాంటిది. అల–సముద్రాలను వాటి నామరూపాల పరంగా చూస్తే అవి రెండూ రెండు భిన్నవస్తువులు. వాటి పేర్లు వేరు; వాటి రూపాలు వేరు – ఒకటి చాలా చిన్నది, ఇంకోటి చాలా విశాలమైనది. ఇది ద్వైతపరంగా చూడటం. ఇప్పుడు వాటికి ఆధారమైన నీటికి వెళితే, ఇంత చిన్న అలలో ఉన్నదీ నీరే; అంత పెద్ద సముద్రంలో ఉన్నదీ నీరే! నీటిపరంగా అలకూ, సముద్రానికీ భేదం లేదు. సగుణజ్ఞానం భేదజ్ఞానం; నిర్గుణజ్ఞానం అభేదజ్ఞానం. జ్ఞానం ద్వైతజ్ఞానం; విజ్ఞానం అద్వైతజ్ఞానం. నీకు రెండింటి గురించీ చెపుతాను. అది కూడా ఎలా చెపుతాను?

**అశేషతః (వక్ష్యామి)** – సంపూర్ణంగా బోధిస్తాను. అంటే పూర్తిగా, సందేహం లేకుండా, నిశ్చయంగా, తార్కికంగా, నమ్మకం ఏర్పడేలా బోధిస్తాను. అంటే లోతుగా చెపుతాను. దానివల్ల లాభం ఏమిటి?

**యద్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే** – ఈ జ్ఞానం పొందితే ఇంక తెలుసుకోవాల్సింది ఏమీ ఉండదు. నీ బుద్ధి పూర్తిగా తృప్తి చెందుతుంది.

మనం సంసారాన్ని మూడు స్థాయిల్లో ఏదో ఒక స్థాయిలో అనుభవిస్తాము.

ఎ) **శారీరకస్థాయి** – కొంతమంది సమస్యలు శారీరక స్థాయిలోనే ఆగిపోతాయి. వారు ఎంతసేపూ శారీరక ఆరోగ్యం గురించి, వృద్ధాప్యం గురించి, పొంచివున్న మరణం గురించే మాట్లాడుతారు. వేరే ఏ విషయమూ పట్టదు వారికి. అంటే స్థూలశరీరానికి చెందిన వారి సమస్య స్థూలంగా ఉంటుంది.

బి) **మానసికస్థాయి** – కొంతమందికి శారీరక అనారోగ్యం పెద్ద సమస్య కాదు. వారికి అన్నీ ఉంటాయి. ఆరోగ్యం బాగుంటుంది; పిల్లలు అన్ని సౌకర్యాలూ అమరుస్తారు; కాని వారితో మనస్సు విప్పి మాట్లాడేవారు ఉండరు. వారు కొంచెం ప్రేమ, ఆప్యాయత, జాలి, దయ, తోడుకోసం అల్లాడిపోతుంటారు. వీరూ సంసారులే. ముందు రకం వారి సమస్య స్థూలంగా ఉంటే, వీరి సమస్య భావోద్రేకాలకు చెందినది.

సి) **బుద్ధిస్థాయి** – మరికొంతమంది సమస్య బుద్ధికి చెందినది. మన శాస్త్రజ్ఞులు ఈ తెగ కిందికి వస్తారు. వారికి బుద్ధిలో అనేక ప్రశ్నలు తొలుస్తూ ఉంటాయి. ఈ సృష్టి ఏమిటి? నేను ఎక్కడినుంచి వచ్చాను? ఎక్కడికి వెళతాను? ఈశ్వరుడు ఎవరు? మరణం తర్వాత ఏమవుతుంది? ఇలాంటి ప్రశ్నలలో కూరుకుపోతారు. భార్య కష్టసుఖాలతో వారికి సంబంధం ఉండదు. భార్య కన్నీరు కారుస్తున్నా ఆ కన్నీటిని శాస్త్రపరంగా వివరిస్తారు తప్ప ఆమె బాధ ఏమిటో తెలుసుకోవటానికి ప్రయత్నించరు.

ఈ విధంగా సంసారాన్ని మూడు స్థాయిల్లో వర్ణించవచ్చు – శారీరక స్థాయి, మానసిక స్థాయి, బుద్ధిస్థాయి.

బుద్ధిస్థాయిలో మళ్ళీ మూడు ప్రశ్నలు వేధిస్తుంటాయి – జీవుడెవరు, జగత్తు ఏమిటి, ఈశ్వరుడెవరు?

**కస్త్వం, కోఽహం, కుత ఆయాతః** – నా గురించి వేసుకునే ప్రశ్నలు ఇవి. నేనెవరు, నేను ఎక్కడ్నుంచి వచ్చాను, ఎక్కడికి వెళతాను? ఇవన్నీ మనను చిన్నతనంలో వేధించే ప్రశ్నలు. పెద్దవారిని అడిగితే, వారు చెప్పలేక నోరు మూయిస్తారు. తర్వాత ఈ ప్రపంచంలో పరుగుపందెంలో పడిపోయి, ఈ ప్రశ్నలు మర్చిపోతాము.

కాని ఇప్పుడు ఈ మూడు ప్రశ్నలకు జవాబు చెప్పబోతున్నాను అని కృష్ణపరమాత్మ ముందే చెబుతున్నాడు. జీవుడెవరు, జగత్తు ఏమిటి, ఈశ్వరుడెవరు? ఈ ప్రశ్నలకు జవాబులే కాదు, ఈ మూడింటి మధ్య ఉన్న సంబంధం ఏమిటో కూడా చెపుతాడు.

**కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి** – ముండక 1.1.3

ముండకోపనిషత్తులో శిష్యుడు శౌనకుడు, గురువు అంగిరసుణ్ణి అడుగుతాడు – ఏ ఒక్క విద్య నేర్చుకుంటే అన్ని విద్యలూ నేర్చుకున్నట్టు అవుతుందో ఆ విద్య బోధించు. అటువంటి విద్యను పరావిద్య అంటారు. పరావిద్య నేర్చుకుంటే బుద్ధిపరంగా కలిగే అన్ని సందేహాలూ తీరుతాయి. **ఏక విజ్ఞానేన సర్వం విజ్ఞాతం భవతి.** అదే కృష్ణపరమాత్మ చెపుతున్నాడు. యద్జ్ఞాత్వా నేహ భూయోఽన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే – దీనిని తెలుసుకున్న తర్వాత ఈ జగత్తులో తెలుసుకోవాల్సింది ఇంక ఏదీ మిగలదు.

శ్లో. 3 **మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥**
మనుష్యాణామ్, సహస్రేషు, కశ్చిత్, యతతి, సిద్ధయే,
యతతామ్, అపి, సిద్ధానామ్, కశ్చిత్, మామ్, వేత్తి, తత్త్వతః ॥

| | | |
|---|---|---|
| మనుష్యాణామ్, సహస్రేషు | = | వేలాది మనుష్యులలో |
| కశ్చిత్ | = | ఎవరో ఒకరు మాత్రమే |
| సిద్ధయే | = | భగవత్ప్రాప్తి సిద్ధించుటకై |
| యతతి | = | ప్రయత్నించును |
| యతతామ్ | = | అలాప్రయత్నించిన |
| సిద్ధానామ్, అపి | = | యోగులలో కూడా |
| కశ్చిత్ | = | ఎవరో ఒకరు మాత్రమే (నా యందే మనస్సు నిల్పి) |
| మామ్ | = | నన్ను అంటే |
| తత్త్వతః | = | నా యథార్థ స్వరూపమును |
| వేత్తి | = | తెలుసుకొనును |

**మనుష్యాణామ్ సహస్రేషు కశ్చిత్ సిద్ధయే యతతి,**
**యతతామ్ సిద్ధానామ్ అపి కశ్చిత్ మామ్ తత్త్వతః వేత్తి ॥**

తా: వేలాది మనుష్యులలో ఎవరో ఒకరు మాత్రమే భగవత్ప్రాప్తి సిద్ధించుటకై ప్రయత్నించును. అలా ప్రయత్నించిన యోగులలో కూడా ఎవరో ఒకరు మాత్రమే నన్ను అంటే నా యథార్థస్వరూపమును తెలుసుకొనును.

ఈ శ్లోకంలో ఈ విద్యయొక్క స్తుతిని చేస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఈశ్వరజ్ఞాన ప్రశంస. విద్య అంటే పరావిద్య, అపరావిద్య – రెండూ. ఈ జ్ఞానఫలాన్ని మన శాస్త్రంలో అనేక విధాలుగా చూస్తాము. ఇక్కడ కృష్ణపరమాత్మ దాన్ని చాలా అరుదైన విద్యగా స్తుతిస్తున్నాడు. మానవనైజం ఎలాగుంటుందంటే, చాలా అరుదైన విషయం తనొక్కడే పొందాలనుకుంటాడు. దాన్ని తన ఇరుగుపొరుగుకి అబ్బురంగా చూపించుకుంటాడు. దాన్ని పొందటానికి వారు కూడా శతవిధాల ప్రయత్నం చేసి విఫలమైతే మురిసిపోతాడు. అందువల్ల ఈ జ్ఞానం చాలా అరుదైనది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ జ్ఞానం పొందాలంటే కొన్ని దశలు దాటిరావాలి సాధకుడు. అతనికి మోక్షేచ్ఛ, ఈశ్వరజ్ఞానేచ్ఛ, గురుశాస్త్ర ఉపదేశ ఇచ్ఛ కలగాలి.

ఎ) **మోక్షేచ్ఛ** – మనిషికి నాలుగు పురుషార్థాలను నియంత్రించింది శాస్త్రం. అవి ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. అర్థ – ఐశ్వర్యం పొందటం; కామ – కోరికలు తీర్చుకోవటం; ధర్మ – పుణ్యం పొందటం; మోక్ష – ఆంతర స్వేచ్ఛ. కాని దురదృష్టవశాత్తూ చాలామంది మనుష్యులు మొదటి మూడు పురుషార్థాల వెంటే పరుగులు తీస్తారు. అంటే వారికి ఎంతసేపూ ధర్మ, అర్థ, కామాలే కావాలి కాని మోక్షంమీద ఇచ్ఛ కలగదు. ఇవి తీరాక మోక్షానికి వెళదాంలే అనుకుంటారు కాని అవి తీరాక వెళ్ళటం అంటే అలలు ఆగాక, సముద్రంలో స్నానం చేద్దామనుకున్నట్టు ఉంటుంది. కాని కొంతమందికి మాత్రమే మోక్షంమీద ఇచ్ఛ ఏర్పడుతుంది.

బి) **ఈశ్వరజ్ఞానేచ్ఛ** – మోక్షంమీద ఇచ్ఛ ఏర్పడిన ఆ కొంతమందిలో కూడా ఈశ్వరజ్ఞానేచ్ఛ కలగదు – ఈశ్వర జ్ఞానాత్ ఏవ మోక్షః – ఈశ్వరజ్ఞానం పొందితేనే మోక్షం కలుగుతుందని తెలియదు. అందువల్ల వారు అనేక మార్గాలు ప్రయత్నిస్తారు కాని ఈశ్వరజ్ఞానం పొందటానికి ప్రయత్నించరు.

సి) **గురుశాస్త్ర ఉపదేశ ఇచ్ఛ** – ఈశ్వరజ్ఞానం పొందాలని తెలిసినా, అది ఎలా పొందాలో చాలామందికి తెలియదు. ఎలా పొందాలో కృష్ణపరమాత్మే చెప్పాడు –

> **తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**
> **ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః** – 4.34

గురువు దగ్గరకు సమిధలు తీసుకుని వెళ్ళి, ప్రశ్నలు వేసి, సేవలు చేసి, శ్రవణంద్వారా గురువునుంచి శాస్త్రం నేర్చుకోవాలి. ఇలా గురువు దగ్గరికి వచ్చి శ్రవణంద్వారా ఈశ్వరజ్ఞానం పొందేవారు ఇంకా అరుదుగా ఉంటారు.

అంటే అంత పెద్ద మానవాళిలో కొద్దిమందికే మోక్ష ఇచ్ఛ కలుగుతుంది, వారిలో కొద్దిమందికే ఈశ్వర జ్ఞానేచ్ఛ కలుగుతుంది, మళ్ళీ వారిలో కొద్దిమందికే గురువుద్వారా జ్ఞానం పొందాలని తెలుస్తుంది. ఆ కొద్దిమంది వచ్చి నేర్చుకుంటారు. ఇంకా అక్కడితో సమస్య పూర్తవలేదు. గురువు దగ్గర శ్రవణం చేసిన కొంతమందిలో కూడా అందరికీ పూర్తిగా అర్థం కాదు. అందువల్ల జ్ఞానం పొందటానికి వచ్చేవారే చాలా అరుదైతే, ఆ జ్ఞానం పొంది ఫలం పొందేవారు ఇంకా, ఇంకా అరుదుగా ఉంటారు.

**మనుష్యాణాం సహస్రేషు** – వేలాది మనుష్యులు ఉన్నారు, వారిలో –

**కశ్చిత్ యతతి** – కేవలం కొందరు మాత్రమే సరియైన మార్గంలో కృషి చేస్తారు. సరియైన మార్గం ఏమిటి? గురుశాస్త్ర ఉపదేశశ్రవణం సరియైన మార్గం. దీనిలో ప్రయత్నం చేస్తారు. ఎందుకు?

**సిద్ధయే** – ఆంతరస్వేచ్ఛ, ఆంతరభద్రతకోసం చేస్తారు. అభద్రతాభావం కేవలం నీ మనస్సులో ఉంది. అది నీ అజ్ఞానంవల్ల ఏర్పడింది అని చెబుతుంది శాస్త్రం. బాహ్యవస్తువులు అశాశ్వతం కాబట్టి, అవి శాశ్వతమైన భద్రతనివ్వలేవు. అసలు భద్రత బయట వస్తువుల్లో లేదు, నీలోనే ఉంది. నిజానికి భద్రత ఒక సమస్య కాదు, అది నీ మనస్సు సృష్టించిన భావన. ఏ భావన అన్నా పోవాలంటే దానికి దాని గురించిన జ్ఞానమొక్కటే మార్గం. జ్ఞానంవల్ల అభద్రతా భావననుంచి విముక్తి కలగటమే సిద్ధి. దీనికోసం చాలా తక్కువమంది ప్రయత్నిస్తారు.

**సిద్ధానామ్ అపి** – సిద్ధానాం అంటే సాధకానాం అంటే సాధకులలో కూడా;

**యతతామ్** – అంటే సరియైన మార్గంలో ప్రయత్నిస్తున్నవారిలో కూడా;

**కశ్చిత్ మాం వేత్తి** – కొందరు మాత్రమే నా జ్ఞానం పొందుతారు. నా జ్ఞానము అంటే ఈశ్వరజ్ఞానం.

**తత్త్వతః** – తత్త్వజ్ఞానాన్ని పొందుతారు అంటే సగుణ, నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందుతారు.

వేలాది మనుష్యుల్లో కొందరు మాత్రమే సరియైన మార్గంలో కృషి చేస్తారు. స్వేచ్ఛ, భద్రత తమలోనే ఉన్నాయని శాస్త్రం చెప్పేది వింటారు. కాని ఆ సాధకులలో కూడా కొందరు మాత్రమే దాన్ని సరిగ్గా అర్థం చేసుకుని, సంపూర్ణ ఈశ్వరతత్త్వాన్ని పొందుతారు. దీన్నిబట్టి ఈ జ్ఞానం ఎంత గొప్పదో తెలుస్తున్నది. అలా ఈ జ్ఞానాన్ని స్తుతించాక అసలు విషయంలోకి అడుగుపెట్టబోతున్నాడు కృష్ణపరమాత్మ.

## 2. ఈశ్వరస్వరూపం – శ్లోకాలు 4–12 ఉపోద్ఘాతం

4 నుంచి12 శ్లోకాల వరకూ ఏడవ అధ్యాయంలోని ముఖ్యమైన బోధ వస్తుంది. ఆ మాటకొస్తే మొత్తం భగవద్గీతలోనే ఇది చాలా ముఖ్యమైన భాగం. ఎందుకంటే ఈశ్వరస్వరూపవర్ణన వస్తుంది వీటిలో.

ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. భగవద్గీత బోధ ఉపనిషత్తులను ఆధారంగా చేసుకుని చెయ్యబడింది. కృష్ణపరమాత్మ తన స్వంతభావాన్ని ఇసుమంత కూడా కలపలేదు. వాటి సారాన్ని ఆయన మనకు రంగరించి పోశారు. అందువల్ల ఇటువంటి శ్లోకాలను అర్థం చేసుకోవాలంటే ఉపనిషత్తులు చేసిన బోధను గుర్తు తెచ్చుకోవాలి.

### ఉపనిషత్తులు ఇచ్చిన ఈశ్వర నిర్వచనం

అన్ని ఉపనిషత్తులూ భగవంతుణ్ణి జగత్కారణంగా అభివర్ణిస్తాయి. అంటే భగవంతుడు సృష్టికర్త. సృష్టి గురించి మాట్లాడగానే దేనికైనా రెండు కారణాలు ఉంటాయి. అవి నిమిత్తకారణం, ఉపాదానకారణం.

**ఉపాదాన కారణం** – ఏదైనా ఒక వస్తువును తయారు చెయ్యాలంటే దానికి ముడిసరుకు కావాలి. కుండకు ముడిసరుకు మట్టి; ఆభరణానికి ముడిసరుకు బంగారం. ఈ ముడిసరుకును ఉపాదాన కారణం అంటారు. దీన్ని మెటీరియల్ కాజ్ అంటారు. దయానందస్వామీజీ దీన్ని మెటీరియల్ అంటారు.

**నిమిత్త కారణం** – ఒక వస్తువును తయారు చెయ్యాలంటే దానికి తెలివితేటలు ఉన్న వ్యక్తి కావాలి. మట్టి దానంతట అది కుండ అయిపోదు; బంగారం దానంతట అది ఆభరణమైపోదు. దాన్ని ఒక ఆకారంలో తీర్చిదిద్దే వ్యక్తిని నిమిత్తకారణం అంటారు. కుండకు కుమ్మరి నిమిత్త కారణం; ఆభరణానికి కంసాలి నిమిత్తకారణం. దీనినే ఇంటిలిజెంట్ కాజ్ అంటారు. దయానందస్వామీజీ దీన్ని మేకర్ అంటారు.

ఇప్పుడు ఒక వస్తువు సృష్టికి ఉపాదాన కారణం వేరు, నిమిత్త కారణం వేరు. జగత్తు సృష్టి వచ్చేసరికి ఉపనిషత్తులు భగవంతుడు సృష్టికర్త అంటున్నాయి. అంతేకాదు, సృష్టికి ముందు భగవంతుడు ఒక్కడే ఉన్నాడు అని కూడా చెపుతాయి. దేశం, కాలం సృష్టితోపాటు వచ్చాయి. అందువల్ల సృష్టికి ముందు భగవంతుడు మాత్రమే ఉన్నాడు.

సృష్టికి ముందు భగవంతుడు మాత్రమే ఉంటే, ఆయన నిమిత్తకారణమా, ఉపాదానకారణమా? నిమిత్తకారణం అంటే ఉపాదానకారణం ఏది? ఉపాదానకారణం అంటే నిమిత్త కారణం ఎవరు? భగవంతుడు ఒక్కడే ఉన్నాడు కాబట్టి ఆయనే అటు నిమిత్త కారణం, ఇటు ఉపాదానకారణం కూడా అంటాయి ఉపనిషత్తులు.

**నిమిత్తకారణంగా జగత్తును సృష్టించాడు, ఉపాదానకారణంగా తానే జగత్తు అయ్యాడు.**

కాని మన అనుభవం ఒప్పుకోదు. మనం చూసే ప్రతి వస్తువు సృష్టి వెనుకా నిమిత్త కారణం వేరు, ఉపాదాన కారణం వేరు. అన్నం వండాలంటే బియ్యం ఉపాదానకారణం, వంటమనిషి నిమిత్తకారణం కదా! కాని ప్రతి నియమానికి ఒక ఉల్లంఘన ఉంటుంది. ప్రతి అపవాదానికి ఒక ఉత్సర్గ ఉంది అంటారు.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ యథా పృథివ్యామోషధయః సమ్భవన్తి ।**
**యథా సతః పురుషాత్కేశలోమాని తథాఽక్షరాత్సమ్భవతీహ విశ్వమ్ ॥** – ముండకం 1.1.7

సాలెపురుగు ఈ నియమానికి ఉల్లంఘన. సాలెపురుగు తనలోంచి ముడిసరుకు తీసుకుని, తనే అద్భుతంగా సాలెగూడును కడుతుంది.

**అభిన్న నిమిత్త ఉపాదాన కారణం** – అభిన్నం అంటే నిమిత్త కారణమూ, ఉపాదాన కారణమూ భిన్నంగా లేవు. ఉదాహరణకు సాలెపురుగు. అలా భగవంతుడే నిమిత్త కారణమూ, ఉపాదాన కారణమూ కూడా. దయానందస్వామీజీ మేకర్ అండ్ మెటీరియల్ రోల్డ్ ఇంటు వన్ (maker and material rolled into one) అంటారు.

ఈ అభిన్న నిమిత్త ఉపాదాన కారణాన్ని మన పురాణాలు అర్ధనారీశ్వరునిగా అభివర్ణిస్తాయి. ఉపనిషత్తులు నిమిత్త కారణం, ఉపాదాన కారణం అంటాయి. కృష్ణపరమాత్మ పరాప్రకృతి, అపరాప్రకృతి అంటున్నాడు.

పరాప్రకృతి అంటే ఉన్నతస్థానం; అపరాప్రకృతి అంటే లౌకిక స్థానం. ఈ పరాప్రకృతికీ, అపరాప్రకృతికీ మధ్య కొన్ని పోలికలు ఉన్నాయి, కొన్ని వ్యత్యాసాలూ ఉన్నాయి.

పోలిక ఏమిటి? పరాప్రకృతి, అపరాప్రకృతి రెండూ **అనాది, నిత్యం.** రెండింటినీ సృష్టించలేము, నాశనం చెయ్యలేము. సైన్సు పరంగా కూడా పదార్థాన్ని సృష్టించలేము, నాశనం చెయ్యలేము అని నేర్చుకుంటాము.

పరాప్రకృతి, అపరాప్రకృతిల మధ్య వ్యత్యాసాలు చాలానే ఉన్నాయి కాని ఇప్పుడు మనకు పనికివచ్చే నాలుగు వ్యత్యాసాలను తీసుకుందాము.

| **పరాప్రకృతి** | **అపరాప్రకృతి** |
|---|---|
| ఎ) చేతనతత్త్వం | అచేతనతత్త్వం |
| బి) నిర్గుణతత్త్వం | సగుణతత్త్వం |
| సి) నిర్వికారతత్త్వం | సవికారతత్త్వం |
| డి) సత్యం | మిథ్య |

అపరాప్రకృతి జడం కాబట్టి అది ప్రతిదానికీ చేతనతత్త్వంమీద ఆధారపడాలి. అందువల్ల అది అస్వతంత్రం అయింది. స్వయంగా ఉనికి లేని దాన్ని మిథ్య అంటారు.

భగవంతుడు ఎవరు? చేతన–అచేతన; నిర్గుణ–సగుణ; నిర్వికార–సవికార; సత్య–మిథ్య; పరాప్రకృతి–అపరాప్రకృతుల మేలుకలయిక భగవంతుడు.

సృష్టికి ముందు పరాప్రకృతి లక్షణాలు, అపరాప్రకృతి లక్షణాలు ఒకే దేవునిలో అవ్యక్తంగా ఉన్నాయి. ఆ అవ్యక్త దశనుంచి సృష్టి ఎలా జరిగిందో వివరంగా చెబుతాయి ఉపనిషత్తులు. దీన్ని సృష్టిప్రకరణం అంటారు.

ఏడవ అధ్యాయంలో ఈ సృష్టిప్రకరణాన్ని రెండు దశల్లో వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఉదాహరణకు ఒక విత్తనం తీసుకుంటే – దాని ఎదుగుదలలో మొదటి దశ–చిన్న మొక్క, రెండవ దశ–పెద్ద వృక్షం. కృష్ణపరమాత్మ ఈ వర్ణన సాంఖ్యదర్శనాన్ని ఆధారంగా చేసుకుని చెపుతున్నాడు. ఈ సాంఖ్యదర్శనాన్ని దర్శించిన ఋషి కపిల ముని. దానికీ మన అద్వైత సిద్ధాంతానికీ కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి కాని, ప్రస్తుతం దాని పద్ధతి తీసుకోవచ్చు.

ఆ పద్ధతి ప్రకారం సృష్టి రెండు దశల్లో జరుగుతుంది – 1) పరాప్రకృతి, అపరాప్రకృతి వస్తాయి; 2) అపరా ప్రకృతి ఎనిమిదిగా విభజించుకుంటుంది. పరాప్రకృతి ఏమీ అవదు, ఎందుకంటే అది నిర్వికారం. అందువల్ల రెండవ దశలో 8 అపరాప్రకృతి + 1 పరాప్రకృతి = 9 = భగవంతుడు.

తర్వాత ఈ ఎనిమిదిగా విభజించుకున్న అపరాప్రకృతి వివిధంగా భాసిస్తున్న జగత్తు అవుతుంది.

**ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ**
**పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽ న్నమ్ అన్నాత్పురుషః** – తైత్తిరీయం

అంటే మన ఎదురుగా కనిపిస్తున్న జగత్తంతా అపరాప్రకృతి. అయితే పరాప్రకృతి ఏది? దానికోసం నిరంతరం పరుగులు పెడుతూనే ఉన్నాము. కృష్ణపరమాత్మ పరుగులు ఆపు; నువ్వు వెతుకుతున్న పరాప్రకృతివి నువ్వే అంటున్నాడు.

చూసే నువ్వు పరాప్రకృతి, చూడబడే జగత్తు అపరాప్రకృతి
మనస్సు కూడా వస్తువే, కాకపోతే సూక్ష్మవస్తువు.

తత్త్వబోధలో మనస్సుయొక్క నిర్వచనం వస్తుంది.

**అపఞ్చీకృత సూక్ష్మమహాభూతైః కృతం సత్కర్మజన్యం సుఖదుఃఖాది భోగసాధనమ్,**
**పఞ్చజ్ఞానేన్ద్రియాణి, పఞ్చకర్మేన్ద్రియాణి పఞ్చప్రాణాదయో మనశ్చైకమ్ బుద్ధిశ్చైకా–ఏవం**
**సప్తదశకలాభిః సహ యత్ తిష్ఠతి తత్ సూక్ష్మశరీరమ్ ॥**

అందువల్ల మనస్సు కూడా అపరాప్రకృతినుంచి వచ్చినదే.

శ్లో. 4 **భూమిరాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధిరేవ చ ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥**

భూమిః, ఆపః, అనలః, వాయుః, ఖమ్, మనః, బుద్ధిః, ఏవ, చ,
అహంకారః, ఇతి, ఇయమ్, మే, భిన్నా, ప్రకృతిః అష్టధా ॥

| | | | |
|---|---|---|---|
| భూమిః | = భూమి | చ | = ఇంకా |
| ఆపః | = నీరు | అహంకారః, ఏవ | = అహంకారమూ |
| అనలః | = అగ్ని | ఇతి | = అని |
| వాయుః | = వాయువు | మే | = నాయొక్క |
| ఖమ్ | = ఆకాశము | ఇయమ్ | = ఇట్టి (ఈ) |
| మనః | = మనస్సు | ప్రకృతిః | = ప్రకృతి |
| బుద్ధిః | = బుద్ధి | అష్టధా, భిన్నా | = ఎనిమిది విధములుగా (కలదు) |

**భూమిః, ఆపః, అనలః, వాయుః, ఖమ్, మనః, బుద్ధిః ఏవ చ,**
**అహంకారః ఇతి అష్టధా భిన్నా మే ఇయమ్ ప్రకృతిః ॥**

తా: ఓ మహాబాహూ! భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి ఇంకా అహంకారమూ అని నాయొక్క ఇట్టి (ఈ) ప్రకృతి ఎనిమిది విధములుగా (కలదు).

ఈ శ్లోకంలో రెండవ దశను వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ఎనిమిదిగా విభజించుకున్న అపరాప్రకృతి గురించి చెపుతున్నాడు. పంచభూతాల సృష్టి గురించి ముందు చెపుతున్నాడు. పంచభూతాలు కూడా రెండురకాలు

ఉన్నాయని తత్త్వబోధలో చూశాము. అవి సూక్ష్మపంచభూతాలు, స్థూలపంచభూతాలు. ముందు సూక్ష్మభూతాలు పుడతాయి. అవి పంచీకరణం జరిగి స్థూలపంచభూతాలు అవుతాయి.

ఈ శ్లోకంలో రెండవ దశను వివరిస్తున్నాడు కాబట్టి పంచభూతాలు అంటే సూక్ష్మభూతాలను తీసుకోవాలి.

**భూమిరాపోఽనలో వాయుః ఖమ్** – భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే సూక్ష్మపంచభూతాలు వచ్చాయి.

**మనో బుద్ధిరేవ చ అహంకార ఇతి** – మనస్సు, బుద్ధి, అహంకారం అనే మూడు కూడా వచ్చాయి. ముందే చూసినట్టుగా ఇవి సాంఖ్య దర్శనంలో వస్తాయి. మనస్సు, బుద్ధి, అహంకారం పదాలు సాంఖ్యలో సాంకేతిక పదాలు. మనకు తెలిసిన మామూలు అర్థాలు రావు. వాటిని శంకరులవారు అవ్యక్తం, మహత్, అహంకారం అన్నారు.

ఈ దశలో పద్నాలుగు లోకాలు ఇంకా సృష్టించబడలేదు, మన శరీరాలు సృష్టించబడలేదు.

**భిన్నా అష్టధా ప్రకృతిః** – ఎనిమిదిగా విభజించబడిన ఈ ప్రకృతిని అపరా ప్రకృతి అంటారు.

కృష్ణపరమాత్మ రాబోయే శ్లోకంలో పరాప్రకృతిని పరిచయం చెయ్యబోతున్నాడు.

శ్లో. 5 **అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥**
అపరా, ఇయమ్, ఇతః, తు, అన్యామ్, ప్రకృతిమ్, విద్ధి, మే, పరామ్,
జీవభూతామ్, మహాబాహో, యయా, ఇదమ్, ధార్యతే, జగత్ ॥

| | | | |
|---|---|---|---|
| మహాబాహో | = ఓ అర్జునా! | ధార్యతే | = ధరింపబడుచున్నదో |
| ఇయమ్, తు | = ఈ అష్టవిధ ప్రకృతి | మే | = నాయొక్క |
| అపరా | = అపరా ప్రకృతి అనియు లేక జడప్రకృతి అనియు చెప్పబడుచున్నది | జీవభూతామ్ | = జీవరూపమైన |
| | | పరామ్, ప్రకృతిమ్ | = పరా ప్రకృతిని |
| | | ఇతః, అన్యామ్ | = ఈ అష్టవిధ ప్రకృతి కంటెను వేరైన దానినిగా |
| యయా | = దేనిచేత | | |
| ఇదమ్, జగత్ | = ఈ జగత్తు | విద్ధి | = తెలుసుకొనుము |

**హే మహాబాహో! ఇయమ్ అపరా (ప్రకృతిః అస్తి) ఇతః తు అన్యామ్**
**జీవ-భూతామ్ మే పరామ్ ప్రకృతిమ్ విద్ధి, యయా ఇదమ్ జగత్ ధార్యతే ॥**

తా: ఓ అర్జునా! ఈ అష్టవిధ ప్రకృతి అపరా ప్రకృతి అనియు లేక జడప్రకృతి అనియు చెప్పబడుచున్నది దేనిచేత ఈ జగత్తు ధరింపబడుచున్నదో నాయొక్క జీవరూపమైన పరా ప్రకృతిని ఈ అష్టవిధ ప్రకృతి కంటెను వేరైన దానినిగా తెలుసుకొనుము.

**ఇయమ్ అపరా** – ఇంతకు ముందు శ్లోకంలో చెప్పిన ఎనిమిదీ అపరాప్రకృతి – అంటే తక్కువ స్థాయికి చెందినవి. పదార్థం, శక్తి రెండూ తక్కువ స్థాయికి చెందినవే, ఎందుకంటే అవి అచేతనతత్త్వానికి చెందినవి. శాస్త్రం చైతన్యాన్ని పరాప్రకృతి అంటుంది – ఎందుకంటే చైతన్యం అంటే పదార్థం కాదు, శక్తి కాదు. వాటిని ఒకదాన్ని ఇంకొకదానిగా మార్చవచ్చు. సవికారం అనాత్మకే ఉంటుంది. చైతన్యం నిర్వికారం. చైతన్యం పదార్థం కాదు, శక్తి కాదు అంటే ఏమిటి? చైతన్యం అంటే చైతన్యమే! అంటే చైతన్యతత్త్వం!

**మే పరాం ప్రకృతిం విద్ధి** – నా ఉన్నత స్వరూపం గురించి తెలుసుకో. అది విజ్ఞానశాస్త్రానికి అందదు. విద్ధి అంటే తెలుసుకో. అపరాప్రకృతి ఈ సృష్టిలో ఉన్నట్టే, పరాప్రకృతి కూడా ఈ సృష్టిలోనే ఉంది. అయితే పరాప్రకృతి ఎక్కడ ఉంది?

ఇందాక చూసిన సూత్రం ప్రకారం మార్పు ఉన్నది ఏదైనా అది అపరాప్రకృతి కింద వస్తుంది. ముందు మన ఎదురుగుండా ఉన్న జగత్తును చూస్తే అది మార్పుకు లోనవుతుంది. అందువల్ల జగత్తు అపరాప్రకృతి.

జగత్తును కాదంటే మిగిలింది ఎవరు? నేను. నేను అంటే శరీరం, ఇంద్రియాలు, మనస్సు ఉన్న కార్యకరణసంఘాతం. శరీరం పరాప్రకృతి కాదు, శరీరానికి షడ్వికారాలు ఉన్నాయి. ఇంద్రియాలు పరాప్రకృతి కాదు, ఇంద్రియాలకు కూడా పటుత్వం తగ్గుతుంది; మనస్సు కూడా పరాప్రకృతి కాదు. మనస్సులో అనేక భావాలు చెలరేగుతాయి. ఒకసారి కోపంగా ఉంటుంది, ఒకసారి ఆనందంగా ఉంటుంది. అదికాక జాగ్రదావస్థలో జాగ్రద్ ప్రపంచాన్ని, స్వప్నావస్థలో స్వప్నప్రపంచాన్ని చూసిన మనస్సు సుషుప్తిలో పడుకుంటుంది. కాని పడుకుని లేచాక నేను హాయిగా పడుకున్నాను అంటాను. అంటే ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును ఒకటి సాక్షిగా చూస్తోందన్నమాట. ఆ సాక్షే చైతన్యం. ఆ చైతన్యాన్ని నేనే!

**Ever the experiencer, never the experienced**

**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

నువ్వు వెతుకుతున్న చైతన్యం లేదా పరమాత్మ నువ్వే. తత్ త్వం అసి. ఇదొక మహావాక్యం. ఈ మహావాక్య అర్థం ఈ శ్లోకంలో వస్తుంది కాబట్టి, ఈ శ్లోకం చాలా ముఖ్యమైన శ్లోకం.

సృష్టి పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయిక. అనుభవించే నేను పరాప్రకృతి, అనుభవించబడేది అపరాప్రకృతి అవుతాము.

**మహాబాహో** – ఈ జ్ఞానం పొంది నీ కండబలంతో పాటు బుద్ధిబలం కూడా పెంచుకో.

**జీవభూతాం (విద్ధి)** – జీవుడే పరాప్రకృతి అని తెలుసుకో! మనశ్శరీరాల వెనకనున్న చైతన్యమే పరాప్రకృతి. ఎలాగైతే విద్యుచ్ఛక్తి ఫ్యానుకు, లైటుకు జీవాన్ని ఇస్తుందో, అలాగే చైతన్యతత్త్వం మనశ్శరీరాలకు చైతన్యాన్ని ఇస్తుంది. ఆ చైతన్యమే నా పరాప్రకృతి. దాని గొప్పతనం ఏమిటి?

**యయా** – ఆ చైతన్యతత్త్వమే

**ఇదం జగత్ ధార్యతే** – ఈ సంపూర్ణ జగత్తును ధరిస్తున్నది.

వ్యష్టిపరంగా చైతన్యతత్త్వాన్ని ప్రాణం రూపంలో అనుభవిస్తున్నాము. ఎలా తెలుసు? శరీరాన్ని ముట్టుకు చూడండి. అందులో చైతన్యం ప్రాణం రూపంలో ఉంది. ఎప్పుడైతే ప్రాణం పోతుందో, అప్పుడే అది జడం అవుతుంది. వ్యష్టిలో జీవం ఉంటే శివం, జీవం లేకపోతే శవం అవుతాడు.

సమష్టిపరంగా చూస్తే, పరాప్రకృతి వల్లనే విశ్వమంతా ఒక క్రమపద్ధతిలో నడుస్తున్నది. నక్షత్రమండలాన్ని పరీక్షిస్తేనే దాని వెనుక ఎంత జ్ఞానం ఉందో తెలుస్తుంది. అందువల్ల మన మతంలో జగత్తును విశ్వరూప ఈశ్వరునిగా కొలుస్తారు. సృష్టిలో కనపడే భాగం అపరాప్రకృతి, దాన్ని వెనకనుంచి నడిపించేది పరాప్రకృతి; సృష్టి విశ్వరూపం.

పురుషసూక్తం ఈ విశ్వరూపాన్నే వర్ణిస్తుంది. భగవంతుణ్ణి తమిళంలో పెరుమాళ్ అంటారు. పెరుమాళ్ అంటే పెరుం ఆళ్. ఆళ్ అంటే మనిషి; పెరుం ఆళ్ అంటే చాలా పెద్దమనిషి. ఆ భగవంతుడు జగత్తుకు స్థితికారకుడు.

శ్లో. 6 **ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।**
**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా ॥**
ఏతద్యోనీని, భూతాని, సర్వాణి, ఇతి, ఉపధారయ,
అహమ్, కృత్స్నస్య, జగతః, ప్రభవః, ప్రలయః, తథా ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వాణి భూతాని | = | సమస్తప్రాణులు | ప్రలయః | = | ప్రళయమూ కూడా నావల్లనే జరుగుతోంది |
| ఏతద్యోనీని | = | నానుంచే పుడుతున్నాయి | ఇతి, ఉపధారయ | = | అని తెలిసికొనుము |
| అహమ్ | = | నేను | | | |
| కృత్స్నస్య, జగతః | = | సమస్త జగత్తునకు | | | |
| ప్రభవః | = | పుట్టుక స్థానమును | | | |
| తథా | = | అదే విధముగా | | | |

**సర్వాణి భూతాని ఏతత్ యోనీని ఇతి, ఉపధారయ ।**
**అహమ్ కృత్స్నస్య జగతః ప్రభవః తథా ప్రలయః (అస్మి) ॥**

తా: సమస్తప్రాణులు నానుంచే పుడుతున్నాయి. నేను సమస్త జగత్తునకు పుట్టుక స్థానమును. అదే విధముగా ప్రళయమూ కూడా నావల్లనే జరుగుతోంది అని తెలిసికొనుము.

సృష్టి రెండు దశల్లో జరిగిందనీ, ముందు సూక్ష్మస్థాయిలో జరిగిందనీ ముందు శ్లోకాల్లో చూశాము. భిన్నా అష్టధా ప్రకృతి అని వచ్చింది. సూక్ష్మపంచభూతాలు, అవ్యక్తం, మహత్, అహంకారం పుట్టాయని చూశాము. అంటే విత్తనంనుంచి మొక్క వచ్చినట్టన్నమాట.

ఇప్పుడు రెండో దశ చూడబోతున్నాము. మొక్క రెండో దశలో ఎలా పెద్ద వృక్షంగా అవుతుందో అలా స్థూలప్రపంచం అంతా వస్తుంది. సూక్ష్మపంచభూతాలనుంచి స్థూలపంచభూతాలు వస్తాయి. ఏమిటవి? ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథివీ. ఇవి భూతాలు కాబట్టి, వీటినుంచి వచ్చినవాటిని భౌతికం అంటారు. దానికి గొప్ప ఉదాహరణ మన శరీరమే.

మన శరీరంలో ఘనపదార్థం పృథివీతత్త్వం. శరీరంలో నీరు ఉంది. నిజానికి నీటి వల్లనే మన శరీరానికి ఒక ఆకారం వస్తుంది. అది జలతత్త్వం. మన శరీర ఉష్ణోగ్రత ఎప్పుడూ సమానంగా ఉంటుంది. వాతావరణంలో ఒక డిగ్రీ ఉన్న కైలాసపర్వతానికో, వేరే చలి ప్రదేశానికో వెళ్ళినా కూడా మనలో ఉష్ణోగ్రత మారదు. దీన్ని అగ్నితత్త్వం అంటారు. మనం తీసుకునే ఊపిరి వాయుతత్త్వం; ఆకాశం అంటే ఖాళీ ప్రదేశం. శరీరంలో ఉండే ఖాళీ ప్రదేశం ఆకాశతత్త్వం. అందువల్ల శరీరాన్ని భౌతికం అంటారు.

**సర్వాణి భూతాని** – మన కంటికి కనపడని అతి చిన్నక్రిములనుంచి, బుద్ధిజీవి అయిన మనిషి వరకూ సృష్టించబడ్డాయి. ఇంకో విధంగా చెప్పాలంటే భూత, భౌతికప్రపంచం వచ్చింది. ఎలా?

**ఏతద్యోనీని** – నానుంచే వచ్చింది. ఏతత్ అంటే పరాప్రకృతి అపరాప్రకృతుల సమ్మేళనం; యోని అంటే మూలం. అంటే పరా–అపరా ప్రకృతుల సమ్మేళనం ఈ జగత్కారణం. ఈ పరా–అపరా ప్రకృతుల సమ్మేళనాన్ని భగవంతుడు అంటారు.

అందువల్ల భగవంతుడే జగత్తు అయ్యాడు. భక్తిలో మూడవ దశను పరిచయం చేస్తున్నాడు కృష్ణపరమాత్మ. భక్తిని మూడు దశలుగా వర్ణిస్తారు. అవి ఏకరూపభక్తి, అనేకరూపభక్తి, అరూపభక్తి.

**ఏకరూపభక్తి** – ఇది ప్రారంభదశలో మనిషికి దైవంమీద భక్తి శ్రద్ధలు ఏర్పడటానికి ఒక రూపంలో చూపిస్తారు. అలా కొంతమంది విష్ణుమూర్తిని కొలిస్తే, కొంతమంది ఈశ్వరుణ్ణి కొలుస్తారు. విష్ణుమూర్తి అనంతశయుడు, పాలకడలిలో నిదురిస్తాడు. ఇలాంటి వర్ణనలు వస్తాయి. అలాగే శివుడు కైలాసంలో ఉంటాడు అంటారు. ఈ ఏకరూపభక్తివల్ల చిన్న ప్రమాదం లేకపోలేదు. ఒక దేవుణ్ణే గాఢంగా నమ్మినవారు ఇంకొక దేవుణ్ణి నమ్మరు. అంతేకాదు ఈ దశలో దేవుడు ఎక్కడో కూర్చుని, మనలను మట్టిముద్దలుగా చేసి, ఈ లోకంలోకి విసిరేస్తున్నాడు అనుకుంటారు.

**అనేకరూపభక్తి** – అనేకరూపభక్తి అంటే అనేకమంది దేవతలను కొలవటం కాదు. భక్తి పరాకాష్ట అది. జగత్తంతటిలో భగవంతుణ్ణి చూస్తాడు. చెట్టులో, పుట్టలో, జంతువులలో అన్నింటిలోనూ చూస్తాడు. మనకు విశ్వరూపదర్శనం ఉంది. విష్ణుమూర్తికి సూర్యచంద్రులు కళ్ళు అంటారు అందులో. అది అనేకరూపభక్తికి నిదర్శనం.

**అరూపభక్తి** – భగవంతుడు నిర్వికారుడు, నిర్గుణబ్రహ్మ అని తెలుసుకోవటం. అంటే ఏకరూపభక్తినుంచి, అనేకరూపభక్తికి వచ్చి, అక్కడే ఆగిపోకుండా అరూపభక్తికి ఎదగాలి. అందరూ ఈ స్థాయికి త్వరగా చేరుకోరు. అందువల్ల ముందే అరూపభక్తి గురించి చెప్పదు మన శాస్త్రం.

ఇక్కడ కృష్ణపరమాత్మ అరూపభక్తి గురించి చెపుతున్నాడు.

**సర్వాణి ఇతి ఉపధారయ** – ప్రతిదీ నా వ్యక్తరూపంగా తెలుసుకుని, జీర్ణించుకో! ఉపధారయ అంటే నేర్చుకున్న దాన్ని జీర్ణించుకోవటం.

భగవంతుడు సృష్టికారకుడే కాదు, ప్రళయకారకుడు కూడా.

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్తనిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥** – 2.28

ప్రతిదీ అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వస్తుంది, మళ్ళీ వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. అంటే భగవంతుడు సృష్టి–స్థితి–లయకారకుడు.

సృష్టి ఎప్పుడు మొదలయింది? సృష్టి ఒక సరళరేఖలా సాగితే, దాని మొదటి భాగాన్ని మొదటి సృష్టి అనవచ్చు. కాని సృష్టిని వృత్తంతో పోలుస్తారు. ఆ వృత్తానికి తుది, మొదలు ఉండవు – అలా సృష్టి జరుగుతూనే ఉంటుంది. మనం పునరపి జననం, పునరపి మరణం అనే వృత్తంలో పడి కొట్టుమిట్టాడుతూనే ఉంటాము. అలా తిరగకుండా ఉండాలంటే, ఆ వృత్తంనుంచి బయటపడాలి. అలా బయటపడటాన్నే మోక్షం అంటారు.

రంగులరాట్నం చూడగానే ఉత్సాహంగా ఎక్కుతాము. కాసేపు సరదాగా ఉంటుంది కాని అది అలా ఆగకుండా తిరుగుతూనే ఉంటే? ఆనందం కాస్తా దుఃఖంగా మారుతుంది. దాన్ని ఆపే మనిషి లేడు అన్నారనుకోండి, అక్కడ్నుంచి దూకటం తప్ప వేరే మార్గం లేదు.

**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయస్తథా** – ఈ జగత్తుయొక్క ప్రభవమూ, ప్రళయమూ కూడా నా వల్లనే జరుగుతున్నాయి. ప్రభవం అంటే పుట్టటం. అంటే సృష్టి. ప్రళయకారకుడిని కూడా నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. శాస్త్రం దీనికి మన స్వప్నదృష్టాంతం ఇస్తుంది. మన స్వప్నప్రపంచాన్ని మనమే సృష్టిస్తాము, ఒక స్వప్నం కాల పరిమితి ఒకటిన్నర నిముషాలు మాత్రమే అంటారు. కాని అందులో మన కాలం, మన ప్రదేశం వేరేగా ఉంటాయి. ఆ ఒకటిన్నర నిముషంలోనే మనం పెళ్ళి చేసుకుని, పిల్లల్ని, మనవళ్ళనీ కూడా కంటాము. దూరతీరాలకు వెళ్ళివస్తాము. కాని ఆ స్వప్నంనుంచి మనం లేస్తే ఏమవుతుంది? అది మనలో లయమయిపోతుంది. అంటే మన స్వప్నప్రపంచానికి మనమే సృష్టి–స్థితి–లయకారకులం. అలాగే ఈ జాగ్రద్ ప్రపంచానికి భగవంతుడే సృష్టి–స్థితి–లయకారకుడు.

శ్లో. 7 **మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥**
మత్తః, పరతరమ్, న, అన్యత్, కించిత్, అస్తి, ధనంజయ,
మయి, సర్వమ్, ఇదమ్, ప్రోతమ్, సూత్రే, మణిగణాః, ఇవ ॥

| | | | |
|---|---|---|---|
| ధనంజయ! | = ఓ ధనంజయా! | ఇదమ్, సర్వమ్ | = ఈ సంపూర్ణ జగత్తు |
| మత్తః | = నాకంటెను | సూత్రే | = సూత్రము నందు |
| అన్యత్, కించిత్ | = వేరైనదేదియును | మణిగణాః, ఇవ | = మణుల వలె |
| పరతరమ్ | = పరమ కారణమైనది | మయి | = నాయందు |
| న, అస్తి | = లేదు | ప్రోతమ్ | = కూర్చబడినది |

**హే ధనంజయ! మత్తః పరతరమ్ అన్యత్ కించిత్ న అస్తి ।**
**సూత్రే మణిగణాః ఇవ ఇదమ్ సర్వమ్ మయి ప్రోతమ్ ॥**

తా: ఓ ధనంజయా! నాకంటెను వేరైనదేదియును పరమ కారణమైనది లేదు. ఈ సంపూర్ణ జగత్తు సూత్రము నందు మణుల వలె నాయందు కూర్చబడినది.

మామూలుగా సృష్టిని మనం పరిశీలిస్తే, ఒక సూత్రాన్ని గమనిస్తాము. ఏమిటది? ప్రతి కార్యానికీ ఒక కారణం ఉంటుంది అని తెలుసు మనకు. ఉదాహరణకు కుండ అనే కార్యానికి మట్టి ఒక కారణం. మన జన్మనే తీసుకుంటే మనం కార్యం, మన తల్లిదండ్రులు కారణం. కాని ఆ కారణం మూలకారణం కాదు. వెనక్కి వెళితే వారికి కారణం, వారి తల్లిదండ్రులు; ఆ తల్లిదండ్రులకు కారణం వారి తల్లిదండ్రులు. అలా వంశవృక్షం వెతుక్కుంటూ పోవాలి.

అలా ప్రతి కారణానికీ, ఇంకో కారణం ఉంటే, జగత్కారణమైన భగవంతుని సృష్టికి కారణం ఎవరు? భగవంతుడు చెపుతున్నాడు నాకు కారణం ఎవరూ లేరు. నేను కారణం లేని కారణాన్ని. అందువల్లనే పరాప్రకృతి అనాది అనీ, అపరాప్రకృతి అనాది అనీ చూశాము. అనాది అంటే ఆది లేనిది. ఈ రెండింటి సమ్మేళనమే భగవంతుడు అని కూడా చూశాము.

భక్తుల పాటల్లో తమిళంలో ఒక అద్భుతమైన పాట ఉంది. ఆ పాట అర్థం, ఓ శివా! నువ్వు జీవితంలో ఇన్ని కష్టాలు పడ్డావు, నీకు తల్లిదండ్రులు ఉండి ఉంటే, నువ్వింత కష్టాలు పడేవాడివా, నిన్ను వారు అక్కున చేర్చుకుని ఉండరూ అని. భగవంతునిమీద భక్తిలో ఇదొక కోణం. ఇందులో మనకు పనికివచ్చే అంశం – ఆయన కారణం లేని కారణం, ఆయనకు తల్లిదండ్రులు లేరు.

**మత్తః అన్యత్ కించిత్ న అస్తి పరతరమ్** – నాకంటే, పరమకారణమైనది ఏదీ లేదు. నేనే మూలకారణాన్ని. నాకు ఇంకో మూలకారణం లేదు.

రెండవ పాదంలో ఒక ముఖ్యమైన సూత్రాన్ని చెపుతున్నాడు. అన్నీ అద్భుతమైన వేదాంత సిద్ధాంతాలు. దాన్ని చూసేముందు, ఒక ఉదాహరణ చూడాలి. ఉపాదాన కారణం, ఆ వస్తువు అంతటా ఉంటుంది. కుండకు మట్టి ఉపాదాన కారణం. మట్టి లేకుండా కుండ ఉంటుందా? లేదు. నిజానికి మనం మట్టికుండ అంటాము కాని కుండగా కనబడుతున్న మట్టి అనాలి. అలాగే ఆభరణం. బంగారం లేకుండా ఆభరణం ఉంటుందా? ఒకవేళ

ఉంటుంది అని ఎవరైనా అంటే, అయితే బంగారాన్ని నాకు ఇచ్చేసి, మీ ఆభరణాన్ని పట్టుకుపొండి అంటాము. అది సాధ్యమా? కాదు.

అదే విధంగా భగవంతుడు జగత్తుకు ఉపాదాన కారణం అయితే ఆయన ఎక్కడ ఉంటాడు? జగత్తు అంతటా ఉంటాడు. ఆయన జగత్తులో అధిష్ఠానదేవతగా, అంతర్యామిగా ఉంటాడు. ఇక్కడ కృష్ణపరమాత్మే ఒక ఉదాహరణ ఇస్తున్నాడు.

**సూత్రే మణిగణా ఇవ** – ఒక ముత్యాలమాలను తీసుకుంటే ఆ ముత్యాలన్నిటినీ కలుపుతూ ఒక దారం ఉంటుంది, దాన్ని సూత్రం అంటారు. మణులకు ఉన్న సూత్రంలో అన్ని మణులనూ కూర్చినట్టు;

**మయి సర్వమిదం ప్రోతమ్** – ఈ జగత్తనే మణిమాలకు నేనే సూత్రాన్ని. కనబడే మణులలో కనబడకుండా సూత్రం ఉంటుంది. అలాగే కనబడే జగత్తు అంతటా కనబడకుండా భగవంతుడనే సూత్రం ఉంటాడు. అందువల్ల ఎవరైనా దేవుడు ఎక్కడ ఉన్నాడు అని అడిగితే, దానికి జవాబు చెప్పకుండా, ఎదురు ప్రశ్నించాలి, 'దేవుడు ఎక్కడ లేడు?' భగవంతునికి ఇంకొక పేరు సూత్రాత్మ. అన్ని జీవుల్లోనూ సూత్రంగా ఉంటాడు.

శ్లో. 8 **రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥**
రసః, అహమ్, అప్సు, కౌంతేయ, ప్రభా, అస్మి, శశిసూర్యయోః,
ప్రణవః, సర్వవేదేషు, శబ్దః, ఖే, పౌరుషమ్, నృషు ॥

| | | | |
|---|---|---|---|
| కౌంతేయ! | = ఓ అర్జునా! | ప్రణవః | = ఓంకారమును |
| అహమ్ | = నేను | ఖే | = ఆకాశమునందు |
| అప్సు | = నీటియందు | శబ్దః | = శబ్దమును |
| రసః | = రసతన్మాత్రను | నృషు | = మానవులయందు |
| శశిసూర్యయోః | = సూర్యచంద్రులయందు | పౌరుషమ్ | = పౌరుషమును |
| ప్రభా | = ప్రకాశమును | అస్మి | = అయియున్నాను |
| సర్వవేదేషు | = వేదములన్నింటియందును | | |

**హే కౌంతేయ! అహమ్ అప్సు రసః, శశి–సూర్యయోః ప్రభా,**
**సర్వ–వేదేషు ప్రణవః, ఖే శబ్దః నృషు పౌరుషమ్ అస్మి ॥**

తా: ఓ అర్జునా! నేను నీటియందు రసతన్మాత్రను, సూర్యచంద్రులయందు ప్రకాశమును, వేదములన్నింటియందును ఓంకారమును, ఆకాశమునందు శబ్దమును, మానవులయందు పౌరుషమును అయియున్నాను.

ఈ శ్లోకంలో అనేకరూప ఈశ్వరుణ్ణి వర్ణిస్తున్నాడు. అనేకరూప ఈశ్వరుణ్ణి విశ్వరూప ఈశ్వరుడు అని కూడా అంటారు. ఏకరూప ఈశ్వరునిలో భగవంతుణ్ణి ఒక రూపంలో కొలుస్తామని చూశాము. ఇప్పుడు గీతాబోధ

చేస్తున్న కృష్ణపరమాత్మను గోపికలు ఏకరూప ఈశ్వరునిగా కొలిచారు. వారు కృష్ణుడు కనపడక పోతే విరహగీతాలు పాడారు. కాకపోతే మన ఏడుపుకూ, వారి బాధకూ వ్యత్యాసం ఉంది. వారు సుస్వరరాగంలో దుఃఖించారుట. మృదుమధురంగా ఉందిట అది. మళ్ళీ కృష్ణుడు కనిపించగానే ఆనందంతో పొంగి పోయారుట.

అందువల్ల ఇప్పుడు మనను ఒక మెట్టు ఎక్కిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఏకరూప ఈశ్వరుని స్థాయినుంచి విశ్వరూప ఈశ్వరుని స్థాయికి రమ్మంటున్నాడు. మనం శివభక్తులమయితే సర్వం శివమయం జగత్తు అని తెలుసుకుంటాము; విష్ణుభక్తులమయితే సర్వం విష్ణుమయం జగత్తు అని తెలుసుకుంటాము. జీవుడు, జగత్తు ఈశ్వరునికి భిన్నంగా లేరు అని నిరూపిస్తున్నాడు.

మన ప్రార్థనలో తన్ మన్ ధన్ సబ్‌కుచ్ తేరా అని పాడతాము. అది పాడటం వరకే! నిజంగా ఆర్తితో అనము. శరీరం, మనస్సు, ధనం అన్నీ నీవే. ఎందుకు? భగవంతునికి భిన్నంగా ఏదీలేదు. ఇదీ ఈ శ్లోకాల సారం. తాను సూత్రాత్మగా అంతటా ఉన్నానని చెప్పాడు ముందు శ్లోకంలో. అదే విషయాన్ని ఇక్కడ వివరిస్తున్నాడు.

ఎందుకు వివరిస్తున్నాడు? ఆయన చెప్పిన అంశాన్ని సరిగ్గా అర్థం చేసుకోవటానికి, అర్థం చేసుకున్నాక మన భక్తిలో మార్పు తీసుకురావటానికి. ఎవరిమీదైనా గౌరవం ఏర్పడాలంటే వారి గొప్పదనం గురించి తెలియాలి. ఏమీ తెలియకపోతే వారిమీద రాగమూ ఉండదు, ద్వేషమూ ఉండదు. ఉదాసీన భావన మిగులుతుంది. అందువల్ల భక్తి ఏర్పడాలంటే జ్ఞానం కావాలి. జగత్తును ఉన్నదున్నట్టుగా చూస్తే దానిమీద రాగమో ద్వేషమో ఏర్పడుతుంది.

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**
**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

జగత్తును భగవంతుని విశ్వరూపదర్శనంగా భావిస్తే, దానిమీద పూజ్యభావం ఏర్పడుతుంది. మన ధర్మం గొప్పదనం అదే. అటువంటి పూజ్యభావం ఏర్పడటానికి తోడ్పడుతుంది.

రుద్రం దానికి గొప్ప ఉదాహరణ. రుద్రం విశ్వరూప దర్శనం. నా నమస్కారములు శివునికి. శివుడు ఎక్కడ ఉన్నాడు? మట్టిలో, ఆకులో ఉన్నాడు. ఆకులో కూడా లేతాకులోనూ, ఎండుటాకులోనూ ఉన్నాడు. అంతేకాదు, పొట్టివాటిల్లోనూ, పెద్దవస్తువుల్లోనూ, వర్షంలోనూ ఉన్నాడు. అలా అనంతంగా సాగుతుంది. దాని ఉద్దేశ్యంలో జగత్తులో ప్రతిదానిని పూజ్యభావంతో చూడాలని. పొద్దున్న సూర్యోదయం సమయంలో, సూర్యుణ్ణి ఉదయిస్తున్న బంతిలాగా చూడకుండా, సూర్యభగవానునిగా చూడండి. సూర్యుడు అపరాప్రకృతిలోకి వస్తాడు.

**అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రు స్సుమంగలః – రుద్రం**

రుద్రునికి నేను నమస్కారం చేస్తున్నాను. ఎరుపు, పసుపు, తెలుపు రంగులు మారుతున్న సూర్యునికి నేను ప్రతిదశలోనూ రుద్రునిలా భావించి నమస్కారం చేస్తున్నాను.

విశ్వరూప ఈశ్వరజ్ఞానం తేలికగా పొందవచ్చు కాని, మన దృక్పథంలో మార్పు తొందరగా రాదు. మన ఆహారం తినటం నిముషాల్లో ముగించినా, అది జీర్ణం కావటానికి గంటలు పడుతుంది. ఆ విధంగా మనకు రెండు దశలు ఉన్నాయి. అవి – బోధను అర్థం చేసుకోవటం, దృక్పథంలో మార్పు తెచ్చుకోవటం.

**జగత్తును జగత్తుగా చూస్తే సంసారంలో పడతాము**
**అదే జగత్తును బ్రహ్మగా అర్థం చేసుకుంటే మోక్షం పొందుతాము**

ఇదే సూత్రం ఈశావాస్యోపనిషత్తులో మొట్టమొదటే చూస్తాము.

**ఈశావాస్యమిదగ్ం సర్వం**

ఇక్కడున్నదంతా ఈశ్వరుడే. ప్రపంచాన్ని ఈశ్వరస్వరూపంగా చూడటం నేర్చుకోండి. ప్రపంచాన్ని ఈశ్వరభావన అనే కుంచెతో చిత్రించండి. ఎంత అద్భుతంగా ఉంటుందో చూడండి! ఇటువంటి మార్పు ఎలా రావాలో కృష్ణపరమాత్మ సూచిస్తున్నాడు.

**రసోఽహమప్సు కౌంతేయ** – ఓ అర్జునా! జలంలో రసాన్ని నేనే. నీటిని నీరుగా చూడకు. నీటివల్లనే నీ మనుగడ కొనసాగుతున్నది. రసం అంటే సారం. నీటి అసలు రుచిని సారం అంటారు. అది నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సంధ్యావందనంలో నీటిని ప్రార్థిస్తాము

**ఆపో వా ఇదగ్ం సర్వం విశ్వా భూతాన్యాపః ప్రాణా వా ఆపః పశవ ఆపోఽన్నమాపోఽమృతమాపః**
**సమ్రాడాపో విరాడాపః సర్వడాపశ్ఛందాగ్ంస్యాపో జ్యోతిగ్ంష్యాపో**
**యజూగ్ంష్యాపస్సత్యమాపస్సర్వాదేవత ఆపో భూర్భువస్సువరాప ఓమ్ ।**

ఓ జలమా, నువ్వు కేవలం జలమువు కావు; నువ్వు సాక్షాత్తూ భగవంతుడివి. ఓ భగవంతుడా, నాకు ఆ జ్ఞానం కలిగేలా చెయ్యి, అప్పుడు నేను ఈ జగత్తును ఈశ్వరస్వరూపంగా చూడగలుగుతాను. అది నా అంతిమ లక్ష్యం – ఈశ్వరస్వరూపం తెలుసుకోవటం.

**శశి సూర్యయోః ప్రభా అస్మి** – సూర్యచంద్రుల్లో కాంతిని నేనే. నిజానికి ప్రపంచప్రఖ్యాతి చెందిన గాయత్రీ మంత్రంలో ప్రార్థన సూర్యకాంతిమీద ఉంటుంది. గాయత్రీమంత్రం నాలుగు వేదాల సారం.

**సవితుః వరేణ్యం భర్గః**

భర్గః అంటే ఈ శ్లోకంలో ప్రభగా వచ్చిన కాంతి. భర్గ పదాన్ని అక్షరాలా తీసుకుంటే చీకటిని నాశనం చేసేవాడు అని అర్థం. నేను ఆ కాంతివంతమైన సూర్యోదయాన్ని పూజిస్తున్నాను. అది భగవంతునికి ప్రతిరూపం.

**ధీయోయోనః ప్రచోదయాత్**

ఆ చైతన్యమే జడమైన నా మనస్సును జ్ఞానం పొందే ప్రమాణంగా చేస్తుంది. అలా సూర్యచంద్రుల కాంతిలో ఉన్నది భగవంతుడే.

**ప్రణవః సర్వవేదేషు** – వేదాల్లో నేను ఓంకారాన్ని. ప్రణవం అంటే ఓంకారం. ఓంకారం కూడా వేదాల సారం. వేదాల సారం మూడు దశల్లో వస్తుంది.

| | | | | |
|---|---|---|---|---|
| **నాలుగు వేదాల సారం** | **– గాయత్రీమంత్రం** | | | |
| **గాయత్రీమంత్రం సారం** | **– వ్యాహృతులు** | **– భూః, భువః, సువః** | | |
| **వ్యాహృతుల సారం** | **– అ, ఉ, మ** | **– అ+ఉ+మ** | **=** | **ఓం** |

అందువల్ల ఓంకారం వేదాల సారం.

**శబ్దః ఖే** – ఆకాశంలో శబ్దాన్ని నేను. పృథివిలో శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను అనుభవించగలిగితే, ఆకాశంలో శబ్దం ఒక్కటే ఉంది. సర్వవ్యాపకమైన ఆకాశం శబ్దతత్త్వం. నేను ఆ శబ్దతత్త్వాన్ని అంటే శబ్దబ్రహ్మను.

**శబ్దబ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ**
**నిత్యానందమయీ నిరంజనమయీ తత్త్వంమయీ చిన్మయీ**
**తత్త్వాతీతమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ**
**సర్వైశ్వరమయీ సదాశివమయీ మాం పాహి మీనాంబికే**

నువ్వు శబ్దబ్రహ్మవు.

**పౌరుషం నృషు** – పురుషులలో పౌరుషాన్ని నేను. మనిషిని మనిషిగా నిలబెట్టే పౌరుషాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 9 **పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥**
పుణ్యః, గంధః ప్రథివ్యామ్, చ, తేజః, చ, అస్మి, విభావసౌ,
జీవనమ్, సర్వభూతేషు, తపః, చ, అస్మి, తపస్విషు ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| పృథివ్యామ్ | = పృథ్వియందు | | సర్వభూతేషు | = సమస్తప్రాణులయందును |
| పుణ్యః, గంధః | = పవిత్రమైన గంధతన్మాత్రను | | జీవనమ్ | = జీవశక్తిని (చైతన్యమును) |
| చ | = ఇంకా | | చ | = ఇంకా |
| విభావసౌ | = అగ్నియందు | | తపస్విషు | = తాపసులయందు |
| తేజః | = తేజస్సును | | తపః | = తపస్సును |
| అస్మి | = అయియున్నాను | | అస్మి | = అయియున్నాను |
| చ | = ఇంకా | | | |

**చ పృథివ్యామ్ పుణ్యః గంధ, విభావసౌ చ తేజః అస్మి,**
**సర్వ–భూతేషు జీవనమ్, తపస్విషు చ తపః అస్మి ॥**

తా: పృథ్వియందు పవిత్రమైన గంధతన్మాత్రను ఇంకా అగ్నియందు తేజస్సును అయియున్నాను. ఇంకా సమస్తప్రాణులయందును జీవశక్తిని (చైతన్యమును) ఇంకా తాపసులయందు తపస్సును అయియున్నాను.

ఇంకా తన పట్టికను కొనసాగిస్తున్నాడు కృష్ణపరమాత్మ.

**చ** – ఇంకా;

**పుణ్యః గంధః పృథివ్యామ్** – పృథివిలో ఉన్న సువాసనను నేను. పృథివిలో శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను అనుభవిస్తామని చూశాము. కాని గంధం విషయం తీసుకుంటే ఒక్క పృథివికే గంధం ఉంది. దాని తర్వాత నీరుకు శబ్ద, స్పర్శ, రూప, రసాలు మాత్రమే ఉంటాయి. నీటికి కూడా వాసన వస్తుంది అని మీరంటే అది స్వచ్ఛమైన నీరు కాదు, దానిలో ఏదో కలిసింది.

పృథివిలో సుగంధాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. జాగ్రత్తగా పుణ్యః గంధః పదాన్ని వేశాడు. ఎందుకంటే, రెండు రకాల వాసనలు ఉంటాయి. అవి సుగంధం, దుర్గంధం. సుగంధం ఎందుకంటే మట్టికి స్వతహాగా మంచివాసన ఉంది. ఎండాకాలంలో ఎండలు చెలరేగాక, ఒకరోజు తొలకరిజల్లు కురిస్తే, ఆ వానతో తడిసిన మట్టి వాసన చాలా బాగుంటుంది.

**అస్మి తేజః విభావసౌ** – అగ్నిలో తేజస్సును నేను. అగ్నికి రెండు లక్షణాలు ఉన్నాయి. అవి కాంతి, వేడి. మామూలుగా తేజస్సు అంటే కాంతి. కాని ఇక్కడ వేడిగా తీసుకోవాలి. అగ్నిలో అగ్నితత్త్వాన్ని నేను. ఎందుకంటే ఎర్రటికాంతి ప్రతిసారీ తెలియదు. వేడినీళ్ళలో వేడి తెలుస్తుంది కాని కాంతి తెలియదు. అందువల్ల అగ్నిస్వరూపమైన వేడిని నేను.

**జీవనం సర్వభూతేషు** – అన్ని ప్రాణులలోనూ జీవశక్తిని నేను. ప్రాణం ఉంటే ఒక వ్యక్తి శివం అవుతాడు, ప్రాణం పోతే శవం అవుతాడు. ఆ జీవశక్తిని నేను.

**దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః**

మన మతం గొప్పదనం అదే – అన్ని జీవరాసులనూ గౌరవించమంటుంది. జంతువులలో, చెట్లలో కూడా ప్రాణశక్తి ఉంది. వాటిని రక్షించండి అంటుంది. పర్యావరణం సంక్షేమం కోరుతుంది మన మతం. ఇప్పుడు అన్నింటిలోనూ భగవంతుడు ఉన్నాడని చూశాము.

**తపస్విషు తపశ్చాస్మి** – తాపసులలో తపస్సును నేనే. ముందు శ్లోకంలో మొత్తం మానవజాతిలో పౌరుషం నేను అన్నాడు. ఇప్పుడు మానవజాతిలో ఉన్నతంగా ఎదిగిన ఋషులను తీసుకున్నాడు. తపస్సు చేసి వారు గొప్ప ఋషులు అయ్యారు. వారిలో ఉన్న తపశ్శక్తిని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ రెండు శ్లోకాలనూ గమనిస్తే, కృష్ణపరమాత్మ పంచభూతాలనూ వర్ణించాడు – పృథివీ, జలం, అగ్ని, ఆకాశం గురించి చెప్పాడు. వాయువును మనం కలుపుకోవాలి. పంచభూతాలను మనం దేవునిగా కొలుస్తాము. అందువల్లనే వీటికి ప్రతీకగా మనకు ఐదు శివాలయాలు ఉన్నాయి. అవి – చిదంబరంలో ఆకాశలింగం;

కాళహస్తిలో వాయులింగం; తిరువన్నామలైలో అగ్నిలింగం; జంబుకేశ్వరంలో జలలింగం; కాంచీపురంలో పృథివీ లింగం ఉన్నాయి. దీని అర్థం పంచభూతాలను ఈశ్వరరూపంలో ధ్యానిస్తాము అని. ఈ శ్లోకాలు మనలో మార్పు రావటానికి ఉపయోగపడతాయి.

శ్లో. 10 **బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।**
**బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్ ॥**
బీజమ్, మామ్, సర్వభూతానామ్, విద్ధి, పార్థ, సనాతనమ్,
బుద్ధిః, బుద్ధిమతామ్, అస్మి, తేజః, తేజస్వినామ్, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ పార్థా! | అహమ్ | = నేను |
| సర్వభూతానామ్ | = సమస్త భూతములకును | బుద్ధిమతామ్ | = ప్రజ్ఞావంతులలో |
| సనాతనమ్ | = శాశ్వతమైన | బుద్ధిః | = ప్రజ్ఞను |
| బీజమ్ | = బీజముగా | తేజస్వినామ్ | = తేజోవంతులలో |
| మామ్ | = నన్ను | తేజః | = తేజస్సును |
| విద్ధి | = తెలుసుకొనుము | అస్మి | = అయియున్నాను |

**హే పార్థ! మామ్ సర్వ-భూతానామ్ సనాతనమ్ బీజమ్ విద్ధి,**
**అహమ్ బుద్ధిమతామ్ బుద్ధిః అస్మి, తేజస్వినామ్ తేజః ॥**

తా: ఓ పార్థా! సమస్త భూతములకును శాశ్వతమైన బీజముగా నన్ను తెలుసుకొనుము. నేను ప్రజ్ఞావంతులలో ప్రజ్ఞను, తేజోవంతులలో తేజస్సును అయియున్నాను.

**బుద్ధిర్బుద్ధిమతామస్మి** – ప్రజ్ఞావంతులలో ప్రజ్ఞను నేను. కొంతమంది గొప్ప ప్రతిభావంతులు ఉంటారు. వారు తెలివితేటలవల్ల అంత గొప్పవారయ్యారు. వారికి ఈ తెలివితేటలు ఎక్కడివి? అవి భగవంతునివి. అగ్నిలో అగ్నితత్త్వం ఎలా భగవంతుడో, అలా ప్రజ్ఞావంతులలో ప్రజ్ఞ భగవంతుడు.

**తేజస్తేజస్వినామహమ్** – తేజోవంతులలో తేజస్సు నేను. ధైర్యవంతులు ఎటువంటి ఆటంకం వచ్చినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతారు. వారు దేనికీ జంకరు. ఏదేమైనా అనుకున్నది సాధిస్తారు. దాన్ని పరాక్రమం అంటారు. పరా అంటే ఏదైనా ఆటంకం; ఆక్రమం అంటే అధిగమించటం. పరాక్రమం అంటే ఏదైనా ఆటంకం కలిగినా, దాన్ని అధిగమించగలగటం. ఈ ధైర్యాన్ని తేజస్సు అంటారు. ఈ ధైర్యవంతులలో పరాక్రమాన్ని నేను.

వీటన్నిటినుంచీ ఒక ఉపసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలి మనం. అంతటా భగవంతుడు ఉన్నాడు కాబట్టి మనలో ఏదైనా గొప్ప లక్షణం ఉంటే – తపశ్శక్తి, బుద్ధిబలం, తేజస్సులాంటివి – అవి మన గొప్పతనం కాదు. అవి భగవంతునియొక్క వ్యక్తరూపం అని తెలుసుకోవాలి. అందువల్ల మనం ఏదైనా సాధిస్తే, అది మన గొప్పతనం కాదు, భగవంతునికే చెందాలి అని గ్రహిస్తాము. భగవంతుని గురించి తెలిసిన కొద్దీ, మనలో వినయం

పెరుగుతుంది. జ్ఞానంవల్ల ఏర్పడిన వినయం పదికాలాలపాటు ఉంటుంది. సరిగ్గా అర్థం చేసుకోకుండా వినయం చూపిస్తే అది కేవలం బాహ్యప్రదర్శన మాత్రమే అవుతుంది. అంతర్గతంగా మనం పొగరుగా ఉండవచ్చు కూడా.

మనలో ఉన్న శక్తి భగవంతునివల్లనే వచ్చిందని నిరూపించటానికి కేనోపనిషత్తులో ఒక కథరూపంలో అద్భుతంగా చెప్పబడింది. ఇది దేవతల గర్వభంగం గురించిన కథ. దేవతలకు, అసురులకు మధ్య తరచు యుద్ధాలు జరుగుతుంటాయి. ఎక్కువగా దేవతలే గెలుస్తుంటారు. అలాంటి ఒక సందర్భంలో అనుకోకుండా వారికి గర్వం వచ్చింది. తమవల్లే విజయం సాధించాము అని ఇంద్రుడు, అగ్ని, వాయువు మురిసిపోతున్నారు.

ఈశ్వరుడు వారికి గర్వభంగం చెయ్యాలనుకున్నాడు. భగవంతుడు ఒక యక్షునిరూపంలో వారికి కనీకనపడకుండా ప్రత్యక్షమయ్యాడు. సరిగ్గా కనపడకపోవటంవల్ల ఎవరో తెలుసుకోమని అగ్నిని పంపారు ముందు. అగ్నిని జాతవేద అంటారు. అంటే సృష్టించబడిన ప్రతిదీ తెలిసినవాడు అని అర్థం. అతను యక్షుని దగ్గరకు వెళితే, అతను ప్రశ్నించేలోపే యక్షుడు, 'ఎవరు నువ్వు? నీలో ఏ శక్తి ఉంది?' అన్నాడు.

**ఇదగ్ంఁ సర్వం దహేయం యదిదం పృథివ్యామితి** – కేన 3.5

అన్నాడు అగ్ని. నేను అగ్నిని, భూమిమీద ఉన్నదేన్నైనా కాల్చి బూడిద చెయ్యగలను అని ధీమాగా పలికాడు. 'అదంతా అవసరం లేదు, ఒక చిన్న ఎండు గడ్డిపోచను నీ ముందు పెడతాను. దానిని దహించు,' అన్నాడు యక్షుడు. దానిని దహించటం మాట దేవుడెరుగు, దాని మూలను కూడా కాల్చలేకపోయాడు. ఇప్పుడు వాయువు వంతు వచ్చింది.

**ఇదగ్ంఁ సర్వమాదదీయ యదిదం పృథివ్యామితి** – కేన 3.9

అన్నాడు వాయువు. అతన్ని మాతరిశ్వుడు అంటారు. మాతరిశ్వుడు అంటే ఆకాశంలో యథేచ్ఛగా సంచరించేవాడు అని అర్థం. భూమ్మీద ఉన్న దేన్నైనా పైకి లేపగలను అన్నాడు. ఈ గడ్డిపోచను లేపు చూద్దాం అన్నాడు యక్షుడు. వాయువు దాన్ని కొంచెం కూడా లేపలేకపోయాడు.

దానివల్ల అగ్నికి, వాయువుకు వారిశక్తి వారిలో స్వతఃహాగా లేదు. భగవంతుని కృపవల్ల వచ్చిందని తెలిసింది. అదే విషయాన్ని ఇంద్రునికి ఉమాదేవిగా ప్రత్యక్షమైన ఈశ్వరుడు చెప్పాడు.

**బ్రహ్మణో వా ఏతద్విజయే మహీయధ్వమితి** – కేన 4.1

మీ విజయానికి కారణం బ్రహ్మే కాని అదంతా మీగొప్పే అనుకున్నారు అని ఉమాదేవి చెప్పింది.

ఈ కథవల్ల మనం జీవితంలో ఏం సాధించినా, అది భగవంతునికే చెందుతుందని అర్థం చేసుకుని, వినయం పెంచుకుంటాము. అలా పెంచుకోవటానికి మన పురాణాల్లో ఎక్కడికక్కడ గర్వభంగ కథలు ఉన్నాయి. నారద గర్వభంగం; అర్జున గర్వభంగం; సత్యభామ గర్వభంగం – అలా ఎన్నో! ఈశ్వరుణ్ణి అర్థం చేసుకుంటే వినయం, అర్థం చేసుకోకపోతే గర్వం వస్తుంది – ఇది ఒక సూత్రం.

ఇంకొక సూత్రం – నాలో ఈర్ష్య కూడా పోతుంది. అసలు ఈర్ష్య ఎందుకు వస్తుంది? నేను సాధించలేనిది ఏదో ఎదుటి వ్యక్తి సాధించాడనే న్యూనతాభావనవల్ల వస్తుంది. నాకన్నా ఎక్కువ చదువుకున్నాడనో, నాకన్నా ఆస్తిపరుడనో, నాకన్నా పేరుప్రతిష్ఠలు ఉన్నాయనో అనుకోవటంవల్ల ఈర్ష్య పుడుతుంది. అన్ని శక్తుల వెనక భగవంతుడే ఉన్నాడని తెలుసుకుంటే, నా శక్తి వెనక, ఎదుటివాని శక్తి వెనక కూడా ఆయనే ఉన్నాడు అని అర్థం చేసుకుంటాను. మనం రెండు నీళ్ళగొట్టాలలాంటి వారము. లావుగా ఉన్న నీటిగొట్టంలోంచి నీరు ధారగా పడితే, సన్నగా ఉన్న నీటిగొట్టంలోంచి నీరు సన్నగా పడుతుంది. అంతే తేడా! రెండింటిలోనూ నీరు ఒకటే ట్యాంకునుంచి వస్తోంది. అలాగే నేను బాగా పాడలేకపోయినా, ఎదుటివ్యక్తి బాగా పాడగలిగినా, ఇద్దరి శక్తీ ఒకటే ట్యాంకు అయిన భగవంతునినుంచి వస్తోంది. ఆ విధంగా ఎదుటి వ్యక్తిలోని గొప్పతనాన్ని చూసి ఈర్ష్య పడకుండా, వెళ్ళి అతన్ని మెచ్చుకుంటాను. ఇది రెండవ సూత్రం. ఈశ్వరజ్ఞానంవల్ల నేర్చుకున్న సూత్రాలివి.

**సర్వభూతానాం సనాతనం బీజం విద్ధి** – అన్ని జీవరాశులకు నేను బీజంగా తెలుసుకో అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. నిజానికి ఈ వాక్యం ఈ పట్టిక అంతా ముగించాక, చదువుకోవాలి కాని కృష్ణపరమాత్మ ఇక్కడ వేశాడు. బీజం అంటే మూలకారణం.

మూలకారణం అని ఎందుకు అన్నాడంటే, కారణాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. అవి ఆపేక్షిక కారణం, మూలకారణం. ఉదాహరణకు మన తల్లిదండ్రులు మన పుట్టుకకు ఆపేక్షిక కారణం కాని మూలకారణం కాదు. మూలకారణం అంటే ఏమిటి? అది ఆద్యంతిక కారణం. అదే అన్నింటికీ మూలకారణం కానీ దానికి ఇంకో మూలకారణం లేదు. భగవంతుడు ప్రపంచానికి తండ్రి; అతనికి ఎవరూ తండ్రి కాదు. **మరో కారణం లేని మూలకారణం భగవంతుడు.**

పైగా ఈ కారణం ఎప్పటిది? అనాది కారణం. ఆది అంటే ఆరంభం లేనిది. పిల్లలు అడుగుతూ ఉంటారు, దేవునికి తల్లిదండ్రులు ఎవరని. కాని ఆయనే మూలకారణం. అందువల్ల కృష్ణపరమాత్మ సనాతనం బీజమ్ అన్నాడు. తను అనాది, తను మూలకారణం, మరో కారణం లేని మూలకారణం.

శ్లో. 11 **బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ ।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥**
బలమ్, బలవతామ్, చ, అహమ్, కామరాగవివర్జితమ్,
ధర్మావిరుద్ధః, భూతేషు, కామః, అస్మి, భరతర్షభ ॥

| | | | |
|---|---|---|---|
| భరతర్షభ! | = ఓ అర్జునా! | చ | = ఇంకా |
| అహమ్ | = నేను | భూతేషు | = సమస్త ప్రాణులయందును |
| బలవతామ్ | = బలవంతులలో | ధర్మావిరుద్ధః | = ధర్మమునకు విరుద్ధము కాని (శాస్త్రానుకూలమైన) |
| కామరాగవివర్జితమ్ | = కామరాగ రహితమైన | కామః | = కామమును |
| బలమ్ | = బలమును | అస్మి | = అయియున్నాను |

**అహమ్ చ బలవతామ్ కామ-రాగ-వివర్జితమ్ బలమ్ అస్మి,**
**హే భరతర్షభ! భూతేషు ధర్మ-అవిరుద్ధః కామః (అహమ్ అస్మి) ॥**

తా: ఓ అర్జునా! నేను బలవంతులలో కామరాగరహితమైన బలమును ఇంకా సమస్త ప్రాణులయందును ధర్మమునకు విరుద్ధము కాని (శాస్త్రానుకూలమైన) కామమును అయియున్నాను.

అదే భావన కొనసాగుతోంది.

**భరతర్షభ** – ఇది అర్జునునికి ఉన్న ఇంకొక బిరుదు. భరత అంటే భరతవంశానికి చెందినవాడు; ఋషభ అంటే శ్రేష్ఠుడు; భరతర్షభ అంటే భరతవంశంలో శ్రేష్ఠుడు.

**బలవతామ్ అహం బలమ్ అస్మి** – బలవంతులలో బలాన్ని నేను. కారణం లక్షణాలు ఏకం, నిత్యం, సారం, సత్యం అని వస్తుంది ముండకోపనిషత్తులో. సారం అంటే కార్యం అంతటా ఉంటుంది. కుండకు మట్టి సారం. బలవంతునికి బలం సారం. అది భగవంతుడు.

నిజానికి రెండు రకాల బలాలున్నాయి. అవి సానుకూలశక్తి లేదా ధార్మికశక్తి; ప్రతికూలశక్తి లేదా అధార్మిక శక్తి. ఒకటి మంచిపనులను సాధిస్తే, ఇంకొకటి నాశనం కలుగజేస్తుంది. రాక్షసులకు కూడా బలం ఉంది కాని అది అధార్మికశక్తి. హిరణ్యగర్భుడు, హిరణ్యకశిపుడు, రావణాసురుడిలలో ఉన్న శక్తి అధార్మికశక్తి. దానికి భిన్నంగా రామునిలో, హనుమంతునిలో ఉన్న శక్తి ధార్మికశక్తి.

**కామరాగవివర్జితమ్** – అందువల్ల కృష్ణపరమాత్మ ప్రత్యేకించి చెబుతున్నాడు కామరాగాలు లేని శక్తిని నేను అని. అంటే ధార్మికశక్తి. ధార్మికశక్తిలో స్వార్థం ఉండదు – స్వార్థం ఉన్నచోట, తను పైకి రావటంకోసం, ఇంకొకరిని కిందకి తోయటానికి వెనుకాడదు. కామం అంటే కోరికలు; స్వార్థపూరితమైన కోరికలు; రాగం అంటే బంధం.

కామానికీ, రాగానికీ మధ్య ఉన్న భేదం ఏమిటి? నేను పొందని వస్తువుమీద కోరికను కామం అంటారు. ఉదాహరణకు ఒక వాచీని బజారులో చూశాను. అది కామం. నేను పొందిన వస్తువుమీద బంధాన్ని రాగం అంటారు. ఆ వాచీని నేను కొని తెచ్చుకున్నాను. అప్పుడు కామం, రాగంగా మారింది.

**అప్రాప్త విషయే కామః ప్రాప్త విషయే రాగః**

కొనకముందు కామం, కొన్నాక రాగం. రెండూ ప్రమాదకరమైనవే. ఈ రెండూ లేని బలాన్ని నేను అన్నాడు కృష్ణపరమాత్మ.

**కామః (అస్మి)** – కామాన్ని నేనే అన్నాడు. కోరికలున్న వ్యక్తుల్లో నేను కోరికను అన్నాడు. ముందు పాదంలోనేమో కోరికలతో అశుద్ధం కాని బలాన్ని నేను అన్నాడు. అంటే కోరికను అశుద్ధంగా వర్ణించాడు. ఇప్పుడేమో నేను కోరికను అంటున్నాడు. అంటే అశుద్ధంలో కూడా తను ఉన్నాడా?

బలంలో రెండు రకాలు ఉన్నాయని ఎలా చూశామో, కోరికల్లో కూడా రెండు రకాలున్నాయి – ధార్మికకామం, అధార్మికకామం. నలుగురికి మేలు చేయాలనుకునే కోరిక ధార్మికకామం. అది కూడా కోరిక కిందకే వస్తుంది.

కాని అది మనము ఉన్నతి సాధించటానికి తోడ్పడుతుంది. నిజానికి మోక్షం పొందాలనుకునే కోరిక కూడా ధార్మిక కోరిక కిందే వస్తుంది. ఒకవేళ అది అధార్మిక కోరిక అయితే దాన్ని సాధనచతుష్టయసంపత్తిలో చేర్చరు. అందులో నాలుగవ సంపద ముముక్షుత్వం. ముముక్షుత్వం అంటే మోక్ష ఇచ్ఛ. ఒక్కముక్కలో చెప్పాలంటే, మన ఆంతర ఎదుగుదలకు తోడ్పడేదేదైనా ధార్మిక కోరికే! గీతాబోధ వినాలనే (చదవాలనే) కోరిక కూడా ధార్మిక కోరికే! చివరికి ధనం సంపాదించాలనుకున్నా కూడా ధార్మిక కోరికే, కాకపోతే సంపాదించిన ధనాన్ని ఇనప్పెట్టెలో భద్రంగా బంధించి రోజూ కళ్ళారా చూసుకున్నప్పుడు కాదు, సమాజశ్రేయస్సుకోసం ఖర్చు పెట్టినప్పుడు. అంటే ధన ఇచ్ఛ కూడా ధార్మిక ఇచ్ఛగా మారుతుంది.

**ధనం ధర్మార్థమ్ ధర్మః చిత్తశుద్ధ్యర్థం చిత్తశుద్ధిః జ్ఞానార్థమ్ జ్ఞానం మోక్షార్థమ్** – తైత్తిరీయ శంకరభాష్యం

ధనాన్ని ధర్మంకోసం వాడితే, ధర్మకార్యం మనస్సును శుద్ధి చేస్తుంది; చిత్తశుద్ధి పొందిన వ్యక్తి జ్ఞానయోగ్యతా ప్రాప్తి పొందుతాడు. తద్వారా జ్ఞానం పొందుతాడు. జ్ఞానం మోక్షాన్ని కలుగజేస్తుంది.

**ధర్మావిరుద్ధః (కామః)** – ధర్మానికి విరుద్ధం కాని కామాన్ని నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ఉత్తములలో ఉన్న ఉత్తమమైన కోరికను నేను. ఉత్తములలో అంటే ఎవరు వారు?

**భూతేషు** – మనుష్యులలో, ముఖ్యంగా ధార్మిక పురుషులలో ధార్మిక కోరికను నేను.

శ్లో. 12 **యే చైవ సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ యే ।**
**మత్త ఏవేతి తాన్ విద్ధి న త్వహం తేషు తే మయి ॥**
యే, చ, ఏవ, సాత్త్వికాః, భావాః, రాజసాః, తామసాః, చ, యే,
మత్తః, ఏవ, ఇతి, తాన్, విద్ధి, న, తు, అహమ్, తేషు, తే, మయి ॥

| | | | |
|---|---|---|---|
| యే, చ, ఏవ | = ఏవైతే | విద్ధి | = తెలుసుకొనుము |
| సాత్త్వికాః, భావాః | = సాత్త్వికభావములు గలవో | తు | = అయితే నిజముగా |
| యే, చ, రాజసాః | = రాజసభావములేవి గలవో | తేషు | = ఆ మూడు భావములయందు |
| తామసాః | = తామసభావములేవి గలవో | అహమ్, చ | = నేను గాని |
| తాన్ | = వాటిని | తే | = అవి |
| మత్తః, ఏవ, ఇతి | = నా నుండియే కలుగుచున్న వానినిగా | మయి, చ | = నాయందు గాని |
| | | న | = లేవు (నేను త్రిగుణాతీతుడను) |

**యే చ ఏవ సాత్త్వికాః రాజసాః తామసాః చ భావాః, తే**
**మత్తః ఏవ ఇతి తాన్ విద్ధి, అహం తేషు న (అస్మి), తు తే మయి (వర్తన్తే) ॥**

తా: ఏవైతే సాత్త్వికభావములు గలవో, రాజసభావములేవి గలవో, తామసభావములేవి గలవో వాటిని నానుండియే కలుగుచున్న వానినిగా తెలుసుకొనుము. అయితే నిజముగా ఆ మూడు భావములయందు నేను గాని అవి నాయందు గాని లేవు (నేను త్రిగుణాతీతుడను).

ఇంతవరకూ కృష్ణపరమాత్మ బాహ్యప్రపంచం గురించి చెప్పాడు. అదంతా ఆయన ప్రకటితరూపమే అన్నాడు. ఇప్పుడు బాహ్యప్రపంచమే కాదు, అంతర్గతప్రపంచమైన ఆలోచనలు కూడా నేనే అంటున్నాడు.

**భావాః** – అంతఃకరణపరిణామాలు; అంతర్గతవృత్తిప్రపంచం. ఈ ఆలోచనలు కూడా ఈశ్వరకార్యమే. ఆలోచనలు స్వంతంగా జడం, కాని పరాప్రకృతివల్ల అవి చేతనంగా అనిపిస్తాయి.

మనస్సులో కూడా రెండు అంశాలున్నాయి. ఇది దృక్ దృశ్యవివేకంలో వస్తుంది. ద్రవ్యంశం, వృత్త్యంశం. ఇంకోవిధంగా చెప్పాలంటే మారని చైతన్యం, మారే ఆలోచన. మారని చైతన్యం పరాప్రకృతి, మారే ఆలోచన అపరాప్రకృతి. కాని వచ్చిన ఆ చిక్కేమిటంటే ఈ రెండూ ఎంతగా పెనవేసుకుపోయాయి అంటే వాటిని మనం విడదీసి చూడలేము.

చెయ్యి–కాంతి ఉదాహరణను గుర్తు తెచ్చుకోండి. ఇక్కడేముంది అంటే ముందు చెప్పేది చెయ్యి ఉంది అని. ఇంకా ఏముంది అంటే, గోళ్ళు ఉన్నాయి, వేళ్ళు ఉన్నాయి, గీతలు ఉన్నాయి, మట్టిగా ఉంది అంటూ ఏవేవో చెపుతారు కాని అసలు విషయం చెప్పరు – ఏమిటది? కాంతి. ఆ కాంతి ఉండటంవల్లనే మీరు చెయ్యిని చూడగలుగుతున్నారు. కాంతి చేతిలో ఒక భాగం కాదు, కాంతి స్వతంత్రమైనది. వీటిలో రెండు అంశాలున్నాయి– కదిలే చెయ్యి, కదలని కాంతి.

ఇప్పుడదే సూత్రాన్ని మనస్సుకు ఉపయోగిస్తే, మనస్సులో కూడా రెండు అంశాలున్నాయి. కదిలే ఆలోచన, కదలని చైతన్యం. ఎవరిదైనా మాటలు మీరు వింటూంటే మీ ఆలోచన మొదటి మాట దగ్గరే ఆగిపోతే, తక్కిన మాటలు వినలేరు. అప్పుడు మీ పరిస్థితి కాదు, ఎదుటివాని పరిస్థితిని ఊహించండి. పంచదశిలో విద్యారణ్యులవారు ఈ కదిలే ఆలోచనలను అత్యంత వేగంగా చేతులను, కాళ్ళను కదుపుతూ నాట్యం చేసే నాట్యగత్తెతో పోలుస్తారు.

ఆలోచనలు వేగంగా కదులుతాయి; కాని కదిలే ఆలోచనల వెనక కదలని చైతన్యం ఉంది. మొదటి ఆలోచననుంచి వచ్చిన అనేక ఆలోచనలను ఒకటి చూస్తోంది. ఆలోచనలు ఆగిపోతే, శూన్యంగా ఉన్న మనస్సును చూస్తోంది. అదే సాక్షిచైతన్యం. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూసేది సాక్షిచైతన్యం. దీన్ని కృష్ణపరమాత్మ పరాప్రకృతి అంటున్నాడు.

**మారేదేదైనా అపరాప్రకృతి, మార్పులేనిది పరాప్రకృతి**

ఈ సూత్రాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదు. అంతేకాదు,

**పరాప్రకృతి నిర్గుణం, అపరాప్రకృతి సగుణం**

అపరాప్రకృతి సగుణం కాబట్టి దానికి మూడు గుణాలున్నాయి. అవి సత్త్వగుణం, రజోగుణం, తమోగుణం. అంటే ఆలోచనలు కూడా అపరాప్రకృతిలోకి వస్తాయి కాబట్టి, ఆలోచనల్లో మూడు గుణాలుంటాయి. ఒక సూత్రం గుర్తుంచుకోవాలి –

**కారణగుణాః కార్యే అనువర్తన్తే**

**కారణభూత ఈశ్వరస్య గుణాః కార్యభూతే ప్రపంచే అనువర్తన్తే**

కారణ గుణం కార్యంలో వస్తుంది. కారణమైన అపరాప్రకృతికి మూడు గుణాలున్నాయి కాబట్టి, దాన్నించి వచ్చిన జగత్తుకూ, శరీరానికీ, మనస్సుకూ, అన్నిటికీ మూడు గుణాలున్నాయి. వీటి గురించి వివరంగా పధ్నాలుగవ అధ్యాయంలో చూస్తాము. ఆ విధంగా మనస్సుకు మూడు భావాలున్నాయి. అవి –

**సాత్త్వికా భావా రాజసాస్తామసాశ్చ –** సాత్త్వికభావాలు, రాజసభావాలు, తామసభావాలు. సాత్త్వికభావాలంటే ఉత్తమభావాలు; రాజసభావాలంటే కర్మను ప్రేరేపించే భావాలు; తామస భావాలంటే మోహంలో పడవేసేవి. శంకరాచార్యులు వీటిని సుఖ, దుఃఖ, మోహవృత్తులు అంటారు. టూకీగా చెప్పాలంటే మనస్సులో అనేక ఆలోచనలు ఉత్పన్నమవుతాయి. అవి ఎక్కడ్నుంచి వస్తాయి?

**మత్త ఏవేతి తాన్ విద్ధి –** ఈ ఆలోచనలన్నీ నానుంచే వస్తున్నాయని తెలుసుకో! ఏ నేను? అపరాప్రకృతి అయిన నేను (పరమాత్మ) అని అర్థం.

ఇక్కడ ఒక చిన్న సమస్య ఉంది. దీన్ని మనుష్యులు వాళ్ళకు కావలసినట్టుగా మలుచుకునే అవకాశం ఉంది. మనం కోపం చూపినప్పుడు, ఈర్ష్యపడినప్పుడు, ఎవరికైనా సమస్య సృష్టించినప్పుడు– ఎవరైనా మనను నిందిస్తే, 'నాదేం లేదు, అంతా భగవంతుని లీల. ఆయన నా మనస్సులో ఆలోచనలు తనే అన్నాడు,' అని భగవంతునిమీద నింద వేసే అవకాశం ఉంది.

ఇలా పొరపాటు పడే అవకాశం ఉన్న ప్రతిచోటా, దాన్ని సరిగ్గా విశ్లేషిస్తారు శంకరులవారు. మనం ఏ ఆలోచన చేసినా, ఏ పని చేసినా దానికి రెండు కారణాలుంటాయి. అవి – సామాన్య కారణం, విశేష కారణం. భగవంతుడు మనలో ఆలోచనలు ఏర్పడటానికి సామాన్య కారణం; కాని మనం మన ఫ్రీవిల్ ఉపయోగించి ఆలోచిస్తాము కాబట్టి మన మనస్సు విశేషకారణం.

సామాన్య కారణానికీ, విశేష కారణానికీ మధ్య వ్యత్యాసం ఏమిటి? ఒక ఇల్లు తీసుకోండి. అందులోని ఏ గది కట్టాలన్నా కూడా దానికి ఇటుకలు, సిమెంటు కావాలి. అవునా? అది సామాన్య కారణం. కాని ఒక ఇంటిలోని అన్ని గదులూ ఒక్కలా ఉండవు; అన్ని ఇళ్ళూ కూడా ఒక్కలా ఉండవు. అంటే దానికి మనిషి బుద్ధి అనే విశేష కారణం తోడయింది. అందువల్ల కొన్ని ఇళ్ళలో వంటిల్లు పెద్దదిగా ఉంటే, కొన్నిళ్ళలో పడకగది విశాలంగా ఉంటుంది. అన్ని ఇళ్ళూ ఇటుకా, సిమెంటులతో కట్టబడితే ఈ భేదాలు ఎక్కడ్నుంచి వచ్చాయి? విశేష కారణంనుంచి.

ఇంకొక ఉదాహరణ చూద్దాము. నిజానికి ఎన్నైనా ఉదాహరణలు చూడవచ్చు దీనికి. ఒక కారు కదలాలంటే దానిలో పెట్రోలు ఉండాలి; దాన్ని నడిపే డ్రైవరు ఉండాలి. అవునా? పెట్రోలు సామాన్య కారణం, డ్రైవరు విశేష కారణం అవుతాయి. కారు ఎటు వెళ్ళాలో పెట్రోలు నిర్ణయించలేదు – దాన్ని డ్రైవరు మాత్రమే నిర్ణయించగలడు. కాని పెట్రోలు లేకపోతే అతను ఎటూ వెళ్ళలేడు. అందువల్ల పెట్రోలు సామాన్య కారణం, డ్రైవరు విశేష కారణం. ఇదే సూత్రాన్ని మన ఆలోచనలకు కూడా ఉపయోగించాలి. భగవంతుడు సామాన్య కారణం; మన బుద్ధి విశేష కారణం అవుతాయి. మత్తా అంటే – **సామాన్య కారణాత్ ఏవ సర్వమ్ ఇతి విద్ధి** అని తీసుకోవాలి.

**న తు అహం తేషు** – ప్రపంచంమీద నేను ఆధారపడను. ప్రపంచం నామీద ఆధారపడుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. అందువల్ల ప్రళయంలో విశ్వం అంతా లయమయిపోయినా, పరాప్రకృతి ఉంటుంది. తేషు అంటే కార్యపదార్థంమీద. కార్యపదార్థేషు **అహం న ఆశ్రితో భవామి; న ఆశ్రయామి.** నేను కార్యప్రపంచంమీద ఆధారపడను, కార్యప్రపంచం నామీద ఆధారపడుతుంది అంటున్నాడు. **మయి ఆశ్రిత వర్తంతే** – నామీద ఆధారపడ్డాయి. దీనికి సూత్రం ఏమిటి?

**కారణం వినా కార్యమ్ న తిష్ఠతి**

అంటే కారణం లేకుండా కార్యానికి విడిగా ఉనికి లేదు. బంగారం లేకుండా ఆభరణాలకు విడిగా ఉనికి లేదు; మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు. కాని కార్యం లేకపోయినా కారణం ఉంటుంది. ఆభరణం లేకపోయినా బంగారం ఉంటుంది; కుండ లేకపోయినా మట్టి ఉంటుంది.

ఇప్పుడు దీన్ని బ్రహ్మకు–జగత్తుకు అన్వయిస్తే, జగత్తు అనే కార్యానికి, బ్రహ్మ అనే కారణం లేకుండా విడిగా ఉనికి లేదు. కాని బ్రహ్మ అనే కారణం, జగత్తు అనే కార్యం లేకపోయినా ఉంటుంది. అంటే కారణం స్వతంత్రం, కార్యం అస్వతంత్రం. అస్వతంత్రమైనదాన్ని మిథ్య అనీ, స్వతంత్రమైనదాన్ని సత్యం అనీ అంటారు. దీనివల్ల వేదాంతసారం వస్తుంది.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**

**ఉపసంహారం**

శ్లోకాలు 4–12 వరకూ ఈశ్వరస్వరూపం చూశాము. ఇక్కడితో అది ముగుస్తుంది. ఈశ్వరస్వరూపం గురించి టూకీగా చూసేముందు ఒక విషయాన్ని గమనించాలి మనం. జగత్తులో అద్భుతమైన విషయాలు భగవంతునియొక్క ప్రకటిత రూపాలయితే, జగత్తులో భయంకరమైన విషయాలు కూడా భగవంతునియొక్క ప్రకటితరూపాలే అవుతాయి. కాని ప్రస్తుతం కృష్ణపరమాత్మ ఆ వ్యతిరేక అంశాలను పక్కనపెట్టి, మంచి అద్భుతమైన అంశాలనే ఎన్నుకున్నాడు. ఎందుకు? అసలే మనకు దైవచింతన కలగటం చాలా కష్టం. అందులో ఏమాత్రం ప్రతికూల అంశం చూసినా, దేవునిమీద భక్తిని పెంచుకోము. అందువల్ల ఆధ్యాత్మిక సాధనకొచ్చిన తొలిరోజుల్లో సృష్టిలోని అద్భుతాలను చూడటం నేర్చుకుంటాము; దాని తర్వాత ఆ అద్భుతాలు భగవంతుడు అని తెలుసుకుంటాము.

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే బ్రహ్మ**

తర్వాత మన మనస్సు పరిపక్వత చెందాక, వ్యతిరేక అంశాలను కూడా స్వీకరించటం నేర్చుకుంటాము. అందులోని అద్భుతం ఏమిటంటే, మనం ఇన్నాళ్ళూ వ్యతిరేకభావనతో చూసిన సృష్టిలోని ఒక భాగం నిజంగా వ్యతిరేక సృష్టి కాదు. అది కూడా అందమైనదే, అది కూడా ఉండాల్సినదే. నిజానికి అవి రెండు భిన్న అంశాలు కావు. అవి ఒక నాణేనికి ఉన్న రెండు వైపులు – బొమ్మ, బొరుసు. ఉదాహరణకు మనం పుట్టుకను మంగళం అంటాము; మరణాన్ని అమంగళం అంటాము. నిజానికి మరణం అమంగళం కాదు, దాన్ని మనం స్వీకరించటానికి సిద్ధంగా లేము, అంతే!

అందువల్ల కృష్ణపరమాత్మ మరణంలో మరణశక్తిని నేనే అనలేదు. అందువల్లనే పదవ శ్లోకంలో బుద్ధి ఉన్నవారిలో నేను బుద్ధిని అన్నాడు కాని తెలివిలేని వారిలో నేను తెలివితక్కువ లక్షణాన్ని అనలేదు. అలా మంచి–చెడు ఒక నాణేనికి ఇరువైపులా ఉన్నా, ప్రస్తుతం కృష్ణపరమాత్మ మంచి అంశాలనే మెచ్చుకుని, వాటివాటి శక్తిగా తాను ఉన్నానన్నాడు.

**ఈశ్వర స్వరూపం టూకీగా**

1. భగవంతుడు పరాప్రకృతి–అపరాప్రకృతుల మేలు కలయిక; అంటే చేతన–అచేతనతత్త్వం.
2. భగవంతుడు జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయకారణం.
3. భగవంతుడు కారణం కాబట్టి కార్యం అంతటా ఉంటాడు. దీన్ని విశ్వరూప ఈశ్వరుడు అంటారు.
4. కారణం స్వతంత్రం, కార్యం మిథ్య కాబట్టి బ్రహ్మ సత్యం, జగత్‌మిథ్య.

**తత్ అనన్యత్వం ఆరంభణశబ్దాదిభ్యః** – 2.1.15

బ్రహ్మ సూత్రాల్లో ఈ భావాన్ని ఆధారంగా తీసుకుని వ్యాసాచార్యులు ఒక సూత్రాన్ని రాశారు.

**తత్ అనన్యత్వమ్ – ఆరంభాది కరణం**

**3. సంసార కారణం, పరిహారం – శ్లోకాలు 13–19**

ఈ శ్లోకాలలో కృష్ణపరమాత్మ సంసార కారణాన్ని, దానికి మందును విశ్లేషిస్తున్నాడు.

అంతటా పరమాత్మ ఉంటే, మనుష్యులు ఎందుకు ఈ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు? మనం మనుష్యుల వ్యక్తిగత సమస్యలను విడిగా చర్చించటం లేదు. మొత్తం సమస్యను చూస్తున్నాము. సంసారం అంటే భద్రత, శాంతి, ఆనందం అనే మూడు అంశాలు లేకపోవటం. ఇవి ప్రపంచంలో అందరూ అనుభవించేవే, కాని వచ్చిన చిక్కేమిటంటే మన సమస్యను మనం ఎన్నడూ విశ్లేషించుకోము. నాకు దుఃఖం ఎందుకు కలుగుతున్నది? ఇది విశ్లేషించుకోవాలనే ఆసక్తి కూడా ఉండదు. అందువల్ల దాన్ని రకరకాలుగా పరిష్కరించటానికి చూస్తాము. ఇల్లు కొంటే భద్రత కలుగుతుంది అనుకుంటాము; పెళ్ళి చేసుకుంటే ఆనందంగా ఉంటాము అనుకుంటాము; ఆస్తి ఉంటే శాంతి దొరుతుకుంది అనుకుంటాము. అలా ఒకదాని వెంట ఒకదానికోసం పరుగులు తీస్తూనే ఉంటాము. ఎందుకంటే, మనం అనుకున్నది పొందినా, ఆశించిన శాంతి భద్రతలు కలగవు. ఒక్కోసారి సమస్య పెరుగుతుంది కూడా. అందువల్ల నిరాశానిస్పృహలు, ఆందోళన, బెంగ, భయం, కోపం, చిరాకు, ఈర్ష్యలాంటి భావాలు పెరుగుతాయి. వీటిని భవరోగాలు అంటారు. కాని మనమేమో ఆ సమస్య ఎందుకు వచ్చిందో పట్టించుకోకుండా, సమస్యకు పరిష్కారం వెతుక్కుంటుంటాము.

కృష్ణపరమాత్మ 13వ శ్లోకంలో సమస్యను, 14వ శ్లోకంనుంచి 19వ శ్లోకంవరకూ దానికి పరిష్కారాన్ని సూచిస్తున్నాడు. అవేమిటో ముందు చూద్దాము.

ఎ) **సంసార కారణం** – ఈ ప్రపంచం మొత్తం పరాప్రకృతి+అపరాప్రకృతుల మేలుకలయిక అని చూశాము. ఆ రెండూ కూడా ఈశ్వరునిలోని రెండు అంశాలు.

| | | |
|---|---|---|
| **పరాప్రకృతి** | = | **చేతన నిర్గుణ నిర్వికార తత్త్వము** |
| **అపరాప్రకృతి** | = | **అచేతన సగుణ సవికార తత్త్వము** |

పరాప్రకృతి **అప్రమేయం**. అప్రమేయం అంటే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు లేవు. అంటే ప్రత్యక్ష ప్రమాణమైన పంచజ్ఞానేంద్రియాలకు అందదు.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం తథాఽరసం నిత్యమగన్ధవచ్ఛయత్ –** కఠ 1–3–15

అపరాప్రకృతి మన ఇంద్రియాలకు తెలుస్తుంది, సగుణం కాబట్టి. అంటే ఒకటి కంటికి కనిపిస్తుంది, ఇంకొకటి కనిపించదు. అలా ఒకటి కనబడే అంశం, ఇంకొకటి కనబడని అంశం ఉంటే మనమేం చూస్తాము? సహజంగా కనబడే అంశమే చూస్తాము. ఇంతకుముందు చూసిన చెయ్యి–కాంతి ఉదాహరణ గుర్తుకు తెచ్చుకుంటే ఇక్కడేముంది అంటే చెయ్యి అనే చెబుతాము, కాంతి మాట చెప్పము. అలాగే సినిమా చూసేటప్పుడు దానిలో ఎంతగా మునిగిపోతామంటే, అది తెరమీద ఆడుతున్నదనే విషయాన్ని బొత్తిగా పట్టించుకోము. ఆ విధంగా నానాత్త్వంగా కనిపించే అపరాప్రకృతి మాయలో పడిపోయి, ఏకం అయిన పరాప్రకృతిని పట్టించుకోము.

భగవంతుని ఉన్నత స్వరూపాన్ని చూడలేకపోతున్నాము. పరాప్రకృతిని తెలుసుకోవటానికి కూడా ప్రయత్నం చెయ్యటం లేదు. ఎందుకంటే ఆకర్షణీయంగా, సమ్మోహపరిచేదిగా, అందంగా, వశం చేసుకునేటట్టుగా ఉన్న అపరాప్రకృతి మాయలో పడిపోతున్నాము. నిజానికి అపరాప్రకృతిని మాయ అనే అంటాడు కృష్ణపరమాత్మ. ఈ అపరాప్రకృతిని మోహిని అంటాడు తర్వాత. సాగరమధనంలో కృష్ణపరమాత్మ జగన్మోహిని రూపంలో అసురులకు అమృతం అందకుండా ఎలా చేశాడో మనకు తెలిసిన కథే.

మోహినీ మోహంలో పడ్డ అసురులు ఏం నష్టపోయారు? అమృతాన్ని నష్టపోయారు. ఈ అపరాప్రకృతి మోహంలో పడి మనం పరాప్రకృతి అనే అమృతాన్ని, తద్వారా మోక్షాన్ని నష్టపోతున్నాము. ఎంతసేపూ బాహ్యప్రపంచం వెంట పరుగులు తీస్తాము కాని మన గురించి ఆలోచించము. అది కూడా ఆలోచించినా, శరీరపోషణ, కేశసంపద, రాగద్వేషాలు – వీటి గురించే ఆలోచిస్తాము. అవన్నీ అపరాప్రకృతికి చెందినవి. అందువల్ల సమస్య ఏమిటి?

**పరాప్రకృతి అజ్ఞానమ్ ఏవ సంసారస్య కారణం**

బి) **సంసార పరిహారం –** మామ్ ఏవ యే ప్రపద్యంతే, ఎవరు నన్ను శరణు కోరుతారో వారు మాత్రమే, ఏతాం మాయామ్ తరంతి– ఈ మాయను అధిగమిస్తారు. అంటే పరిష్కారం భక్తి. దీన్ని ప్రపతిః అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కొంతమంది ఏం నేను పరాప్రకృతి గురించి ఎందుకు తెలుసుకోవాలి అనుకుంటారు. ఎందుకంటే వారికి అపరాప్రకృతి అద్భుతంగా ఉంది, కోరినదంతా ఇస్తుంది, అలాంటప్పుడు పరాప్రకృతి గురించి తెలుసుకోవటానికి సమయాన్ని వృథాపరచటమెందుకు? ఇది వారి వాదన.

శాస్త్రం దాన్ని ఒప్పుకోదు. పరాప్రకృతి గురించి తెలుసుకుంటే రెండు ఫలాలు పొందుతాము అంటుంది. అవి పూర్ణత్వం, శాశ్వతత్త్వం.

**పూర్ణత్వం** – అపరాప్రకృతి అనేక సుఖాలను ఇవ్వచ్చేమో కాని మన ప్రాథమిక అవసరాలు కొన్ని తీర్చలేదు. అందులో ఒకటి పూర్ణత్వం. అపరాప్రకృతికి కాలపరిమితి ఉంది. దేశపరిమితి ఉంది. అలాంటప్పుడు అది పూర్ణత్వాన్ని ఇవ్వలేదు. పూర్ణత్వం పరాప్రకృతివల్లనే వస్తుంది. పూర్ణత్వం ఉన్నచోటనే శాంతి ఉంటుంది. పూర్ణత్వం లేకపోతే శాంతి ఉండదు.

**శాశ్వతత్త్వం** – అపరాప్రకృతికి కాలపరిమితి ఉందని చూశాము. కాలపరిమితి ఉన్న వస్తువు, శాశ్వతమైన ఆనందాన్ని ఎలా ఇస్తుంది? శాశ్వతంగా ఉండని అపరాప్రకృతి శాశ్వతమైన ఆనందాన్ని, శాంతిని, భద్రతలను ఇవ్వలేదు. అన్నీ కాలం కోరల్లో చిక్కుకోవాల్సిందే.

> **మా కురు ధనజనయౌవనగర్వం హరతి నిమేషాత్కాలః సర్వమ్**
> **మాయామయమిదమఖిలం హిత్వా బ్రహ్మపదం త్వమ్ ప్రవిశ విదిత్వా** – భజగోవిందం 11

నీకు ధనం ఉందనీ, జనం నీ చుట్టూ భజన చేస్తున్నారనీ, యౌవనంతో మిసమిసలాడుతున్నావనీ గర్వంతో మిడిసిపడకు. నిమిషంలో కాలం అంతటినీ హరించివేస్తుంది అంటున్నారు శంకరులవారు భజగోవిందంలో.

హరిద్వార్‌లో గంగాస్నానం చెయ్యాలంటే ఒడ్డున ఉన్న ఇనుపగొలుసు పట్టుకోవాలి. వేగంగా ప్రవహిస్తున్న నీరులో కొట్టుకుపోకుండా ఉండాలంటే, కదలకుండా స్థిరంగా ఉన్న గొలుసును పట్టుకోవాలి. అలాగే మారుతున్న అనేక అనుబంధాలు కోరుకున్నా, మారక స్థిరంగా ఉండే ఒక అనుబంధమైనా ఉండాలి. అప్పుడు తక్కినవి నిలవకపోయినా ఇదన్నా ఉందికదా అనే తృప్తి ఉంటుంది.

మనిషికి శాశ్వతమైనది కావాలని తెలుసు, కాని అది పరాప్రకృతి అని తెలియదు. అపరాప్రకృతిని పట్టుకుని శాశ్వతత్త్వం కోరుకుంటాడు. మనం ఏది శాశ్వతమనుకుని గట్టిగా పట్టుకున్నామో అది మనం ఎదురుచూడని సమయంలో దెబ్బకొట్టి, మాయమయిపోతుంది. కొండలెక్కే వారికి ఈ అవస్థ ఏమిటో అర్థమవుతుంది. వారు టెంట్లు వేసుకుని, తాడు కట్టుకుని అన్ని ఏర్పాట్లూ చేసుకుంటారు, కాని ఎక్కడో ఏదో పోతుంది.

అందువల్ల మనకు ఏదో శాశ్వతమైనది కావాలి. ఆ శాశ్వతమైన వస్తువు పేరు భగవంతుడు; అది కూడా భగవంతునిలోని ఉన్నతస్థాయి అంటే పరాప్రకృతి.

పరిష్కారం ఏమిటి? పరాప్రకృతిని పట్టుకోవటం. అలాగని అపరాప్రకృతిని వదిలివేయమనటం లేదు. గంగానది ఒడ్డున కేవలం గొలుసులు ఉన్నా లాభం లేదు, కేవలం ప్రవహించే నీరు ఉన్నా లాభం లేదు.

ప్రవహించే నీటిలో స్నానం చెయ్యాలంటే, ఆనందం పొందాలంటే, కదలని గొలుసును గట్టిగా పట్టుకోవాలి. అంటే నది అపరాప్రకృతి, గొలుసు పరాప్రకృతి. అపరాప్రకృతిని అనుభవించండి, ఆస్వాదించండి. కాని దానిలో కొట్టుకుపోకుండా పరాప్రకృతిని గట్టిగా పట్టుకోండి. పరాప్రకృతిని గట్టిగా పట్టుకోవటమంటే భక్తి చూపండి.

భక్తి అంటే ఏమిటి? ఇది తర్వాత వచ్చే ప్రశ్న. భక్తిని కృష్ణపరమాత్మే తర్వాత ప్రత్యేకించి వివరిస్తాడు. అక్కడ వివరంగా చూద్దాము. ఇక్కడ భక్తి మూడు రకాలని తెలుసుకుంటే చాలు. అవి మందభక్తి, మధ్యమభక్తి, ఉత్తమభక్తి.

ఎ) **మందభక్తి** – భగవంతుణ్ణి మన కోరికలు తీర్చే మార్గంగా భావించి పూజించటం. ధర్మ, అర్థ, కామాలు మన లక్ష్యాలు; భగవంతుడు అవి తీర్చే మార్గం. ఇందులో ప్రపంచంమీద ఆధారపడతాము.

బి) **మధ్యమభక్తి** – ఇక్కడ భగవంతుడు మార్గం కాదు, భగవంతుడే లక్ష్యం అని తెలుసుకుని పూజిస్తాము. తక్కినవేవీ శాశ్వతం కాదు; అందువల్ల దేనిమీదా ఆధారపడలేము; భగవంతుడొక్కడే శాశ్వతం; అందువల్ల ఆయనమీదే ఆధారపడాలి అని తెలుసుకుంటాము. అంటే ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి భగవంతుని మీద ఆధారపడే స్థాయికి ఎదుగుతాము.

సి) **ఉత్తమభక్తి** – ఇక్కడ భగవంతుడు మార్గమూ కాదు, లక్ష్యమూ కాదు. భగవంతుడు నేనే. భగవంతుణ్ణి మార్గంగా చూసినా, లక్ష్యంగా చూసినా అది ద్వైతభక్తి అవుతుంది. నేనే భగవంతుడు అని అర్థం చేసుకోవటం అద్వైతభక్తి.

**ఈశ్వరః సర్వభూతానామ్ హృద్దేశే అర్జున తిష్ఠతి**

నేను వెతుకుతున్న పరమాత్మ నాకు భిన్నంగా లేదు. ఆ పరమాత్మను నేనే! అంటే భగవంతునిమీద ఆధారపడే స్థాయినుంచి నామీద నేను ఆధారపడే స్థాయికి ఎదుగుతాము.

మనం మందభక్తితో మొదలుపెట్టి, మధ్యమభక్తికి ఎదిగి, చివరకి ఉత్తమభక్తికి చేరుకోవాలి. అంటే ప్రపంచంమీద ఆధారపడే దశనుంచి భగవంతునిమీద ఆధారపడే దశకు వచ్చి, నామీద నేను ఆధారపడే దశకు చేరుకోవాలి. అదీ పరిష్కారం. అది మోక్షాన్ని ఇస్తుంది. ఈ నేపథ్యంతో రాబోయే శ్లోకాలను చూద్దాము.

శ్లో. 13 **త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥**
త్రిభిః, గుణమయైః, భావైః ఏభిః, సర్వమ్, ఇదమ్, జగత్,
మోహితమ్, న, అభిజానాతి, మామ్, ఏభ్యః, పరమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| గుణమయైః | = గుణములయొక్క కార్య రూపములైన | ఏభ్యః | = కాబట్టి ఈ మూడు గుణముల కంటెను |
| ఏభిః, త్రిభిః, భావైః | = మూడు విధములైన సాత్త్విక, రాజస, తామసభావములచే | పరమ్ | = శ్రేష్ఠుడనైన |
| | | అవ్యయమ్ | = శాశ్వతుడనైన |
| ఇదమ్, సర్వమ్ | = ఈ సమస్త | మామ్ | = నన్ను |
| జగత్ | = ప్రాణిసముదాయము | న, అభిజానాతి | = ఆ ప్రాణిసముదాయము తెలిసికొనలేకున్నది |
| మోహితమ్ | = మోహితమగుచున్నది | | |

**ఏభిః త్రిభిః గుణమయైః భావైః ఇదమ్ సర్వమ్ జగత్ మోహితమ్,**

**(అతః) ఏభ్యః పరమ్ అవ్యయమ్ మామ్ న అభిజానాతి ॥**

తా: గుణములయొక్క కార్యరూపములైన, మూడు విధములైన సాత్త్విక, రాజస, తామసభావములచే ఈ సమస్తప్రాణిసముదాయము మోహితమగుచున్నది. కాబట్టి ఈ మూడు గుణములకంటెను శ్రేష్ఠుడనైన, శాశ్వతుడనైన నన్ను ఆ ప్రాణిసముదాయము తెలిసికొనలేకున్నది.

**త్రిభిర్గుణమయైర్భావైః** – బాహ్యప్రపంచం మూడు గుణాలతో నిండి ఉండటంవల్ల, శంకరులవారు భావ అంటే బాహ్యప్రపంచంతో పాటు భావోద్రేకాలను కూడా తీసుకోవాలంటారు.

**ఇదం సర్వం జగత్** – ఈ ప్రపంచం మొత్తం. అంటే అందులో అరుదుగా ఒక్కరో, ఇద్దరో దీనికి భిన్నంగా ఉంటారు.

**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత** – కఠ 2.1.1

ఎవరో ఒక ధీరుడు మాత్రమే ప్రత్యగాత్మ గురించి తెలుసుకుంటాడు. జగత్తు అంటే మనుష్యులు మాత్రమే. జంతువులు వేదాంతం నేర్చుకోలేవు. మనిషి ఒక్కడే బుద్ధిజీవి.

**మోహితమ్** – ఈ ప్రపంచం మొత్తం మోహంలో పడిపోతున్నారు.

**బాలస్తావత్ క్రీడాసక్తః తరుణస్తావత్తరుణీసక్తః**

**వృద్ధస్తావత్ చింతాసక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః** – భజగోవిందం

ఆటలతో బాల్యం, యువతులతో యౌవనం, చింతలతో వృద్ధాప్యం గడిపేస్తే భగవంతుణ్ణి ప్రార్థించేది ఎప్పుడు? దాని ఫలితం ఏమిటి?

**మామ్ ఏభ్యః పరమ్ అవ్యయమ్ న అభిజానాతి** – నన్ను తెలుసుకోలేకపోతున్నారు. తెలుసుకోవాలనే ప్రయత్నం కూడా చెయ్యటం లేదు. మామ్ అంటే నన్ను, ఏ నన్ను? ఉన్నతమైన నేను, అవ్యయమైన నేను, నిర్గుణరూపమైన నేను అంటున్నాడు కృష్ణపరమాత్మ. భగవంతునియొక్క పరాప్రకృతి గురించి తెలుసుకోలేకపోతున్నారు. మోహం అంటే ఎలా ఉంటుందో చూశాము. జగన్మోహిని మాయలో పడ్డ రాక్షసులు అమృతాన్ని కోల్పోతే, జగత్ అనే మాయలో పడ్డ మనుష్యులు పరాప్రకృతి అనే అమృతాన్ని కోల్పోతున్నారు. ఇది సమస్య. సంసారమనే సమస్య.

శ్లో. 14 **దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥**
దైవీ, హి, ఏషా, గుణమయీ, మమ, మాయా, దురత్యయా,
మామ్, ఏవ, యే, ప్రపద్యంతే, మాయామ్, ఏతామ్, తరంతి, తే ॥

| | | | |
|---|---|---|---|
| హి | = ఎందుకంటే | మామ్, ఏవ | = కేవలము, నిరంతరము నన్నే |
| ఏషా | = ఈ | ప్రపద్యంతే | = భజించుచున్నారో |
| మమ, మాయా | = నా మాయ | తే | = వారు |
| దైవీ | = అలౌకికమైనది | ఏతామ్, మాయామ్ | = ఈ మాయను |
| గుణమయీ | = త్రిగుణాత్మకమైనది | తరంతి | = దాటి, సంసార సముద్రము నుండి బయట పడుదురు |
| దురత్యయా | = అధిగమింప సాధ్యము కానిది | | |
| యే | = ఎవరైతే | | |

**ఏషా దైవీ గుణమయీ మమ మాయా హి దురత్యయా ।**
**యే మామ్ ఏవ ప్రపద్యంతే, తే ఏతామ్ మాయామ్ తరంతి ॥**

తా: ఎందుకంటే ఈ నా మాయ అలౌకికమైనది, త్రిగుణాత్మకమైనది, అధిగమింప సాధ్యము కానిది. ఎవరైతే కేవలము, నిరంతరము నన్నే భజించుచున్నారో వారు ఈ మాయను దాటి సంసార సముద్రము నుండి బయట పడుదురు.

ఇందులో పరిష్కారం చూస్తాము. సంసారం మిమ్మల్ని ముంచెత్తే లోపు నన్ను గట్టిగా పట్టుకోండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఏషా మాయా** – ఈ మాయ అంటే సగుణ, సవికార సవికల్ప అపరాప్రకృతి. ఈ అపరాప్రకృతి మనుష్యులను మోహంలో పడవేస్తుంది. భగవంతుడెందుకు, అంతా మా గొప్పే అనుకుంటారు కొందరు. ఈ మాయ ఏం చేస్తుంది?

**దురత్యయా** – ఆ మాయ ఎంత గొప్పదంటే దాన్ని అధిగమించటం సాధ్యం కాదు. అసలు మనకు దాని మోహంలో పడ్డామనే తెలియదు. అందువల్ల మన బుద్ధితో దాన్ని అధిగమించటం కష్టం. ఎందుకు?

**గుణమయీ** – అపరాప్రకృతికి మూడు గుణాలున్నాయి. అవి సత్త్వ రజో తమోగుణాలు. ఆ గుణాల్లో ఏ గుణం అయినా మనను వలలో వేసుకోవచ్చు – దాని వివరాలు 14వ అధ్యాయంలో చూస్తాము. ఈ గుణాలు ఎక్కడ ఉన్నాయి?

**దైవీ** – నాలో ఉన్నాయి. అంటే పరాప్రకృతి అయిన నాలో ఉన్నాయి. అపరాప్రకృతి ఎవరిమీదైనా ఆధారపడిందీ అంటే అది పరాప్రకృతిమీదనే. అపరాప్రకృతిని అధిగమించేదెలా? ఒక్కటే మార్గముంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**యే మామ్ ప్రపద్యంతే** – ఎవరైతే నన్ను శరణు వేడుతారో, అంటే ఎవరు భక్తి చూపిస్తారో.

**తే ఏతాం మాయామ్ తరంతి** – వారు ఈ మాయను అధిగమించగలరు.

సంసారాన్ని నేను ఒక్కడినే దాటలేను. దానికి ఈశ్వరకృప కావాలని అర్థం చేసుకోవాలి. ఈశ్వరకృప ఉంటే ఆయన మనల్ని గురువు దగ్గరకు చేరుస్తాడు. గురువు శాస్త్రాన్ని బోధిస్తాడు. మూడు దశల్లో మోక్షం కలుగుతుంది. ప్రపంచంమీద ఆధారపడటంనుంచి భగవంతునిమీద ఆధారపడాలి. తర్వాత భగవంతునినుంచి శాస్త్రంమీద ఆధారపడాలి. శాస్త్రంద్వారా నేను నామీదే ఆధారపడటం నేర్చుకుంటాను. కాని మొదటిదశ ఏమిటి? భగవంతునిమీద భక్తి చూపాలి.

సమస్య ఏమిటి? సంసారం! అంటే అపరాప్రకృతి మోహంలో పడిపోవటం. పరిష్కారం ఏమిటి? భక్తి. అంటే పరాప్రకృతిమీద భక్తి చూపటం.

శ్లో. 15 **న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।**
**మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః ॥**
న, మామ్, దుష్కృతినః, మూఢాః, ప్రపద్యంతే, నరాధమాః,
మాయయా, అపహృతజ్ఞానాః, ఆసురమ్, భావమ్, ఆశ్రితాః ॥

| | | | |
|---|---|---|---|
| మాయయా | = మాయచేత | దుష్కృతినః | = చెడుకర్మలను ఆచరించు వారును అయిన |
| అపహృతజ్ఞానాః | = జ్ఞానమును పోగొట్టుకున్న వారును | మూఢాః | = మూర్ఖులు |
| ఆసురమ్, భావమ్ | = ఆసుర స్వభావమును | మామ్ | = నన్ను |
| ఆశ్రితాః | = ఆశ్రయించిన వారును | న, ప్రపద్యంతే | = భజించరు |
| నరాధమాః | = నరులలో అధములును | | |

**మాయయా అపహృత–జ్ఞానాః ఆసురమ్ భావమ్ ఆశ్రితాః**
**దుష్కృతినః మూఢాః నర–అధమాః మామ్ న ప్రపద్యన్తే ॥**

తా: మాయచేత జ్ఞానమును పోగొట్టుకున్నవారును, ఆసుర స్వభావమును ఆశ్రయించిన వారును, నరులలో అధములును, చెడు కర్మలను ఆచరించు వారును అయిన మూర్ఖులు నన్ను భజించరు.

చాలామంది భక్తిమార్గానికి ఎందుకు రారంటే వారికి పుణ్యం లేదు కాబట్టి. పూర్వజన్మ పుణ్యం లేకపోతే మోక్షంగురించి చెప్పే సంప్రదాయంలోనే పుట్టడు జీవి. ఎంతసేపూ అర్థ కామపురుషార్థాల వెంట పరుగులు తీసి, ఐహికసుఖాలకోసం అర్రులు చాచే సంప్రదాయంలో పుడతాడు. అంటే మనిషిగా పుట్టటానికే కొంత పుణ్యం చేసుకుని ఉండాలి; మనిషిగా పుట్టినా కేవలం అర్థకామాల వెంట కాక, ధర్మ మోక్షాల గురించి కూడా నేర్పించే సంప్రదాయంలో పుట్టటానికి పెట్టిపుట్టాలి. ఆ సంప్రదాయంలో పుడితే చాలదు, దానిమీద శ్రద్ధ ఏర్పడాలి.

మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుషసంశ్రయత్వం. వీటన్నిటికీ పుణ్యం ఉండాలి.

**దుష్కృతినః** – కాని కావలసినంత పుణ్యం లేనివారు చాలామంది ఉన్నారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. వారు మనుష్యులుగా పుట్టేంత పుణ్యం చేసుకున్నారు కాని, భగవంతుణ్ణి లేదా శాస్త్రాన్ని తెలుసుకోగలిగేటంత పుణ్యం చేసుకోలేదు. అందువల్ల వారిని పాపులు అనవచ్చు. దానివల్ల వారేం చేస్తారు?

**మాయయా అపహృతజ్ఞానాః** – మాయ అంటే అపరాప్రకృతి. అపహృత జ్ఞానాః అంటే విచక్షణాశక్తి పోగొట్టుకున్నవారు. వారి విచక్షణాశక్తిని మాయ అపహరించివేసింది. ఈ మాయ వీళ్ళని ఇరవైనాలుగు గంటలూ అర్థపురుషార్థం లేదా కామపురుషార్థం వెంట పరుగులు తీసేలాగా చేస్తుంది. అందువల్లనే చూడండి, అన్ని వందల టీవీ ఛానెల్సు వచ్చాయి, రాత్రింబవళ్ళూ ఏవో చూపిస్తూనే ఉంటాయి. ఆఫీసుకెళితే పని, పని. రాత్రి ఎన్నింటికి ఇంటికి వస్తామో తెలీదు – అంటే జీవితమంతా అటు డబ్బు సంపాదించటంలోనో, ఇటు సరదాలలో తేలిపోవటంలోనో సరిపోతోంది. ఇంక సత్సంగానికి తీరికేది? మాయ ఆ విధంగా వారి విచక్షణాశక్తిని కొల్లగొట్టేసింది.

లేకపోతే, వారు కొంచెం మనస్సు పెట్టి, కొంచెం వివేకం చూపితే వారి కళ్ళముందు ఎన్నో దీనగాథలు కనిపిస్తాయి. ధనం వెంట పరుగులు తీసిన వ్యక్తి రాత్రికి రాత్రి బికారి అవటం; అధికారదర్పం చూపిన వ్యక్తికి ఆదరించేవారే లేకపోవటం; ఆప్యాయతల్లో మునిగితేలినవారికి చివరికి గుక్కెడు నీళ్ళు కూడా ఇచ్చే దిక్కులేకపోవటం– ఇలాంటివెన్నో హృదయవిదారకంగా కనిపిస్తాయి. జీవితంలో ఏదీ శాశ్వతం కాదని తెలుస్తుంది– డబ్బు, హోదా, ఆస్తి, అంతస్తు, బంధువులు, ప్రేమలు – ఏవీ పదికాలాలు నిలవవు. అన్నీ కళ్ళముందు నగ్నసత్యాలుగా ఎలుగెత్తి చాటుతున్నా వీరు మాత్రం చలించరు. ఎందుకు? అదే మాయా ప్రభావం. అందరి విషయంలో అలా జరుగుతుందేమో కాని నాకు మాత్రం అలా జరగదు. నన్ను విడిచి నా వాళ్ళు, నా డబ్బు వెళ్ళదు అనుకుంటారు వారు.

**మూఢాః** – అందువల్ల అటువంటి వారు మూఢులు అవుతున్నారు. మోహంలో పడిపోతున్నారు. మోహం వల్ల అశాశ్వతమైన దాన్ని శాశ్వతమైనదిగా భావిస్తున్నారు.

**అనిత్యమ్ నిత్యత్వేన భావయతి అతస్మిన్ తత్‌బుద్ధిః అధ్యాసః**

దీన్ని **శోభన అధ్యాస** అంటారు శాస్త్రంలో. శోభన అధ్యాసం అంటే ఒక వస్తువుమీద లేనిదాన్ని ఆరోపించటం. అందువల్ల మూఢులు అవుతున్నారు.

మనమీ మోహంలో పడిపోతామని ముందే తెలుసు భగవంతునికి. అందుకని మనకు గురువులను, శాస్త్రాన్ని కూడా ఇచ్చాడు. ఒక కొత్తవస్తువును కొంటేనే, దానితో పాటు ఒక మాన్యువల్ ఇస్తారు. ఆ వస్తువు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్చరికలతో నిండివుంటుంది ఆ మాన్యువల్. అలా మనను సృష్టించి, మన జీవన విధానాన్ని నిర్దేశించి, విధినిషేధాలను ఎత్తి చూపే శాస్త్రాన్ని ఇచ్చాడు పరమాత్మ. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవటానికి గురువులను కూడా ఇచ్చాడు.

**అవిద్యాయామ్ అంతరే వర్తమానః స్వయం ధీరః పండితమ్ మన్యమానః** – ముండకం

కొంతమందికి ఏమీ తెలియదు, కాని తెలియకపోయినా ఫర్వాలేదు కాని, అన్నీ తమకే తెలుసు అనుకుంటారు. వారిని వారే పండితులుగా నిర్ణయించేసుకుంటారు. అందువల్ల శాస్త్రం, గురువు అవసరం లేదు వారికి.

**నరాధమాః** – అటువంటి వారిని నరాధములు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వారు నరులలో అధములు. ఎందుకు? మానవజన్మ పొందినందుకు అత్యున్నత పురుషార్థమైన మోక్షాన్ని పొందే అవకాశం పెట్టుకుని, దాన్ని వదిలేసి అంత విలువైన మానవ జీవితాన్ని మామూలు లక్ష్యాలు సాధించేటందుకు వెచ్చిస్తున్నారు. మంచి గంధం చెక్కలను వంటకి వాడినట్టు ఉంటుంది అలా చేస్తే. ఉత్తమమైన మనుష్యజన్మనెత్తి అధమమైన కోర్కెలు కోరుతున్నారు కాబట్టి, వారు నరాధములు అయ్యారు. అంటే వివేకం లేనివారు అయ్యారు.

**ఆసురం భావమ్ ఆశ్రితాః** – అంతేకాదు, అటువంటి వారు, వారు సమస్యల్లో చిక్కుకోవటమే కాక తక్కిన వారికి కూడా సమస్యలు సృష్టిస్తారు. ఎప్పుడైతే వారు అర్థకామాల వెంట పరుగులు తీస్తారో, వారికి ఎంత వచ్చినా తృప్తి ఉండదు. కోరికలు అనంతం అంటారు అర్థశాస్త్రంలో.

**న విత్తేన తర్పణీయః మనుష్యః** – కఠ

ఎంతవచ్చినా తృప్తి ఉండదు. ఇంకా కావాలి, ఇంకా కావాలి అనిపిస్తుంది. ఒక దశకి వెళ్ళేసరికి ధార్మిక పద్ధతి ద్వారా ఎక్కువ సంపాదించలేరు. కోరికలు ఆకాశాన్నంటుతాయి, కాని వాటిని తేలికగా తీర్చేటంత సునాయాసంగా ధనం పెరగదు. ధర్మబద్ధంగా జీవిస్తే కోరికలు తీరవు. కోరికలా, నైతిక విలువలా అంటే చాలాచోట్ల కోరికలే గెలుస్తాయి. ఏదో చిన్నచిన్న తప్పులు చెయ్యటంతో మొదలవుతుంది. మొదట్లో అంతరాత్మ నిలదీస్తుంది, కొన్నాళ్ళయ్యాక దాని శక్తి తగ్గినా, ఉండబట్టలేక హెచ్చరిస్తుంది. అయినా వినకుండా దాని గొంతు నొక్కేస్తే, అది మాత్రం ఏం చేస్తుంది? మూగపోతుంది. డబ్బు ఒక్కటే మనుష్యుల లక్ష్యం. దానికోసం ఎన్ని దారుణాలు చూడటం లేదు? అందువల్ల అర్థకామాలు ముఖ్యం అనుకుంటే అధర్మం పేట్రేగిపోతుంది. దీన్ని ఆసురీస్వభావం అంటున్నాడు కృష్ణపరమాత్మ. వీరు నెమ్మదిగా ధర్మాన్ని పక్కదారి పట్టించేస్తారు.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥** – 3.37

కామక్రోధాలు అంతులేని పాపకర్మలకు ప్రేరకాలు. ఇటువంటి లక్ష్యాలు ఉన్నవారు అత్యంత దురదృష్టవంతులు. పుణ్యం చేసుకున్నవారి పరిస్థితి ఏమిటి? అది రాబోయే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 16 **చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥**
చతుర్విధాః, భజంతే, మామ్, జనాః, సుకృతినః, అర్జున,
ఆర్తః, జిజ్ఞాసుః, అర్థార్థీ, జ్ఞానీ, చ, భరతర్షభ ॥

| | | |
|---|---|---|
| భరతర్షభ! | = | ఓ భరతశ్రేష్ఠా! |
| అర్జున! | = | అర్జునా! |
| సుకృతినః | = | శుభకర్మలను ఆచరించువారై |
| అర్థార్థీ | = | సంపదలను, సౌఖ్యాలను కోరు అర్థార్థి భక్తులును |
| ఆర్తః | = | శారీరిక, మానసిక సంతాపములకు గురియైన ఆర్తభక్తులును |
| జిజ్ఞాసుః | = | పరమాత్మ తత్త్వజ్ఞానమునందు ఇచ్ఛగల జిజ్ఞాసు భక్తులు |
| చ | = | ఇంకా |
| జ్ఞానీ | = | తత్త్వజ్ఞానమును పొందిన జ్ఞానీభక్తులును |
| చతుర్విధాః | = | నాలుగు విధములైన |
| జనాః | = | భక్తులు |
| మామ్ | = | నన్ను |
| భజంతే | = | భజింతురు |

**హే భరతర్షభ అర్జున! ఆర్తః, జిజ్ఞాసుః, అర్థార్థీ,**

**జ్ఞానీ చ (ఇతి) చతుః-విధాః సుకృతినః జనాః మామ్ భజన్తే ॥**

తా: ఓ భరతశ్రేష్ఠా! అర్జునా! శుభకర్మలను ఆచరించువారై సంపదలను సౌఖ్యములను కోరు అర్థార్థి భక్తులును, శారీరిక, మానసిక సంతాపములకు గురియైన ఆర్తభక్తులును, పరమాత్మ తత్త్వజ్ఞానమునందు ఇచ్ఛగల జిజ్ఞాసుభక్తులు ఇంకా తత్త్వజ్ఞానమును పొందిన జ్ఞానభక్తులును అని నాలుగు విధములైన భక్తులు నన్ను భజింతురు.

కొంతమంది పుణ్యం చేసుకున్నవారు ఉన్నారు.

**అర్జున జనాః సుకృతినః** – ఓ అర్జునా, కొంతమంది పుణ్యం చేసుకున్నారు. ముందు శ్లోకంలో పుణ్యం చేసుకోని వారిని దుష్కృతినః అన్నాడు. ఇక్కడ పుణ్యం చేసుకున్నవారిని సుకృతినః అంటున్నాడు. అంటే దుష్కృతినః – వారికి భక్తి లేదు, సుకృతినః – వీరికి భక్తి ఉంది.

**చతుర్విధా భజంతే మామ్** – భక్తులు నన్ను నాలుగు విధాలుగా కొలుస్తారు. ఆ నాలుగు రకాల భక్తులు ఎవరు?

**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ** – ఓ భరతశ్రేష్ఠా! వారు ఆర్తభక్తులు, జిజ్ఞాసు భక్తులు, అర్థార్థీ భక్తులు, జ్ఞానీభక్తులు. వారి గురించి వివరంగా చూద్దాము.

ఎ) **ఆర్తః**:– ఆర్తభక్తులు. వారికి ఏదైనా కష్టం ముంచుకువస్తే ఉన్నఫళంగా దేవుడు గుర్తుకు వస్తాడు. అంటే ఇంకో విధంగా చెప్పాలంటే వారికి సమస్య వస్తే గానీ, దేవుడు గుర్తుకు రాడు. అందువల్ల కుంతీదేవి అంటుంది, 'ఓ భగవాన్ నేను నిన్ను మర్చిపోకుండా ఉండటానికి నాకు నిరంతరం ఏదో ఒక సమస్యను ఇస్తూ ఉండు.' సాధారణంగా ఈ భక్తితోనే మొదలుపెడతారు ఎవరైనా. పిల్లలు పరీక్ష రాసే రోజు గట్టిగా భగవంతునికి దండం పెట్టుకుంటారు, ఈ పరీక్ష పాసయ్యేలాగా చెయ్యి లేదా పరీక్ష పేపరు తేలికగా వచ్చేలాగా చెయ్యి అంటారు. వీలుంటే ఇష్టదేవుని గుడికి కూడా వెళ్ళి ఒక దరఖాస్తు పెట్టుకుంటారు. ఇటువంటి భక్తిని ఆర్తభక్తి లేదా దుఃఖనివృత్తి భక్తి అంటారు. ఇలా కష్టం వస్తే మొక్కుకుంటే దేవుడు పరుగెత్తుకు వస్తాడని మన పురాణాల్లో కథలు కూడా ఉన్నాయి.

**వాత్సల్యాదభయప్రధానసమయాదార్తార్తి నిర్వాపణాత్,**
**ఔదార్యాదఘశోషణా దగణితశ్రేయః పదప్రాపణాత్ ।**
**సేవ్యః శ్రీపతిరేక ఏవ జగతామేతేఽ భవన్సాక్షిణః,**
**ప్రహ్లాదశ్చ విభీషణశ్చ కరిరాట్ పాంచాల్యహల్యాధ్రువః ॥**
**ఆర్తత్రాణపరాయణస్స భగవాన్ నారాయణో మే గతిః ॥**

భక్తులు కష్టంలో ఎలుగెత్తి పిలుస్తే భగవంతుడు వెనువెంటనే వచ్చి కాపాడుతాడు. అలా కాపాడబడిన వారు మన పురాణాల్లో ఆరుగురు ఉన్నారు. వారు – ప్రహ్లాదుడు, విభీషణుడు, కరిరాజు (గజేంద్రుడు), పాంచాలి, అహల్య, ధృవుడు అందువల్ల భగవంతుణ్ణి ఆర్తత్రాణ పరాయణుడు అంటారు.

బి) **అర్థార్థీ** – ఆర్తభక్తుడు, తర్వాత అర్థార్థీ భక్తుడు అవుతాడు. అందువల్ల జిజ్ఞాసుకన్నా ముందు ఇది చూస్తున్నాము. ఇతను కష్టం వస్తేనే కాదు, ఏ శుభకార్యం మొదలు పెట్టాలన్నా భగవంతునికి ముందే మొర పెట్టుకుంటాడు. అతనితో వ్యాపార ఒప్పందం కూడా పెట్టుకుంటాడు. నాకు ఇంత లాభం వస్తే, నీకు ఇంత ఇస్తాను అంటాడు. అంటే ముందు రకం భక్తి దుఃఖనివృత్తి కోసం అయితే, ఈ భక్తి సుఖప్రాప్తి కోసం. వ్యాపారం మొదలు పెట్టబోతుంటే కాసులు రాలుస్తున్న నిలువెత్తు లక్ష్మీదేవి ఫోటో పెట్టి, పూజ చేస్తాడు. అలా తనకు కూడా కనకవర్షం కురవాలని ఆశ. అర్థార్థీని విడదీస్తే అర్థ+అర్థీ. అర్థ అంటే ఐశ్వర్యం; అర్థీ అంటే కోరేవారు. అంటే ఐశ్వర్యాన్ని కోరేవాడు. ఐశ్వర్యం అంటే డబ్బే కాదు, ఆస్తి, అంతస్తు, హెూదా ఏదైనా తీసుకోవచ్చు.

ఆర్తభక్తి, అర్థార్థీ భక్తి రెండూ కూడా మందభక్తి కిందకే వస్తాయి. ఇది సకామభక్తి, అంటే ఈ భక్తునికి నిజంగా భగవంతునిమీద భక్తి ఉండదు. తనకు అర్థకామాలు అనే లక్ష్యాలు ఉన్నాయి. వాటిని పొందటానికి మార్గం భగవంతుడు. అంటే భగవంతుడు లక్ష్యం కాదు, మార్గం మాత్రమే. మనకు మన లక్ష్యం పొందగానే, మార్గాన్ని మర్చిపోతాము. ఎందుకంటే మనకు లక్ష్యం ముఖ్యం కాని, మార్గం కాదు. అందువల్ల ఈ భక్తి నిజమైన భక్తి కాదు. ఇది సకామభక్తి.

సి) **జిజ్ఞాసుః** – ఈ భక్తుడికి భగవంతుని గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస, కుతూహలం ఉంటుంది. ఆర్తభక్తుడు, అర్థార్థీ భక్తులలాగా భగవంతుడు ఇతనికి మార్గం కాదు, భగవంతుడే లక్ష్యం. ఇతను ఏమీ కోరికలు కోరడు. ఇతనిది నిష్కామభక్తి. నీ గురించి నేను తెలుసుకోవాలి, దానికోసం ఏదైనా త్యాగం చేస్తాను అంటాడు. ఇతనిది మధ్యమ భక్తి.

డి) **జ్ఞానీ** – జ్ఞాని అంటే భగవంతుడు తనకు భిన్నంగా లేడు, తనే భగవంతుడు అనే జ్ఞానం పొందిన వ్యక్తి. ఇతను ఉత్తమ భక్తుడు. ఇతనికి భగవంతుడు సాధన కాదు సాధ్యం కూడా కాదు. సాధన అంటే మార్గం; సాధ్యం అంటే లక్ష్యం. భగవంతుడు సిద్ధవస్తువు. అంటే భగవంతుణ్ణి పొందేశాడు ముందే. నేనే భగవంతుడు అని తెలుసుకుంటే భగవంతుణ్ణి పొందినట్టే.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ నాలుగు రకాల భక్తుల గురించి చెప్పాడు కాని, ఇదే శ్లోకాన్ని ఇంకో కోణం లోంచి కూడా చూడవచ్చు. అంటే వీళ్ళను నాలుగు రకాల భక్తులుగా కాకుండా ఒకే వ్యక్తి దాటే నాలుగు దశలుగా కూడా తీసుకోవచ్చు.

గణితశాస్త్రంలో ఒక సంఖ్య విలువ తెలుసుకోవటానికి ముందు $x$ అనే అక్షరంతో మొదలు పెడతారు. అనేక విధాలుగా లెక్కలు వేసి $x$ విలువ ఇంత అని చెపుతారు. అలాగే శాస్త్రం మనకు ఒక రూపాన్ని ఇస్తుంది భగవంతుని పేరుతో. తర్వాత మనం మూడు దశలు దాటి, జ్ఞానీభక్తుడుగా మారాలి అంటే నిర్వికారబ్రహ్మను తెలుసుకోవాలి.

అందులో మొదటి దశ ఆర్తభక్తుడు. దుఃఖనివృత్తికోసం పూజ చేస్తాము. దాని తర్వాత అర్థార్థీ భక్తుడుగా ఎదగాలి. దుఃఖనివృత్తికోసం చేసే పూజను ఈ స్థాయిలో సుఖప్రాప్తి కోసం చేస్తాము. రెండూ సకామభక్తి కిందకే వస్తాయి. ఏదో ఒక కోరికతో చేస్తాము. ఈ రెండింటిలోనూ భగవంతుడు సాధన, మన కోరికలు సాధ్యం అని చూశాము.

అలా భగవంతుణ్ణి సాధనగా ముందు చూసినా, పరిపక్వత చెందిన కొద్దీ, ప్రాపంచిక విషయాలు మనం కోరుకునే శాంతి, భద్రత, ఆనందాలు ఇవ్వలేవు అని తెలుసుకుంటాము. ఎప్పుడైతే ప్రపంచంయొక్క పరిమితి తెలుసుకుంటామో, అప్పుడే భగవంతుని విలువ తెలుస్తుంది. ఆయనను సాధనగా చూడటం మానేసి, సాధ్యంగా చూస్తాము. అప్పుడు మన భక్తి సకామభక్తినుంచి నిష్కామభక్తికి మారుతుంది. దీన్ని జిజ్ఞాసుభక్తి అంటారు.

జిజ్ఞాసుభక్తునికి కొన్ని విషయాలు స్పష్టంగా తెలుస్తాయి –

ఎ) శాంతి, భద్రత, ఆనందం బాహ్యవస్తువులలో దొరకవు. భగవంతుడే శాశ్వతమైన శాంతి, భద్రత, ఆనందాలను ఇవ్వగలడు.

బి) భగవంతుణ్ణి పొందటం అంటే బాహ్యంగా జరిగే సంఘటన కాదు. భగవంతుణ్ణి పొందటం అంటే జ్ఞానంద్వారా పొందటం. అంతకు ముందు అతను భగవంతుడు ఎక్కడో కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్నాడని, తను మరణించాక ఆ లోకానికి ప్రయాణం చేసి వెళ్ళాలని అనుకునేవాడు, కాని ఇప్పుడు అతనికి భగవంతుడు సర్వవ్యాపకుడు అనీ, ఆయన లేని చోటంటూ లేదనీ, ఆయన్ని ఇక్కడే ఇప్పుడే పొందవచ్చనీ తెలుసుకుంటాడు. అందువల్ల ఈశ్వరప్రాప్తి = ఈశ్వరజ్ఞానప్రాప్తి. అంతకుముందు భగవంతుణ్ణి చూడాలి అనేవాడు, ఇప్పుడు భగవంతుని గురించిన జ్ఞానం కావాలి అంటాడు. అందువల్ల అతన్ని జిజ్ఞాసువు అంటారు. జిజ్ఞాసువు అంటే భగవంతుని గురించిన జ్ఞానం పొందాలనే కోరిక ఉన్నవాడు.

సి) నేను భగవంతుణ్ణే కోరుకోవాలి; భగవంతుణ్ణి కోరుకోవాలి అంటే భగవంతుని జ్ఞానం పొందాలి అని తెలియటమే కాక, ఆ జ్ఞానం పొందటానికి తనకు అధికారిత్వం ఉండాలని తెలుసు. అంటే అతను చిత్తశుద్ధి పొందాలి. చిత్తశుద్ధి పొందటంకోసం మతాన్ని ఆశ్రయిస్తాడు. మతపరమైన జీవితంనుంచి ఆధ్యాత్మికత ఉన్న మతపరమైన జీవితానికి ఎదుగుతాడు.

మతాన్ని పాటించే వ్యక్తికీ, ఆధ్యాత్మికతను పాటించే వ్యక్తికీ మధ్య ఏమిటి వ్యత్యాసం? లౌకికమతం, ఆధ్యాత్మికమతం అనవచ్చు. ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు పాటించేది లౌకికమతం. అంటే వారు భగవంతునికి పూజ చేస్తారు కాని, లౌకిక విషయాలకోసం చేస్తారు. జిజ్ఞాసుభక్తుడు పాటించేది ఆధ్యాత్మిక మతం. అతను చిత్తశుద్ధికోసం ప్రార్థన చేస్తాడు. చిత్తశుద్ధి ఎందుకు? జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం. జ్ఞానం ఎందుకు? భగవంతుణ్ణి పొందటానికి. భగవంతుణ్ణి పొందటం ఎందుకు? పూర్ణత్వం పొందటానికి.

కర్మయోగి ఆధ్యాత్మిక మతాన్ని పాటించి జిజ్ఞాసుభక్తుడు అవుతాడు. జిజ్ఞాసుభక్తుడు అక్కడితో ఆగడు. జ్ఞానం పొందటానికి జ్ఞానయోగి అవుతాడు. కర్మయోగంనుంచి జ్ఞానయోగానికి రావటానికే సుదీర్ఘమైన ప్రయాణం చెయ్యాలి. జ్ఞానయోగం అంటే ఈశ్వరజ్ఞానం పొందటానికి గురువు ద్వారా శాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. అలా కర్మయోగం, జ్ఞానయోగం విజయవంతంగా ముగిస్తే అతను జ్ఞానీ భక్తుడు అవుతాడు. జ్ఞాని, భగవంతుడు తనకు భిన్నంగా లేడని తెలుసుకుంటాడు. దానివల్ల ఇంతవరకు ఉన్న ద్వైతభక్తి అద్వైతభక్తిగా మారుతుంది.

ఇలా మనం ఈ నాలుగు దశలు దాటాలి. ఒకవేళ మనం ఆర్తభక్తి స్థానంలో ఉంటే ఏమీ చిన్నతనంగా భావించనవసరం లేదు. భగవద్గీత వింటుంటే, ఎప్పటిలా గుడికి వెళ్ళి భగవంతుణ్ణి ఏమైనా కోరికలు కోరవచ్చా అని సందేహం కలుగుతుంది కొందరికి. వెళ్ళొచ్చు, కోరికలు కోరవచ్చు, తప్పేంలేదు. కాని ఎప్పటికీ ఆర్తభక్తునిగా మిగిలిపోవద్దు అంటున్నాడు కృష్ణపరమాత్మ. క్రమేపి ఒక స్థాయినుంచి ఇంకొక స్థాయికి ఎదుగుతూ రావాలి. ఆర్తభక్తుడినుంచి అర్థార్థీభక్తుడయి, అర్థార్థీభక్తుడినుంచి జిజ్ఞాసుభక్తుడి స్థాయికి ఎదిగి, జ్ఞానీభక్తుడిగా అవ్వాలి. ఈ ఎదుగుదలకు మీకు కావాల్సినంత సమయం తీసుకోండి, కొన్ని జన్మలు తీసుకోండి, ఫర్వాలేదు, కాని ఎదగండి, మొదటి దశనుంచి చివరి దశకు రండి అంటుంది శాస్త్రం.

శ్లో. 17 **తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥**
తేషామ్, జ్ఞానీ, నిత్యయుక్తః, ఏకభక్తిః, విశిష్యతే,
ప్రియః, హి, జ్ఞానినః, అత్యర్థమ్, అహమ్, సః, చ, మమ, ప్రియః ॥

| | | | |
|---|---|---|---|
| తేషామ్ | = వారిలో | జ్ఞానినః | = యథార్థముగ నా తత్త్వమును తెలుసుకున్న జ్ఞానికి |
| నిత్యయుక్తః | = నిరంతరము నాయందే మనస్సు నిలిపినవాడును | అహమ్ | = నేను |
| ఏకభక్తిః | = అనన్యమైన భక్తి గల | అత్యర్థమ్ | = అత్యంతము |
| జ్ఞానీ | = జ్ఞానియైనవాడును | ప్రియః | = ఇష్టుడను |
| విశిష్యతే | = శ్రేష్ఠుడు | చ | = ఇంకా |
| హి | = ఎందుకంటే | సః, మమ | = అతడును నాకు |
| | | ప్రియః | = ఇష్టుడు |

**తేషామ్ నిత్య-యుక్తః ఏక-భక్తిః జ్ఞానీ విశిష్యతే ।**

**అహమ్ హి జ్ఞానినః అత్యర్థమ్ ప్రియః (అస్మి), సః (జ్ఞానీ) చ మమ ప్రియః (అస్తి) ॥**

తా: వారిలో నిరంతరము నాయందే మనస్సును నిలిపినవాడును, అనన్యమైన భక్తి గల జ్ఞానియైనవాడును శ్రేష్ఠుడు. ఎందుకంటే యథార్థముగ నా తత్త్వమును తెలుసుకున్న జ్ఞానికి నేను అత్యంతము ఇష్టుడను ఇంకా అతడును నాకు ఇష్టుడు.

నాలుగు రకాల భక్తులను లేదా ఇంకో విధంగా చెప్పాలంటే నాలుగు స్థాయిల భక్తిని వర్ణించాడు కృష్ణపరమాత్మ. కాని ఇలా నాలుగు స్థాయిలు ఉన్నాయనగానే మానవనైజం వాటిలో ఏది గొప్పది అన్న ప్రశ్నను రేకెత్తిస్తుంది. అందువల్ల కృష్ణపరమాత్మ, తనే చెపుతున్నాడు ఎవరు గొప్పవారో!

**తేషాం జ్ఞానీ విశిష్యతే** - నాలుగు రకాల భక్తులలో, జ్ఞానీ భక్తి లేదా జ్ఞానీ భక్తుడు అందరికన్నా గొప్పవాడు. ఈ విషయాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే దీనివల్ల అనేక అపోహలు తొలగుతాయి.

ఎ) కలియుగంలో జ్ఞానయోగం అత్యంత కష్టమైనదనీ, అంత తేలికగా నేర్చుకోలేమనీ, భక్తియోగంతో ఆగిపోదామనీ అనుకుంటారు చాలామంది. కాని దీనివల్ల మనకు భక్తియోగంతో ఆగిపోకూడదనీ, జ్ఞానయోగానికి వచ్చి తీరాలనీ తెలుస్తున్నది. మొదట్లో కర్మయోగం పాటించవచ్చు కాని అక్కడే ఆగిపోకూడదు. కర్మయోగంవల్ల చిత్తశుద్ధి పొంది జ్ఞానయోగానికి వచ్చి తీరాలి.

బి) ఆత్మజ్ఞానం ధ్యానంలో కలుగుతుందని ఇంకొక అపోహ. నిర్వికల్పసమాధిలోకి వెళ్ళాలనీ, అప్పుడు ఆత్మసాక్షాత్కారం అవుతుందనీ అనుకుంటారు వారు. ధ్యానం వేరు నిదిధ్యాసనం వేరు. జ్ఞానానికి రాకముందు చేసేదాన్ని ధ్యానం అంటారు. అది చిత్త ఏకాగ్రతను, చిత్తవైశాల్యతను ఇస్తుంది. కాని జ్ఞానం పొందాక చేసే ధ్యానాన్ని నిదిధ్యాసనం అంటారు. ఆ నిదిధ్యాసనంలో తను ఆత్మ గురించి నేర్చుకున్న విషయాలను గుర్తుకు తెచ్చుకుని, దానిమీద నిలుస్తాడు. కొత్తగా ఏమీ నేర్చుకోడు, నేర్చుకున్నదాన్ని జీర్ణించుకుంటాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**

**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** - 4.34

జ్ఞానయోగం అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యటం. శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థుడైన ఆచార్యుని దగ్గర శాస్త్రాన్ని నేర్చుకోవటం. మననం అంటే నిశ్చయజ్ఞానం పొందటం. నిదిధ్యాసనం అంటే ఇప్పుడే చూశాము. శాస్త్రం నిర్గుణబ్రహ్మ గురించే కాక, సగుణబ్రహ్మ గురించి కూడా బోధిస్తుంది.

భాగవతం అందరూ చదువుతారు. అందులో ఎన్నో కథలు - అజామిలోపాఖ్యానం, జడభరతోపాఖ్యానం లాంటివి ఉన్నాయి. ఆ కథల్లో సగుణబ్రహ్మ వివరణ, నిర్గుణబ్రహ్మ తత్త్వం రెండూ వస్తాయి. కాని చాలామంది ఏం చేస్తారంటే ఆ కథలను జనరంజకంగా వర్ణించి చెపుతారు కాని, నిర్గుణబ్రహ్మ తత్త్వాన్ని నిశ్శబ్దంగా వదిలివేస్తారు. అలా కాకుండా రెండూ నేర్చుకోవాలి. అంటే జ్ఞానానికి వచ్చి తీరాలి.

సి) జ్ఞానం పొందితే భక్తి ఉండదు – ఇదొక పెద్ద అపోహ. కొంతమంది అంటారు కూడా, జ్ఞానమార్గానికి వచ్చాక నాకు భక్తి సన్నగిల్లింది అని. అలా అన్నారంటే వారికి వేదాంతం సరిగ్గా అర్థం కాలేదు అనుకోవాలి. వారికి వేదాంతం సరిగ్గా అర్థమయితే భక్తి మటుమాయమవదు. ఈ మాట కృష్ణపరమాత్మే చెబుతున్నాడు. అన్ని రకాల భక్తుల్లోకీ జ్ఞాని శ్రేష్ఠుడు అంటున్నాడు. జ్ఞాని అంటే వేదాంతజ్ఞాని, అద్వైతజ్ఞాని, పరాప్రకృతిజ్ఞాని, నిర్గుణ ఈశ్వరజ్ఞాని.

**నిత్యయుక్తః** – ఎందుకు ఈ జ్ఞాని గొప్పవాడు? అతను నిత్యమూ దైవస్వరూపంలోనే నెలకొని ఉంటాడు. ద్వైతభక్తిలో భగవంతుణ్ణి ఆవాహన చేస్తాము, ఉద్వాసన చేస్తాము. అంటే ద్వైతభక్తిలో భగవంతునికి రాకపోకలు ఉన్నాయి. వచ్చి దీవించి, వెళ్ళిపోతాడు. కాని జ్ఞానభక్తిలో దేవుడు ఎన్నటికీ నాకు దూరంగా ఉండడు. నేనే దేవుణ్ణి కాబట్టి. అందువల్ల జ్ఞానీభక్తుడు ఈశ్వరనిష్ఠలో ఉంటాడు.

**ఏకభక్తిః** – అతనికి అద్వైతభక్తి ఉంటుంది.

ఇక్కడ ఒక అద్భుతమైన విషయం గుర్తు తెచ్చుకోవాలి. బృహదారణ్యకోపనిషత్తులో మైత్రేయీబ్రాహ్మణంలో మనిషి ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తాడో వివరిస్తాడు యాజ్ఞవల్క్యుడు. అక్కడ అతను చెప్పిన విషయం ఒక పిడుగులాగా ఉంటుంది.

**న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవతి**

**ఆత్మనస్తు కామాయ పతిః ప్రియో భవతి।** – బృహదారణ్యకం 2.4.5

ఓ మైత్రేయీ భర్తను భర్త లక్షణాలకోసం ప్రేమించదు భార్య. తనకు భర్త ప్రియం కలుగజేస్తాడు కాబట్టి ప్రేమిస్తుంది అంటాడు. ఒక్క భర్తనే కాదు, ఒక పెద్ద పట్టికనే ఇస్తాడు, భార్యను, పిల్లలను, బంధువులను, స్నేహితులను ఎవరినీ నిజంగా ప్రేమించరు ఎవరూ అంటాడు. పిల్లలే లోకంగా గడుపుతున్నామని భావించేవారికి ఇదొక పెద్ద అశనిపాతం! పిల్లలను ప్రేమించేది కూడా తమ కోసమే అంటే తమకు ఆనందం కలుగజేస్తారు కాబట్టి ప్రేమిస్తారు. తమకు దుఃఖం కలిగించేవారిని ప్రేమించరు. వారు ఆశించినట్టుగా ఉన్నంతవరకూ భార్యను కానీ, పిల్లలను కానీ ప్రేమిస్తారు. ఇది నగ్నసత్యం.

**యావద్విత్తోపార్జనసక్తః స్తావన్నిజపరివారో రక్తః**

**పశ్చాజ్జీవతి జర్జరదేహే వార్తామ్ కోఽపి న పృచ్ఛతి గేహే** – భజగోవిందం

ఉద్యోగం చేస్తున్నంతసేపు రాచమర్యాదలు పొందుతాము. 'ఉద్యోగానంతరం చూడవలెనమ్మ ఆ అయ్య సౌభాగ్యముల్, ' అన్నారు. పదవీ విరమణ తర్వాత ఎవరూ పట్టించుకోవటం లేదని వాపోతారు. అంటే వారు వారి స్వార్థంకోసం మనను ప్రేమించినట్టేగా! అంటే ఎదుటి వ్యక్తిమీద ప్రేమ షరతులతో కూడినది. అది తీరితేనే ప్రేమిస్తాము. లేకపోతే లేదు.

శాస్త్రం ఇంకొక అడుగు ముందుకు వేస్తుంది. భగవంతునిమీద భక్తి కూడా షరతులతో కూడినదే! 'నేను భగవంతుణ్ణి ఎంత పూజించాను? ఎన్ని పూజలు చేశాను? కాని నా కూతురి పెళ్ళి కుదర్చలేకపోయాడు. దానితో

నాకు కోపం వచ్చింది, నేను భక్తి పుస్తకాలన్నీ కట్టకట్టి చెత్తబుట్టలో పారేశాను. పూజలు చెయ్యటం మానేశాను,' అంటారు కొందరు. అంతవరకూ చాలా భక్తి ఉన్నవారు కూడా, హఠాత్తుగా వారి జీవితంలో ఏదైనా పెద్ద దుర్ఘటన జరిగితే, 'అసలు భగవంతుడు ఉన్నాడా?' అనే పరిస్థితికి కూడా వస్తారు.

అందువల్ల నన్ను నేను ప్రేమించుకోవటం అత్యుత్తమ ప్రేమ; ఎదుటి వ్యక్తిని, దేవునితో సహా, ప్రేమించటం షరతులతో కూడినది. అందువల్ల ఉపనిషత్తు అద్భుతమైన తర్కాన్ని ఉపయోగిస్తున్నది. దేవునిమీద భక్తి అత్యుత్తమ ప్రేమగా ఉండాలంటే ఏం చెయ్యాలి? ఊహించగలరా? ముందేం చూశాము? నన్ను నేను ప్రేమించు కోవటం అత్యుత్తమ ప్రేమ అన్నాము. భగవంతునిమీద అత్యుత్తమ ప్రేమ ఉండాలి అన్నాము. అదెప్పుడు సాధ్యం? భగవంతునికీ, నాకూ మధ్య దూరం లేనప్పుడు. ఇంకా చెప్పాలంటే నేనూ–భగవంతుడూ ఐక్యం అయినప్పుడు. అది జ్ఞాని ఒక్కడే అర్థం చేసుకోగలడు. జ్ఞానికి మాత్రమే భగవంతునిమీద ప్రేమ తనమీద ప్రేమతో సమానం. అందువల్ల అది అత్యుత్తమ ప్రేమ. ఏకభక్తిర్విశిష్యతే.

**ప్రియో హి జ్ఞానినః అత్యర్థమ్** – జ్ఞాని అత్యంత గొప్ప భక్తుడు. అతనికి నేను చాలా ప్రియమైన వ్యక్తిని అంటున్నాడు కృష్ణపరమాత్మ. దీని వెనక తర్కం గమనించారా? జ్ఞానికి కూడా తనంటేనే చాలా ఇష్టం, కాని తను ఎవరు? భగవంతునికి భిన్నంగా లేని తను. అందువల్ల అతనికి నేను ప్రియతమం అవుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంతే కాదు,

**అహం స చ మమ ప్రియః** – నాకు కూడా అతను చాలా ఇష్టమైనవాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే కృష్ణపరమాత్మ, జ్ఞాని ఒక్కరే కాబట్టి.

శ్లో. 18 **ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥**
ఉదారాః, సర్వే, ఏవ, ఏతే, జ్ఞానీ, తు, ఆత్మా, ఏవ, మే, మతమ్,
ఆస్థితః, సః, హి, యుక్తాత్మా, మామ్, ఏవ, అనుత్తమామ్, గతిమ్ ॥

| | | | |
|---|---|---|---|
| ఏతే | = ఈ చతుర్విధభక్తులు | సః | = అటువంటి భక్తుడు |
| సర్వే, ఏవ | = అందరూ | యుక్తాత్మా | = తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగా నిల్పినవాడై |
| ఉదారాః | = ఉదారులే | అనుత్తమామ్ | = అత్యుత్తమ |
| తు | = కాని | గతిమ్ | = లక్ష్యమైన |
| జ్ఞానీ | = జ్ఞానియైనవాడు మాత్రము | మామ్, ఏవ | = నాయందే |
| ఆత్మా, ఏవ | = (సాక్షాత్తుగా) నా స్వరూపమే, అని | ఆస్థితః | = నిలిచి ఉన్నాడు |
| మే, మతమ్ | = నా అభిప్రాయము | | |
| హి | = ఎందుకంటే | | |

**ఏతే సర్వే ఏవ ఉదారాః (సన్తి), జ్ఞానీ తు (మమ) ఆత్మా ఏవ (అస్తి ఇతి) మే మతమ్ ।**
**సః హి యుక్త–ఆత్మా అనుత్తమామ్ గతిమ్ మామ్ ఏవ ఆస్థితః (అస్తి) ॥**

తా: ఈ చతుర్విధభక్తులు అందరూ ఉదారులే కాని జ్ఞానియైనవాడు మాత్రము (సాక్షాత్తుగా) నా స్వరూపమే, అని నా అభిప్రాయము. ఎందుకంటే అటువంటి భక్తుడు తన మనస్సును, బుద్ధిని నాయందే స్థిరముగా నిల్పినవాడై అత్యుత్తమ లక్ష్యమైన నాయందే నిలిచి ఉన్నాడు.

జ్ఞానీభక్తుడు నాకు ఇష్టం అని కృష్ణపరమాత్మ చెప్పగానే తక్కిన భక్తులకు, అయితే కృష్ణపరమాత్మకు మేమంటే ఇష్టం లేదా అని సందేహం రావచ్చు. అందువల్ల అలాంటి శంక పెట్టుకోవద్దని హామీ ఇస్తున్నాడు.

**ఏతే సర్వే ఏవ ఉదారాః** – అందరు భక్తులూ గొప్పవారే! అంటే 16వ మంత్రంలో చూసిన నాలుగు రకాల భక్తులనూ తీసుకోవాలి. వారు ఆర్తభక్తులు, అర్థార్థిభక్తులు, జిజ్ఞాసుభక్తులు, జ్ఞానీభక్తులు.

**జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** – కాని జ్ఞానీభక్తుడు, నా స్వరూపమే. ఇది ఒక మహావాక్యమంత్రం. జ్ఞానికి, భగవంతునికి మధ్య ఐక్యాన్ని సూచిస్తున్నది. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని సూచించే వాక్యాన్ని మహావాక్యం అంటారు.

తక్కిన భక్తులది ద్వైతభక్తి. వారు వేరు, భగవంతుడు వేరు. అందువల్ల వారి భక్తి షరతుతో కూడినది. జ్ఞాని గొప్పతనం ఏమిటి?

**స హి యుక్తాత్మా** – నాయందే తన మనస్సును, బుద్ధిని నిలుపుతాడు. అంటే అతని జీవన లక్ష్యమేమిటో స్పష్టమైన అవగాహన ఉంది అతనికి.

**మామ్ ఏవ అనుత్తమాం గతిమ్ ఆస్థితః** – అతను జీవితంలో అత్యుత్తమ లక్ష్యానికి వచ్చాడు. అది నేనే అంటున్నాడు కృష్ణపరమాత్మ. గతి అంటే లక్ష్యం. దీని గురించి వివరంగా తరువాత చెబుతాడు కృష్ణపరమాత్మ.

ఆర్తభక్తునికి, అర్థార్థీభక్తునికీ కూడా లక్ష్యాలు ఉంటాయి, కాని అవి అత్యుత్తమ లక్ష్యాలు కావు. అవి పరిమితి ఉన్న లక్ష్యాలు. ఇది చూపించటానికి భాగవతంలో ఒక అద్భుతమైన కథ వస్తుంది. ఒక జంటకు పిల్లలు లేరు. వారు ఒక ఋషిని వేడుకుంటారు, తమకు మోక్షం కూడా అవసరం లేదనీ, పుత్రుడు పుడితే చాలనీను. అలాగే ఋషి వారిని దీవిస్తాడు. ఋషి దీవెన ఫలించి పుత్రుడు పుడతాడు. కాని కొన్నాళ్ళకే ఆ పిల్లవాడు మరణిస్తాడు. పుట్టుట గిట్టుట కొరకే అంటారు. సరిగ్గా ఆ పిల్లవాడు మరణించినప్పుడే ఆ ఋషి మళ్ళీ వస్తాడు. వీరు చాలా బాధపడుతుండటం చూసి, 'సరే, చనిపోయిన మీ అబ్బాయితో మిమ్మల్ని మాట్లాడిస్తాను,' అంటాడు. అలాగే ఆ అబ్బాయి కనిపిస్తాడు. 'నీ తల్లిదండ్రులము మేము,' అంటారు. 'ఏ జన్మలో తల్లిదండ్రులు మీరు?' అంటాడు. ఎందుకంటే ఆ జీవుడు అనేక జన్మలనెత్తుతాడు, ఒక్కొక్క జన్మలో ఒక్కొక్క తల్లిదండ్రులు ఉంటారు. ఒక శరీరం రాలిపోతే ఆ శరీరానికి సంబంధించిన బంధాలు కూడా రాలిపోతాయి. ఈ విధంగా బంధాలు శాశ్వతం కాదని తెలుసుకుంటారు ఆ దంపతులు.

**ఋణానుబంధ రూపేణ, పశుపత్నీ సుతాలయః ।**

**ఋణక్షయే క్షయం యాంతి, తత్ర కా పరివేదనా ॥**

అత్యంత గొప్ప అనుబంధం కూడా రాకపోకలకు లోను కావలిసిందే! అలాగే ఏ లక్ష్యం కూడా పరిమితి ఉన్నదే. ఒక్క మోక్షమే అత్యుత్తమమైనది.

శ్లో. 19 **బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥**
బహూనామ్, జన్మనామ్, అంతే, జ్ఞానవాన్, మామ్, ప్రపద్యతే,
వాసుదేవః, సర్వమ్, ఇతి, సః, మహాత్మా, సుదుర్లభః ॥

| | | | |
|---|---|---|---|
| బహూనామ్ | = అనేకములైన | ఇతి | = అని భావించి |
| జన్మనామ్ | = జన్మముల | మామ్ | = నన్ను |
| అంతే | = అంతమున | ప్రపద్యతే | = భజించును |
| జ్ఞానవాన్ | = భగవత్తత్త్వమును తెలుసుకున్న జ్ఞాని | సః, మహాత్మా | = అటువంటి మహాత్ముడు |
| సర్వమ్ | = సమస్తము | సుదుర్లభః | = లభించుట అరుదు |
| వాసుదేవః | = వాసుదేవ మయమే | | |

**జ్ఞానవాన్ బహూనామ్ జన్మనామ్ అన్తే వాసుదేవః**
**సర్వమ్ ఇతి (అనుభూయ) మామ్ ప్రపద్యతే । సః మహాత్మా సుదుర్లభః ॥**

తా: అనేకములైన జన్మముల అంతమున భగవత్తత్త్వమును తెలుసుకున్న జ్ఞాని సమస్తము వాసుదేవ మయమే అని భావించి నన్ను భజించును. అటువంటి మహాత్ముడు లభించుట అరుదు.

ఇక్కడ కృష్ణపరమాత్మే చెపుతున్నాడు భక్తిలో ఈ నాలుగు రకాల దశలనూ ఒక్క జన్మలోనే ఎవరూ పొందలేరు. దానికి సమయం పడుతుంది; దానికి పరిపక్వత కావాలి. ఒకవేళ మనం నీరు లేకుండా చాలా అవస్థ పడుతున్నామనుకోండి, అప్పుడు భగవంతుడు ప్రత్యక్షమయి, 'నేను కావాలా, నీరు కావాలా?' అంటే ముందు నీరే కావాలంటాము. అలాగే ఏదైనా సమస్యలతో సతమతమవుతుంటే, ఆ సమస్యలకు పరిష్కారం గురించి తపించిపోతాము. అందువల్లనే ఎవరో మహాత్ముడు అన్నాడు, 'ఆకలితో అలమటించి పోతున్న వ్యక్తికి కావల్సింది అన్నం, హితబోధ కాదు.'

అందువల్ల మొదట్లో భక్తిని అనేక ఐహికసుఖాలు తీరటంకోసం వాడతాము. మోక్షం ముఖ్యం కాదు అప్పుడు. అందువల్ల మనకు పురుషార్థాల్లో కామపురుషార్థం కూడా ఉంది. నిజానికి వేదపూర్వభాగం అంతా మన కోరికలు తీర్చుకోవటానికి అనేక కర్మలను ఇచ్చింది. సకామభక్తి చూపటం పాపం కాదు, కాని ఎప్పుడో ఒకప్పుడు కోరికలంటే విసుగుపుట్టి, ఇంకేదో కావాలి అనిపించాలి. అది వృద్ధాప్యంలో అనిపించినా ఫర్వాలేదు, కనీసం కొంత మార్పు వచ్చినట్టే, వచ్చే జన్మలోనైనా మోక్షం కావాలి అనిపించవచ్చు.

**బహూనాం జన్మనామ్ అంతే –** అనేక జన్మల తర్వాత మోక్షంమీద ఇష్టం ఏర్పడుతుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. అనేక జన్మల తర్వాత అనగానే నీరసించిపోనవసరం లేదు. దీని ముందు అనేక జన్మలు గడిచి ఈ జన్మలో మోక్షం విలువ తెలియవచ్చు. ముముక్షుత్వం ఏర్పడవచ్చు.

**జ్ఞానవాన్ (భవతి)** – జ్ఞాని అవుతాడు. ఇది భక్తిలో నాలుగవ దశ అని చూశాము. అతను ఎలా జ్ఞానం పొందుతాడు? వేదాంత శ్రవణ,మనన,నిదిధ్యాసనలద్వారా; గురు ఉపదేశంద్వారా జ్ఞానం పొందుతాడు.

**మాం ప్రపద్యతే –** నన్ను పొందుతాడు. నాలో ఐక్యం అవుతాడు; నాకు–అతనికీ మధ్య దూరం ఉండదు. అతను జ్ఞానం పొందుతాడు సరే, అతను పొందే జ్ఞానం ఏమిటి?

**వాసుదేవః సర్వమ్ ఇతి** – సర్వమూ వాసుదేవ మయమే అని తెలుసుకుంటాడు. ఈ వాసుదేవుడు ఎవరు? వసుదేవుని పుత్రుడు అయిన కృష్ణుడు కాదు. ఒక రూపంలో పూజించే భగవంతునికి దేశ, కాల, వస్తుపరిమితి ఉంటుంది. అందువల్ల వాసుదేవుడు అంటే సగుణరూపం కాదు; నిర్గుణబ్రహ్మ, సద్రూపబ్రహ్మ.

**వసంతి సర్వాణి భూతాని అస్మిన్ ఇతి వాసుః**

అన్ని జీవరాశుల్లోనూ ఉన్న సత్ లేదా ఉనికి. దేవః అంటే చిత్ లేదా చైతన్యం. **స్వయం ప్రకాశతే ఇతి దేవః.** వాసుదేవుడు అంటే సద్రూపబ్రహ్మ, చిద్రూపబ్రహ్మ. రూపం లేని కృష్ణపరమాత్ముడు, మొత్తం జగత్తు అంతా ఆయన రూపమేనని సాధకుడు తెలుసుకుంటాడు.

**స మహాత్మా** – అటువంటి జ్ఞాని మాత్రమే మహాత్ముడు; అత్యుత్తమ వ్యక్తి.

**సుదుర్లభః** – కాని అటువంటి వ్యక్తి చాలా అరుదు.

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**

**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥** – 7.3

కృష్ణపరమాత్మే ఈ అధ్యాయం మొదట్లో చెప్పాడు. మనుష్యుల్లో మోక్షం కోరేవారే చాలా అరుదు; కోరినా కూడా ఈ దశకి వచ్చేవారు ఇంకా అరుదుగా ఉంటారు. అందువల్ల నువ్వు జ్ఞానీభక్తుడవుగా మారాలి అన్నాడు. ఆర్తభక్తితో మొదలు పెట్టవచ్చు కాని ఈ దశకు చేరుకోవాలి.

సంసారం గురించి పదమూడవ శ్లోకంలో మాట్లాడాక 14–19 శ్లోకాల వరకూ సంసారనివృత్తి గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. సంసారసమస్య ఏమిటి? ప్రతి వ్యక్తీ ప్రాథమికంగా మూడు అంశాలు కోరుకుంటాడు– శాంతి, భద్రత, ఆనందం. కాని వచ్చిన చిక్కేమిటంటే వాటిని ఎక్కడ పొందాలో తెలియదు. వాటిని పరాప్రకృతిలోనే పొందగలము. పరాప్రకృతి అంటే భగవంతుని పారమార్థిక స్వరూపం. అది తెలియక బాహ్యవస్తువుల్లో వెతుక్కుంటాడు మనిషి. అవి శాశ్వతం కాదు. అందువల్ల శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవు.

**యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి** – ఛాందోగ్యం 7.23.1

అల్పవస్తువు ఆనందాన్ని ఇవ్వలేదు. పూర్ణవస్తువు మాత్రమే ఆనందాన్ని ఇవ్వగలదు. అల్పవస్తువు ఆనందాన్ని ఇచ్చినట్టు అనిపించినా అది అసలైన ఆనందం కాదు. దానితో బాధ, దుఃఖం, నిరాశలకు లోనవుతాడు మనిషి. దీనికి పరిష్కారం ఏమిటి? భక్తి మాత్రమే. ప్రపంచంమీద ఆధారపడటం మాని భగవంతునిమీద ఆధారపడటం నేర్చుకోవాలి. కాని అక్కడతో కూడా ఆగకూడదు. నాలుగు రకాల భక్తి గురించి చెప్పి, జ్ఞానంతో కూడిన భక్తి

గొప్పదన్నాడు. ఎందుకు? అది భగవంతునిమీద ఆధారపడే దశనుంచి నామీద ఆధారపడే దశకు తీసుకువెళుతుంది. నామీద ఆధారపడటమంటే నేను వేరు, భగవంతుడు వేరు కాదు అనే జ్ఞానం పొందటం. అప్పుడు సంసారంనుంచి విడివడి, మోక్షం పొందుతాను. కాని అందరూ ఈ చివరి దశకు అంత తేలికగా చేరుకోలేరు, అసలు ఒక్క జన్మలోనే నాలుగు దశలూ దాటలేరు అన్నాడు.

**4.భక్తిలో రెండు రకాలు- శ్లోకాలు 20-30 ఉపోద్ఘాతం**

రాబోయే శ్లోకాల్లో కృష్ణపరమాత్మ భక్తిని రెండు రకాలుగా విభజిస్తున్నాడు. అవి సకామభక్తి, నిష్కామభక్తి. 20-26 వరకూ సకామభక్తియొక్క లాభనష్టాలు; 27-30 వరకూ నిష్కామభక్తియొక్క ప్రయోజనం చెప్పబోతున్నాడు. ఈ రెండింటినీ బేరీజు వెయ్యబోతున్నాడు.

**సకామభక్తి శ్లోకాలు 20-26** - భక్తి అంటే దైవాన్ని ఆరాధించటం, పూజించటం. సకామభక్తి అంటే దైవంమీద ఉన్న భక్తిని జీవితంలో ఉన్న అశాశ్వతమైన లక్ష్యాలను పొందటానికి ఉపయోగించటం. మనిషికి నాలుగు పురుషార్థాలు ఉన్నాయి. అవి ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. ధర్మార్థకామాలను అశాశ్వతమైన లక్ష్యాలు అంటారు.

అర్థ అంటే అన్ని రకాల సంపదలు. అవి ఈరోజు ఉంటాయి, రేపు పోతాయి. కామ అంటే ఐహికసుఖాలు. సుఖాలు కూడా శాశ్వతం కావు. ధర్మ అంటే మనిషి చేసుకున్న పుణ్యం. అది అతనిని ఊర్ధ్వలోకాలకు తీసుకువెళుతుంది. కాని శాస్త్రం భువర్లోక, సువర్లోక, మహర్లోకాలలాంటి లోకాలు కూడా శాశ్వతం కాదు అంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే భగవంతుడు తప్ప అన్నీ అశాశ్వతాలే. భగవంతుడు తప్ప అన్నీ కాలం, దేశంలోకి వస్తాయి. కాలానికి, దేశానికి కూడా పరిమితులు ఉన్నాయి.

ఇదే విషయాన్ని మతపరంగా చెపితే, దేవుడు ఒక్కటే శాశ్వతం, తక్కిన లక్ష్యాలన్నీ అశాశ్వతం; కఠోపనిషత్తు భాషలో చెప్పాలంటే ఈ మూడు లక్ష్యాలూ ప్రేయస్‌లోకి వస్తాయి, అవి అశాశ్వతం; వేదాంతపరిభాషలో చెప్పాలంటే పరిమితి ఉన్న లక్ష్యాలన్నీ అనాత్మ.

సకామభక్తి ఒక ఫక్తు వ్యాపారం లాంటిది. నేనిది చేస్తాను, నాకు నువ్వు ఇది చెయ్యి అన్నా కొంత నయమే. కాని మనం ఏంచేస్తాము? ముందు నాకిది చెయ్యి, నువ్వు ఇది చేస్తే నేను అది ఇస్తాను అంటాము. ఒక భక్తుడు వేంకటేశ్వరస్వామితో తన డైమండ్ ఉంగరం బేరం పెట్టాడు. అతనికి చాలా పెద్ద జబ్బు చేసింది. తనకు నయం చేస్తే ఆ డైమండ్ ఉంగరాన్ని హుండీలో వేస్తానన్నాడు. పాపం ఆ భగవంతుడు అతన్ని నమ్మి, అతని రోగం నయం చేశాడు. కాని ఆ భక్తుడు అతితెలివి చూపిద్దామనుకున్నాడు.

అతను ఉంగరం వేస్తానన్న రోజుకీ; అతని జబ్బు నయమయి, అతను తిరుపతికి వెళ్ళే రోజుకీ మధ్యలో బంగారం ధర బాగా పెరిగిపోయింది. అందుకని తను మొక్కుకున్న రోజుకి బంగారం విలువ ఎంతుందో లెక్కకట్టి, అంత సొమ్ము హుండీలో వేశాడు. అతను తెలివైనవాడైతే, భగవంతుడు ఇంకా తెలివైనవాడు. అతను డబ్బులు వేస్తుండగా, అతని చేతి ఉంగరం కూడా జారి హుండీలో పడిపోయింది. పడిపోయిన దాన్ని తిరిగి తీసుకోలేడు. కాని ఇటువంటి భక్తిని సకామభక్తి అంటారు.

**నిష్కామభక్తి శ్లోకాలు 27–30** – నిష్కామభక్తిలో ఐహికసుఖాల గురించిన కోరిక ఉండదు. నిష్కామభక్తి అంటే అసలు కోరికలేని భక్తి అని కాదు అర్థం. నిష్కామభక్తిలో కూడా కోరిక ఉంటుంది కాని అది భగవంతుణ్ణి తెలుసుకోవాలనే కోరిక. అతనికి ధర్మార్థకామాలమీద కోరిక లేదు; మోక్షంమీద కోరిక ఉంది. కృష్ణపరమాత్మ చెప్పిన మూడవ రకం భక్తుడు అంటే జిజ్ఞాసుభక్తుడు ఇందులోకి వస్తాడు. మొదటి రెండు రకాల భక్తులు అంటే ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు సకామభక్తుడిలోకి వస్తారు.

భక్తిలో ఈ రెండు రకాలూ ఫర్వాలేదు కాని, ఎప్పటికన్నా సకామభక్తినుంచి నిష్కామభక్తికి రావాలంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని ప్రత్యేకమైన భాషతో చెబుతున్నాడు. భగవద్గీతలో కృష్ణపరమాత్మ నిర్గుణబ్రహ్మకు ప్రతీక. అందువల్ల తక్కిన దేవుళ్ళందరూ పరిమితి ఉన్న దేవుళ్ళలోకి వస్తారు. నిజానికి కృష్ణపరమాత్మను కూడా సగుణబ్రహ్మగా కొలిస్తే ఆయనకు కూడా పరిమితి ఉంది. ఆయన జన్మదిన వేడుకలు చేసుకుంటాము; ఆయన నిర్యాణం గురించి చెప్పుకుంటాము. కృష్ణునికి కూడా ఒక నామం, ఒక రూపం ఉంది.

అందువల్ల వ్యక్తిగత దేవుడు ఎవరైనా పరిమితమైన దేవుడే. కాని వ్యక్తిగత దేవుడు నిర్గుణబ్రహ్మను సూచిస్తాడు. జాగ్రత్తగా చూడండి, సగుణబ్రహ్మకు పరిమితి ఉంది; కాని ఏ సగుణబ్రహ్మను తీసుకున్నా ఆయన నిర్గుణబ్రహ్మకు ప్రతీక. ఒక జాతీయజెండాను తీసుకుంటే జెండాగా చూస్తే అది చాలా చిన్నది కాని అది ఒక పెద్ద దేశానికి ప్రతీక. స్వాతంత్ర్యదినోత్సవం రోజు జెండావందనం చేస్తాము అంటే దేశానికి వందనం చేసినట్టుగా భావిస్తాము.

మనకు ఎందరో దేవుళ్ళు ఉన్నారు. రాముడు, కృష్ణుడు, అయ్యప్ప, వేంకటేశ్వరస్వామి, అలా ముక్కోటి దేవతలు ఉన్నారు. ఏ దేవుణ్ణి తీసుకున్నా ఆయన నిర్గుణబ్రహ్మయొక్క సగుణ ఆకారమే. శివపురాణం చదివితే, శివుని గొప్పదనం చూస్తాము; ఆయనే సర్వాంతర్యామి అంటారు. అలా విష్ణుపురాణం చూస్తే విష్ణువు సర్వాంతర్యామి; దేవీభాగవతం చదివితే దేవీశక్తి గొప్పది. తక్కిన దేవుళ్ళు ఆవిడకి మొక్కాలి. ఏ దేవుడు గొప్ప అంటే మనం ఏ దేవుణ్ణి ఇష్టదేవునిగా కొలిస్తే ఆయన నిర్గుణబ్రహ్మను సూచిస్తాడు.

ఒక చెక్‌బుక్‌లో ఏ కాగితం గొప్పది? కాగితాలుగా ఉన్నప్పుడు అన్నీ సమానమే. వాటిమీద రాసిన అంకెలనుబట్టి వాటి విలువ పెరుగుతుంది. మొదటి కాగితంమీద పదిరూపాయలు రాసి, నాలుగవ కాగితంమీద ఒక లక్షరూపాయలు రాస్తే, సహజంగానే నాలుగవ కాగితం విలువ ఎక్కువ. శివుడు గొప్పవాడా, విష్ణువు గొప్పవాడా అని భక్తులు పోట్లాడుకుంటారు కాని వారి మధ్య భేదం లేదు. వారు నిర్గుణబ్రహ్మకు వివిధ రూపాలు.

ఇక్కడ భగవద్గీతలో కృష్ణపరమాత్మను ముందు శ్లోకంలో వాసుదేవః సర్వమ్ అని చూశాము. సర్వమూ వాసుదేవ మయమే. వాసుదేవుడు అంటే వసుదేవుని పుత్రుడు అయిన కృష్ణుడు కాదు, నిర్గుణబ్రహ్మ, సత్‌బ్రహ్మ. అందువల్ల రాబోయే శ్లోకాల్లో సకామభక్తి అంటే అన్యదేవతా భక్తి అని వస్తుంది. అంటే కృష్ణపరమాత్మ కాకుండా తక్కిన దేవతలందరూ. కృష్ణభక్తి నిష్కామభక్తిలోకి వస్తుంది. ఈ వివరణను గుర్తు పెట్టుకుని ఈ శ్లోకాలను చూడాలి.

శ్లో. 20 **కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతేఽన్యదేవతాః ।**
**తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా ॥**

కామైః, తైః, తైః, హృతజ్ఞానాః, ప్రపద్యంతే, అన్యదేవతాః,
తమ్, తమ్, నియమమ్, ఆస్థాయ, ప్రకృత్యా, నియతాః, స్వయా ॥

| | | | |
|---|---|---|---|
| తైః, తైః, కామైః | = నానావిధములైన ఆయా భోగవాంఛలచే | తమ్, తమ్ | = వారి వారి (ఆయా) |
| | | నియమమ్ | = నియమములను |
| హృతజ్ఞానాః | = పోగొట్టుకున్న జ్ఞానము గలవారు | అస్థాయ | = పాటించి |
| స్వయా, ప్రకృత్యా | = తమ స్వభావములచే | అన్యదేవతాః | = ఇతర దేవతలను |
| నియతాః | = ప్రేరితులై | ప్రపద్యంతే | = ఆరాధింతురు |

**తైః తైః కామైః హృత-జ్ఞానాః స్వయా ప్రకృత్యా నియతాః**
**(అజ్ఞానినః) తమ్ తమ్ నియమమ్ ఆస్థాయ అన్య-దేవతాః ప్రపద్యన్తే ॥**

తా: నానావిధములైన ఆయా భోగవాంఛలచే పోగొట్టుకున్న జ్ఞానము గలవారు తమ స్వభావములచే ప్రేరితులై వారి వారి (ఆయా) నియమములను పాటించి ఇతర దేవతలను ఆరాధింతురు.

**కామైస్తైస్తైర్హృతజ్ఞానాః అన్యదేవతాః ప్రపద్యంతే** – కొంతమంది భక్తులు పరిమితిమైన లక్ష్యాలకోసం అన్యదేవతలను పూజిస్తారు. కామై అంటే ధర్మార్థకామాలను కోరేవారు. వారు అన్యదేవతా అంటే తక్కిన పరిమితి ఉన్న దేవతలను పూజిస్తారు. లక్ష్మీదేవి ఐశ్వర్యాన్ని ఇస్తుంది; అశ్వినీదేవతలు ఆరోగ్యాన్ని ఇస్తారు; గణేశుడు విఘ్నాలను తొలగిస్తాడు. ఇలా ఏ కోరిక తీవ్రంగా ఉంటే, ఆయా కోరికలను తీర్చగలిగే దేవతలకు పూజ చేస్తారు. ఆ కోరికవల్ల ఏమవుతుంది? హృతజ్ఞానాః – పోగొట్టుకున్న జ్ఞానము గలవారు. వారి వివేకశక్తి క్షీణిస్తుంది.

వివేకశక్తి క్షీణిస్తుంది అని ఎందుకు అంటున్నాడు కృష్ణపరమాత్మ? నిజంగా వివేకశక్తిని ఉపయోగిస్తే, వారికే అర్థమవుతుంది. పరిమితి ఉన్న వస్తువులను కోరితే, అవి శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేవు. ఆ వస్తువులే శాశ్వతం కాదు. శాశ్వతం కాని వస్తువులు శాశ్వతమైన ఆనందాన్ని ఎలా ఇవ్వగలవు? ఈ దూరదృష్టి లేదు వారికి. హృతజ్ఞానా అంటే మూఢులు, అల్పబుద్ధి ఉన్నవారు, మందబుద్ధి ఉన్నవారు.

సకామభక్తి ద్వారా పరిమితి ఉన్న ఫలాలను కోరేటప్పుడు, ఆ పూజ చేయటానికి కావాల్సిన నియమాలన్నిటినీ ఒక్కటి కూడా వదలకుండా, తప్పకుండా పాటించాలి. ఒక పూజ రాహుకాలంలోనే చెయ్యాలి, ఆ సమయంలోనే గుడికి వెళ్ళాలి అంటే అలాగే చెయ్యాలి. ఇన్ని వారాలు చెయ్యాలి అంటే అన్ని వారాలు చేసితీరాలి. పెళ్ళి అవ్వాలంటే ఫలానా గుడికి వెళ్ళి, రెండు మాలలు కొని, ఒక మాల దేవుడికి వేయించి, రెండోది పెళ్ళి అయ్యేదాకా మీ ఇంట్లో అట్టిపెట్టుకోవాలి అంటే, అలాగే చెయ్యాలి.

అంతేకాదు, ఆహార నియమం ఉంటుంది, నైవేద్య నియమం ఉంటుంది. వస్త్రనియమం ఉంటుంది. ఆ వ్రతం చేసేటప్పుడు మనం ఏం తినాలి, ఏం తినకూడదు లాంటి నియమాలు ఉంటాయి; అలాగే నైవేద్యం

కూడా ఏది పెట్టాలి, ఎప్పుడు పెట్టాలి నియమం ఉంటుంది. కొన్ని వ్రతాలకు ఒక్కొక్క వారం ఒక్కొక్క ప్రసాదం పెట్టాలి. ఏ దేవతకు ఏ రంగు వస్త్రం సమర్పించాలి? ఒక్కోచోట మనం ఏ రంగు వస్త్రం వేసుకువెళ్ళాలో చెబుతారు.

**తం తం నియమమాస్థాయ** – ఏయే దేవతలను ఏయే కోరికలతో పూజ చేస్తే, ఆయా నియమాలను పాటించాలి. తం తం రెండుసార్లు చెప్పటంలో ఉద్దేశం ఆయా దేవతలు అని చెప్పటం.

**ప్రకృత్యా నియతాః స్వయా** – భక్తులు వారివారి రాగద్వేషాలను బట్టి పూజలు చేస్తారు. పూజలు రెండు కారణాల కోసం చేస్తారు. దేనిమీద రాగం ఉంటే అది పొందాలని దానికోసం చేస్తారు; దేనిమీద ద్వేషం ఉంటే అది తమ దగ్గరనుంచి తొలగిపోవాలని చేస్తారు. ప్రకృతి అంటే స్వభావం; స్వభావం అంటే వ్యక్తిగత ఇష్టాయిష్టాలు. ఎవరైనా మోక్షం గురించి ప్రయత్నించు అని చెప్పినా కూడా వారి రాగద్వేషాలు ఎన్ని ఉంటాయంటే వాటిని తీర్చుకోవటానికే వారికి ఎక్కడలేని సమయమూ చాలదు. వారి కోరికలకు వారు బందీలవుతారు.

శ్లో. 21 **యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥**
యః, యః యామ్, యామ్, తనుమ్, భక్తః, శ్రద్ధయా, అర్చితుమ్, ఇచ్ఛతి,
తస్య, తస్య, అచలామ్, శ్రద్ధామ్, తామ్, ఏవ, విదధామి, అహమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యః, యః, భక్తః | = ఏయే సకామభక్తుడు | శ్రద్ధామ్ | = శ్రద్ధను |
| యామ్, యామ్ | = ఏయే దేవతా | తామ్, ఏవ | = ఆ దేవతల యందే |
| తనుమ్ | = స్వరూపమును | అచలామ్ | = స్థిరమైనదానినిగా |
| శ్రద్ధయా | = శ్రద్ధతో | అహమ్ | = నేను |
| అర్చితుమ్ | = పూజించుటకు | విదధామి | = చేయుదును |
| ఇచ్ఛతి | = కోరుకొనునో | | |
| తస్య తస్య | = ఆయా భక్తుని | | |

**యః యః భక్తః యామ్ యామ్ తనుమ్ శ్రద్ధయా అర్చితుమ్ ఇచ్ఛతి,**
**తస్య తస్య తామ్ ఏవ శ్రద్ధామ్ అహమ్ అచలామ్ విదధామి ॥**

తా: ఏయే సకామభక్తుడు ఏయే దేవతా స్వరూపమును శ్రద్ధతో పూజించుటకు కోరుకొనునో ఆయా భక్తుని శ్రద్ధను ఆ దేవతలయందే స్థిరమైనదానినిగా నేను చేయుదును.

సకామభక్తుడు ఏ కోరిక కావాలంటే అది తీర్చటానికి ఏ దేవునికి పూజ చేస్తే మంచిదో తెలుసుకుంటాడు. దానికోసం శాస్త్రానికి వెళతాడు. వేదపూర్వభాగం చాలా విస్తీర్ణంగా ఉంటుంది. అందులో మనిషికుండే అంతులేని కోర్కెలను తీర్చే ముక్కోటి దేవతల గురించి చెపుతుంది.

**పశుకామాన్ చిన్వీత విత్తకామ చిన్వీత**

**అమయావీ చిన్వీత బ్రహ్మవర్చ కామాన్ చిన్వీత**

పశువులు కావాలా, విత్తం కావాలా, బ్రహ్మవర్చస్సు కావాలా? దేనికైనా మీకొక మార్గాన్ని శాస్త్రం సూచిస్తుంది.

**భక్తః తనుమ్ అర్చితుమిచ్ఛతి** – సకామభక్తుడు ఏ దేవుణ్ణి పూజించటానికి ఇష్టపడతాడో, ఇక్కడ దేవుడు వారివారి భక్తిని బట్టి మారతాడు. ఆరోగ్యంకోసం పూజించేది విష్ణుభక్తుడైతే, ధన్వంతరిమూర్తిని పూజించమంటారు. శివభక్తుడు అయితే మృత్యుంజయమంత్రాన్ని (త్రయంబకం యజామహే) జపించమంటారు. కొంతమంది అశ్వినీకుమారులకు పూజ చెయ్యమంటారు; మరి కొంతమంది సూర్యదేవునికి పూజ చెయ్యమంటారు. ఈ దేవతలలో ఎవరో ఒకరిని ఎన్నుకుంటాడు సకామభక్తుడు.

సకామభక్తి కూడా నిఖార్సైన భక్తే అంటాడు కృష్ణపరమాత్మ. అందువల్ల వారి కోరికలు కూడా తప్పకుండా తీరతాయి. కాని దానికొక షరతు ఉంది. ఏమిటది?

**శ్రద్ధయా (అర్చితుమిచ్ఛతి)** – శ్రద్ధగా పూజ చెయ్యాలి. ఏ కోరిక తీరటానికి ఏ దేవునికి పూజ చేసినా ఆ కోరిక తీరుతుంది కాని ఆ పూజమీద లేదా ఆ దేవునిమీద శ్రద్ధ అంటే నమ్మకం పెట్టుకోవాలి.

**మంత్రే తీర్థే ద్విజే దైవే దైవజ్ఞే భేషజే గురౌ**

**యాదృశీ భావనా యస్య సిద్ధిర్భవతి తాదృశీ॥**

ఏడు అంశాలు మీకు ఫలితాన్ని ఇస్తాయి. మీకు ఎంత ఎక్కువ భక్తి ఉంటే, అంత ఎక్కువ ఫలితాన్ని ఇస్తాయి. అందులో ఈశ్వరభక్తి కూడా ఉంది. అందువల్ల శ్రద్ధగా చెయ్యాలి. అలా చేస్తే ఏమవుతుంది?

**తస్య తస్య శ్రద్ధామ్ అహమ్ అచలాం విదధామి** – ఆ భక్తునికి ఆయా దేవతలమీద భక్తిశ్రద్ధలు స్థిరంగా ఏర్పడేటట్టు నేను చేస్తాను. భక్తి ఎలా స్థిరమవుతుంది? మనం కోరిన కోరిక తీరితే భక్తి పెరుగుతుంది. మనం నలుగురికి చెపుతాము, వారు ఇంకో నలుగురికి చెపుతారు. హఠాత్తుగా ఆ ఆలయం పేరుప్రఖ్యాతులు మారుమ్రోగి పోతాయి. అంతకుముందు ఎక్కువ భక్తులు వెళ్ళని ఆ ఆలయం ఇప్పుడు భక్తులతో కిటకిటలాడి పోతుంది.

అందువల్ల కృష్ణపరమాత్మ చెపుతున్నాడు; నేను వారి కోరికలను తీర్చి, వారి భక్తిని రెట్టింపు చేస్తాను! ఇక్కడ ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి మనం. నేను వారి కోరిక తీరుస్తాను అంటున్నాడు. నిజానికి వారు పూజిస్తున్నది ఎవరిని? అన్యదేవతలను! పరిచ్ఛిన్నదేవతలను లేదా అపూర్ణదేవతలను. ఆ పరిచ్ఛిన్నదేవతలు తీరుస్తారు అనాలి కదా, నేను తీరుస్తాను అని ఎందుకన్నాడు?

దానికి కారణం ఇంతకు ముందే చూశాము. భగవద్గీతలో కృష్ణపరమాత్మ అపరిచ్ఛిన్న దేవుడు, అనంతం, నిర్గుణం, సత్‌బ్రహ్మ. కృష్ణపరమాత్మ అపరిచ్ఛిన్నం కాబట్టి, ఈ సందర్భంలో తక్కిన దేవుళ్ళంతా పరిచ్ఛిన్న దేవుళ్ళు అవుతారు. ఎందుకంటే పరిచ్ఛిన్నమైనవన్నీ అనంతంలో ఒకభాగం. పరిచ్ఛిన్నమైనవి అనంతంలో కలవకపోతే అనంతాన్ని అనంతం అనలేము. తక్కిన దేవతలు అనంతం అయిన కృష్ణపరమాత్మలో ఒక భాగం కాబట్టి, ఏ భాగానికి మనం పూజ చేసినా అది మొత్తానికి వెళుతుంది.

**ఆకాశాత్ పతితం తోయం యథా గచ్ఛతి సాగరమ్**
**సర్వ దేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి**

నదులన్నీ సముద్రంలో కలిసినట్టుగా, ఏ దేవతకు నమస్కారం చేసినా, అది కేశవునికే చెందుతుంది. పై శ్లోకంలో అనంతంగా కేశవుణ్ణి అభివర్ణించారు. అందువల్ల శివపూజ చేసినా, గణేశపూజ చేసినా, కేశవునికే చెందుతుంది. భగవద్గీతలో కృష్ణపరమాత్మకు చెందుతుంది. అందువల్ల కృష్ణపరమాత్మే పూజాఫలం కూడా ఇస్తాడు, కాకపోతే ప్రత్యక్షంగా ఇవ్వడు. ఏ దేవతకు పూజ చేస్తే ఆ దేవతచేత ఇప్పిస్తాడు. అందువల్ల మీరు శివపూజ చేసినా అది కృష్ణునికే వెళ్ళి, కృష్ణునినుంచి శివునిద్వారా మీకు ఫలం వస్తుంది. ఇందులో శివుణ్ణి తక్కువచేసి మాట్లాడటం లేదు. శివపురాణం చదివితే, మీరు విష్ణువుకు పూజ చేసినా, అది శివునికే చెందుతుందని, శివునినుంచి విష్ణువుద్వారా మీకు ఫలం వస్తుందనీ వస్తుంది.

ఈ వివరణ సారాంశం ఏమిటి?

శివుడు గొప్పా, విష్ణువు గొప్పా అనే ప్రశ్న లేదు. అపరిచ్ఛిన్న దేవుడు, పరిచ్ఛిన్న దేవుళ్ళ ద్వారా మన పూజలను స్వీకరిసాడు. అపరిచ్ఛిన్న దేవునికి ఏ పేరైనా పెట్టండి – శివ, విష్ణు, కృష్ణ, దేవి. నిజానికి దేవుళ్ళందరి నామాలు చూస్తే అందరికీ కొన్ని నామాలు సమానంగా ఉంటాయి. శివుని వర్ణన వేరే ఉంటుంది, విష్ణుమూర్తి వర్ణన వేరే ఉంటుంది, నిజమే! కాని కొన్ని నామాలు రెండింటిలోనూ ఉంటాయి. **అనంతాయ నమః** – అనంతం; **సర్వగతాయ నమః** – సర్వవ్యాపకం. శివుడు, విష్ణువు ఇద్దరూ సర్వవ్యాపకం అవలేరు. అంటే సర్వవ్యాపకమైన దేవునికి శివుడు, విష్ణుమూర్తి రెండు భిన్ననామాలు అంతే.

**సర్వః శర్వః శివస్థాణుః** అని విష్ణుసహస్రనామంలో వస్తుంది. అందువల్ల శివా విష్ణువులకు భేదం లేదు. నేను విష్ణుమూర్తినే పూజిస్తాను, శివాలయానికి వెళ్ళను అనుకోనవసరం లేదు. **తస్య తస్య శ్రద్ధామ్ అహమ్ అచలాం విదధామి** అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 22 **స తయా శ్రద్ధయా యుక్తః సత్యారాధనమీహతే ।**
**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ ॥**
సః, తయా, శ్రద్ధయా, యుక్తః, తస్య, ఆరాధనమ్, ఈహతే,
లభతే, చ, తతః, కామాన్, మయా, ఏవ, విహితాన్, హి, తాన్ ॥

| | | | |
|---|---|---|---|
| సః | = ఆ భక్తుడు | ఈహతే | = ఇష్టముతో చేయును |
| తయా, శ్రద్ధయా | = అట్టి శ్రద్ధ | చ | = ఇంకా |
| యుక్తః | = కూడినవాడై | తతః | = ఆ దేవతనుండి |
| తస్య, ఆరాధనమ్ | = ఆ దేవతారాధనమును | మయా, ఏవ | = నా అనుగ్రహమువలననే |

| | | | | | |
|---|---|---|---|---|---|
| విహితాన్ | = | విహితములైన | హి | = | నిస్సందేహముగా |
| తాన్, కామాన్ | = | ఆ భోగములను | లభతే | = | పొందును |

**సః తయా శ్రద్ధయా యుక్తః తస్య ఆరాధనమ్ ఈహతే, తతః చ**
**మయా ఏవ విహితాన్ తాన్ కామాన్ లభతే హి ॥**

తా: ఆ భక్తుడు అట్టి శ్రద్ధకూడినవాడై ఆ దేవతారాధనమును ఇష్టముతో చేయును. ఇంకా ఆ దేవతనుండి నా అనుగ్రహమువలననే విహితములైన ఆ భోగములను నిస్సందేహముగా పొందును.

ఎప్పుడైతే ఒక దేవునికి పూజ చేస్తే ఒక కోరిక తీరుతుందో, అప్పుడే ఆ దేవుణ్ణి ప్రత్యక్షదేవుడనీ, పిలిస్తే పలికే దేవుడనీ, కలియుగదైవమనీ కీర్తిస్తాము. కాని ఈ బిరుదులన్నీ ఒక్క దేవునికే చెందవు. కొంతమందికి ప్రత్యక్షదైవం గురువాయూరప్ప అయితే, కొంతమందికి కలియుగదైవం వేంకటేశ్వరస్వామి; కొంతమందికి భోళాశంకరుడు పిలిస్తే పలికే దైవం. ఒకచోటకు వెళితే వారు ప్రత్యక్షదైవంగా శ్రీనాథుణ్ణి కొలుస్తారు; జగన్నాథుణ్ణి ఇంకొక చోట కొలుస్తారు.

**స తయా శ్రద్ధయా యుక్తః** – అటువంటి సకామభక్తుడు శ్రద్ధతో పూజ చేస్తాడు. అతని కోరిక తీరటంవల్ల శివభక్తునికి శివునిమీద భక్తి పెరుగుతుంది, గణేశభక్తునికి గణేశునిమీద భక్తి పెరుగుతుంది. అందువల్ల ఎవరైనా గురువు దగ్గరికి వెళ్ళి మంత్రోపదేశం పొందాలంటే సాధారణంగా ఆ గురువులు నీ ఇష్టదేవత ఎవరు అని అడిగి, ఆ దేవత నామాన్ని మంత్రజపంగా ఇస్తారు. ఒక స్త్రీకి ఒక గురువు అలా అడక్కుండా, ఆయన శివభక్తుడు అవటంచేత ఆవిడకి శివపంచాక్షరీ మంత్రదీక్ష ఇచ్చాడు ఆయన. ఆవిడేమో కృష్ణభక్తురాలు. శివనామం జపిస్తుంటే, గురువాయూరప్పే గుర్తుకొస్తున్నాడు, ఏం చెయ్యాలి అని ఆవిడ తెగ బాధపడిపోయింది. కాని ఏ దేవునిమీద పూజ చేసినా అతని భక్తి పెరుగుతుంది.

**తస్య ఆరాధనమ్ ఈహతే** – ఆ దేవుని పూజ ఇంకా ఎక్కువ చేస్తాడు.

**తతః కామాన్ లభతే** – ఆ భక్తివల్ల మరిన్ని కోరికలు తీర్చుకోగలుగుతాడు. మళ్ళీ గుర్తు చేస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఆ కోరికలన్నీ ఎవరు తీరుస్తున్నారు?

**మయైవ విహితాన్ (కామాన్)** – నేనే ఆ కోరికలన్నిటినీ తీరుస్తున్నాను. అన్ని పూజలనూ అందుకునేది నేనే, అన్ని ఫలితాలనూ ఇచ్చేది నేనే. నేనే అంటే కృష్ణపరమాత్మ అనే సగుణాకారాన్ని తీసుకోకూడదు. ఆయన అపరిచ్ఛిన్నదేవత లేదా పూర్ణదేవత. తక్కిన దేవతలందరూ పరిచ్ఛిన్న దేవతలలోకి వస్తారు. అందువల్ల అన్యదేవతలు భక్తులను దీవిస్తున్నారంటే అనంతం అయిన కృష్ణపరమాత్మవల్ల దీవిస్తున్నారు. వారు మధ్యవర్తులలాంటివారు. చివరికి అందుకునేది కృష్ణపరమాత్మ. అందువల్ల ఆయనే కర్మఫలదాత కూడా.

**భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి ॥** – 5.29

అన్ని పూజలను చివరకు అందుకునేది నేనే. మోక్షం కావాలంటే ఏ దేవుణ్ణి పూజించాలి? భగవద్గీత పరంగా కృష్ణపరమాత్మను పూజించాలి. దాని బదులు మీరు దేవీ భాగవతం చదువుతున్నట్టయితే, మోక్షంకోసం దేవిని వేడుకోవాలి. అందువల్ల నామరూపాలను చూడకండి; ఏ నామరూపమూ గొప్పదీ కాదు, తక్కువా కాదు.

లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ అన్నాడు అందువల్లనే. లభతే – అన్యదేవతా భక్తః లభతే. తక్కిన దేవతల భక్తులకు వారి కోరికలు తప్పకుండా తీరుతాయి. కామాన్ అంటే కోరికలు తీరుతాయి అని కాదు; వారు కోరుకున్న వస్తువు లభ్యమవుతుంది. కామయతే ఇతి కామః, భక్తుడు ఆ దేవత తీరుస్తుంది అనుకుంటాడు కాని మయైవ విహితాన్ – నావల్ల దీవించబడుతాడు. నేను అంటే అపరిచ్ఛిన్నమైన దేవుడను.

ఇంతవరకూ కృష్ణపరమాత్మ సకామభక్తివల్ల కలిగే ప్రయోజనాలను వర్ణించాడు. ముందు సకామభక్తిని మెచ్చుకుని, తర్వాత దాన్ని విమర్శిస్తాడు. ఎందుకు? మనం సకామభక్తిలోనే ఉండిపోకుండా, నిష్కామభక్తికి రావాలని కృష్ణపరమాత్ముని కోరిక. అందువల్ల రాబోయే శ్లోకాల్లో సకామభక్తిలోని లోటుపాట్లను చర్చిస్తాడు.

ఇప్పటిదాకా సకామభక్తిని మెచ్చుకున్నాడు. దాని ప్రయోజనాలను చెప్పాడు. ఏమిటవి? సకామభక్తి కూడా భక్తే. అది పాపమేమీ కాదు. భగవంతుణ్ణి కోరిక కోరటంలో తప్పేం లేదు. కొంతమంది దేవుణ్ణి ఏమీ కోరిక కోరకూడదు; మనకు ఏం కావాలో ఆయనకు తెలియదా అంటారు. కాని మనకు అనేక కోరికలు ఉంటాయి, దానిలో ఏది కావాలో నిర్ణయించేది ఎవరు? మనమే నిర్ణయించుకోవాలి. భగవంతుడే నిర్ణయించాలి అంటే, ఆయన మోక్షం ఇవ్వాలనుకుంటాడు.

నిజానికి భగవంతుడు మోక్షం ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాడు కాని మనమేమో మోక్షం అప్పుడే వద్దు, ముందు ఒక పండంటి బాబును ప్రసాదించు అంటాము. లేదా నీటి యెద్దడి ఉంటే, మోక్షం ఎప్పుడైనా కోరుకోవచ్చు, ముందు నీటి సమస్యను తీర్చు దేవుడా అంటాము. అందువల్ల మనకేం కావాలో మనం చెప్పుకోవాలి. అందువల్లనే ప్రతి పూజ ముందు సంకల్పం ఉంటుంది. దేవుడికే తెలుసు అంటే శాస్త్రం సంకల్పాన్ని ఎందుకు ప్రవేశపెడుతుంది? అందువల్ల సకామపూజ చెయ్యవచ్చు, ఎంత చిన్న కోరికైనా కోరవచ్చు; తప్పేం లేదు. అది కూడా మీరు కోరిన ఫలితాన్ని ఇస్తుంది. పూజ సరిగ్గా చేస్తే – ఇంతవరకూ లాభం చూశాము. ఇప్పుడు అందులోని కష్టం చూడబోతున్నాము.

శ్లో. 23 **అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్ ।**
**దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి ॥**

అంతవత్, తు, ఫలమ్, తేషామ్, తత్, భవతి, అల్పమేధసామ్,
దేవాన్, దేవయజః, యాంతి, మద్భక్తాః, యాంతి, మామ్, అపి ॥

| | | | |
|---|---|---|---|
| తు | = అయితే | అంతవత్ | = నశించేదే |
| తేషామ్, అల్పమేధసామ్ | = ఆ అల్పబుద్ధులయొక్క | భవతి | = అవుతుంది |
| తత్, ఫలమ్ | = ఆ ఫలము | దేవయజః | = దేవతలను పూజించువారు |

| | | | |
|---|---|---|---|
| దేవాన్ | = ఆ దేవతలనే | మామ్, అపి | = చివరగా నన్నే |
| యాంతి | = పొందుదురు | యాంతి | = పొందుదురు |
| మద్భక్తాః | = నా భక్తులు | | |

**తేషామ్ అల్ప-మేధసామ్ తత్ ఫలమ్ తు అన్తవత్ భవతి,**
**దేవ-యజః దేవాన్ యాన్తి, మత్ భక్తాః అపి మామ్ యాన్తి ॥**

తా: అయితే ఆ అల్పబుద్ధులయొక్క ఆ ఫలము నశించేదే అవుతుంది. దేవతలను పూజించువారు ఆ దేవతలనే పొందుదురు. నా భక్తులు చివరగా నన్నే పొందుదురు.

సకామపూజ చేస్తే ఫలితం కలుగుతుంది. నిజమే! కాని, పూజకూ, ఫలితానికీ మధ్యలో ఒక పెద్ద **కానీ** ఉంది. సకామపూజ చేస్తే దానికి తగిన ఆహార నియమం, నైవేద్యనియమం, సమయనియమం – ఇలా అనేక నియమాలు ఉన్నాయని చూశాము. ఏ దేవతకు ఏ కోరికకోసం పూజ చేస్తే, ఆ పూజ ఆ పద్ధతిలోనే చేసితీరాలి. నియమాలను ఉల్లంఘించకూడదు. ప్రతి చిన్నవిషయమూ పాటించాలి. అప్పుడే ఆశించిన ఫలం దొరుకుతుంది.

కృష్ణపరమాత్మ సకామభక్తిని మెచ్చుకుని ఇప్పుడు ఒక హెచ్చరిక చెయ్యబోతున్నాడు. కొన్ని ప్రకటనలలో అది కొంటే ఇది ఉచితం అంటూ ఏవేవో హామీలు ఇచ్చేస్తారు. కింద బుల్లి అక్షరాలతో షరతులు వర్తిస్తాయి అంటారు.

అలాగే ప్రతి ఐహికసుఖం వెనుక, ప్రతికర్మఫలం వెనుక మూడు దోషాలుంటాయి. అవి బంధకత్వం, అతృప్తికరత్వం, దుఃఖమిశ్రితత్వం. వీటిని ఆంగ్ల అక్షరాలతో కుదించాలంటే BAD వస్తుంది. నిజంగా ఈ ఫలాలు బ్యాడ్ కూడా. ముందు దుఃఖమిశ్రితత్వాన్ని చూద్దాము.

ఎ. **దుఃఖమిశ్రితత్వం** – ప్రాపంచిక సుఖాలలో ఏది పొందాలన్నా కూడా దానితో పాటు కష్టం కూడా మేళవించి ఉంటుంది. సుఖదుఃఖాలు నాణేనికి బొమ్మాబొరుసులాంటివి. ఎంతో పోటీని ఎదుర్కొని ఒక విషయాన్ని సాధించాలి. నిజానికి ఏదైనా పోటీలో పాల్గొనాలన్నా కూడా చాలామందిని దాటుకుని ముందుకు రావాలి. అంటే బెంగ, ఆందోళన, భయం, ఈర్ష్యలాంటి భావాలెన్నో కలుగుతాయి. ఒకవేళ అనుకున్నదాన్ని పొందినా, దాన్ని నిలుపుకోవటానికి చాలా కష్టపడాలి. యోగక్షేమం అంటారు. యోగం అంటే ఒక వస్తువును పొందటం, క్షేమం అంటే పొందిన వస్తువును నిలబెట్టుకోవటం. ఆర్జనే దుఃఖం; రక్షణే దుఃఖం. కష్టపడి దాన్ని నిలబెట్టుకున్నా కూడా దానికి ఒక కాలపరిమితి ఉంది. ఎలా వచ్చిందో, అలా వెళ్ళిపోతుంది. వెళ్ళిపోయినా మనకు దుఃఖం కలగజేస్తుంది. ఆ దుఃఖం దాన్నించి మనం పొందిన ఆనందంతో ముడిపడివుంటుంది. నష్టపోయిన దానివల్ల దుఃఖం. అంటే ముందు రెండింటికీ దీన్ని కూడా కలుపుకోవాలి – ఆర్జనే దుఃఖం, రక్షణే దుఃఖం, నాశే దుఃఖం. అంటే ఒక ప్రియవస్తువును పొందటంలో దుఃఖం; దాన్ని కాపాడుకోవటంలో దుఃఖం. అది పోతే దుఃఖం అనుభవిస్తాము. అందువల్ల ప్రతి కర్మఫలం కూడా దుఃఖమిశ్రితత్వం.

బి. **అతృప్తికరత్వం** – ఎంత ఉన్నా తృప్తి తీరదు. ఇంకా ఇంకా ఏదో కావాలనిపిస్తుంది. ఉన్నదానితో తృప్తి పడము, లేనిది కావాలి. మనకన్నా ఎక్కువ ఉన్నవారిని చూసి ఈర్ష్య పడతాము. పక్కవారితో పోల్చుకునే మనస్తత్వం మనది. ఎప్పుడైతే ఇతరులతో పోల్చుకుంటామో అప్పుడే ఆత్మన్యూనతా భావన, ఈర్ష్య రాజుకుంటాయి. దీన్నే అతృప్తికరత్వం అంటారు.

**విత్తేన న తర్పణీయో మనుష్యః** – కఠ

ఎంత డబ్బు ఇచ్చినా ఏ మనిషి కూడా తృప్తి పడడు అంటాడు చిన్నపిల్లవాడు నచికేతుడు. అలా తృప్తి ఉందుంటే, ఇంత పెద్ద ఎత్తున లంచగొండితనాలు, మోసాలు, స్కాములు ఎందుకు జరుగుతాయి?

ఎంతున్నా తృప్తి తీరదు కాబట్టే దయానందస్వామి ఎవరూ ధనవంతులు లేరు అంటారు. ధనవంతుడు అంతకు ముందు డబ్బులేని బీదవాడు అయితే, ఇప్పుడు డబ్బున్న బీదవాడు అంటారు. ఎందుకంటే ఎంత డబ్బున్నా, లోపల బీదరికం పోదు.

**అపూర్ణం + అపూర్ణం = అపూర్ణం.** పరిమితి ఉన్న వస్తువులు ఎన్ని ఉన్నా అవి పరిమితమైనవే అవుతాయి కాని, అపరిమితమైనవి అవవు. అనంతానికీ, మనకూ మధ్య ఉన్న దూరం అలాగే ఉంటుంది. వంద రూపాయలకూ, అనంతానికీ మధ్య ఎంత దూరం ఉందో, లక్షరూపాయలకూ, అనంతానికీ మధ్య ఉన్న దూరం కూడా అంతే ఉంటుంది. అందువల్ల మనం అపూర్ణంగానే ఉండిపోతాము. ప్రాపంచిక వస్తువులను పొందటంలో అపూర్ణం నుంచి అపూర్ణంకి ప్రయాణం చేస్తాము కాబట్టి, ప్రతికర్మఫలం అతృప్తికరత్వంగానే ఉంటుంది.

సి. **బంధకత్వం** – ప్రాపంచిక విషయాలను కోరి, వాటిని పొందితే వాటిమీద బంధం ఏర్పడుతుంది. పేరు, హోదా కూడా బంధాలే. హోదా పోతే భరించలేము. ఇంట్లో ఎవరైనా పట్టించుకోకపోతే భరించలేము. ఈ బంధాలతో ఎంతగా పెనవేసుకుపోతామంటే, అవి లేని జీవితాన్ని ఊహించలేము.

సకామభక్తి ఈ మూడు రకాల ఫలాల ద్వారా సంసారంలోనే కట్టిపడవేస్తుంది. సకామభక్తిలో ప్రాపంచిక ఎదుగుదల ఉంటుంది. కోరికలు తీరుతాయి; సమృద్ధిగా ధనం సంపాదిస్తాము; భార్యాపిల్లలు ఉంటారు; కావాల్సినవన్నీ ఉంటాయి, కాని ఆధ్యాత్మికంగా చూస్తే ఏమీ ఉన్నతి ఉండదు. సకామభక్తిలో ఆధ్యాత్మికంగా ఎదుగుదల ఉండదు. అందులో పాపాలు చెయ్యము కాబట్టి ఆధ్యాత్మికంగా పతనం ఉండదు; అలాగని ఎదుగుదలా ఉండదు. ఎక్కడ ఉన్నవారం అక్కడే ఉంటాము.

నిషిద్ధకర్మ చేసేవారు ఆధ్యాత్మికంగా పతనమైపోతారు. నిష్కామకర్మ చేసేవారు ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. సకామకర్మ చేసేవారికి ఎదుగుదలా ఉండదు; పతనమూ ఉండదు. ఎక్కడ ఉన్నవారు అక్కడే ఉంటారు. అంటే సంసారంలో ఉన్నారు వారు; సంసారంలోనే పడి కొట్టుమిట్టాడుతుంటారు. నాస్తికుడు దేవుణ్ణి నమ్మడు కాబట్టి అతను ఎక్కడ పడితే అక్కడ కన్నీరు పెట్టుకుంటాడు. సకామభక్తుడు దేవుణ్ణి నమ్ముతాడు కాబట్టి దేవుని ముందు కన్నీరు పెట్టుకుంటాడు. ఇద్దరూ సమానంగానే సంసారంలో బాధపడతున్నారు. అదే ఈ శ్లోకం సారాంశం.

**తేషామ్** – ఈ సకామభక్తులు; **అల్పమేధసామ్** – తెలివితక్కువవారు; వివేకం లేనివారు. ఎందుకు? ఇదే భక్తితో వారు అనంతమైన మోక్షాన్ని పొంది ఉండవచ్చు; భగవంతునినుంచి అనంతాన్ని కోరుకోకుండా అపూర్ణత్వాన్ని కోరుతున్నారు.

భగవంతుణ్ణి రెండు జేబులలో రెండు చేతులు పెట్టి నిల్చున్నట్టుగా ఊహించుకోవచ్చు మనం. ఒక జేబులో ప్రేయస్సు, ఇంకొక జేబులో శ్రేయస్సు ఉన్నాయి. శ్రేయస్సు అంటే శాశ్వతమైన మోక్షమనీ, ప్రేయస్సు అంటే అశాశ్వతమైన ధర్మార్థకామాలనీ చూశాము. మనం నమస్కారం పెట్టి, ఏ కోరిక కోరితే అది తీర్చటానికి సిద్ధంగా జేబుల్లో చెయ్యిపెట్టి మరీ నిల్చున్నాడు; కాని మనమేం చేస్తున్నాము? చిన్నచిన్న కోరికలు కోరుతున్నాము – నీటి సమస్య తీర్చు స్వామీ, అమ్మాయి పెళ్ళి చెయ్యి స్వామీ, అబ్బాయికి ఉద్యోగం తెప్పించు స్వామీ; నేను వేసిన టెండరు నాకే దక్కేటట్టు చెయ్యి స్వామీ అంటున్నాము. ఒక చేత్తో క్షణం తీరిక లేకుండా ఇస్తూనే ఉన్నాడు కాని రెండో చెయ్యి మాత్రం జేబులోనే ఇరుక్కుపోయింది. దానికి పని లేకుండా పోయింది. అందువల్ల అల్ప మేధసామ్ అంటున్నాడు. వారికి గమ్యమేమిటో తెలియటం లేదు, వారికి నిత్యానిత్యవస్తువివేకం లేదు. అందువల్ల వైరాగ్యం లేదు. ఎవరు ఆ భక్తులు? ఆర్తభక్తులూ, అర్థార్థీభక్తులూను. దానికి వారికి వచ్చే ఫలం బాగానే ఉంటుంది – పేరు, హోదా, మనుష్యులు, కుటుంబం – ఏం కావాలంటే అది వస్తుంది. కాని ఆ ఫలాలు ఎలా ఉంటాయి?

**అంతవత్తు ఫలమ్** – ఫలం శాశ్వతం కాదు. డబ్బు శాశ్వతం కాదు; ఊర్ధ్వలోకాలకు వెళ్ళినా పుణ్యక్షయం అయితే వెనక్కి తిరిగి రావాల్సిందే. ఇదే భావాలున్న 9వ అధ్యాయంలో ఈ విషయాన్ని చెపుతాడు కృష్ణపరమాత్మ.

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।** – 9.21

ఇంద్రపదవి కూడా శాశ్వతం కాదు; పుణ్యం అయిపోగానే ఇంద్రుడు కూడా భూలోకానికి రావాల్సిందే. ఇంకా కృష్ణపరమాత్మ సుతారంగా హెచ్చరిస్తున్నాడు. ఉపనిషత్తు ఘాటుగానే హెచ్చరిస్తుంది.

**ఇమం లోకం హీనతరం వా విశంతి** – ముండకం

ఈ లోకానికో, ఇంకో హీనతరం అయిన అధోలోకాలకో వెళతాడు. అందువల్ల అంతవత్తు అంటే పరిమితి ఉన్న ఫలం. దానికి భగవంతుణ్ణి నిందించి లాభం లేదు. ఆయన రెండు జేబుల్లోనూ చేతులు పెట్టుకుని సిద్ధంగా నిలుచుని ఉన్నాడు. మనమే సరియైన లక్ష్యాలు ఎన్నుకోవటం లేదు. నన్ను నిందించకండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**దేవాన్ దేవయజో యాంతి** – అపూర్ణదేవతలను పూజించేవారికి అపూర్ణఫలాలే దక్కుతాయి. సకామభక్తులు పరిచ్ఛిన్నఫలాలనే పొందుతారు. దేవాన్ అంటే దేవతలు. దేవతలు కూడా అశాశ్వతమే. ఎందుకంటే దేవలోకాల్లో ఉన్నత పదవుల్లో ఉన్న దేవతలు కూడా మనలాంటి మామూలు జీవులే; వారు చేసుకున్న పుణ్యకర్మవల్ల ఉత్తమజన్మ పొందారు.

**జానామ్యహమ్ శేవధిరిత్యనిత్యమ్**
**న హ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్** – కఠ 1.2.10

యమధర్మరాజే చెబుతాడు నచికేతునితో, 'నేను యమధర్మరాజు పదవికోసం కాంక్షించాను నీలాగా ఆత్మవిద్యను కోరలేదు.' కోరుకుంటే ఇంద్రుడవచ్చు, యమధర్మరాజు అవచ్చు, బ్రహ్మ అవచ్చు, ఇవన్నీ పదవులే. అందువల్ల సకామభక్తులు దేవతలు అనే పరిచ్ఛిన్నఫలాన్ని పొందుతారు.

**మద్భక్తాః** – కాని నా భక్తుల పరిస్థితి వేరు. నా అంటే కృష్ణుణ్ణి ఒక మూర్తిగా కొలిచేవారు కాదు; అనంతమైన కృష్ణపరమాత్మను కొలిచేవారు. వారు నిష్కామభక్తులు, వివేకవంతులు, జిజ్ఞాసుభక్తులు, ముముక్షువులు, సాధన చతుష్టయ సంపన్నులు, అసలైన భక్తులు.

**మామ్ అపి యాంతి** – నన్నే పొందుతారు. నన్ను అంటే నామం, రూపం ఉన్న కృష్ణపరమాత్మను కాదు. మద్భక్తా అంటే నిష్కామభక్తులు, మాం యాంతి అంటే పూర్ణత్వం పొందుతారు; మోక్షం పొందుతారు; జీవన్ముక్తి పొందుతారు.

శ్లో. 24 **అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః ।**
**పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్ ॥**
అవ్యక్తమ్, వ్యక్తిమ్, ఆపన్నమ్, మన్యంతే, మామ్, అబుద్ధయః,
పరమ్, భావమ్, అజానంతః, మమ, అవ్యయమ్, అనుత్తమమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మమ | = | నాయొక్క | అవ్యక్తమ్ | = | ఇంద్రియములకు, మనస్సుకు గోచరింపని వాడను |
| అనుత్తమమ్ | = | అత్యుత్తమము | | | |
| అవ్యయమ్ | = | శాశ్వతము అయిన | మామ్ | = | సచ్చిదానందపరమాత్ముడనైన నన్ను |
| పరమ్, భావమ్ | = | పరమభావమును | | | |
| అబుద్ధయః | = | బుద్ధిహీనులు | వ్యక్తిమ్, ఆపన్నమ్ | = | గోచరమయ్యే వ్యక్తిగా |
| అజానంతః | = | తెలుసుకోలేనివారై | మన్యంతే | = | తలంచెదరు |

**మమ పరమ్ అవ్యయమ్ అవ్యక్తమ్ అనుత్తమమ్ భావమ్**
**అజానన్తః అబుద్ధయః మామ్ వ్యక్తిమ్ ఆపన్నమ్ మన్యన్తే ॥**

తా: నాయొక్క అత్యుత్తమము, శాశ్వతము అయిన పరమభావమును బుద్ధిహీనులు తెలుసుకోలేనివారై, ఇంద్రియములకు, మనస్సునకు గోచరింపని వాడను, సచ్చిదానందపరమాత్ముడనైన నన్ను గోచరమయ్యే వ్యక్తిగా తలంచెదరు.

ఇక్కడ కృష్ణపరమాత్మ రెండు రకాల భక్తుల గురించి మాట్లాడుతున్నాడు. భగవంతుణ్ణి సరిగ్గా అర్థం చేసుకున్నవారు; సరిగ్గా అర్థం చేసుకోనివారు. అంతకుముందు భగవంతుని గురించి చెప్పేటప్పుడు, భగవంతునిగా తనకు రెండు అంశాలు ఉన్నాయన్నాడు. అవి పరాప్రకృతి, అపరాప్రకృతి. పరాప్రకృతి అంటే చేతనతత్త్వం, అపరాప్రకృతి అంటే జడతత్త్వం; చేతనతత్త్వాన్ని పారమార్థికస్వరూపం అంటే, అచేతన జడతత్త్వాన్ని వ్యావహారిక స్వరూపం అంటారు.

ఇప్పుడు ఈ తెలివితక్కువవారు భగవంతునియొక్క తక్కువ స్థాయిని చూసేవారు. భగవంతుని శారీరక రూపం అపరాప్రకృతా, పరాప్రకృతా? అది అపరాప్రకృతిలోకే వస్తుంది. నామరూపం ఉన్న భగవంతునిగా చూస్తే అవతారం ఎత్తిన రోజు, అవతారం చాలించిన రోజు ఉంటాయి. అంటే రాకపోకలు ఉంటాయి. అపరాప్రకృతి అయిన భగవంతునికి రాకపోకలు ఉంటాయి.

భగవంతుడు ప్రత్యక్షం అయ్యాడంటే అది అపరాప్రకృతి అంశం గురించే. గోపికలు నిరంతరం కృష్ణుని రాక కోసం ఎదురుచూసేవారు; ఆయన వస్తే ఆనందం, వెళ్ళిపోతే దుఃఖం. గోపికా గీతం వివరిస్తుంది ఈ భావనను. అలా అపరాప్రకృతిని పూజించేవారిని కృష్ణపరమాత్మే బుద్ధిహీనులు అంటున్నాడు.

దానికి భిన్నంగా పరాప్రకృతిని తెలివైనవారు కొలుస్తారు. పరాప్రకృతి అంటే చైతన్యతత్త్వం, ఉన్నత స్వరూపం. ఈ చైతన్యతత్త్వానికి రాకపోకలు ఉన్నాయా? చైతన్యం సర్వవ్యాపకం. అందువల్ల దానికి రాకపోకలు ఉండవు. చైతన్యం సర్వవ్యాపకమే కాదు, ప్రతిక్షణం చైతన్యం ఉన్నదని తెలుస్తూనే ఉంటుంది. అది స్వయంప్రకాశక రూపం; నిత్యప్రకాశకరూపం; అనావృతచైతన్యరూపం. వస్తువులు దేనితోనైనా కప్పబడవచ్చు; ఒక వస్తువు కప్పబడి ఉందని ఎలా చెప్పగలము? అది కప్పబడి ఉందని మనకు తెలుసు కాబట్టి. కాని, చైతన్యం అనేదాన్ని ఏదీ, ఎన్నడూ కప్పలేదు. నిజానికి చైతన్యంవల్లనే తక్కినవి ఉన్నాయని చెప్పగలుగుతున్నాము.

తెలివైనవారికి భగవంతుడు ఇక్కడే, ఇప్పుడే ఉన్నాడని తెలుసు. ఎలా తెలుసు? వారిలోని చైతన్యతత్త్వంగా. అందువల్ల వారు దేవునియొక్క రాకపోకల గురించి మాట్లాడరు.

**అబుద్ధయః** – బుద్ధిహీనులు మాత్రమే; **మన్యంతే** – పొరపాటు పడతారు. ఏమని?

**అవ్యక్తం వ్యక్తిమాపన్నం** – భగవంతుడు అవ్యక్తం అయిపోయాడు అని పొరపడతారు. అవ్యక్తం అంటే మాయమయ్యాడు అనుకుంటారు. మళ్ళీ వ్యక్తి మాపన్నం – మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు అనుకుంటారు.

పురాణాల్లో భక్తుల కథల్లో చూస్తాము – భక్తులు భగవంతుడు ప్రత్యక్షం అవ్వాలని ఘోరమైన తపస్సు చేస్తారు. వారి భక్తికి మెచ్చి, భగవంతుడు వారి ముందు ప్రత్యక్షమయి, 'భక్తా, నీ భక్తికి మెచ్చాను. ఏమి నీ కోరిక?' అంటాడు. అతను ఏదో కోరిక కోరతాడు. 'తథాస్తు,' అని తక్షణమే మాయమవుతాడు. ఆ విధంగా బుద్ధిహీనులు భగవంతుణ్ణి నామ, రూపాలతో ఉన్న అపరాప్రకృతి అంశాన్ని కొలుస్తారు. ఎందుకు అలా కొలుస్తారు?

**అజానంతః** – వారికి తెలియదు. ఏమి తెలియదు?

**పరం భావమ్** – భగవంతునియొక్క పరాప్రకృతి గురించి తెలియదు. నామరూపాలు లేని, ఆకారాలు లేని, చావుపుట్టుకలు లేని పరాప్రకృతి గురించి వారికి తెలియదు. ఏమిటా పరాప్రకృతి? చైతన్యస్వరూపం. అది సర్వవ్యాపకం, సర్వప్రకాశకం. మీరు ఎదుటివారి మాట వినగలుగుతున్నారంటే చైతన్యంవల్ల. ఎదుటివారు మాట్లాడటం కాసేపు ఆపితే, నిశ్శబ్దంగా ఉందని తెలుస్తోందంటే చైతన్యంవల్ల. మాటలు ఉన్నా లేకపోయినా, ఆలోచనలు ఉన్నా లేకపోయినా, రూపాలు ఉన్నా లేకపోయినా చైతన్యం ఎప్పుడూ ఉంటుంది. అటువంటి **సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ స్వరూపం** గురించి వారికి తెలియదు. అటువంటి స్వరూపం గొప్పతనం ఏమిటి?

**అవ్యయమ్** – దానికి మార్పులు లేవు. కృష్ణపరమాత్మను సాకారరూపంలో బాలకృష్ణునిగా, కౌమారకృష్ణునిగా చూస్తాము. కాని పరాప్రకృతికి అలాంటి మార్పులు లేవు. అది నిర్వికారం.

**అనుత్తమమ్** – అత్యుత్తమం. అపరాప్రకృతి తక్కువ స్థాయిది; పరాప్రకృతి ఉత్తమస్థాయిది. కాని సకామభక్తులు తక్కువ స్థాయికి చెందిన అపరాప్రకృతికి పూజ చేస్తే, నిష్కామభక్తునికి మాత్రమే పరాప్రకృతియొక్క ఉన్నతస్థాయి గురించి తెలుసు.

శ్లో. 25 **నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః ।**
**మూఢో౽యం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ ॥**
న, అహమ్, ప్రకాశః, సర్వస్య, యోగమాయాసమావృతః,
మూఢః, అయమ్, న, అభిజానాతి, లోకః, మామ్, అజమ్, అవ్యయమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యోగమాయా | = నా యోగమాయచే | అయమ్ | = ఈ |
| సమావృతః | = కప్పబడినవాడనై | మూఢః, లోకః | = మూఢలోకము (అజ్ఞానులు) |
| అహమ్ | = నేను | మామ్ | = నన్ను |
| సర్వస్య | = ప్రతివ్యక్తికిని | అజమ్ | = జన్మలేనివానిగా |
| ప్రకాశః, న | = ప్రత్యక్షముగా గోచరించు వాడను కాను | అవ్యయమ్ | = శాశ్వతునిగా |
| | | న, అభిజానాతి | = తెలిసికొనలేకున్నారు |

**యోగ–మాయా–సమావృతః అహమ్ సర్వస్య ప్రకాశః న ।**
**అయమ్ మూఢః లోకః అజమ్ అవ్యయమ్ మామ్ న అభిజానాతి ॥**

తా: నా యోగమాయచే కప్పబడినవాడనై నేను ప్రతివ్యక్తికిని ప్రత్యక్షముగా గోచరించు వాడను కాను. ఈ అజ్ఞానులు నన్ను జన్మలేనివానిగా, శాశ్వతునిగా తెలిసికొనలేకున్నారు.

దశలవారీగా వస్తున్నాము. భక్తులలో రెండు రకాలు ఉన్నారు – సకామభక్తులు, నిష్కామభక్తులు. సకామభక్తుడు లౌకికంగా ఎదుగుతాడు కాని, ఆధ్యాత్మికంగా ఎదుగుదల ఉండదు. అందువల్ల అతను సకామభక్తినుంచి నిష్కామభక్తికి రావాలి.

భగవంతునిలో కూడా రెండు అంశాలున్నాయి – అవి అపరాప్రకృతి, పరాప్రకృతి. సకామభక్తుడు రెండవ అంశం గురించి తెలియక, అపరాప్రకృతికే పూజ చేస్తాడు. అపరాప్రకృతి అపూర్ణరూపం, పరాప్రకృతి సర్వవ్యాపకచైతన్యం. సర్వవ్యాపకచైతన్యం గురించి తెలియనివారు బుద్ధిహీనులు.

పరాప్రకృతి ఎక్కడ ఉంటుంది? కృష్ణపరమాత్మ జవాబు చెప్పాడు –

**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్** – 7.5

పరాప్రకృతి నా చేతనప్రకృతి అని చెప్పాడు. నిజానికి ఆ చేతనతత్త్వంవల్లనే నా శరీరం, నా మనస్సు, నా మనస్సులో ఉన్న ఆలోచనలు నాకు తెలుస్తున్నాయి.

పరాప్రకృతి అంత ఉన్నతస్థాయి అయి, అంత సర్వవ్యాపకమయితే, ఎందుకు మనుష్యులకు ఆ ఉన్నతస్థాయి గురించి తెలియటం లేదు? ఎందుకు అపరాప్రకృతినే పూజిస్తున్నారు? చాలామందికి భగవద్దర్శనం కావాలని ఉంటుంది. భగవంతుణ్ణి చూడాలని వారు కోరుకుంటున్నారంటే అది ఉన్నతస్థాయి భగవంతుణ్ణా, తక్కువస్థాయి భగవంతుణ్ణా? నామం, రూపం ఉందంటేనే సగుణబ్రహ్మ, వ్యవహారస్థాయి.

**అధరం మధురం నయనం మధురం వదనం మధురం**

ఒక భక్తురాలు నాకు కృష్ణపరమాత్మతో గోపికలలాగ నృత్యం చెయ్యాలి, కోలాటం ఆడాలని ఉంది అంటుంది. మోక్షం వద్దా అంటే దాని సంగతి తర్వాత చూద్దాము, ముందు నాట్యం చెయ్యాలి అంటుంది. ఎందుకు అపరాప్రకృతినే కోరుకుంటారు?

**యోగమాయాసమావృతః** – త్రిగుణాత్మకమైన మాయతో కప్పబడ్డారు వారు. మాయ అంటే అపరాప్రకృతి. మాయ ఎప్పుడూ మోహిని. అందువల్ల మోహంతో కప్పివేస్తుంది అందరినీ. దానివల్ల తెలివితేటలు పని చెయ్యవు.

మనుష్యులు నేను ప్రేమలో **పడ్డాను** అంటారు; ప్రేమలో లేచాను అనవచ్చు కదా, అది జరగదు; ప్రేమ ఒక విధమైన మైకం లాంటిది. అది మన వివేకాన్ని కప్పేస్తుంది. అలా ఇక్కడ మాయ కప్పేస్తుంది. అందువల్ల సమావృతః అన్నాడు. నా మాయాశక్తికి ఆవరణశక్తి ఉంది. అది మనుష్యులను మోహంలో పడవేస్తుంది.

**త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥** – 7.13

త్రిగుణాత్మకమైన మాయ కప్పేయటంవల్ల శాశ్వతుడనయిన నన్ను ఆ ప్రాణులు తెలుసుకోలేకుండా ఉన్నారు.

శరీరం, మనస్సు, ప్రపంచం అనే మోహంలో పడి పరాప్రకృతిని తెలుసుకోలేకుండా ఉన్నారు.

**అహం సర్వస్య ప్రకాశః న** – వారు ఇలా బాహ్యముఖంగా ఉండటంవల్ల నా స్వయం ప్రకాశకరూపం వారికి తెలియటం లేదు. మన ఇంటిలోనే భూమిలో మంచినీరు ఉంటే, ఎందుకు మనం బయట నీరుకోసం తాపత్రయ పడుతున్నాము? దానికి ఒక్కటే కారణం. ఇంటిలోనే భూమిలో నీరు ఉందనే జ్ఞానం లేకపోవటమే. మనలో ఉన్నదాన్ని మనం బయట వెతుకుతున్నామంటే, మనలో ఉన్నట్టు తెలియకపోవటమే దానికి కారణం.

ఈ పరాప్రకృతిని మనం తెలుసుకోకుండా ఏది కప్పేస్తోంది అంటే కృష్ణపరమాత్మయొక్క మాయాశక్తి అని చూశాము.

**అయం లోకః మూఢః** – అందువల్ల ప్రపంచం అంతా మాయలో పడిపోయి;

**న అభిజానాతి** – వారిలోనే చైతన్యం ఉందని తెలుసుకోలేకుండా ఉన్నారు.

మన ఇంటిలోనే, భూమిలో నీరు ఉందని చెప్పగల నిపుణులు ఉన్నట్టే, మనలోనే చైతన్యం ఉందని చెప్పగల గురువులు ఉన్నారు. నువ్వు బాహ్యంగా వెతుకుతున్నది నీలోనే ఉంది. అది శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా తెలుసుకోవాలి.

ఆనందం, శాంతి, భద్రతలు బాహ్యంగా లేవు, నీలోనే ఉన్నాయి. అది చెప్పటానికి గురువు సిద్ధంగా ఉన్నాడు. కాని నేర్చుకోవటానికి శిష్యులు సిద్ధంగా లేరు. అటువంటి వారిని మూఢులంటున్నాడు కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మకు వారిమీద జాలి ఉంది కనీసం. ఉపనిషత్తు వారిని విమూఢాః అంటుంది. మూఢుల్లో మూఢులు. మనుష్యులు ఈ జీవితమనే పరుగుపందెంలో పరుగులు తీస్తూనే ఉన్నారు. పెద్ద పట్టణాల్లో ఉంటే ఇంకా పరుగులు ఎక్కువ. పెద్ద దేశాల్లో ఉంటే నడిచే తీరిక కూడా లేదు. నిరంతరం పరుగే! లోకాః అంటే ప్రపంచంలోని మనుష్యులు. వారు నన్ను గుర్తించటం లేదు. ఎటువంటి నన్ను?

**అజమ్ అవ్యయమ్** – పుట్టుకలేని, చావులేని నన్ను తెలుసుకోలేకుండా ఉన్నారు. అంటే శాశ్వతమైన నన్ను తెలుసుకోలేకపోతున్నారు.

శ్లో. 26 **వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।**
**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥**
వేద, అహమ్, సమతీతాని, వర్తమానాని, చ, అర్జున,
భవిష్యాణి, చ, భూతాని, మామ్, తు, వేద, న, కశ్చన ॥

| | | | |
|---|---|---|---|
| అర్జున! | = ఓ అర్జునా! | వేద | = తెలుసు |
| సమతీతాని | = గతించి పోయినవి | తు | = కాని |
| చ | = ఇంకా | మామ్ | = నన్ను |
| వర్తమానాని | = ప్రస్తుతకాలమునందు ఉన్నవి | కశ్చన | = మాయచేత కప్పబడిన జీవులు |
| చ | = ఇంకా | | |
| భవిష్యాణి | = రాబోవుకాలములో జన్మించునవి | న వేద | = తెలుసుకోలేరు |
| భూతాని | = ప్రాణులనన్నింటిని గూర్చి | | |
| అహమ్ | = మాయను అధీనము చేసుకున్న నాకు | | |

**హే అర్జున! అహమ్ సమతీతాని వర్తమానాని చ భవిష్యాణి చ**
**భూతాని వేద । కశ్చన తు మామ్ న వేద ॥**

తా: ఓ అర్జునా! మాయను అధీనము చేసుకున్న నాకు, గతించి పోయినవియు ఇంకా ప్రస్తుత కాలమునందు ఉన్నవియు ఇంకా రాబోవు కాలమున జన్మించునవి అయిన ప్రాణులనన్నింటి గూర్చి నాకు తెలుసు కాని నన్ను మాయచేత కప్పబడిన జీవులు తెలుసుకోలేరు.

ముందు శ్లోకంలో ప్రపంచం అంతా మాయ అనే మోహంలో పడి కొట్టుకుపోతున్నారు, అందువల్ల నన్ను తెలుసుకోలేకపోతున్నారు అన్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడ మనకొక సందేహం కలుగుతుంది. ప్రపంచం అంతా మాయయొక్క మాయలో పడితే ఆ మాయ భగవంతుణ్ణి కూడా కప్పేయదా?

ఒక పుస్తకం మీకు, నాకు మధ్య అడ్డుగా ఉంది. ఆ పుస్తకం అడ్డుగా ఉండటంవల్ల మీరు నన్ను చూడలేక పోతున్నారు అంటే అదే సూత్రం నాకు కూడా వర్తిస్తుంది కదా! అంటే అదే పుస్తకం అడ్డుగా ఉండటంవల్ల నేను కూడా మిమ్మల్ని చూడలేకపోవాలి. అదే విధంగా మాయవల్ల మనం కృష్ణపరమాత్మను చూడలేకపోతే, అదే మాయవల్ల కృష్ణపరమాత్మ కూడా మనను చూడలేకపోవాలి కదా! నిజానికి మాయ కృష్ణపరమాత్మకు చాలా దగ్గరగా కూడా ఉంటుంది. కాని ఆ సూత్రం ఇక్కడ వర్తించదు. ఎందుకు?

మనమంతా మాయ ఆధీనంలో ఉంటే, కృష్ణపరమాత్మ అధీనంలో మాయ ఉంటుంది. నేను అధికారిని, మాయ నా చెప్పుచేతల్లో ఉంటుంది; మనుష్యుల విషయంలో మాయ అధికారి అయి, మనుష్యులను తన చెప్పుచేతల్లోకి తీసుకుంటుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ విషయాన్ని వివరించటానికి చిన్మయానందస్వామి అద్భుతమైన ఉదాహరణ చెబుతారు. ఒకసారి తండ్రీకొడుకులు రోడ్డుమీద నడుస్తున్నారుట. వారికి ఎదురుగా ఒక వ్యక్తిని బందీగా చేసి తీసుకుపోతున్న పోలీసు వచ్చాడు. 'ఎందుకలా పట్టుకుని తీసుకు వెళుతున్నాడు?' కొడుకు అడిగితే, 'అతను దొంగతనం చేశాడు, అందువల్ల దగ్గరుండి జైలుకు తీసుకువెళుతున్నాడు,' అన్నాడు తండ్రి.

ఇంకాసేపటికి ఇద్దరు పోలీసుల మధ్య ఒక వ్యక్తి ఎదురయ్యాడు. 'ఇతన్ని ఇద్దరు ఎందుకు తీసుకువెళుతున్నారు?' అతను గజదొంగ. అందువల్ల అతను పారిపోకుండా ఇద్దరు పట్టుకున్నారు. దీన్నిబట్టి ఆ చిన్నారి బుర్రలో ఒక ఉపసిద్ధాంతం ఏర్పడిపోయింది. ఒక వ్యక్తి పక్కన ఎంతమంది పోలీసులుంటే, అతను అంత పెద్ద నేరస్థుడన్నమాట.

ఈ సిద్ధాంతం రూపుదిద్దుకున్న కాసేపటికి ప్రెసిడెంటు వెళుతున్నాడు. ఆయన చుట్టూ పోలీసు బలగం చాలా ఉంది. 'నాన్నా, అదుగో చాలా పెద్ద నేరస్థుడు వెళుతున్నాడు,' అన్నాడు కొడుకు ఆవేశంగా! తండ్రికి ఇప్పుడు విడమర్చి చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. పోలీసులు దొంగ వెంటా ఉన్నారు, ప్రెసిడెంటు వెనకా ఉన్నారు, కాని ఆ ఉండటంలో చాలా వ్యత్యాసం ఉంది. దొంగ, పోలీసుల అధీనంలో ఉంటే, పోలీసులు ప్రెసిడెంటు అధీనంలో ఉన్నారు. అక్కడ పోలీసు అధికారి, ఇక్కడ ప్రెసిడెంటు అధికారి.

ఇదే సూత్రాన్ని భగవంతుడికి అన్వయిస్తే, మాయ అధీనంలో మనం ఉన్నాము; భగవంతుని అధీనంలో మాయ ఉంది.

**అహం వేద** – నాకు తెలుసు అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఏం తెలుసు? నాకు పరాప్రకృతి, అపరాప్రకృతి రెండూ తెలుసు. మనుష్యులకు ఉన్న అజ్ఞానం నాకు లేదు.

**భూతాని (వేద)** – మొత్తం సృష్టి గురించి నాకు బాగా తెలుసు. మాయ నన్ను ప్రలోభ పెట్టలేదు.

**సమతీతాని వర్తమానాని భవిష్యాణి చ** – నాకు గతం తెలుసు; వర్తమానం తెలుసు; భవిష్యత్తు కూడా తెలుసు. ఈ మూడు పదాలు భూతానికి విశేషణాలు. అంటే సమస్త జీవరాశుల భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి నాకు తెలుసు. ఒక్కముక్కలో చెప్పాలంటే, నాకు మొత్తం సృష్టి గురించి తెలుసు.

**కశ్చన మాం న వేద** – కాని జీవులు నా గురించి తెలుసుకోలేరు. మాయచేత కప్పబడిన జీవులు నా గురించి తెలుసుకోలేరు. వారు అజ్ఞానంలో మునిగివున్నారు. అందువల్ల సంసారం అనుభవిస్తున్నారు. దాన్నే ఇంకా వివరంగా తర్వాత వచ్చే శ్లోకంలో వివరించబోతున్నాడు.

శ్లో. 27 **ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన భారత ।**
**సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప ॥**
ఇచ్ఛాద్వేషముత్థేన, ద్వంద్వమోహేన, భారత,
సర్వభూతాని, సమ్మోహమ్, సర్గే, యాంతి, పరంతప ॥

| | | | |
|---|---|---|---|
| భారత! | = ఓ భరతవంశీ! | ద్వంద్వ మోహేన | = సుఖదుఃఖాది ద్వంద్వముల ప్రభావమున మోహ కారణముగ |
| పరంతప! | = ఓ అర్జునా! | సర్వభూతాని | = సమస్త ప్రాణులు |
| సర్గే | = (ఈ) జగత్తునందు | సమ్మోహమ్ | = అంతులేని వ్యామోహమును |
| ఇచ్ఛాద్వేషసముత్థేన | = రాగద్వేషములవలన కలిగిన | యాంతి | = పొందుచున్నవి |

**హే పరన్తప భారత! సర్వ–భూతాని ఇచ్ఛా–ద్వేష–సముత్థేన**
**ద్వన్ద్వ–మోహేన సర్గే సమ్మోహమ్ యాన్తి ॥**

తా: ఓ భరతవంశీ! ఓ అర్జునా! (ఈ) జగత్తునందు రాగద్వేషములవలన కలిగిన సుఖదుఃఖాది ద్వంద్వముల ప్రభావమున మోహ కారణముగ సమస్త ప్రాణులు అంతులేని వ్యామోహమును పొందుచున్నవి.

జీవుడు తనలోనే ఉన్న అఖండమైన శాంతి, భద్రత, ఆనందాలను తెలుసుకోలేక పోతున్నాడు. ఎప్పుడు?

**సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి** – జగత్తులో ప్రాణులందరూ పుట్టినప్పటి నుంచే మోహంలో పడిపోయారు. సర్గే అంటే పుట్టినప్పటి నుంచే. శాంతి, భద్రతలు తనలోనే ఉన్నాయని తెలియక, వాటిని బాహ్యంగా వెతుక్కుంటున్నారు.

**బాలస్తావత్ క్రీడాసక్తః** – బాల్యంలో బొమ్మలతో ఆడుకుంటారు;

**తరుణస్తావత్ తరుణీ సక్తః** – వయస్సు వచ్చాక భార్యమీద ప్రేమ ఉంటుంది;

**వృద్ధస్తావత్ చింతాసక్తః** – వృద్ధాప్యం చింతలతో గడిచిపోతుంది. అలా జీవితమంతా బాహ్యాముఖంగానే ఉంటే, అంతర్ముఖులు అయ్యేదెప్పుడు? నాలోనే నేను వెతికే శాంతి భద్రతలు ఉన్నాయేమోనని సందేహం లేశమాత్రం రాదు. అది తెలియకుండా జీవితం చాలిస్తారు కొంతమంది.

అంతేకాదు, సైన్సు పెరిగినకొద్దీ, మరింత బాహ్యాముఖులు అవుతారు. టీవీ ఛానెల్స్ వందకు పైగా ఉంటాయి. కావల్సినంత కాలక్షేపం. ఎక్కడో 99 రూపాయలకే ప్రపంచయాత్ర అని తాటికాయంత అక్షరాల్లో ప్రకటన వస్తుంది. మనం ఎగిరి గంతేసి పూర్తిగా చదవటానికి ప్రయత్నిస్తే, భూతద్దంలోంచి చూస్తే గాని కనబడని అక్షరాలతో జీవితాంతం 1000 రూపాయలు కట్టాలని ఉంటుంది. అలా ఏదో ఒక వ్యామోహంలో పడిపోతూ ఉంటారు.

**ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన** – ద్వంద్వాల మోహంలో పడిపోతారు మనుష్యులు. ద్వంద్వాలు అంటే రెండు వస్తువుల మేలుకలయిక. ప్రపంచాన్ని రెండుగా విభజించి చూస్తారు – ఇవి నాకు ఆనందాన్ని ఇస్తాయి; ఇవి దుఃఖాన్ని ఇస్తాయి అనుకుంటారు. అంటే రాగద్వేషాలలో పడిపోతారు; ఇచ్ఛాద్వేషాలు రాజ్యమేలుతాయి. వారికి ఇష్టమైన వాటిని పొందటంలోను, వారికి ద్వేషం కలిగించే విషయాలను పారద్రోలటంతోనూ సరిపోతుంది. వీటిని ప్రవృత్తి–నివృత్తి మార్గాలు అంటారు; ఇవి రాగద్వేషాలవల్ల ఏర్పడతాయి.

కాని వేదాంతం ప్రకారం ప్రపంచం ఆనందహేతువూ కాదు, దుఃఖహేతువూ కాదు. ఆనందహేతువు నన్ను నేను తెలుసుకోవటం; దుఃఖహేతువు ఆత్మ అజ్ఞానం. అంటే సుఖదుఃఖాలు నామీదే ఆధారపడి ఉన్నాయి. ఆత్మ అజ్ఞానం దుఃఖహేతువు అయితే ఆత్మజ్ఞానం సుఖహేతువు. అది తెలియక నేను బాహ్యప్రపంచాన్ని మారుస్తూ వస్తున్నాను. మనుష్యులను మారుస్తున్నాను, కార్లను మారుస్తున్నాను, ఏదీ మార్చటానికి అందుబాటులో లేకపోతే నా జుట్టు దువ్వే విధానాన్ని మారుస్తాను, చేతి గడియారాన్ని మారుస్తాను. ఈ మార్చటంలో పడిపోయి, అసలు సమస్య ఎక్కడ ఉందో ఆలోచించే తీరిక కూడా లేదు.

అందువల్ల సమ్మోహంలో పడిపోతున్నారు అర్జునా అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇది మానవాళి పరిస్థితి. కాని కొందరు పుణ్యం చేసుకున్నవారు ఉన్నారు. వారు వీరందరికీ భిన్నంగా ఉన్నారు. ఎవరు వారు? భగవద్గీత అధ్యయనం చేసేవారు.

శ్లో. 28 **యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।**
**తే ద్వంద్వమోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥**
యేషామ్, తు, అంతగతమ్, పాపమ్, జనానామ్, పుణ్యకర్మణామ్,
తే, ద్వంద్వమోహనిర్ముక్తాః, భజంతే, మామ్, దృఢవ్రతాః ॥

| | | | |
|---|---|---|---|
| తు | = కాని | ద్వంద్వ | = రాగద్వేష జనితములైన |
| పుణ్యకర్మణామ్ | = నిష్కామభావముతో పుణ్యకర్మలను ఆచరించు | మోహనిర్ముక్తాః | సుఖదుఃఖాది ద్వంద్వరూప మోహములనుండి విముక్తులై |
| యేషామ్, జనానామ్ | = ఏ పురుషులయొక్క | దృఢవ్రతాః | = దృఢనిశ్చయము గలవారై |
| పాపమ్ | = పాపము(లు) | మామ్ | = నన్ను |
| అంతగతమ్ | = నశించిపోవునో | భజంతే | = భజింతురు |
| తే | = అటువంటి భక్తులు | | |

**యేషామ్ పుణ్య-కర్మణామ్ జనానామ్ తు పాపమ్ అన్తగతమ్,**
**తే దృఢ-వ్రతాః ద్వన్ద్వ-మోహ-నిర్ముక్తాః మామ్ భజన్తే॥**

తా: కాని నిష్కామభావముతో పుణ్యకర్మలను ఆచరించు ఏ పురుషులయొక్క పాపములు నశించిపోవునో అటువంటి భక్తులు రాగద్వేష జనితములైన సుఖదుఃఖాది ద్వంద్వరూపమోహములనుండి విముక్తులై దృఢనిశ్చయము గలవారై నన్ను భజింతురు.

**జనానాం పుణ్యకర్మణామ్ –** కాని కొందరు పుణ్యమూర్తులు ఉంటారు. వారు ఈ జన్మలోనో, పూర్వజన్మలోనో పుణ్యం చేసుకుని ఉంటారు. పంచమహాయజ్ఞాలు (మూడవ అధ్యాయంలో చూశాము) చేసి ఉంటారు. దానివల్ల వారికి చిత్తశుద్ధి పెరిగి, పాపం తగ్గుతుంది. వారి పుణ్యం ఎక్కువైతే, వారి పాపం తగ్గుతుంది.

**త్వంతగతం పాపం** –వారి పాపం తగ్గిందని ఎలా తెలుస్తుంది? వారు ఆలోచించటం మొదలుపెడతారు. వారు ఆలోచించటం మొదలుపెడతారు అంటే, ఇంతవరకూ ఆలోచించలేదు అనే అర్థం. ప్రపంచాన్ని మారిస్తే, నాకు ఆనందం వచ్చేటట్టయితే, ఎప్పుడో ఆనందం వచ్చి ఉండాలే అనే విశ్లేషణ బయలుదేరుతుంది వారిలో. డెబ్బయోపడిలో పడినా, ఎనభయ్యోపడిలో పడినా ఇంకా ఆనందం ఏమిటో తెలియటం లేదు. ఆరోజు ఎప్పుడైనా వస్తుందా అనిపిస్తుంది.

జీవితంలో కావాల్సినవి అన్నీ ఉన్నాయి – పిల్లలు, మనవలు ఉన్నారు; ఇల్లు, ఆస్తి ఉంది; కొన్ని విజయాలు సాధించాను, కాని నా సమస్య తీరలేదు అంటే బహుశ నేను వెళుతున్న మార్గం సరియైనది కాదేమోననే సందేహం వస్తుంది వారికి. ఎందుకంటే వారు వెళుతున్న మార్గం సబబే అయితే, ఈపాటికి ఆనందం లభించి ఉండాలి కదా!

ఎప్పుడైతే ఈ విశ్లేషణ బయలుదేరుతుందో, అప్పుడు ఏదైనా శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేది ఉందా అనే ప్రశ్న మొదలవుతుంది. అర్థకామాలు కాక ఇంకేదైనా పురుషార్థం ఉందా? ఎప్పుడైతే వారిలో ఈ చింత మొదలవుతుందో, అప్పుడే భగవంతుడు వారికి మార్గాన్ని నిర్దేశిస్తాడు. ఈశ్వరకృపవల్ల సుఖదుఃఖాలు బాహ్యంగా లేవు, తమలోనే ఉన్నాయని తెలుసుకుంటారు. దయానందస్వామీజీ చెపుతారు – **సమస్య నువ్వు, పరిష్కారం నువ్వు.** ఎప్పుడైతే మనిషి ఈ విషయం అర్థం చేసుకుంటాడో అప్పుడే ఆధ్యాత్మిక మార్గంలోకి వస్తాడు. ఇంతవరకూ బాహ్యంగా పరుగులు తీశాడు.

**తే ద్వంద్వమోహనిర్ముక్తాః (భవంతి) –** అంతకుముందు శ్లోకంలో ద్వంద్వమోహాల్లో పడిపోయారు మానవులు అన్నాడు. ఇప్పుడు అందులోంచి కొందరు పుణ్యాత్ములు, వారి పాపం తగ్గటంవల్ల ఈ ద్వంద్వమోహాలనుంచి విముక్తి పొందుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వారికి నిత్యానిత్యవస్తువివేకం వచ్చింది, ఇహాముత్ర ఫలభోగవైరాగ్యం వచ్చింది. ఒక్కముక్కలో చెప్పాలంటే వారికి సమస్య ఏమిటో తెలిసింది. ఏమిటా సమస్య?

ఆత్మ అజ్ఞానం సమస్య. వారు ఏమిటో తెలియక, ఏవేవో పనులు చేస్తూ వచ్చారు. ఇప్పుడు తెలిసింది.

**మాం భజంతే –** నన్ను వెతుకుతున్నారు. అపరాప్రకృతిని కాదు, పరాప్రకృతిని. అంటే బ్రహ్మ అన్వేషణ చేస్తున్నారు. దీన్ని నిష్కామభక్తి అంటారు. అయోమయంవల్ల మనుష్యులు సకామభక్తులుగా ఉన్నారు. ఎప్పుడైతే స్పష్టత ఏర్పడుతుందో అప్పుడే నిష్కామభక్తులు అవుతారు. నిష్కామభక్తి అంటే ఏమిటి? అది రాబోయే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 29 **జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతంతి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్ అధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥**
జరామరణమోక్షాయ, మామ్, ఆశ్రిత్య, యతంతి, యే,
తే, బ్రహ్మ, తత్, విదుః, కృత్స్నమ్, అధ్యాత్మమ్, కర్మ, చ, అఖిలమ్ ॥

| | | | |
|---|---|---|---|
| యే | = ఏ పురుషులు | తత్, బ్రహ్మ | = ఆ పరబ్రహ్మను |
| మామ్ | = నన్ను | కృత్స్నమ్ | = సంపూర్ణమైన |
| ఆశ్రిత్య | = ఆశ్రయించి | అధ్యాత్మమ్ | = అధ్యాత్మమును |
| జరామరణ | = జరామరణములనుండి | చ | = ఇంకా |
| మోక్షాయ | = విముక్తికై | అఖిలమ్, కర్మ | = సంపూర్ణకర్మను |
| యతంతి | = ప్రయత్నింతురో | విదుః | = తెలుసుకొందురు |
| తే | = ఆ పురుషులు | | |

**యే మామ్ ఆశ్రిత్య జరా–మరణ–మోక్షాయ యతన్తి, తే తత్ బ్రహ్మ,**
**కృత్స్నమ్ అధ్యాత్మమ్, అఖిలమ్ కర్మ చ విదుః ॥**

తా: ఏ పురుషులు నన్ను ఆశ్రయించి జరామరణములనుండి విముక్తికై ప్రయత్నింతురో ఆ పురుషులు ఆ పరబ్రహ్మను సంపూర్ణమైన అధ్యాత్మమును ఇంకా సంపూర్ణకర్మను తెలుసుకొందురు.

నిష్కామభక్తి ఎప్పుడు మొదలవుతుంది? నా ఆనందానికి కాని, నా దుఃఖానికి కాని కారణం బాహ్యప్రపంచం కాదు, నేనే నా ఆనందానికి, దుఃఖానికి కారణమని తెలిసినప్పుడు. నేనే ఎలా రెండింటికీ కారణమవుతాను? నన్ను నేను సరిగ్గా అర్థం చేసుకుంటే నేను ఆనందానికి కారణం; నన్ను నేను తప్పుగా అర్థం చేసుకుంటే నేను దుఃఖహేతువును. తాడును తాడుగా చూస్తే ఏ భయమూ లేదు; తాడును చూసి పాము అని భయపడితేనే వస్తుంది గొడవంతా.

అలాగే నాకు ఆత్మజ్ఞానం కలిగితే నేనే ఆనందస్వరూపాన్ని. ఎప్పుడైతే ఈ స్పష్టత వస్తుందో, అప్పుడే నాలో జిజ్ఞాస ఏర్పడుతుంది. అప్పుడే నేను జిజ్ఞాసభక్తుణ్ణి అవుతాను.

**జరామరణమోక్షాయ** – సంసారంనుంచి మోక్షం పొందటానికి. సంసారంలో అనేక సమస్యలు ఉంటాయి, కాని అన్నిటికన్నా ఎక్కువ భయపెట్టే సమస్యలు జరా, మరణాలు అంటే వృద్ధాప్యం, చావు. మనకు మరణించాలని ఉండదు – నాకేం భయంలేదని చెబుతాము కాని మరణం సమీపిస్తుందంటేనే భయపడతాము. అందువల్ల చాలామంది నేను కష్టపడకుండా పోవాలనో లేదా నిద్రలో పోవాలనో అంటారు.

అలాగే వృద్ధాప్యంలో ఇంద్రియాల శక్తి సన్నగిల్లుతుంది కాని మనస్సు హుషారుగానే ఉంటుంది. అందువల్ల ఏదో ఒకటి తలుచుకుని బాధపడతూ ఉంటుంది. ఎవరన్నా కనబడితే, వారితో కష్టం సుఖం వెళ్ళబోసుకోవాలని ఉంటుంది. అందువల్లనే ఎవరైనా పొరపాటున 'ఎలా ఉన్నారు?' అని అడిగితే 1917నుంచి చెప్పుకొస్తాము– అదంతా వినే తీరికా, ఓపికా ఎవరికి ఉంటుంది? ఒకవేళ ఉన్నా అరిగిపోయిన గ్రామఫోను రికార్డులా అదే అదే చెబుతాము. అందువల్ల వృద్ధాప్యం, మరణం పెద్ద సమస్యలు.

**యే యతంతి** – కొంతమంది వీటినుంచి స్వేచ్ఛ కోరుతారు.

**మామ్ ఆశ్రిత్య** – నన్ను శరణు పొందుతారు. కొంతమంది కాలానికి అతీతంగా ఎదుగుదామని చూస్తారు. జరామరణాలు కాలాన్ని సూచిస్తాయి. కాలాతీతంగా ఎదగాలంటే, వస్తువుకు కూడా అతీతంగా ఎదగటం. వస్తువుకు అతీతంగా ఎదగటమంటే అపరాప్రకృతికి అతీతంగా ఎదగటం. అపరాప్రకృతికి అతీతంగా ఎదగటమంటే పరాప్రకృతికి వెళ్ళటం. పరాప్రకృతిని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు.

**తద్విదుః** – వారు పరాప్రకృతిని ఖచ్చితంగా తెలుసుకుంటారు. పరాప్రకృతి శాశ్వతమనీ, శాంతి భద్రతలకు మూలమని, ఆనందహేతువని తెలుసుకుంటారు. అంటే వారు అపరాప్రకృతి, పరాప్రకృతి రెండూ తెలుసుకుంటారు. ఇంతవరకూ ఇష్టదైవాన్ని కొలవటంవల్ల భగవంతునియొక్క అపరాప్రకృతి మాత్రమే తెలుసు. అంటే సగుణ ఈశ్వరుడు మాత్రమే తెలుసు. ఇప్పుడు నిర్గుణ ఈశ్వరుడు కూడా తెలుసు. ఒక్కముక్కలో చెప్పాలంటే వారికి భగవంతుని గురించి సంపూర్ణంగా తెలుసు.

కాని కృష్ణపరమాత్మ ఇక్కడ తన చిలిపితనం చూపిస్తున్నాడు. ఆయన చెప్పాలనుకున్నది నిష్కామభక్తులు చివరికి పరాప్రకృతిని, అపరాప్రకృతిని కూడా తెలుసుకుంటారు అని. పరాప్రకృతి అంటే భగవంతునియొక్క ఉన్నతస్థాయి అని, అపరాప్రకృతి అంటే వ్యావహారికస్థాయి అని చూశాము. కాని ఇక్కడ కృష్ణపరమాత్మ పరాప్రకృతి, అపరాప్రకృతి పదాలు వాడకుండా కొత్త పదాలను పరిచయం చేస్తున్నాడు. సహజంగా ఈ కొత్త పదాలేమిటో తెలుసుకోవాలనే కుతూహలం అర్జునునికి కలుగుతుంది. ఆ కుతూహలం రేకెత్తించటం ద్వారా ఎనిమిదవ అధ్యాయానికి ఇక్కడే బీజం వేసాడు కృష్ణపరమాత్మ. ఆ కొత్త పదాలు **బ్రహ్మ, కర్మ**. వాటిని ఇక్కడ వివరించడు. ఎనిమిదవ అధ్యాయంలోనే చూస్తాము.

**తే తత్ బ్రహ్మ కృత్స్నమ్ (విదుః)** – వారు బ్రహ్మను సంపూర్ణంగా తెలుసుకుంటారు.

**అఖిలం కర్మ (విదుః)** – వారు కర్మను సంపూర్ణంగా తెలుసుకుంటారు.

**అధ్యాత్మమ్** – అధ్యాత్మాన్ని కూడా సంపూర్ణంగా తెలుసుకుంటారు.

ఈశ్వరజ్ఞాని ఈ మూడు అంశాలనూ – బ్రహ్మ, కర్మ, అధ్యాత్మాలను సంపూర్ణంగా తెలుసుకుంటాడు. అవేమిటో ఇక్కడ కృష్ణపరమాత్మ చెప్పడు కాబట్టి మనం కూడా ఇప్పుడు వాటిని చూడటం లేదు. అంతేకాదు, ఇంకో మూడు కొత్త పదాలను కూడా పరిచయం చెయ్యబోతున్నాడు రాబోయే శ్లోకంలో.

శ్లో. 30 **సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।**
**ప్రయాణకాలేఽపి చ మాం తే విదుర్యుక్తచేతసః ॥**
సాధిభూతాధిదైవమ్, మామ్, సాధియజ్ఞమ్, చ, యే, విదుః,
ప్రయాణకాలే, అపి, చ, మామ్, తే, విదుః, యుక్తచేతసః ॥

| | | | |
|---|---|---|---|
| యే | = ఏ పురుషులు | విదుః | = స్మరిస్తారో |
| సాధిభూతాధిదైవమ్ | = అధిభూత అధిదైవములతో | తే | = ఆ పురుషులు |
| చ | = ఇంకా | యుక్తచేతసః | = మనస్సును అదుపులో పెట్టుకున్నవారు |
| సాధియజ్ఞమ్ | = అధియజ్ఞముతో కూడిన | మామ్,చ విదుః | = నన్నే తలుచుకుంటారు |
| మామ్ | = నన్ను | | |
| ప్రయాణకాలే | = అవసాన సమయమున | | |
| అపి | = కూడా | | |

**యే సాధిభూత–అధిదైవమ్ సాధియజ్ఞమ్ చ మామ్ విదుః**
**తే యుక్త–చేతసః ప్రయాణ–కాలే అపి చ మామ్ విదుః ॥**

తా: ఏ పురుషులు అధిభూత అధిదైవములతో ఇంకా అధియజ్ఞముతో గూడిన నన్ను అవసాన సమయమున కూడా స్మరిస్తారో ఆ పురుషులు మనస్సును అదుపులో పెట్టుకున్నవారు నన్నే తలుచుకుంటారు.

**సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ** – వారు ఈ మూడు అంశాలను కూడా తెలుసుకుంటారు. అవి అధిభూతం, అధిదైవం, అధియజ్ఞం. అంటే వీటితో కలిపి మొత్తం ఆరు అంశాలు తెలుసుకుంటారు. అవి – బ్రహ్మ, కర్మ, అధ్యాత్మం, అధిభూతం, అధిదైవం, అధియజ్ఞం. వీటి రహస్యం తెలుసా మీకు? ఈ ఆరు పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయిక. వీటినే వేరే పేర్లతో వివరించబోతున్నాడు.

తెలివైనవారు ఈ ఆరూ తెలుసుకోవటమే కాక, మరణకాలంలో కూడా వీటిని గుర్తు పెట్టుకుంటారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ప్రయాణకాలేఽపి చ మామ్** – పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయికనైన నన్ను మరణంలో కూడా ఈ జ్ఞానులు గుర్తు పెట్టుకుంటారు. ప్రయాణకాలంలో నన్ను గుర్తు పెట్టుకుంటారని కృష్ణపరమాత్మ అనటంవల్ల మనలో రెండు ప్రశ్నలు ఉదయిస్తాయి.

1. మరణకాలంలో ఈశ్వరస్మరణం గురించి ఎందుకు ప్రత్యేకించి చెప్పాడు కృష్ణపరమాత్మ? ఇప్పుడు మనం హాయిగా ఉన్నాము, మరణకాలం ఇంకా ఆసన్నమవలేదు కదా!

2. మరణకాలంలో భగవంతుడు ఎలా గుర్తుకు వస్తాడు? నిజం చెప్పాలంటే మరణకాలంలో ఈశ్వరస్మరణ తప్ప అన్నీ గుర్తుకొస్తాయి. ఎక్కడో దూరంగా ఉన్న మనవడో, మనవరాలో గుర్తుకొస్తుంది; ఎవరో ఎప్పుడో అప్పు తీసుకుని, తిరిగి ఇవ్వని విషయం గుర్తుకొస్తుంది. ఏదో ఎఫ్.డి. రెన్యూ చెయ్యలేదని గుర్తుకు వస్తుంది; ఎవరినో చూడాలనిపిస్తుంది. వీటన్నిటినీ కాదని భగవన్నామస్మరణ చెయ్యటం ఎలా? అర్జునుడు ఎలాగూ ఈ ప్రశ్న వేస్తాడు.

నిజానికి ఎనిమిదవ అధ్యాయం ప్రారంభంలో అర్జునుడు ఏడు ప్రశ్నలు వేస్తాడు. ఆ ప్రశ్నలకు బీజాన్ని ఇక్కడ చివరి రెండు శ్లోకాల్లో వేసి వదిలేస్తాడు కృష్ణపరమాత్మ.

**(ప్రయాణకాలేఽపి) యుక్త చేతసః** – ప్రయాణకాలం అంటే మరణసమయంలో; యుక్త చేతసః అంటే మనస్సును అదుపులో పెట్టుకున్నవారు.

**మాం విదుః** – విదుః అంటే స్మరిస్తారు. ఎవరు? నిష్కామభక్తులు. దీనితో కృష్ణపరమాత్మ రెండు రకాల భక్తులను– సకామభక్తి, నిష్కామభక్తి – వాటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ముగిస్తూ ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాడు.

అర్జునుడు అడగబోయే ఏడు ప్రశ్నలు ఇవి – బ్రహ్మ అంటే ఏమిటి? కర్మ అంటే ఏమిటి?అధ్యాత్మము అని దేనికి పేరు? అధిభూతము అని దేనికి పేరు? అధిదైవము అని దేనిని అంటారు? అధియజ్ఞము అంటే ఏమిటి? అంత్యకాలంలో నిన్ను ఎలా తలుచుకుంటారు?

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే జ్ఞానవిజ్ఞానయోగోనామ సప్తమోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీమద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు జ్ఞాన, విజ్ఞానయోగము అనే సప్తమోధ్యాయము.

# అధ్యాయము 7 - జ్ఞానవిజ్ఞానయోగము సారాంశము

ఏడవ అధ్యాయం మొత్తం గీతాబోధలో ఒక మలుపు రాయి. ఆరవ అధ్యాయం వరకూ కొన్ని అంశాలు చర్చించి, ఏడవ అధ్యాయంనుంచి మరికొన్ని అంశాలు చర్చిస్తాడు.

ముందు మొదటి ఆరు అధ్యాయాల్లో చర్చించిన అంశాలను మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము. అవి – జీవస్వరూపం, కర్మయోగం, పురుషప్రయత్నం.

1. **జీవస్వరూపం** – జీవుడు శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు. జీవుడు వీటన్నిటినీ సాక్షిగా చూసే సాక్షిచైతన్యం. ఈ చైతన్యాన్ని సచ్చిదానంద ఆత్మ అంటారు. ఈ జీవ స్వరూపం 2,3,4,6 అధ్యాయాల్లో వచ్చింది.

2. **కర్మయోగం** – కర్మయోగం అంటే ఏమిటి?

| | | | | |
|---|---|---|---|---|
| **కర్మయోగం** | **=** | **సరియైన కర్మ** | **+** | **సరియైన దృక్పథం** |
| **సరియైన కర్మ** | **=** | **సాత్త్విక కర్మ** | **+** | **పంచమహా యజ్ఞాలు** |
| **సరియైన దృక్పథం** | **=** | **ఈశ్వరార్పణ బుద్ధి** | **+** | **ఈశ్వర ప్రసాదబుద్ధి** |

3. **పురుషప్రయత్నం** – దీన్నే ఫ్రీవిల్ అని కూడా అంటారు. మన హిందూధర్మంమీద చాలామందికి ఒక పెద్ద అపోహ ఉంది. మనం విధిని నమ్ముతామనీ, విధి చేతిలో కీలుబొమ్మలుగా మారామనీ అంటారు. ఇతరులు అనటమే కాదు, మనం ఏదైనా ఎదురుదెబ్బలు తిన్నప్పుడు, మన భవిష్యత్తును ముందే ఆ భగవంతుడు మన నుదుటిమీద రాసి పంపుతాడనీ, ఆ లలాటలిఖితాన్ని ఎవరూ చెరపలేరనీ, మనం భగవంతుడు ఆడే వింతనాటకంలో కీలుబొమ్మలమనీ దృఢంగా నమ్ముతాము. అలాంటి విధిరాతని నమ్మడం మనకు హానికరం.

అందువల్ల కృష్ణపరమాత్మ అటువంటి మనస్తత్వాన్ని తీవ్రంగా ఖండించాడు మొదటి ఆరు అధ్యాయాల్లో. అంతా పూర్తిగా దైవనిర్ణయం కాదు. మన భవిష్యత్తును మనం తీర్చిదిద్దుకునే అధికారం ఉంది మనకు. మన భవిష్యత్తుకు కారణం ఎవరు? భగవంతుడా, మనమా? భగవంతుడూ పూర్తి కారణం కాదు, మనమూ పూర్తి కారణం కాదు. అందువల్ల మన ప్రయత్నం మనం చెయ్యాలి. మన ఫ్రీవిల్‌ను ఉపయోగించి, మన మార్గనిర్దేశం మనం చేసుకోవాలి. దాన్ని పురుషప్రయత్నం అనీ, జీవప్రయత్నం అనీ అంటారు.

ఏడవ అధ్యాయంనుంచి పన్నెండవ అధ్యాయం వరకూ అంటే రెండవ షట్కంలో మరో మూడు అంశాలను చర్చిస్తాడు కృష్ణపరమాత్మ. అవి ఈశ్వరస్వరూపం, ఈశ్వర అనుగ్రహం, ఈశ్వరధ్యానం. అక్కడ జీవస్వరూపం చూస్తే ఇక్కడ ఈశ్వరస్వరూపం చూస్తాము. అలాగే అక్కడ పురుషప్రయత్నం లేదా జీవప్రయత్నం గురించి చూస్తే దానికి తోడుగా ఈశ్వరకృప కూడా ఎలా ఉండాలో చూస్తాము. అలాగే అక్కడ కర్మయోగం గురించి చూస్తే ఇక్కడ ఉపాసనయోగం గురించి చూస్తాము. ఈశ్వర ఉపాసన అంటే సగుణ ఈశ్వర ఉపాసన. ఈ నేపథ్యంతో రెండవ షట్కం నేర్చుకోవాలి.

ఇప్పుడు ఏడవ అధ్యాయం సారాంశం చూద్దాము. ఏడవ అధ్యాయాన్ని ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించవచ్చు. అవి–

| | | |
|---|---|---|
| **1. ఉపోద్ఘాతం** | - | **శ్లోకాలు 01 - 03** |
| **2. ఈశ్వర స్వరూపం** | - | **శ్లోకాలు 04 - 12** |
| **3. సంసార కారణం, పరిహారం** | - | **శ్లోకాలు 13 - 19** |
| **4. భక్తిలో రెండు రకాలు** | - | **శ్లోకాలు 20 - 30** |

**1. ఉపోద్ఘాతం – శ్లోకాలు 1-3:** ఇవి ఉపోద్ఘాత శ్లోకాలు. ఈశ్వరస్వరూపం గురించి చెప్పబోతున్నాను అని స్పష్టం చేశాడు వీటిల్లో. ఈశ్వరస్వరూపజ్ఞానాన్ని రెండు రకాలుగా విభజించాడు. అవి జ్ఞానం, విజ్ఞానం.

జ్ఞానం అంటే సగుణ ఈశ్వరజ్ఞానం; విజ్ఞానం అంటే నిర్గుణ ఈశ్వరజ్ఞానం. ఓ అర్జునా, నీకు జ్ఞానం, విజ్ఞానం రెండూ బోధించబోతున్నాను అన్నాడు కృష్ణపరమాత్మ. తర్వాత ఈ జ్ఞానాన్ని స్తుతిస్తాడు. దీన్ని కాలక్షేపం బఠానీగా తీసుకోవద్దు. ఇది చాలా అరుదైన జ్ఞానం. ఇది మోక్షాన్నిచ్చే జ్ఞానం. అటు భావపరంగా, ఇటు జ్ఞానపరంగా పూర్ణత్వాన్ని ఇస్తుంది. ఆ విధంగా మొదటి మూడు శ్లోకాల్లో తను చెప్పబోయే అంశం గురించి, దాని గొప్పతనం గురించీ చెప్పాడు కృష్ణపరమాత్మ.

**2. ఈశ్వరస్వరూపం – శ్లోకాలు 4-12:** ఈ అధ్యాయంలోనూ, తక్కిన ఐదు అధ్యాయాల్లోనూ ముఖ్య అంశమైన ఈశ్వరస్వరూపం గురించి వివరించాడు ఈ శ్లోకాల్లో. ఈశ్వరస్వరూపంలో రెండు అంశాలున్నాయి. అవి పరాప్రకృతి, అపరాప్రకృతి. వేరే భాషలో చెప్పాలంటే పదార్థము, చైతన్యము.

**పరాప్రకృతి, అపరాప్రకృతుల సమానధర్మం** – పరాప్రకృతి, అపరాప్రకృతి – రెండూ అనాది; అంటే ఆది లేనివి. చైతన్యాన్ని సృష్టించలేము; అలాగే పదార్థాన్ని కూడా సృష్టించలేము. అందువల్ల చైతన్యం అనాది; పదార్థం అనాది.

**అనాది చేతనతత్త్వం + అనాది అచేతనతత్త్వం = అనాది ఈశ్వరుడు.** ఇదీ ఈశ్వరస్వరూపం.

ఈ పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయిక అయిన ఈశ్వరుడు జగత్తుకు సృష్టి, స్థితి, లయ కారణం. జగత్తును సృష్టించాడు. జగత్తును సృష్టించటమే కాక, జగత్తు తానే అయ్యాడు. జగత్తును సృష్టించాడు అంటే ఈశ్వరుడు నిమిత్త కారణం అవుతాడు; జగత్తు తానే అయ్యాడు అంటే ఈశ్వరుడు ఉపాదాన కారణం అవుతాడు.

పూజ్య స్వామీజీ ఎప్పుడూ హావభావాలతో చెబుతారు, ఈశ్వరుడు ఎక్కడో కూర్చుని మనను సృష్టించి ఇక్కడికి విసిరి వేయలేదు అని. దానికి ఆయన రోడ్డు పక్కన రుమాలీరోటీ చేసేవారి ఉదాహరణ తీసుకుంటారు. రుమాలీరోటీ చేసే వ్యక్తి ఆ పిండిని రెండు చేతుల్లో ఇటూ, అటూ తిప్పి, ఇంత పెద్ద వృత్తాకారం చేసి, విసురుతాడు. అలా ఈశ్వరుడు ఎక్కడో కూర్చుని, మనను మట్టినుంచి ముద్దలుగా చేసి ఇక్కడికి విసరలేదు. ఈశ్వరుడు ఉపాదాన కారణం. ఈశ్వరుడు ఉపాదాన కారణం అంటే దాన్నించి ఒక ఉపసిద్ధాంతాన్ని చూపించాడు కృష్ణపరమాత్మ. అది ముందు ముందు బోధను అర్థం చేసుకోవటానికి తోడ్పడుతుంది.

**సర్వం విష్ణుమయం జగత్** – ఈశ్వరుడు ఉపాదాన కారణం, జగత్తు కార్యం అంటే ఈశ్వరునికి భిన్నంగా జగత్తు లేదని అర్థం. ఎందుకంటే ఉపాదాన కారణం నిర్వచనం – ఈశ్వరుడే జగత్తుగా అయ్యాడు. ఈశ్వరుడే జగత్తుగా ప్రకటితమవుతున్నాడు. ఇది అర్థం చేసుకోవటానికి బంగారం–ఆభరణము ఉదాహరణ చూద్దాము.

బంగారం కారణం, ఆభరణము కార్యం. బంగారం ఆభరణములో ఎక్కడ ఉంది అంటే ఆభరణము అంతటా ఉంది. అంటే బంగారం లేకుండా ఆభరణానికి విడిగా ఉనికి లేదు. ఉన్నది ఒకటే బంగారం. అయితే బంగారం దేన్ని సూచిస్తుంది? ఆభరణము కొత్త వస్తువును సూచించదు; ఉన్న బంగారానికే ఇంకొక కొత్త అవస్థను చూపిస్తున్నది. ఒక అవస్థలో బంగారం అంటే ఇంకొక అవస్థలో ఆభరణము అంటున్నాము. రెండింటి మధ్య అవస్థాభేదం తప్ప అసలు భేదం లేదు.

ఇంకొక ఉదాహరణ – నీరు, మంచు, ఆవిరి. మూడూ నీరే. నీరు గడ్డకడితే మంచు, వేడెక్కితే ఆవిరి అవుతుంది. మూడు అవస్థలలోనూ ఉన్నది నీరే.

అందువల్ల ఓ అర్జునా, ఈ జగత్తును చిన్న చూపు చూడకు; జగత్తును నిర్లక్ష్యం చెయ్యకు; ఎందుకంటే జగత్తు నా అవతారం అన్నాడు కృష్ణపరమాత్మ. రాముడొక అవతారం, కృష్ణుడొక అవతారం, అలాగే జగత్తు కూడా అవతారం. రాముని దర్శనమో, కృష్ణుని దర్శనమో చెయ్యాలంటే ఘోరమైన తపస్సు చెయ్యాలి. కాని భగవంతుని ఒక అవతారానికి ఏమీ తపస్సు చెయ్యనవసరం లేదు.

**జగత్తును సరిగ్గా అర్థం చేసుకుంటే అది బ్రహ్మ**

**బ్రహ్మను సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది జగత్తు**

అందువల్ల అందరికీ అందుబాటులో ఉన్న అవతారం విశ్వరూప అవతారం. జగత్తును చూసేటప్పుడు దాన్ని బ్రహ్మగా చూడాలి. అప్పుడది జడమైన, మామూలు ప్రపంచంగా కనబడదు.

**రసోఽహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**

**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥** – 7.8

జలంలో రసతన్మాత్రను నేనే. సూర్యచంద్రులలో కాంతిని నేనే. వేదాలలో ఓంకారాన్ని నేనే. ఆకాశంలో శబ్దాన్ని నేనే. పురుషులలో పౌరుషాన్ని నేనే. ఏది చూసినా, ఏవి విన్నా అంతా భగవంతుడే. సర్వం విష్ణుమయం జగత్. మీరు శివభక్తులయితే, సర్వం శివమయం జగత్. ఇది ఒక ఉపసిద్ధాంతం.

**జగత్తు అపరాప్రకృతి, పరాప్రకృతుల మేలుకలయిక** – ఈశ్వరుడు పరాప్రకృతి, అపరాప్రకృతుల మేలుకలయిక అయితే, సర్వం ఈశ్వరమయం జగత్ అయితే, జగత్తు కూడా అపరాప్రకృతి, పరాప్రకృతుల మేలుకలయిక అవాలి. ఈశ్వరునిలో రెండు అంశాలుంటే, జగత్తులో కూడా రెండు అంశాలుండాలి. జగత్తులో పరాప్రకృతి, అపరాప్రకృతి ఏది? మీరు ఏది అనుభవిస్తే అదంతా అపరాప్రకృతి అన్నాడు కృష్ణపరమాత్మ. జగత్తు, శరీరం, మనస్సు అన్నీ అపరాప్రకృతులే. జగత్తు కెమిస్ట్రీ అయితే, మనశ్శరీరాలు బయోకెమిస్ట్రీ. రెండింటిలోనూ కెమికల్సే ఉన్నాయి. అందువల్ల శరీరంలోని రసాయనాల్లో మార్పు వస్తే, మనస్సు కూడా ప్రభావితమవుతుంది.

అంతేకాక మానసిక రోగానికి కూడా చికిత్సకు కెమికల్స్‌నే ఇస్తారు వైద్యులు. దీన్ని బట్టి మనస్సు కూడా రసాయనాలతో చెయ్యబడిందని తెలుస్తున్నది. ఆ విధంగా జగత్తు, శరీరం, మనస్సు – అపరాప్రకృతి.

అయితే ఈ పరాప్రకృతి ఎక్కడ దొరుకుతుంది? పరాప్రకృతికోసం వెతకకండి; అది వెతికితే దొరికే **వస్తువు కాదు** అన్నాడు కృష్ణపరమాత్మ. ఎందుకు? నేను, వెతికే నేను, జగత్తును అనుభవించే నేను, శరీరాన్ని అనుభవించే నేను, మనస్సును అనుభవించే నేను, సాక్షిచైతన్యం అయిన నేను పరాప్రకృతిని.

**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్** – 7.5

జగత్తు సృష్టింపబడకముందు ఉన్నది పరమాత్మ. అదే పరమాత్మ సృష్టి జరిగాక, మన శరీరంలో అందుబాటులో ఉంటే అది జీవాత్మ.

**సృష్టేః పూర్వం పరమాత్మా, సృష్టేః అనంతరం జీవాత్మా ఇతి ఉచ్యతే**

చైతన్యం ఒకటే. ఇది ఈశ్వరస్వరూపం.

**3. సంసార కారణం, పరిహారం – శ్లోకాలు 13-19:** ఈ శ్లోకాల్లో సంసార కారణం, సంసార పరిహారం గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. మనిషి దుఃఖానికి, బెంగలకు, ఆందోళనలకు, భయాలకు కారణమేమిటి? వీటన్నిటినీ కలిపి సంసారం అనవచ్చు. ఈ సంసారాన్ని వర్ణించాక, దానికి మందు కూడా సూచించాడు కృష్ణపరమాత్మ.

ఎ) **సంసార కారణం** – (భగవంతుడు, జగత్తు) పరాప్రకృతి, అపరాప్రకృతి – రెండూ ఉంటే మనం మన జీవిత కాలమంతా అపరాప్రకృతిని పొందటానికే సరిపోతున్నది. మన శాంతి, భద్రత, ఆనందాలు అపరాప్రకృతిలో ఉన్నాయనుకుని దానిమీద ఆధారపడుతున్నాము. అయితే ఏమిటి సమస్య?

అపరాప్రకృతి అంటే వస్తువు; వస్తువు స్వభావం మార్పుకు లోనుకావటం; అపరాప్రకృతి ఎప్పుడూ ఒకేలాగ ఉండదు. అపరాప్రకృతిలోకి జగత్తు, శరీరం, మనస్సు వస్తాయని చూశాము. ఈ మూడూ నిరంతరం మారుతూ ఉంటాయి. నిరంతరం మారుతూ ఉన్న వస్తువు ఆదర్శంగా ఉండలేదు. అసలు నిజానికి ఆదర్శమైన వస్తువు ఉండదు. అందువల్లనే శుద్ధమైన బంగారాన్ని కూడా 100% అనరు, 99.9999999% అంటారు.

అదే విధంగా శుద్ధమైన, ఆదర్శవంతమైన అపరాప్రకృతి అంటూ ఉండదు; ఒకవేళ మీ అదృష్టం బాగుండి అలాంటి ఆదర్శవంతమైన పరిస్థితులు ఉన్నాయనుకుందాము, అయినా అవి ఎప్పటికీ అలాగే ఉండిపోతాయనే నమ్మకం లేదు. ఎందుకంటే పరిస్థితులు మారుతూ ఉంటాయి కాబట్టి. యోగక్షేమాలు అంటారు – యోగం అంటే ఒక వస్తువును పొందటం; క్షేమం అంటే పొందిన వస్తువును నిలబెట్టుకోవటం. రెండూ కష్టమే! ఒక వస్తువును కష్టపడి పొందినా, అది పదికాలాల పాటు నిలుస్తుందనే భరోసా లేదు. జీవితమంతా అలా వస్తువులను పొందే ప్రయత్నంలోనూ, పొందిన వస్తువులను నిలబెట్టుకునే తాపత్రయంలోనూ జరిగిపోతుంది. కాని మనం ఓడిపోక తప్పదు. ఎందుకంటే అపరాప్రకృతి పుట్టటం, ఎదగటం, మారటం, క్షీణించటం, నశించడం అనే లక్షణాలకు లోనవుతుంది.

దానికే శాశ్వతత్వం, నికరం లేని వస్తువుమీద భద్రత కోసం ఆధారపడటమే సంసారం. అంటే అపరాప్రకృతి మీద ఆశలు పెంచుకోవటం సంసారం. అది ఇసుక నుంచి నూనెను తియ్యటానికి ప్రయత్నించినట్టుగా ఉంటుంది. అక్కడ నూనె ఉంటే కదా, మీకు రావటానికి! అలాగే శాశ్వతం కాని వస్తువు మీకెలా శాశ్వతత్వాన్ని ఇస్తుంది?

అపరాప్రకృతిని ఆనందంకోసం, సరదాకోసం, ఆటకోసం, మెచ్చుకోవటంకోసం వినియోగించండి; కాని ఆధారపడటం మాత్రం చెయ్యకండి. భావపరంగా ఆధారపడాలన్నా, మానసికంగా ఆధారపడాలన్నా, ఏదైనా శాశ్వతమైన వస్తువును పట్టుకోండి. అది పరాప్రకృతి. పరాప్రకృతి ఒక్కటే శాశ్వతం. పరాప్రకృతిని పట్టుకోమంటే, అపరాప్రకృతిని తోసిపుచ్చటం కాదు. అపరాప్రకృతి కార్డ్‌బోర్డ్ ఛెయిర్ లాంటిది. అది అందంగా ఉంటుంది, ఆకర్షణీయంగా ఉంటుంది, బొమ్మల కొలువులో పెట్టటానికి బాగుంటుంది; ఎవరికైనా కానుకగా ఇవ్వటానికి కూడా బాగుంటుంది. కాని ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. అది కూర్చోటానికి పనికిరాదు. అది కూర్చోవటానికి పనికిరాదన్నంత మాత్రాన మీరు దాన్ని పారవేయనవసరం లేదు. మీ షోకేసులో పెట్టుకోండి, తప్పేంలేదు. దాన్ని నాశనం చెయ్యమనో, ద్వేషించమనో చెప్పటం లేదు, దానిమీద కూర్చోవద్దంటున్నాము అంతే. అలాగే అపరాప్రకృతిని మీ ఆనందానికి, మీ సరదాలకు వాడండి; కాని పరాప్రకృతిని మీ శాంతి, భద్రతలకు వాడండి. ఈ చిన్న కిటుకు తెలియటం లేదు మనుష్యులకు. అందుకని అపరాప్రకృతి వలలో చిక్కుకుపోతున్నారు.

**త్రిభిర్గుణమయైర్భావైః ఏభిః సర్వమిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥** – 7.13

అపరాప్రకృతి మోహంలో పడ్డవారికి పరాప్రకృతి గురించి తెలియదు. బట్టలకోసం, దీపావళి సామాన్లకోసం అవసరమైన దుకాణాలకు వెళ్ళండి; కాని వాటిలో భద్రతను ఆశించకండి. దీనికి ఏమిటి పరిష్కారం?

బి) **సంసారపరిహారం** – సంసారపరిహారం ఏమిటి? కృష్ణపరమాత్మను శరణు వేడటమే సంసారపరిహారం.

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥** – 7.14

ప్రపత్తి లేదా శరణాగతి లేదా భక్తిని పరిష్కారంగా చూపించాడు కృష్ణపరమాత్మ.

ఇక్కడ ఒక విషయం బాగా అర్థం చేసుకోవాలి. లేకపోతే అయోమయంలో పడిపోతాము.

**శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥** – 4.33

అన్ని యజ్ఞాలలోకి జ్ఞానయజ్ఞం మిక్కిలి శ్రేష్ఠమైనది. కర్మలన్నీ జ్ఞానంలోనే పరిసమాప్తి చెందుతాయి అన్నాడు కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలో. అంటే అక్కడ సంసారానికి పరిష్కారం జ్ఞానమొక్కటే అన్నాడు. అనేక మార్గాల్లో జ్ఞానమార్గం ఒకటి అనలేదు, జ్ఞానం ఒక్కటే మార్గం అన్నాడు. ఇక్కడేమో నామీద భక్తి చూపటమే

పరిష్కారం అన్నాడు. అంటే ఇక్కడొక సందేహం రావాలి. మోక్షానికి అనేక మార్గాలున్నాయా? రకరకాల మార్గాలు చెపుతారు అనేకమంది. కర్మ, భక్తి, జ్ఞానం, రాజయోగం అంటారు. ఇవి కాక కుండలినీయోగం ఇంకొక మార్గం అంటారు మరికొందరు.

వీటిలో ఏది సరియైన మార్గం? బోధలో సమతుల్యత ఉండాలి. ఒక ఆదర్శగురువు ఈ సమతుల్యతయొక్క ప్రాముఖ్యతను ఎన్నడూ మర్చిపోడు. అంటే ఇలా భిన్నవాక్యాలు ఉండకుండా చూస్తాడు. ఇప్పుడు భక్తి పరిష్కారం ఎలా అవుతుంది?

దానికి జవాబు భక్తి ఒక ప్రత్యేక సాధన కాదు; భక్తిలో అనేక దశలున్నాయి. చివరిదశ జ్ఞానంతో ముగుస్తుంది. జ్ఞానంలో భక్తి కలగలసినప్పుడు దాన్ని జ్ఞానరూపభక్తి అంటారు. ఆ సాధనలేమిటో పన్నెండవ అధ్యాయంలో చూస్తాము. ఇప్పటికి భక్తి అంటే ఒక్కటే సాధన కాదు; అనేక సాధనల దశలతో కూడినదని, చివరిదశ జ్ఞానమనీ తెలుసుకుంటే చాలు.

అందువల్ల భక్తి పరిష్కారం అంటే, దాని అర్థం ఏమిటి? జ్ఞానంలో ముగిసే భక్తి, సంసారానికి పరిష్కారం. కృష్ణపరమాత్మకు కూడా తెలుసు మనకు ఈ సందేహం వస్తుందని. అందువల్ల ఆయనే వివరణను ఇచ్చాడు–

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥** – 7.16

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥** – 7.17

ఒక భక్తుడే ఈ నాలుగు దశలనూ దాటుతాడనీ, చివరిదశ జ్ఞానభక్తి అనీ చూశాము. ముందు దశల్లో ఆర్తభక్తి, అర్థార్థీభక్తి, జిజ్ఞాసుభక్తి వస్తాయి. ఈ మొదటి మూడు దశల్లో సంసార బంధంనుంచి విముక్తి చెందరు. ఆ విషయం పెద్ద అక్షరాలతో రాసుకోవచ్చు. ఎవరైతే జ్ఞానీభక్తుడు అవుతాడో, అంటే ఎవరైతే జ్ఞానం పొందుతాడో, ఆ భక్తుడు సంసారంనుంచి విముక్తి పొందుతాడు. అతను మాత్రమే పరాప్రకృతిని తెలుసుకుంటాడు. తక్కిన ముగ్గురూ అపరాప్రకృతిమీదే ఆధారపడతారు. జ్ఞానీ భక్తునికి మాత్రమే శాంతి భద్రతలు పరాప్రకృతిలో దొరుకుతాయని తెలుస్తుంది. కాని ఆ ప్రయాణం అంత తేలిగ్గా సాగదు. అది చాలా దీర్ఘకాల ప్రయాణం.

**బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే ।**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥** – 7.19

సర్వమూ వాసుదేవమయమే అని భావించే మహాత్ముడు లభించటం చాలా అరుదు. అందువల్ల భక్తిలో జ్ఞానీభక్తి దశకు చేరుకోవటం చాలా కష్టం. అందువల్ల ముందు ఎక్కడో అక్కడ మొదలుపెట్టాలి. కనీసం ఆర్త భక్తునిగా భగవంతుణ్ణి ప్రార్థించినా మంచిదే! తెలుగులో ఒక సామెత ఉంది – ఓడ దాటేదాకా ఓడ మల్లయ్య, ఓడ దాటాక బోడి మల్లయ్య. అలాగే కష్టం వచ్చినప్పుడు వెంటనే బాలాజీనో గురువాయూరప్పనో పట్టుకుంటాము.

ఏ కష్టానికి, ఏ ఊరిలో ఉన్న, ఏ దేవుణ్ణి పట్టుకోవాలో తెలుసు మనకు. తర్వాత కష్టం తీరగానే మళ్ళీ మర్చిపోతాం దేవుణ్ణి. అందుకే అన్నారు ఆపదమొక్కులు, సంపదమరుపులు. కాని ఆర్తభక్తితో మొదలుపెట్టినా నయమే. 13-19 శ్లోకాల వరకూ జ్ఞానంతో ముగిసే భక్తి సంసారానికి పరిష్కారం అని చూశాము.

**4. భక్తిలో రెండు రకాలు - శ్లోకాలు 20-30** - ఈ శ్లోకాల్లో భక్తిలో రెండు రకాల గురించి చెప్పాడు కృష్ణపరమాత్మ. అవి - సకామభక్తి, నిష్కామభక్తి. రెండు రకాల భక్తులూ మంచివే కాని, సకామభక్తినుంచి నిష్కామభక్తికి ఎదగాలి అన్నాడు కృష్ణపరమాత్మ.

**సకామభక్తి లేనిదే నిష్కామభక్తి అసాధ్యం**
**నిష్కామభక్తికి రానిదే సకామభక్తి అసంపూర్ణం**

సకామభక్తి ద్వారానే నిష్కామభక్తికి ఎదగాలి; అలాగని సకామభక్తి దగ్గరే ఆగిపోకూడదు. ఈ భావాన్ని అందజేశాడు కృష్ణపరమాత్మ ఈ శ్లోకాల్లో.

**సకామభక్తి - శ్లోకాలు 20-26** - సకామభక్తి అంటే అపరాప్రకృతినుంచి ప్రయోజనం కోరి చేసే ఏ పూజ అయినా సకామభక్తి కిందకు వస్తుంది. అపరాప్రకృతి అంటే పదార్థము కాబట్టి అపరాప్రకృతివల్ల మనం పొందే లాభాలు కూడా పదార్థప్రపంచానికి సంబంధించినవే ఉంటాయి. అంటే డబ్బు, పేరు ప్రఖ్యాతులు, హోదా, ఆస్తులు, బంధుబలగం లాంటివెన్నో వస్తాయి. నిజానికి మనం కోరేవన్నీ అపరాప్రకృతి కిందకి వస్తాయి. నిజానికి రాకపోకలు ఉన్నదేదైనా అపరాప్రకృతే! మనం కోరే ధర్మార్థకామ పురుషార్థాలను ప్రేయోమార్గం అంటుంది కఠోపనిషత్తు. ఈ ప్రేయోమార్గంలో లక్ష్యాలు తీరుతాయి. సకామభక్తిలో లాభనష్టాలు ఉన్నాయి-

**లాభం**: సకామభక్తి పాపమేమీ కాదు. సకామభక్తి ఉంటే నేరం చేసినట్టుగా, కించపరచుకోనవసరం లేదు. నిజానికి తోటి మానవుని కాళ్ళమీద పడేకన్నా, భగవానుని కాళ్ళమీద పడటం ఎంతో శ్రేష్ఠం.

**నరస్తుతి సుఖమా? నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?**

అనేక లోపాలున్న తోటి మానవుని పూజించటం ఎందుకు? దాని బదులు రాముని వేడితే చాలు.

**తక్కువేమి మనకూ రాముఁడొక్కడుండు వరకూ**

అందువల్ల సకామభక్తి మంచిదే. పైగా మనం కోరుకున్న ఫలితాలను ఇస్తాడు కూడా భగవంతుడు. చెయ్యవలసిన దేవునికి, చెయ్యవలసిన పూజను, చెయ్యవలసిన పద్ధతిలో చేస్తే ఆశించిన ఫలితాన్ని ఇస్తాడు.

**నష్టం**: కోరిన కోరికలు తీరుతాయి నిజమే, అవి శాశ్వతం కాదు. అవన్నీ అపరాప్రకృతికి చెందినవి. అపరాప్రకృతి శాశ్వతం కాదు.

**అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్** - 7.23

ఈ సకామభక్తులు పొందే ఫలం శాశ్వతం కాదు. అవి శాశ్వతం కాదని మనకూ తెలుసు. అసలే మన మనస్సు ఊహాగానాలు చాలా చేస్తుంది. అందువల్ల ఒక వస్తువును పొందినప్పటినుంచీ, ఆనందించకుండా, అది పోతుందేమోనని బెంగ పడతాము. నిజానికి ఆనందంకన్నా బెంగే ఎక్కువ ఉంటుంది. ఈ అంశాన్ని దయానందస్వామీజీ అద్భుతంగా వర్ణిస్తారు – కోకోకోలాను స్ట్రాతో తాగేటప్పుడు, కిందకు చూడాలి, లేకపోతే అది పైకి రాదు. దానివల్ల కోకోకోలా రుచిని ఆస్వాదించే బదులు, తరుగుతూ వస్తున్న ఆ డ్రింకుమీద కళ్ళు పడతాయి. అందువల్ల ఆనందం కన్నా, తరిగిపోతోందనే దుఃఖమే ఎక్కువుంటుంది. ఎప్పుడో భవిష్యత్తులో బాధపెట్టటమే కాదు. ఇప్పుడు ఈ క్షణంలో అంటే దాన్ని అనుభవిస్తున్న క్షణంలో కూడా అది పోతుందన్న భయంతో కృంగిపోతాము. ఇది సకామభక్తియొక్క ప్రతికూల పరిస్థితి.

**నిష్కామభక్తి – శ్లోకాలు 27–30** – ఈ శ్లోకాల్లో కృష్ణపరమాత్మకు అత్యంత ప్రీతికరమైన నిష్కామభక్తి గురించి చెప్పాడు. నిష్కామభక్తిలో, ఒక వ్యక్తి పరాప్రకృతిని పొందటానికి లేదా పరాప్రకృతిని అర్థం చేసుకోవటానికి లేదా తన ఆధ్యాత్మిక ఎదుగుదలకు వాడతాడు. నిష్కామభక్తుడు ప్రాథమికంగా ఆంతర ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం ప్రయత్నిస్తాడు. అతను ధనాన్ని కోరడని చెప్పలేము కాని అది అతని ప్రాథమిక కోరిక కాదు. అది అనుకోకుండా వస్తుంది. ఆఫీసుకు వెళ్ళటం, జీతం తీసుకోవటం మానడు; కాని అదే ముఖ్యం కాదు; ఆంతరంగికంగా ఎదగటం ముఖ్యం.

**జరామరణమోక్షాయ మామాశ్రిత్య యతంతి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్ అధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥** – 7.29

నిష్కామభక్తి అంటే కాలాతీతంగా ఎదగటం; జరా అంటే వృద్ధాప్యం, మరణం అంటే చావు. రెండూ కాలంవల్ల జరుగుతాయి.

**మా కురు ధనజనయౌవనగర్వం హరతి నిమేషాత్ కాలః సర్వమ్** – భజగోవిందం

కాలం జగత్తును భక్షిస్తుంది. అందువల్ల జరామరణాలను అధిగమించటమంటే కాలాన్ని అధిగమించటం; కాలానికి అతీతంగా ఉన్నది పరాప్రకృతి మాత్రమే. అందువల్ల మోక్షం అంటే పరాప్రకృతిని తెలుసుకోవటం. పరాప్రకృతిని తెలుసుకోవటానికి భక్తిని వాడేవారిని నిష్కామభక్తులు అంటారు. అటువంటి నిష్కామభక్తులు భగవంతునియొక్క సంపూర్ణస్వరూపాన్ని తెలుసుకుంటారు. అంటే భగవంతునియొక్క పరాప్రకృతి, అపరాప్రకృతి గురించి సంపూర్ణంగా తెలుసుకుంటారు; అంటే సగుణ బ్రహ్మను, నిర్గుణ బ్రహ్మను గురించి సంపూర్ణంగా తెలుసుకుంటారు.

**ఉభయోరపి దృష్టోఽంతః త్వనయోస్తత్త్వదర్శిభిః** – 2.16

ఈ రెండింటియొక్క వాస్తవస్వరూపాన్ని తత్త్వజ్ఞానియైన వాడే తెలుసుకుంటాడు.

ఈ విధంగా నిష్కామభక్తుడు సంపూర్ణ ఈశ్వర జ్ఞానం పొందుతాడని ముగించాలి కృష్ణపరమాత్మ. కాని ఇక్కడ చిన్న చిలిపితనం చూపించాడు. తనదైన బాణిలో ఆ విషయాన్ని చెబుతాడు. ఈశ్వరజ్ఞానం, పరాప్రకృతి, అపరాప్రకృతి పదాలు వాడకుండా ఆరు కొత్త సాంకేతిక పదాలను వాడాడు. ఏమిటవి? కర్మ, బ్రహ్మ, అధ్యాత్మము, అధిభూతము, అధిదైవము, అధియజ్ఞము – ఇవన్నీ కలిసి పరాప్రకృతి, అపరాప్రకృతే.

ఇది మన లౌకికవిద్యలో కూడా జరిగేదే! ఒక విషయం గురించి నేర్చుకుంటాము, దాన్నే పరీక్షల్లో కొంచెం మార్చి అడిగితే రాయలేము. అల్లం గురించి నేర్చుకుంటే, మురబ్బా గురించి రాయమంటే రాయలేము. ఇక్కడ జరిగింది – నామభేదః న తు వస్తు భేదః. కృష్ణపరమాత్మ చెప్పిన వాటికి కూడా ఇదే సూత్రం. ఒక మంచి గురువు చేసే పని శిష్యునిలో విషయంమీద ఆసక్తిని కలుగజేయటం. కృష్ణపరమాత్మ, జగద్గురువు చేసింది అదే. అర్జునునిలో ఈ పదాలమీద ఆసక్తిని కలుగజేశాడు. వచ్చే అధ్యాయంలో ఈ ఆరుపదాల అర్థం ఏమిటని అడుగుతాడు అర్జునుడు. వాటి జవాబులు కూడా అక్కడే చూద్దాము.

ఇప్పటికి మనం తెలుసుకోవాల్సిన అంశం – నిష్కామభక్తుడు మోక్షం పొందుతాడు. దీనితో ఈ అధ్యాయం ముగిసింది. దీని పేరు జ్ఞాన, విజ్ఞానయోగం; ఎందుకంటే జ్ఞానం ఈశ్వరునియొక్క అపరాప్రకృతి గురించి బోధిస్తే, విజ్ఞానం ఈశ్వరునియొక్క పరాప్రకృతి గురించి బోధిస్తుంది.

## స్వామీజీ ఆణిముత్యాలు

జ్ఞానీభక్తుడు నాకు ఇష్టం అని కృష్ణపరమాత్మ చెప్పగానే తక్కిన భక్తులకు, అయితే కృష్ణపరమాత్మకు మేమంటే ఇష్టం లేదా అని సందేహం రావచ్చు. అందువల్ల అలాంటి శంక పెట్టుకోవద్దని హామీ ఇస్తున్నాడు.

**ఏతే సర్వే ఏవ ఉదారాః** – అందరు భక్తులూ గొప్పవారే! అంటే 16వ మంత్రంలో చూసిన నాలుగు రకాల భక్తులనూ తీసుకోవాలి. వారు ఆర్తభక్తులు, అర్థార్థీభక్తులు, జిజ్ఞాసుభక్తులు, జ్ఞానీభక్తులు.

**జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** – కాని జ్ఞానీభక్తుడు, నా స్వరూపమే. ఇది ఒక మహావాక్యమంత్రం. జ్ఞానికి, భగవంతునికి మధ్య ఐక్యాన్ని సూచిస్తున్నది. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని సూచించే వాక్యాన్ని మహావాక్యం అంటారు.

తక్కిన భక్తులది ద్వైతభక్తి. వారు వేరు, భగవంతుడు వేరు. అందువల్ల వారి భక్తి షరతుతో కూడినది.